ఏరియల్



వల్లభనేని అశ్వినీకుమార్



పెర్సీ బీష్ షెల్లీ

సర్ బీష్ షెల్లీ మనుమడు...
న్యూ షోర్ హామ్ పార్లమెంటు సభ్యుడైన తిమోతి షెల్లీ
పెద్ద కుమారుడు...
ససెక్స్ ఫీల్డుప్లేస్ సంస్థానానికి, రెండు లక్షల పౌండ్ల
విలువగల నిధి నిక్షేప క్షేత్రాలతోపాటు పార్లమెంటు
సభ్యత్వానికి, సాలీనా ఆరువేల పౌండ్ల గౌరవ భృతికి,
సర్ బిరుదుకు అర్హుడు, అయినా ఇవన్నీ కాదనుకొని
కాలదన్నినవాడు...
కాంతులీనే కనులు, నల్లని ఉంగరాల జుట్టు,
గులాబి రంగు ఒంటి ఛాయ, చిప్పిల్లే చైతన్యం,
ప్రతి నియమాన్ని ప్రశ్నించే ధీరత్వం కలవాడు...

పుస్తకాలంటే ప్రేమ, మనిషి దుఃఖాన్ని గురించి ఆలోచన,
దేవుడు, మతం లాంటి పిచ్చి నమ్మకాలంటే అసహ్యం,
సాంఘిక దురాచారాలపట్ల తిరుగుబాటు,
అందమంటే ఆరాధన, ప్రకృతిపట్ల ప్రేమ కలవాడు..
వివాహ వ్యవస్థను నిరసించినవాడు...

దయ, కరుణ, వేదనామయ హృదయంతో విశ్వాంతరాళం
రంగస్థలిగా కవితాఝరి వెలువరించినవాడు...

'స్పిరిట్ ఆఫ్ సాలిట్యూడ్', 'రివోల్ట్ ఆఫ్ ఇస్లాం',
'ప్రామితియస్ అన్‌బౌండ్', 'మాస్క్ ఆఫ్ అనార్కీ', 'ఓవిడ్',
'ది మూన్' 'క్వీన్ మాబ్', 'ది యసాసిన్స్'తో బాటు
గ్రీకు నుంచి హోమర్, వర్జిల్ రచనలను అనువదించినవాడు...

అహింస, సహాయ నిరాకరణలతో రాచరికం – నిరంకుశత్వం
నుంచి మానవాళిని రక్షించవచ్చని గాంధీజీకి స్ఫూర్తినిచ్చినవాడు...

ఎన్నో రచనలను తన పధ్నాల్గవ ఏట నుంచి
ప్రచురించినవాడు... ఎన్నో పోరాటాలు, సాహసాలు
ఊపిరిగా, ఆచరణను సిద్ధాంతానికి ముందుపెట్టి మనసా
వాచా కర్మణా తన నమ్మకాలను నడిపించి, ఇప్పటికి
రెండు శతాబ్దాల క్రితం తనకు మూడుపదులు కూడా
నిండక మునుపే మరణదేవత ఆహ్వానాన్ని మన్నించాలని
ఎటో కనుమరుగయిన గంధర్వుడు,
ఇప్పుడు మిమ్మల్ని పలకరించటానికి మళ్ళీ
ప్రాణం పోసుకొని వస్తున్నాడు......

ఏరియల్

షెల్లీ స్వప్న విషాదం

వల్లభనేని అశ్వనీకుమార్

ఏరియల్

Ariel

A Shelley Romance

by

Andrè Maurois

(Translated by Ella D'Arcy)

In Telugu by V. Aswinikumar

Copies : 2000

Price : ₹ 248/-

ISBN No : 978-81-927170-5-0

First Edition : Jaya Nama Ugaadi 2014

Cover Concept : *V.A.K*

Tech. Help : Shan

For Copies :

AK PublicationS

Ph : 93 93 43 69 69

Printed at :

Kala Jyothi Process Pvt. Ltd.,

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad,

Hyderabad - 500 020.

Ph. 040-27645536



స్వప్న వీధి

రెండవ స్వప్నం



ఈ తెలుగు సేత గురించి .....

'ఆంద్రీ మార్వా' ఫ్రెంచి రచయిత. ఆయనకు ఆంగ్ల కవులంటే ఎనలేని గౌరవం, ముఖ్యంగా షెల్లీ, బైరన్. ఎన్నో దశాబ్దాలు శ్రమించి, ప్రయాణాలు చేసి అప్పటికి వంద సంవత్సరాల క్రితం జీవించిన కవి గురించి, పరిశోధన చేసి, దొరికిన పుస్తకాలు, ఉత్తరాలు, ఆయా వ్యక్తులు రాసుకున్న జర్నల్స్ పోగుచేసుకొని, అధ్యయనం చేసి – షెల్లీ జీవించిన ప్రదేశాల్లో, పయనించిన దారుల్లో ఇంకా ఏమైనా పాదముద్రలు మిగిలాయా అని ఎంతగానో తపన చెంది, షెల్లీని ఆవాహన చేసుకొని ఈ రచన వెలువరించాడు, అదీ ఫ్రెంచి భాషలో.

నేను నేర్చిన ఆంగ్ల పదాల పరిమితులు ఏ పాటి? కాని 'ఆంద్రీ మార్వా' ఫ్రెంచి రచన ఆంగ్లానువాదాన్ని ఎన్నో మార్లు చదివాను. ఎందుకు ? అతని ఫ్రెంచి ఆలోచనలను కొంతవరకైనా అవగాహన చేసుకోవాలని. చివరికి షెల్లీని ఆశ్రయించి ఈ తెలుగు రూపాన్ని ఇవ్వగలిగానంటే – ఈ గ్రంథంలోని జీవితాలు, ప్రేమలు, విషాదాలు, మరణాలు, సమాధులు, తుఫానులు, ఆయా వ్యక్తుల సాహసాలు, రెండు శతాబ్దాల కాలంనాటి పరిస్థితులు – ఇవన్నీ, ఇంకా ఎన్నో, నన్ను పూర్తిగా ఆక్రమించి ఆవహించాయి. అదిగో, ఆ స్థితి నుంచి ఆవిర్భవించినదే ఈ సృజన. శ్రద్ధగా చదవాలి, ఆ కాలానికి, ఆ వ్యక్తుల జీవితాల్లోకి తొంగి చూడాలి, పలకరించాలి, వారి సాహసాలను అర్థం చేసుకోవాలి. అప్పుడే ఈ విషాదం పండుతుంది. గుండె మండుతుంది. కనులు చెమ్మగిలుతాయి.

ఈ రచనలో ఎన్నో క్రియా రహిత వాక్యాలుండవచ్చు. ఇది వ్యాకరణానికి లొంగక పోనూవచ్చు. తప్పుపట్టకండి. మరో విషయం, ఈ విషాదం ఎప్పుడో జరిగినట్లు కాకుండా, ఇంతకు ముందే జరుగుతోందని చెప్పటం, ఆయా సంఘటనలకు మళ్ళీ ప్రాణం పోయటానికే. షెల్లీ గంధర్వుణ్ణి – తారీకులు సంవత్సరాల కాలావధిలో బంధించటం ఇష్టం లేకనే!

తెలుగు రచన ముప్పై రోజుల్లోనే – తరువాత ముప్పై సార్లు సరిచూసి, పదిమంది స్నేహితులతో చదివించి, మూడు నెలలుగా చిన్ని చిన్ని పదాల వాక్యాల మార్పులు, చేర్పులు, కూర్పులు చేసిన తరువాత – ఇంకా అచ్చు తప్పులుండవచ్చు. అవి షెల్లీ అందానికి దిష్టి తగలకుండా ఉంచామనుకోండి.

– అశ్వినీకుమార్



ఎటువంటి కవి??

గహనాంతర సీమల్లో విహరిస్తూ
గ్రహాలను తన సున్నితమైన చేతులతో
బంతులాడిన వాడు –

వ్యోమ వీధుల్లో విధిని వెన్నాడుతూ
నక్షత్ర ధూళిని తన గులాబి పాదాలతో
చెలరేపిన వాడు –

కాలాన్ని కాంతి వేగంతో పరుగులెత్తిస్తూ
కాలావధులు దాటి
కవితలు రాసిన వాడు –

కాంతి కిరణాల సౌధాల వెంట
సూర్య రథాశ్వాల గిట్టల జుట్టిన వాడు –

ఊహా వ్యాహ్యాళికై వెన్నెల రెక్కలపై
లోకాల లోగిళ్ళన్నీ అవలోకించిన వాడు –

విశ్వాంతరాళంలో అనంతత్వాన్ని
తన అంతరంగంలో నింపుకున్న వాడు –


రోదసీ భారరహిత స్ఫటిక భవనాలలో
సేదదీరిన వాడు –

భావనా వలయాల వాయుమందిరాలలో
సుడులు తిరిగిన వాడు –

ప్రకృతి సౌందర్యాన్ని – ఆడదాని అందాన్ని,
మృత్యు దేవత ఆహ్వానాల్ని
మనసా వాచా కర్మణా ప్రేమించిన వాడు –

స్వర్గ ద్వారాలను తరచూ తట్టిన వాడు,
ధ్వంసమైన స్వర్గంలో దారి తప్పిన దేవత వాడు...

– ఎ.కె



ఎన్నో తేనె పూలు విరిసిన ప్రేమవనం
మరి సమాధులతో నిండి వుందేమి?

– *విలియమ్ బ్లేక్*

ఏరియల్
స్వప్న విషాదం

విషాదానికి పునాదులు :

ఈటన్ పాఠశాలకు, డాక్టరు కీట్సుని, ప్రధానోపాధ్యాయునిగా, కింగ్ జార్జి – 1809లో నియమించాడు. కీట్సు పొట్టి వాడైనా చాలా గట్టి వాడు – పిల్లల పిర్రలు పగల గొట్టేవాడు – కేవలం వాళ్లకు మంచి బుద్ధులు గరపటానికే అని నమ్మి! “విద్యార్థులారా! మీ మనసులను నిర్మలంగా వుంచుకోండి! లేదా మీ పిర్రలు వాచిపోతాయి!” అని అతని మొదటి సందేశం ముగించాడు!

ఆ చిన్ని పట్నపు షావుకార్లు, హోదాగలవాళ్లు తమ సంతానాన్ని ఆయన అధీనంలో వుంచటానికి వెనుకాడలేదు. ఆయనే, ఆ ప్రాంతపు మతాధిపతులను, సైనికాధికారులను – రాజకుమారులను ‘తీర్చిదిద్దాడని’ కీర్తి గడించిన దైవభీతిగల భీకరుడు మరి!

ఆ కాలంలో కఠిన ‘క్రమ శిక్షణ’తోనే గౌరవం దక్కేది.

అధికార వర్గాలను ప్రభావితం చేసిన ‘ఫ్రెంచి విప్లవం’ – స్వతంత్ర ఆలోచనాసరళి ఎంత ప్రమాదకరమో తెలియచేసింది. ఆంగ్లేయుల అధికార వర్గం – పవిత్ర మతాధికారులతో



పెర్సీ బీష్ షెల్లీ

చేయి కలిపి – 'నెపోలియన్ లిబరలిజాన్ని' మొగ్గలోనే తుంచి వేయాలని కంకణం కట్టుకుంది. అదిగో దానికోసమే విద్యార్థి దశనుంచే 'లౌకిక వాదులను' అసత్య మృదుభాషణ తరాన్ని – శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించి తయారుచేసింది.

ఈటన్ రాచరికపు యువతను స్వతంత్ర భావాలవైపు దృష్టి సారించ నివ్వకుండా – వారి బోధనాపద్ధతులను కట్టు దిట్టం చేశారు. అయితే వీళ్లు విద్యార్థి దశ పూర్తయ్యేసరికి 'హోమర్'ను కనీసం రెండుసార్లు ఔపోసన పట్టాలి– 'వర్జిల్'ను జీర్ణించుకోవాలి– 'హోరేస్'ని ఆకళింపు చేసుకోవాలి. 'వెల్లింగ్‌టన్', 'నెల్సన్', ప్రభృతులపై లాటిన్‌లో వ్యాసాలు రాయగలగాలి. లాటిన్ భాషపై మోజు ఎంతవరకు వెళ్ళిందంటే – పార్లమెంట్‌లో 'ఈనీడ్' గ్రంథ భాగాన్ని ఏ సభ్యుడైనా ఉటంకిస్తే చాలు, విగ్‌లు, టోరీలు, సభ్యులంతా ఒక్కటిగా లేచి ఆ వాక్యాన్ని పూరించేవారు. ఈ విధంగా సార్వజనీన సంస్కృతి ఏర్పడటానికి దోహదం చేసేది.

శాస్త్రవిజ్ఞాన పఠనం వెనకబడింది కాని, నృత్యం తప్పనిసరిగా సాధన చెయ్యాలి. మత విశ్వాసాన్ని శంకించటం మహాపాపంగా, నేరంగా డా॥ కీట్సు ప్రచారం చేశాడు. అది అంతవరకే. తరవాత దాని చర్చ ఉండేది కాదు. మార్మికత, నిర్లక్ష్యం కంటె ప్రమాదమని నమ్మాడు. ప్రార్థన సమయంలో నవ్వినా పట్టించుకునేవాడు కాదు. 'సబ్బత్' ప్రాముఖ్యతను పక్కన పెట్టాడు. అలా అని కీట్సుని అపార్థం చేసుకోవద్దు. ఆయన క్రమశిక్షణాపద్ధతులు చాలా గౌరవనీయమని భావించాలి.

అసలు విద్యార్థులలోనే ఆటవిక విధానాలుండేవి. క్రింది తరగతి, చిన్న వయసు విద్యార్థులు, 'పెద్దల'కు బానిసలే. ఈ 'బానిస' అతని 'యజమానికి' ప్రక్క సర్దాలి. నీళ్లు మోయాలి. బట్టలు శుభ్రం చేయాలి. అతని బూట్లు తుడవాలి! ఒకవేళ అశ్రద్ధ చేస్తే – లేదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే – రాచిరంపాన పెట్టేవాడు, యజమాని. క్రింది తరగతి విద్యార్థి ఒకసారి, ఇంటికి ఉత్తరం వ్రాస్తూ – ఫిర్యాదు కాదు – కేవలం తన దినచర్యను తెలియజేస్తూ.

"నా యజమాని 'రోల్సు' - నన్ను, నేను దాటలేనంత పెద్ద గుంటను దాటమన్నాడు - నేను పడిపోయినప్పుడల్లా - ముళ్లు గుచ్చేవాడు - అప్పటికే నా అరికాళ్ళు రక్తమోడుతున్నాయి - నా 'గ్రీకు వాచకం' చెత్తగా మారిపోయింది. నా కొత్త బట్టలు - పీలికలైపోయాయి."

అప్పట్లో - 'ఆత్మరక్షణ' పద్ధతులు గొప్పగా ఉండేవి. ఒక 'అంతర్యుద్ధం' తరువాత ఒక కుర్రవాడు చచ్చిపడిపోతే డా॥ కీట్సు చూసి, "అరె! ఇది విచారించదగిన విషయమే, కాని ఈటన్ వీరుడు దెబ్బకు దెబ్బ తీయగలగాలి" అని వెళ్ళిపోయాడు.

దీని గుప్తసారమంతా: కఠిన శిక్షణతో ఒక సైన్యాన్ని తయారు చేసి సంఘంలో చెలామణి చేయించాలి. నీవు స్వతంత్రంగా కనబడవచ్చు. కాని స్వేచ్ఛగా ఆలోచించకూడదు. నీ ఇష్టం వచ్చిన బట్టలు వేసుకోరాదు. నీ సొంత భాష మాట్లాడకూడదు. ఇవన్నీ భయంకరమైన నేరాలు సుమా! స్వతంత్ర భావాలవైపు, పుస్తకాలలోకి చూడటానికి కూడా భయపడే తరాన్ని ముందుకు తేవటమే దీని లక్ష్యం.

ఎక్కువ శాతం ఆంగ్ల యువత ఇది తప్పనిసరిగా మంచిదనే నమ్మారు. ఒక రాజు నిర్మింపజేసి నడిపిస్తున్న పాఠశాలలో 'శిక్షణ'తీసుకొనే గౌరవం దక్కటం గొప్ప విషయం కదా. మరి ఇలాంటి గౌరవం ఎలాంటి గాయాలనైనా మరిపింపజేస్తుంది!

కాని, ఎవరో కొద్దిమంది - సున్నిత మనస్కులు - ఈ బాధను, భయంకరమైన ఈ 'శిక్షణ'ను చాలాకాలం అనుభవించారు. ఉదాహరణకు - పెర్సి బీష్ షెల్లీ; సస్సెక్స్ సంస్థానాధీశుని గారాల బిడ్డడు. సర్ బీష్ షెల్లీ మనుమడు. ఇతనికి ఈ వాతావరణం, ఈ శిక్షణ వంటబట్టలేదు.

ఈ కుర్రవాడు మహాఅందగాడు. కాంతులీనే నీలి కళ్ళు, నల్లని ఉంగరాల జుట్టు, గులాబీరంగు ఒంటిఛాయ. అతి సున్నితమైన చైతన్యాన్ని కనపరచే ఏకైక విద్యార్థి తన తరగతిలో. అంతే కాదు ప్రతి నియమాన్ని ప్రశ్నించే సత్తావున్నవాడు. మొట్టమొదటిసారి బడిలో అడుగు పెట్టినపుడు అతని 'యజమాను'లు షెల్లీ నాజూకు తనం చూసి ఇతన్ని లొంగదీయటానికి శ్రమ పడాల్సిన పనిలేదనుకున్నారు. కాని అతని తిరుగుబాటుతనం వారికి వెంటనే తెలియవచ్చింది. అతని దృఢ నిశ్చయం - తొణకని ధైర్యం, శారీరక దుర్బలత్వం - షెల్లీని విప్లవకారునిగా కనిపింపజేసాయి. ప్రశాంతంగా ఉన్నప్పుడు కలలు కనే కళ్ళు, ఎదురు తిరిగినప్పుడు కోపంతో చింతనిప్పుల్లా మండేవి. మామూలుగా సున్నితంగా ఉండే అతని గొంతు కోపంలో బాధతో గీపెట్టేది.

అతనికి పుస్తకాలంటే ప్రేమ. ఆటలంటే అసహ్యం. ఉంగరాల జుట్టు గాలికి ఊగుతుంటే, సన్నని మెడమీద కాలరు కదులుతుంటే, దురహంకారులైన ఈటన్ 'యజమానులు' అతన్ని ఆటపట్టించేవారు. షెల్లీ మొదటి రోజునుంచీ బెత్తం దెబ్బలు అనాగరికమని నమ్మాడు. తన తిరుగుబాటు చాటాడు. అంతే, అతని బహిష్కరణ ఈటన్ ప్రచారంచేసింది. 'పిచ్చి షెల్లీ' అని పిలుస్తూ అతన్ని హింసించాలని ప్రయత్నించే 'యజమానులు' కూడా ఇది నిప్పుతో చెలగాటమని అతని జోలికి రావటం మానేశారు. ఒకవేళ ఎవరైనా దగ్గరకు వస్తే చేతులతో గోళ్లతో రక్కి ఆడపిల్లలా అరుస్తాడు.

అయినా ఈటన్ పులులు, ఈ లేడిని వేటాడటం ఒక ఆటగా తీసుకుంటాయి. షెల్లీ పచ్చగడ్డిలో నదిపక్కన నల్లని కురులు గాలికి కదులుతుంటే పుస్తక పఠనంలో ఈ పరిసరాలు మర్చిపోతాడు. ఆ విధంగా అతన్ని చూసిన పులులు గుంపుగా చుట్టుముడితే, షెల్లీ ఈటన్ వీధుల్లో పరుగులు పెడతాడు. చివరికి ఏ గోడమూలనో ఆగిపోతే వాళ్ళు మట్టి ముద్దలు విసిరేవాళ్లు. అంతే 'షెల్లీ', 'షెల్లీ' అని కేకలు వినపడతాయి. ఈటన్ వీధులన్నీ షెల్లీ పేరుతో మార్మోగుతాయి. ఒకడు అతని కోటు లాగుతాడు. ఒకడు షెల్లీ భద్రంగా పట్టుకొన్న పుస్తకాలను కిందకు తోస్తాడు. అందరి వ్రేళ్లూ అతని వైపు చూపిస్తూ షెల్లీ, షెల్లీ అని పిచ్చిగా అరుస్తారు.

అంతే, వాళ్ళు ఎదురు చూసిన క్షణం రానే వచ్చింది. షెల్లీ కళ్ళు నిప్పులు కురిశాయి. బుగ్గలు ఎర్రబడ్డాయి. అతని శరీరమంతా కోపంతో కంపించింది. చివరికి అలిసిపోయిన గుంపు ఇది రోజూ చూసేదే కదా అంటూ తిరిగి బడిదారి పట్టింది.

* * *

బురద మరకలైన పుస్తకాలను ఏరుకొని థేమ్స్ తీరపు పచ్చికలో కాసేపు తిరిగాడు. లేయెండలో తడిసిన పచ్చగడ్డిలో కూర్చుని పరుగులు పెట్టే నదీ ప్రవాహాన్ని చూశాడు.

సంగీతంలాగానే, నీటి గలగలలు బాధను వేదనగా మార్చగల శక్తిగలవి. నిరంతర తరంగాలతో మృదువుగా హృదయాన్ని మరుపు మాయలో ముంచివేస్తాయి.

విండ్సర్, ఈటన్ సౌధాలు ఈ తిరుగుబాటు దారునికి శత్రువుల లాగానే, మారని ప్రపంచంలో నిలబడివున్నాయి. కానీ, నీటిలో మెరుస్తున్న చెట్ల నీడలు అతనికి ఎంతగానో ఓదార్పు కలిగించాయి.

తరువాత తన పుస్తకాల ప్రపంచంలో – డిడిరో, వోల్టేర్, వోల్‌బాష్‌లతో కాలక్షేపం చేశాడు. ఈ ఫ్రెంచి రచయితలను ప్రేమించటమంటే, అదీ తన గురువులు ద్వేషించేవారిని, తన తిరుగుబాటును బాహాటంగా చాటటమే. వీరందరి గ్రంథాలసారం, గోల్డ్‌విన్ 'రాజకీయ ధర్మం' అనే ఒకే పుస్తకంలో నిక్షిప్త పరచబడింది. అదే షెల్లీకి ఇష్టమైన పుస్తకం. పఠనం. గోల్డ్‌విన్ అన్ని విషయాలను చాలా క్లుప్తంగా, సులభంగా విశదీకరించాడు. అందరూ గోల్డ్‌విన్ రచనలు చదివితే ఈ ప్రపంచం ఆనందోత్సాహాలతో అలరారేది. గోల్డ్‌విన్ చెప్పిన హేతువాదాన్ని శ్రద్ధగా విని ఉంటే – అందరి అవసరాలు తీరేవి. మూర్ఖమైన వివాహపు లంపటత్వం నుంచి స్వేచ్ఛను పొందగలిగేవారు. ప్రేమించగలిగేవారు. మాయలు మంత్రాలను వదిలి తాత్త్విక దృక్పథాలను అనుసరించేవారు. దురదృష్టవశాత్తు మూఢనమ్మకాలు మనుషుల ఆలోచనలను సత్యంవైపు చూడనివ్వవు.

షెల్లీ పుస్తకాలు పక్కన పెట్టి ఒళ్ళు విరుచుకున్నాడు. ఎండలో మెరుస్తున్న గడ్డి పూల నక్షత్రాలను చూశాడు. మనిషి దుఃఖాన్ని గురించి ఎంతగానో ఆలోచించాడు, మరెంతగానో మథనపడ్డాడు.

అతని వెనుక ఉన్న పాఠశాల భవనాల నుంచి అసంగతమైన, అస్పష్టమైన సంభాషణలు వినపడుతూనే ఉన్నాయి. కనీసం ఇక్కడ తనమీద నిఘా నేత్రం ఏమీ లేదనే భరోసాతో విశ్రాంతి పొందాడు. హఠాత్తుగా అతని కనులు వర్షించాయి. తన చేతులు రెండూ ఒకటిగా చేసి ప్రతిన బూనాడు.

"నేను స్వేచ్ఛగా, ధర్మంగా జాగరూకుడనై ఉండటానికి నా శక్తిమేరకు ప్రయత్నిస్తాను. ఎవరికీ బానిసగా బ్రతకను. కనీసం నిశ్శబ్దంగానైనా, స్వార్థపరుల, శక్తివంతుల పక్షాన నిలబడను. నా జీవితమంతా సౌందర్యారాధనలోనే గడుపుతాను..."

ఇది పొరపాటున ఆ పాఠశాల ప్రధానాచార్యుడు డా॥ కీట్స్ విని ఉంటే, అసమ్మతమైన, పాఠశాల రాజ్యాంగ విరుద్ధమైన ఈ ప్రతిజ్ఞలు ఆయన చెవిని పడి ఉంటే, పర్యవసానం చాలా దారుణంగా ఉండేది సుమా!

EATON
FUNDAMENTAL
MIDDLE SCHOOL



ఈటన్ ఉన్నత పాఠశాల భవనం

రెండవ అధ్యాయం

అనువంశిక భవనంలో...

సెలవులు వచ్చాయి. ఈటన్ పులుల బారినుంచి బయటపడిన బానిస, ఇక తన వంశపారంపర్య సౌధంలో యువరాజుగా వెలుగుతాడు. సస్సెక్స్‌లోని ఫీల్డ్ ప్లేస్ భవంతి యజమాని అయిన తిమోతి షెల్లీ మన యువరాజుగారి తండ్రి. ఈ శ్వేత వర్ణపు సౌధం చుట్టూ ఒక హరిత వనం, ఆపైన చిట్టడవి పరిసరాలు. అతని అందమైన చెల్లెళ్ళు షెల్లీకి ఆహ్వానం పలికారు. భవంతిలోకి స్వాగతం చెప్పారు. మూడేళ్ళ తమ్ముడు కూడా ఉన్నాడు. షెల్లీ అతనికి దయ్యం అనే మాట నేర్పాడు. ఆ విధంగా దైవభక్తి కలవాళ్లని భయపెట్టాడు. ఇక్కడే షెల్లీ మరదలు, సుందరాంగి హెరియట్ గ్రోవ్ అతనికోసం ఎదురు చూస్తోంది.

ఈ షెల్లీ వంశపు యజమాని, సర్ బిష్ షెల్లీ – హోర్షమ్ పట్నంలో నివసిస్తారు. అతనికి చిన్న రాజ్యమే ఉంది. ఆరడుగులు ఆజానుబాహుడు, అందగాడు. అధికారం చెలాయిస్తూ కాస్త మూర్ఖత్వంతో చాలా ఉత్సాహంగా ఉంటారు. మిగతా షెల్లీ కుటుంబానికంతా ప్రకాశవంతమైన నీలికళ్ళు వుంటే సర్ బిష్ షెల్లీవి గోధుమవర్ణపు కళ్లు. బహుశా తన న్యూజెర్సీ అమ్మగారి వారసత్వమై ఉంటుంది. ఆమె ధనవంతురాలైన పూర్వసువాసిని.

సర్ షెల్లీ గోరింగ్‌లో ఒక చిన్న కోట కట్టాలని ఎనభై వేల పౌండ్లు ఖర్చుపెటాడు. కాని డబ్బు చాలక పూర్తి చెయ్యలేదు. ప్రస్తుతానికి హోర్షమ్ పట్నంలో చిన్న బంగ్లాలో ఉంటున్నాడు. ఆయనకి ఒక సేవకుడున్నాడు. వాడూ తనలాంటి తిక్కవాడే. ఒక రైతులాగా బట్టలు వేసుకొని శ్వాన్ హోటల్ బార్‌లో రోజులు గడుపుతాడు. దేశరాజకీయాలు మాట్లాడుతూ అందర్నీ అదరగొడతాడు. ఆయన హాస్యం కూడా మోటుగా ఉంటుంది.

పాపం అంతగా చదువుకోని అక్కడి పౌరులు బెదురుతుంటారు. తన ఇద్దరు కుమార్తెలను ఎంత కష్టపెట్టాడంటే, చివరికి వాళ్ళు ఇల్లు వదిలి పారిపోయే స్థితి వచ్చింది. ఆ వంకతో వాళ్ళకు కట్నం ఎగ్గొట్టి సమర్థించుకున్నారు.

ఆయనది ఒకటే ఆశ. ఈ ఆస్తిపాస్తులన్నీ స్థిరీకరించి ఒక జమీందారీని నిర్మించి షెల్లీ వంశాన్ని తరతరాలు నిలబెట్టాలని. ఈ దృష్టితోనే ఆస్తిలో ఎక్కువభాగం పెర్సీ షెల్లీకి కట్టబెట్టారు. పెర్సీ అంటే తాతగారికి ఎనలేని ప్రేమతోపాటు ఇతనే వంశోద్ధారకుడని విశ్వాసం కూడా. తన కొడుకంటే, అదే తిమోతి షెల్లీ పట్ల ఆయనకు ఒకరకమైన అయిష్టమే.

తిమోతి షెల్లీ న్యూషోర్ హోమ్ నియోజక వర్గానికి పార్లమెంటు సభ్యుడు. తన తండ్రిలాగ ఈయన ఆజానుబాహుడే. మంచి ఒంటి చాయ. అందంతో చూపరులను ఆకర్షిస్తాడు. తండ్రి కంటె దయగల హృదయం. కాని అంతటి శక్తివంతుడు కాదు. సర్ షెల్లీ చాలా ఆకర్షణీయుడు, అహంకారి. మూర్ఖులు అలాగే వుంటారు మరి! కాని తిమోతి షెల్లీ మంచి అభిప్రాయాలు కలవాడు. ఎవరి ఆసరా లేనివాడు. నిరక్షరాస్యుల కంటే విద్యాధికుల్ని ఎక్కువ గౌరవిస్తాడు. మతమంటే కూడా గౌరవం. గొప్ప తాత్త్విక సిద్ధాంతాల్ని, కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తాడు. తనని తాను ఉదారవాదిగా పిలుచుకుంటాడు, రాజకీయంగా, మతపరంగా కూడా. కాని తన తోటివాళ్ళను అల్లరి పెట్టేవాడు కాడు. తన స్నేహితుడైన నార్‌ఫోక్ జమీందారుతో, ఐర్లండ్ కేథలిక్ మతస్థులను ఉద్ధరించాలని చెప్తుంటాడు. తన ధైర్యానికి తనే గర్వపడుతుంటాడు. ఎంతో ఆర్ద్రమైన హృదయం కలవాడు. కాని తన అహాన్ని కాపాడుకుంటాడు. ఆత్మగౌరవం గలవాడు. తన వ్యక్తిగత జీవితంలో నాగరికుడు. కాని తన మోటు చేతులను వెల్వెట్ తొడుగులతో దాస్తాడు. చిన్నా చితకా విషయాలలో చాల లౌక్యంగా వ్యవహరిస్తాడు. అదే పెద్ద వ్యవహారాలకు దూరంగా ఉంటాడు. తన కంటే చిన్నవారి విమర్శలను సానుభూతితో తీసుకుంటాడు. కాని తన తండ్రి తింగరితనం తిమోతీని మేధోపరంగా ఏకాకిని చేసింది.

ఇక శ్రీమతి షెల్లీ విషయం. ఆమె ఆ ప్రాంతంలోనే ఎంతో సౌందర్యవతి. ధీరత్వంగల పెద్దమనిషిని ఇష్టపడుతుంది. తన కుమారుడు పెర్సీ షెల్లీ, తుపాకీతో కాకుండా, పుస్తకాలను పట్టుకుని అడవిలోకి వెళ్లటం, ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

* * *

తన చెల్లెళ్ళందరికీ షెల్లీ ఒక సూపర్ మాన్. అతను ఈటన్ నుంచి రాగానే ఆ భవంతి అంతా అతిథులతో నిండిపోయింది. భవనం చుట్టూ వున్న తోట కూడా, చుట్టపక్కాలతో కళకళలాడింది. పాపం ఆడపిల్లలు బెరుకుతో, బెదురుతూనే తిరుగుతుంటూరు. షెల్లీ తన రోజువారి దినచర్యని కూడా ఎంతో మార్మికంగా మారుస్తుంటాడు. ఒక కర్రతీసుకుని గోడల్లోని రంధ్రాలన్నీ పొడుస్తాడు. ఎక్కడైనా రహస్య సొరంగం ఉందేమోనని. అటకలమీద తాళం వేసి వున్న గదిని కనుగొన్నాడు. ఇక్కడే బంగారం తయారు చేసే ముసలి గడ్డం వాడుండేవాడు. వాడిపేరే కార్నిలియాస్ అగ్రప్ప అని అంటాడు. అటకమీద ఏదైనా శబ్దం వినపడితే చాలు, అదిగో కార్నిలియాస్ లాంతర్ని తిప్పుతున్నాడు అని వివరిస్తాడు. ఒక వారం రోజులు ఈ కార్నిలియాస్ కోసం, షెల్లీ కుటుంబం అంతా తోటలో గుంటలు తవ్వుతూనే ఉంది.


షెల్లీ రాకతో మిగతా భూతాలు కూడా నిద్రలేచాయి. తోటలోని నీటి గుంటలో తాబేలు– పొడవాటి పాము నిద్రలేచాయి. ఈ పాము తరచు ఆ చుట్టుపక్కల తిరుగుతుండేది. తోట పనివాళ్ళు దాన్ని పెద్ద బరిశెతో చంపారుకూడా. “అమ్మాయిలూ, ఈ తోట పనివాడు మన మనిషిలాగా కనబడతాడు. కాని అది విధి అన్నమాట. అదే ఆ భూతాన్ని చంపుతుంది.”

ఈ కట్టు కథలన్నీ చాలా రక్తికడతాయి. ఎందుకంటే, కథకుడే అవి కథలని నమ్మేవాడు కాదు. మంత్రగత్తెల, దెయ్యాల కథలు అతన్ని వెంటాడేవి, భయపెట్టేవి. వాటిని ధైర్యంగా ఎదుర్కొనేవాడు. ఒకసారి ఈటన్‌లో తనచుట్టూ గిరిగీసి చిన్న పళ్ళెంలో స్పిరిట్‌పోసి నిప్పుపెట్టి తనచుట్టూ నీలిమంట వెలుగుతుంటే “గాలి దెయ్యాలూ, నిప్పు...” అంటుండగా ‘షెల్లీ ఏంచేస్తున్నావ్’ అని అతని మాస్టర్ అడిగితే “సార్ కాస్త ఆగండి, నేను దెయ్యాల్ని లేపుతున్నాను” అన్నాడు.

ఈ తోటలో ఆ విధంగానే సన్న గొంతుతో దెయ్యాల్ని నిద్రలేపుతాడు. అతని చిన్నారి చెల్లెళ్ళు దయ్యాల్లా, భూతాల్లాగా కేరింతలు కొడతారు.

సైన్సు షెల్లీకి అంతగా ఒంటబట్టేది కాదు. కాని శాస్త్రపరికరాలు అతన్ని ఉత్సాహపరుస్తాయి. అప్పుడే కనిపెట్టిన కరెంటు తీగతో, చిన్నపిల్లలందరికీ షాకులివ్వటం ఆనందాన్నిస్తుంది. తన చిట్టి చెల్లెలు హెలెన్, అన్న సీసా, తీగతో వస్తున్నాడంటే ఏడుపు లంకించుకునేది.

అతనికి చాలా ఇష్టమైన నమ్మకమైన పెద్దచెల్లెలు ఎలిజబెత్– తన అందాలరాశి మరదలు హెరియట్ గ్రోవ్. వీరుముగ్గురు తమ తొలియౌవనపు చైతన్యంలో దగ్గరయ్యారు. వారికి 'సత్యం' అంటే ఎనలేని ప్రేమ. తొలకరి యౌవనపు ఆలోచనలు ఎంతో రమణీయంగా ఉంటాయి. షెల్లీ తన విద్యార్థినులను చర్చి వెనక్కు – చచ్చిన వాళ్ళ సమాధుల దగ్గరకు తీసుకువెళ్తాడు. అతనికి ఎందుకో ఈ వాతావరణంలో ఒక కవితాశక్తి దాగి ఉందని నమ్మకం. పైగా ఇక్కడివరకూ తన తండ్రి రాడు. అక్కడ ఒక సమాధి రాయిమీద కూర్చొని చేతులు తిప్పుతూ – స్వర్గం– భూమి– అందులో అన్ని గొప్పవిషయాలు ధారాళంగా చెప్తుంటే ఈ విద్యార్థినుల అందమైన కళ్ళు అవన్నీ ఆత్రంగా ఆహ్వానిస్తాయి. ఈ ప్రపంచాన్ని చాల సులభంగా చూపిస్తాడు. "ఒక ప్రక్క అధర్మం, అన్యాయం. అంటే రాజులు, మతాధికారులు, ధనవంతులు. మరొపక్క ధర్మం, న్యాయం అంటే తత్త్వవేత్తలు, బాధితులు, పేదలు. ఇక్కడ మతం అధర్మానికి, అన్యాయానికి గొడుగు పడుతుంది. అక్కడ గాడ్విన్ రాసిన 'రాజకీయ



ఫీల్డ్‌ప్లేస్ భవంతి

ధర్మం' ఉంటుంది. అంతేకాదు ప్రేమను తెలుసుకోండి. ఈ నియమాలన్నీ మన ఆలోచనలను సరియైన మార్గంలో పెడుతున్నట్లు చెప్తారు. ఎంత మూర్ఖం. కంటికి అందమైన పువ్వు కనపడితే హృదయం ఆస్వాదిస్తుంది. ఈ ప్రేమను మనిషి ఎలా నియంత్రిస్తాడు? ఈ ప్రేమ సారం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం. అది నియమాల నడుమ బతికి బట్ట కట్టదు. వాడివత్తలై పోతుంది. అసూయలో కాలిపోతుంది. లొంగుబాటుకు ఎండిపోతుంది. దానికి నమ్మకం కావాలి. స్వేచ్ఛ కావాలి. ప్రేమకు, పెళ్ళి సమాధి- కారాగారం..."

* * *

ఇక్కడే పెళ్ళికాని ఆడపిల్లలు అడ్డుకుంటారు. వారిని మెట్టవేదాంతపు విషయాలు అంతగా కలతపెట్టవు. కాని వివాహ విషయంలో వారి ఆలోచనలు వేరుగా వుంటాయి.

'ఏమిటీ? బంధాలా? అవి తేలికపాటివైతే నష్టమేమిటి' అంటుంది హెరియట్.



"అవి తేలికపాటివైతే అసలు ఉపయోగం ఉండవు. స్వచ్ఛంద ఖైదీకి గొలుసులెందుకు?" ఇది షెల్లీ వాదన.

'అయితే, మతం?'

ఇక్కడే గాడ్విన్‌ని రక్షించడానికి హోల్‌బాష్‌ని తెస్తాడు. "అరె! దేవుడు సరైన వాడైతే, తానే సృష్టించిన బలహీనుల్ని ఎందుకు శిక్షిస్తాడు. అతనికి అన్ని శక్తులూ ఉంటే అతన్ని ఎదుర్కొవడానికి ఎవరికి శక్తి ఉంటుంది? అతనే గనక సత్యవాది అయితే, పాపం నిస్సహాయులను ఎందుకు గాలికి వదిలివేస్తాడు?"

'అయితే మన సంప్రదాయం?'

"అరె! ఏమిటి సంప్రదాయం? అనంతకాలంలో ఈ దశాబ్దం, శతాబ్దం ఎంత? ఒక బుద్బుదప్రాయం కాదా?" అంటాడు.

ఎలిజబెత్ తన అన్నని సమర్థిస్తుంది.

ఇక హెరియట్‌కు ఈ సుందరాంగుని రూపంలో, వెలిగే నీలికళ్ళల్లో, సన్నని మెడచుట్టూ ఎగురుతున్న కాలరుతో, పట్టుకుచ్చులాంటి నల్లని కురులతో, కనపడుతున్న దేవతను కాదనే శక్తి లేదు. ఒకసారి నిట్టూర్చి "సరే, 'జెన్రోజి' సంగతి చూద్దామా"?!

అది ముగ్గురూ కలిసి రాస్తున్న నవల. ఒక దొంగల నాయకుడు, ఒక నియంత, గట్టివాడు కథానాయకుడు, చక్కని సున్నితమైన అందమైన నాయిక... అలా గంటలు గడిచిపోతాయి. సాయంత్రం దగ్గరికొస్తుంది. అంతలో ఎలిజబెత్ ఆ ఇద్దరి ప్రేమికుల్నీ వదిలి ఇంటివైపు వెళ్ళిపోతుంది. అంతలో చంద్రోదయం.

లేత పసిరిక పరిసరాల మీద తెలిమంచు తేలి వస్తోంది. చిరుగాలికి చిగురుటాకులు చందమామకు వింజామరలు వీస్తున్నాయి. నిద్రగన్నేరు పూలు కళ్ళు మూసుకొని తలలు వాలుస్తున్నాయి. సంజ చాటు చీకటి, తాను వెళ్ళబోయే బడి చెరసాల భయాన్ని, ముందుకు తెస్తోంది. హెరియట్ నులివెచ్చని అరచేయి, ఆమె సుతిమెత్తని దగ్గర తనం, షెల్లీకి ఏకాంతపుటాసరాగా వుంది. ఆమె బిగువైన కదలికల చైతన్యంతో రాబోయే యుద్ధానికి సిద్ధమవుతున్న సిపాయిలా, గుండెలో ధైర్యాన్ని నింపుకుంటాడు. ఆమెను దగ్గరగా పొదవుకొని ఇంటివైపు అడుగులు వేశాడు.

* * *

మూడవ అధ్యాయం

ఆత్మ విశ్వాసం

న్యూషోర్‌హామ్ పార్లమెంటు సభ్యుడు, తిమోతి షెల్లీ, అక్టోబర్ 1810లో పెర్సీని ఆక్స్‌ఫర్డ్ తీసుకువెళ్లాడు. తిమోతి చాలా హుషారుగా ఉన్నాడు.

హోటళ్లలో ఉండటం ఇష్టం లేక, జాన్‌స్లేటర్ బంగ్లాలో దిగాడు. ఈ స్లేటర్ తండ్రి తనకు తెలిసినవాడే. ఆయనకూడా అతిథి గృహాలనే నడిపేవాడు. అతని మరో కుమారుడు కార్‌పాక్స్‌లో పుస్తకాల ముద్రణ వ్యాపారంలో ఉన్నాడు.

ఒకప్పుడు తాను చదివి, అత్తెసరు మార్కులతో ఉత్తీర్ణుడైన విశ్వవిద్యాలయ కళాశాలలోనే పెర్సీని చేర్పించే తంతు పూర్తిచేశాడు. ఆ వెంటనే కొడుకుతో పుస్తకాల దుకాణంలోకి వెళ్లి అతని కోసం ఖాతా తెరుస్తాడు. "నా కుమారుడు..." కాస్త గర్వంగానే అంటూ "సాహిత్య ప్రియుడు... – ఓ పుస్తకం కూడా రాసాడు. ప్రేమకథ. 'జెస్ట్రోజి' – చాలా బాగుంటుంది. మళ్లీ ఏదైనా ప్రచురించదలిస్తే అడ్డు చెప్పకండి, అన్ని వనరులూ సమకూర్చండి" అని మర్యాదపూర్వకంగా, అధికారికంగా చెప్తాడు.

* * *

షెల్లీకి కళాశాల చాలా బాగా నచ్చింది. తన సొంత గదులు. అన్నీ అక్కడే. పెట్టే బేడా సర్దుకోవచ్చు. బట్టలకి, పుస్తకాలకి అనుకూలంగా ఉన్నాయి. తరగతులకు ఎప్పుడు వెళ్లాలనిపిస్తే అప్పుడు వెళ్లి వినవచ్చు. ఏది కావాలంటే అదే చదువుకోవచ్చు, అదే రాసుకోనూ వచ్చు. పచ్చికబయళ్ళలో ఎంతసేపయినా తిరగవచ్చు. స్వేచ్ఛగా ఆలోచిస్తూ ఈ మర జీవితాన్ని హాయిగా తత్త్వవేత్తలా గడపవచ్చు. ఆహా! ఎంత అద్భుతం! "శాశ్వతంగా" ఇక్కడే ఉండిపోవచ్చు కదా! అనుకున్నాడు.

ఆ సాయంత్రం తనలాగా కొత్తగా వచ్చిన మరో విద్యార్థితో పరిచయం ఏర్పడింది. జఫర్‌సన్ హాగ్ అని తనపేరు క్లుప్తంగా చెప్పి అతను కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. అవును, ఇది ఆక్స్‌ఫర్డ్ క్రమశిక్షణాపద్ధతి కాని, తరువాత వాళ్లు సంభాషణలో దిగిపోయారు. “ఇప్పుడు జర్మన్ కవిత్వ సాహిత్యం గొప్పగా ఉంటోంది” అంటాడు షెల్లీ. హాగ్ దీనితో ఏకీభవించడు. 'మరీ అంత ప్రేమ వాతావరణాన్ని భరించలేం' అంటూ 'ఇప్పుడు ఆధునికం ఇటాలియన్ సాహిత్యం'. షెల్లీకి ఇది ఎంతో ఉత్సాహాన్ని ఆసక్తిని కలిగించింది. వాళ్లిద్దరూ అంతూపొంతూ లేకుండా మాట్లాడుకొంటూనే ఉన్నారు, పనివాళ్లు వచ్చి బల్లలు సర్దేవరకూ. 'నా గదికి వెళ్దాం రండి' హాగ్, షెల్లీని ఆహ్వానిస్తాడు. షెల్లీ వెంటనే అంగీకరిస్తాడు కాని, అతనికి జర్మన్ సాహిత్యంమీద మాట్లాడే ఉత్సాహం తగ్గిపోయింది.

హాగ్ గదిలో దీపాలు వెలిగిస్తుండగా “ఏదో మాట్లాడాలని మొదలు పెట్టాను. నా కంతగా జర్మన్ సాహిత్యం తెలియదు” అన్నాడు షెల్లీ.

హాగ్ 'నాకూ అంతగా ఇటాలియన్ సాహిత్యం తెలియదులే' అంటూ బల్లమీద వైన్ సీసా, గ్లాసులు, బిస్కట్‌లు పెట్టి కూర్చోమంటాడు. షెల్లీ “నిజానికి ఈ సాహిత్యమంతా పనికిరానిదే. పురాతన సాహిత్యంలో, ఆధునిక వాఙ్మయంలో ఏముంది గొప్పగా? అన్నీ పదాలూ, వాక్యాలే కదా, పేర్లూ, ఊర్లేకదా. అంతకంటే స్వానుభవమే గొప్పది” అంటాడు.

'ఏవిధంగా?' అనుమాన పడతాడు హాగ్.

“శాస్త్రవిజ్ఞానం - ముఖ్యంగా రసాయన శాస్త్రం.” ఎంతో ఉత్సాహంగా, అంతకు పూర్వం జర్మన్ సాహిత్యాన్ని సమర్థిస్తూ మాట్లాడినప్పటికంటే కూడా ఆసక్తిగా, భౌతికశాస్త్రం, కరెంటు తయారుచేయడం లాంటి విషయాలు మాట్లాడతాడు. హాగ్‌కి ఇటువంటి విషయాలపై అంతగా ఆసక్తి లేదు. అలా అతనికి దొరికిన విశ్రాంతి సమయంలో షెల్లీని పరీక్షగా పరిశీలిస్తాడు.

రూపురేఖలకు మనిషి ఎత్తుగా ఉన్నాడు– బక్కగా, బలహీనంగా. అతని తల ముందుకు వంగి ఏదో చెప్పాలనే ఉత్సాహంతో ముఖం వెలిగిపోతోంది. ఉంగరాలజుత్తు నుదుటిమీద పడుతోంది. ఎంతో హుందాగా హఠాత్తుగా అతని కదలికలున్నాయి. ఒంటి చాయ గులాబీరంగులో ఆడపిల్లలాగ సున్నితంగా అందంగా ఉంది. చీకటిగా, ఒత్తుగా, పొడవుగా అతని జుట్టు గాలికి కదులుతోంది. అతని చేతి కదలికలన్నీ

ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నాయి. స్వచ్ఛంగా సహజమైన తెలివితేటలు – తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. అతని మేధో సౌందర్యంతో పాటు నైతిక స్వచ్ఛతకూడా కొట్టవచ్చినట్లు కనపడుతుంది. కడిగిన ముత్యంలా మెరుస్తున్నాడు. అతని అంతరంగంలో వెలిగే జ్ఞానజ్వాల, అతని నీలికనుల్లో ప్రతిఫలిస్తున్నది. నాజూకైన పెద్ద మనిషి తరహా వ్యక్తిత్వం – ఆధ్యాత్మిక తత్త్వవేత్తల జ్ఞానం, ఫ్లొరెన్స్ పురాతన చర్చి గోడలపై దర్శనిమిచ్చే సాధుపుంగవునిలా కనిపిస్తున్నాడు.

షెల్లీ మాట్లాడుతూనే ఉన్నాడు. ఎక్కడో గంట మ్రోగింది. "అరె, నా ఖనిజశాస్త్ర తరగతి" అంటూ మెట్లు దిగి వెళ్లిపోతాడు.

* * *

మర్నాడుదయం, షెల్లీ గదికి వస్తానని చెప్పినట్లుగానే హాగ్ వెళ్తాడు.

హాగ్ వెళ్లేసరికి షెల్లీ తన గదులు శుభ్రపరచటానికి వచ్చిన కుర్రవానితో పోట్లాడుతున్నాడు. గదులన్నీ చిందరవందరగా, గందరగోళంగా ఉన్నాయి.

ఆ గదుల్లో పుస్తకాలు, బూట్లు, కాగితాలు, పిస్తోళ్లు, గుడ్డలు, తుపాకిగుళ్లు, ఇనుము పోతపోసే క్రూసిబుల్స్, అన్నీ చెల్లాచెదురుగా పడివున్నాయి, నేలమీద, కుర్చీల్లో, మంచాలమీద కూడ! ఒకమోటరు, గాలిపంపు, సోలారు మైక్రోస్కోపు కూడా ఒక మూల కూర్చొని ఉన్నాయి. అంతలో షెల్లీ మోటారు మీట తిప్పాడు. పెద్ద శబ్దంతో నిప్పురవ్వలతో గాలి వీస్తుంది. నల్లని పొడవాటి కురులు గాలిలో మెరుస్తూ ఊగుతుంటే అతను గాజు బల్లమీద నిలబడి ఉన్నాడు. హాగ్ ఆశ్చర్యంతో షెల్లీని గమనించాడు. షెల్లీ కప్పుల్లో టీ నింపుతుండగా హాగ్ ఒక కప్పులోనుంచి బంగారు నాణేన్ని తీసి పరీక్షించి చూశాడు. అది నైట్రిక్ యాసిడ్‌లో సగం కరిగిపోయి, మిగతా సగం మాత్రమే ఉంది.

వారి స్నేహం దిన దిన ప్రవర్ధమానమై పెనవేసుకుపోయింది. రోజూ ఎంతో దూరం నడకలో గడిపేస్తారు. షెల్లీ చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తాడు. గుట్టలెక్కుతూ, గోడలు దూకుతూ, గంతులు వేస్తాడు. నీళ్ళు కనపడితే కాగితం పడవలు చేసి వదిలి, అవి మునిగి పోయేవరకూ వాటి వెనకాలే పరిగెడతాడు. హాగ్ అక్కడే నిలబడిపోయి షెల్లీ కోసం ఎదురు చూస్తుంటాడు.

గదికి తిరిగి వచ్చి షెల్లీ అలసి సొలసి పడిపోతాడు. చలిమంట గూటి దగ్గరలో రగ్గుల మీద పిల్లిలా తనలోకి తను ముడుచుకొని అయిదారు గంటలు నిదురపోతాడు. రాత్రి పది గంటలకు హఠాత్తుగా లేచి కళ్ళు నులుముకొని తన నల్లటి పొడవాటి జుత్తును సవరించుకొంటూ పద్యాలు చదవటమో, సాహిత్య చర్చ మొదలు పెట్టటమో, తనశక్తినంతా ఉపయోగించి హాగ్‌తో వాదిస్తాడు. రాత్రి పదకొండు గంటలకు ఏదో కొద్దిగా తింటాడు. తన సిద్ధాంతం ప్రకారం మాంసాహారం ముట్టడు. రొట్టెముక్కలు జేబుల నిండా ఉండేవి. నడుస్తూ, తింటూ, కవిత్వం చదువుతూ దారిపొడవునా రొట్టె చిల్లలు పడుతుంటే సమయం గడిచిపోతుంటుంది. రొట్టెతో పాటు ఎండుపళ్లు, అటుకులు తింటుంటాడు. బల్లదగ్గర కూర్చొని మామూలుగా భోజనం చేయటం అతను భరించలేడు. ఏ భోజనం పూర్తయ్యేది కాదు.

అలా ఆహారం తీసుకున్న తరువాత అతని మనసు, బుద్ధి వికసిస్తుంది. సంభాషణ అద్భుతంగా సాగేది. హాగ్‌తో, షెల్లీ తన మరదలు హెరియెట్ గురించి చెప్తాడు. ఆమెకు పెద్ద పెద్ద ఉత్తరాలు రాశానని - తన ప్రేమనంతా ఒలకబోస్తూ, మధ్యలో గాడ్విన్ సిద్ధాంతాలను, తత్వాన్ని బోధిస్తూ...

తనకు ఇష్టమైన లాక్, హ్యూమ్, వోల్టేర్ పుస్తకాలు తీసి చదువుతుంటాడు. వ్యాఖ్యానిస్తాడు.

హాగ్ ఆశ్చర్యపోతాడు. ఈ రచయితలు తన స్నేహితుణ్ణి ఇంతగా ఎలా ప్రభావితం చేయగలిగారా? అని! అతని మానసిక ప్రవృత్తి, బుద్ధి వికాసం చాలా వింతగా, విచిత్రంగా ఉండేది. షెల్లీ విపరీతమైన చదువు, ఈ సిద్ధాంత రాద్ధాంతాల అయోమయం అతన్ని అంతులేని ఆలోచనల లోయల్లోకి తోసివేసేవి. అందులోనుంచి బయల్పడాలంటే సూటిగా క్లుప్తంగా చెప్పగలిగే గాడ్విన్ సిద్ధాంతాలే ఈ మెట్టవేదాంతపు మత్తునుంచి షెల్లీని బయటపడేసేవి.

చరిత్రపుటల గందరగోళం నుంచి, పుస్తకాల గుట్టల పుట్టల నుంచి బయటపడడానికి, ఈ సూటిగా ఉన్న, లౌకిక ప్రపంచానికి దగ్గరగా ఉన్న- ప్రాపంచిక విషయాల్లోని గందరగోళం కూడా అతన్ని భయపెట్టేది- గాడ్విన్ తాత్త్వికతలో ఈ మబ్బుతెరల నుంచి సత్యాన్ని చూస్తున్నట్లు భావిస్తాడు. విస్తృతమైన గ్రంథ పఠన ప్రభావం, లౌకిక ప్రపంచపు గందరగోళం షెల్లీని గాడ్విన్‌కు మరింత దగ్గరగా తీసుకువెళ్ళాయి.

అప్పటికి గడియారం రాత్రి రెండు గంటలు కొట్టేది. తన స్నేహితుడు గొడవ చేస్తున్నా హాగ్ వెళ్ళి మంచమెక్కేస్తాడు. అరే! ఎంత ప్రత్యేకమైన వింత వ్యక్తి! చిన్నారి హొయలు, తల్లి చాటు యౌవనవతి స్వచ్ఛతా, ఎంతో చురుకైన బుద్ధి, కేథలిక్ సన్యాసి హృదయం, ఫ్రెంచి విప్లవ మేధావి, జాకోబిన్ ఆలోచనలు.

ఆహాఁ! ఎంత వింత వ్యక్తి ఈ షెల్లీ! ఇవన్నీ కలిస్తేనే షెల్లీ!

అవును. - ఆలోచించదగిన విషయం. హాగ్, షెల్లీ గురించి ఆలోచించి అలసిపోవటానికి, నిద్రలోకి జారిపోవడానికి అలవాటు పడిపోయాడు.



క్రీస్ట్ చర్చి కాలేజి, ఆక్స్‌ఫర్డ్



అరండేల్ కాజిల్

నాల్గవ అధ్యాయం

పోరుగు బాధ

క్రిస్టమస్ పండుగకు కొద్ది రోజుల ముందు – లండన్ ప్రచురణకర్త స్టాక్‌డేల్, తిమోతి షెల్లీగారికి ఒక ఉత్తరం పంపాడు. సారాంశం. యువ పెర్సీ రాసిన రచలను– ముఖ్యంగా తన దగ్గరకు వచ్చిన రాతప్రతి నవల సెయింట్ ఇర్విన్, దాని మరో పేరు రోజీక్రూసియన్. ఈ రాతలన్నీ అసంగతమైన విషయాలతో, తిరుగుబాటు ఆలోచనతో నిండిఉన్నట్లు మీ లాంటి పెద్దమనిషి పార్లమెంటు సభ్యుని కుమారుడు ఇలాంటి వక్రమార్గంలో తన తెలివి తేటలను వృధా చేయటం తమ దృష్టికి తేవటం నా కర్తవ్యమని, అంతేగాక పెర్సీ స్నేహితునిగా చెలామణి అవుతున్న జఫర్‌సన్ హాగ్, ఈ యువకుడు ఉత్తర రాష్ట్ర టోరీ కుటుంబానికి చెందినవాడే. కాని చాలా ప్రమాదకరమైన వ్యక్తిగ తెలియవచ్చిందని వివరించాడు. తిమోతి షెల్లి వెంటనే సమాధానం పంపాడు. ఆ నవలా ఆ రచనలకు ఒక్క పెన్నీకూడా ప్రచురణార్థం చెల్లింపబడదని. ఇది స్టాక్‌డేల్‌ని మరింత ఆందోళనకు గురిచేసింది.

సరే, ఎలాగు క్రిస్టమస్‌కు వారంరోజులు ఫీల్డ్ ప్లేస్ భవంతికి పెర్సీ వస్తాడు కదా – కొడుకుని ప్రేమపూర్వకంగానే మందలించాలని, హితబోధ చెయ్యాలని మానసికంగా సిద్ధమయ్యాడు తండ్రి.

ఇంతవరకు ప్రపంచంలో వాదనలు ఎవర్నీ ఒప్పించలేకపోయాయి. అందులోను ఒక తండ్రి తన కొడుకుతో వాదించి ఒప్పించగలగటం పిచ్చితనమే అనుకోవాలి.

* * *

తన తండ్రి వాదన ముగిసేసరికి పెర్సీకి తన కుటుంబ వాతావరణంలో ఇమడలేక ప్రచురణకర్త స్టాక్‌డేల్ పట్ల కోపంతో తన స్నేహితుడైన హాగ్‌కి మానసికంగా మరింత దగ్గరై ఆ సాయంత్రమే ఉత్తరంలో అన్ని విషయాలు చెప్పాడు.

"నా ఆలోచనలు, సిద్ధాంతాలని అందరూ వ్యతిరేకిస్తున్నారు. నన్ను అంటరాని వానిగా చూస్తున్నారు. భయంకరమైన తుఫాను రాబోతోంది. నేను శిలావిగ్రహంలా నిలబడతాను. తుఫాను భీభత్సాన్ని నవ్వుతూ భరిస్తాను. అప్పటికీ, నాన్నకి జ్ఞానోదయం కలిగించాలని అద్భుతంగా వాదించాను. కొంతసేపు విన్నారు. ఆయన దైవాన్ని నమ్ముతారట. దయ్యాలను, భూతాలను, మాయలు మర్మాలు నమ్మరట. కాని నేను ఈ అసంబద్ధ పరిస్థితిని వివరిస్తే చివరికి 'నాది విశ్వాసమే, కేవలం విశ్వాసమే' అని మౌనం వహించాడు. నా తల్లి ఇక నాకు పిచ్చి పట్టటమే తరువాయి అని నమ్మింది. నా చెల్లెళ్ళందర్నీ నాతోపాటు చెడగొడతానని భయపడింది. ఎంత హాస్యాస్పదం!" అని ముగించాడు.

మామూలుగా సెలవు రోజుల్లో, అందులోను క్రిస్టమస్ వేడుక దినాల్లో ఎంతో ఆనందోత్సాహాలతో ఉండవలసిన ఫీల్డ్‌ప్లేస్ భవంతి అనుమానపు నీలి నీడలతో నిండిపోయింది. శ్రీమతి షెల్లీ కూతుళ్ళందరిని అన్నకు దూరంగా ఉండమని సలహా ఇచ్చింది. పాపం వాళ్లు సిగ్గుపడి మౌనంగా ఉండిపోయారు.

అలవాటు ప్రకారం క్రిస్టమస్ పండుగ పనులు చేస్తున్నా, అందులో ఏమాత్రం ఉత్సాహం లేకుండా పోయింది. బహుమతులు, ఆశ్చర్యాలతో ఉండవలసిన పండుగ వాతావరణం అనుమానాలు, అవమానాలతో ఏమాత్రం సంతోషం లేకుండా గడిచిపోయింది. పెద్ద చెల్లెలు ఎలిజబెత్ రహస్యంగా అన్నతో మాట్లాడుతుంది. కాని హెరియట్, పెర్సీకి రోజు రోజుకూ దూరమవటం చూసి చాలా బాధపడింది.

* * *

తరవాత రోజుల్లో ఆక్స్‌ఫర్డ్ నుంచి హెరియట్‌కి వచ్చిన ఉత్తరాలు ఆసక్తికరమైన సిద్ధాంత విషయాలతో అర్థంచేసుకోవడానికి వీలుకాని విధంగా ఉండి ఆమెను చాలా ఇబ్బంది పెట్టాయి. గాడ్విన్ గురించి చెప్పిన విషయాలు ఆమెను కన్నీటి పర్యంతం చేశాయి.

అందమైన యువతులు, ప్రమాదకరమైన ఆలోచనలు దగ్గరకు రానీయరు. సౌందర్యం – ప్రకృతి సిద్ధంగా ఒక నిర్దిష్ట పద్ధతి ప్రకారం వ్యక్తీకరణ చెందుతుంది. సహజ సిద్ధమైన ప్రకృతి వ్యక్తీకరణమే సౌందర్యమంటే, దాని సారం: చాలా సంకుచితంగా ఉంటుంది. అప్పటి వరకు స్థిరీకరించబడిన మత విశ్వాసాలనే ఆహ్వానిస్తుంది. సంప్రదాయ సంస్కృతులనే అంగీకరిస్తుంది. ఆచార వ్యవహారాల ఉత్సవాలనే అలంకరిస్తుంది.

* * *



దిగులుగా సమాధుల మధ్య

హెరియట్ తనకు షెల్లీ రాసిన ఉత్తరాలను తల్లికి చూపింది. ఆమె భర్త దృష్టిలోకి తెచ్చింది. ఈయన గారు పెర్సీ షెల్లీ సిద్ధాంతాలను అనంగీకారమని, అయోగ్యమైనవని అభిప్రాయపడ్డారు. అంతేకాదు పాపం షెల్లీ భవిష్యత్తు అంధకారమైపోతున్నట్లు కూడా భయపడ్డారు. అందరికీ పనికిరాకుండా పోతున్న ఈ యువకునితో హెరియట్ జతకట్టాలా? హెరియట్ సుందరి అలంకరణలన్నా, పండుగలన్నా, పబ్బాలన్నా, కుటుంబ సమావేశాలన్నా, విందులు వినోదాలన్నా ఎంతో ఇష్టపడుతుంది. కాని షెల్లీని, ఎవరిని గౌరవించని, ఏ నియమాలను పాటించని, కనీసం వివాహవ్యవస్థను అంగీకరించని షెల్లీని ఎలా ఎంచుకొని జీవితాన్ని పంచుకోగలదు? మత విశ్వాసానికి కట్టుబడి ఉండాలిగదా!

షెల్లీ తిరిగిరాక మునుపు, ఎలిజబెత్ అన్న తరఫున హెరియట్‌తో చాలా గట్టిగా వాదించింది. ఈ చిల్లర ప్రాపంచిక విషయాలకు విలువ ఇవ్వటం ఎంతవరకు సబబు – షెల్లీ లాంటి అద్భుతమైన వ్యక్తితో ఆనందమయ జీవితం గడపటంతో పోలిస్తే ఇవన్నీ చిన్నవిషయాలు గదా! అని అభిప్రాయం వెలిబుచ్చింది.

"ఏమిటీ! నీ అన్నను గొప్పగా చెప్తున్నావు. బాగానే వుంది కాని, మన పెంపకమంతా ఈ పల్లెటూళ్లోనే గదా గడిచింది. మనం ప్రపంచాన్ని ఏమి చూశాము? చివరికి షెల్లీ నాన్నగారు కూడా ఇక్కడి వారే కదా! పార్లమెంటు సభ్యులై కూడా, తన కొడుకు అభిప్రాయాలను

గౌరవించలేకపోతున్నారు. ఒక వేళ నేను షెల్లీ లాంటి మేధావితో జీవితం గడపవలసి వస్తే, ఒక్కసారి ఆలోచించు, అలాంటి మేధావికి నా లాంటి పల్లెటూరి పిల్ల ఎలా సమవుజ్జీ కాగలదు? ఇది షెల్లీకి చాలా నిరాశ కలిగిస్తుంది కదా?"

హెరియట్ వాదనలో ఎంతో అణకువ ఉన్నట్టు కనపడుతున్నా – *నిజమైన ప్రేమకు నియతులేముంటాయి?*

చివరికి షెల్లీ వచ్చినప్పుడు ఎలిజబెత్ విషయమంతా విశదీకరించింది. వెంటనే హెరియట్‌ను కలిసి తన చెల్లెలు చెప్పిన విషయాలను, హెరియెట్ నిరాసక్తతను గుర్తించాడు. ఆమె షెల్లీని వివరణ కూడ కోరలేదు. తన మానానికి తనని వదిలివేయమంది. అతన్ని నాస్తిక వాదిగా నిరసించింది.

"ఇది చాలా అన్యాయం. నేను హేతుబద్ధంగా ఆలోచించి సిద్ధాంతీకరించిన అభిప్రాయాలను చెప్పే స్వాతంత్ర్యం నాకులేదా? అలా వెలిబుచ్చినంత మాత్రాన నేను – స్నేహితుణ్ణి, అన్నను, ప్రేమికుణ్ణి కాకుండా పోతానా? ఎంతటి అన్యాయం?" షెల్లీ వాపోయాడు.

"నువ్వేమైనా అనుకో. నాకు అవసరం లేదు – అనవసరం కూడా. నీ ఆలోచనతో నాకు పనిలేదు. నన్ను మాత్రం నీతో కలవమని అడగవద్దు, అంతే."

ఒక స్త్రీ నిర్లక్ష్యం, నిరాకరణ ఇంత దారుణంగా, మధ్య ఆఫ్రికాలో ఒక్కసారిగా చీకటి కమ్మినట్టు, ఉంటుందని షెల్లీకి అప్పటి వరకు తెలియదు.

అంతులేని దుఃఖంతో అడవిలోకి వెళ్లిపోయాడు. చలికి గడ్డకట్టిన చెట్లమధ్యలో, చీకటి రాత్రి నగ్నత్వంలోనుంచి, తిరిగి మంచుకురుస్తున్నా, చిమ్మ చీకటి కమ్ముతున్నా తెలియకుండానే ఆ ఊరి స్మశానంలోకి ప్రవేశించాడు.

హుఁ! ఇక్కడేనా భగ్నప్రేమికుల స్వప్నాలన్నీ పూడ్చిపెడతారు. ప్రేమకథలన్నీ సమాధులుగా నిలబడతాయి, అయ్యో!

రాత్రి రెండు గంటలకు ఇంటికి చేరాడు. పిస్తోలు తీసుకుని గుళ్లు నింపాడు. ఎన్నో రకాల విషరసాయనాలను కలగలిపి తన పక్కనే పెట్టుకున్నాడు.

కాని తన శవాన్ని చూసి ఎలిజబెత్ ఏమైపోతుందోనని – తన హత్యాయత్నం మానుకున్నాడు.



హెరియట్ గ్రోవ్

మర్నాడు హాగ్‌కి ఉత్తరం రాసాడు.

హెరియట్‌ని తప్పుపట్టలేదు. ఆమె తండ్రిని, తన తండ్రిని ఒక్క మాటకూడా అనలేదు. కేవలం అభిప్రాయ భేదాలు, పరస్పర అసహనాలు, ఈ విషాదానికి కారణం అన్నాడు.

"ఇప్పుడే ప్రతిజ్ఞ చేస్తున్నాను – నా ఒట్లన్నీ పక్కన పెట్టి నా కెటువంటి శిక్షలు పడినా సరే, ఈ 'అసహనాన్ని' క్షమించకూడదు. అంతేకాదు కక్ష సాధించాలి. ప్రతిక్షణాన్ని కక్ష సాధింపులోనే గడపాలి. ఈ అసహనమే సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మత – విలువలు, సంబంధాలన్నీ దీనిమూలంగానే తుంచబడుతున్నాయి. నేనే దీన్ని అంతం చేయగలిగితే ఎంత గొప్పగా ఉంటుంది. ఈ అసహనమనే భూతాన్ని అణగద్రొక్కి ప్రపంచంలో 'శాశ్వతంగా' శాంతిని, సహనాన్ని ప్రతిష్టించాలి.

"ఈ దాహార్తి ఆలోచనలు, కవిత్వ భాషలో పెట్టాలని – ఆ విధంగా తృష్ణను తృప్తి పరుచుకోవచ్చని అనుకుంటున్నాను. నువ్వే చూడాలి, నువ్వే వినాలి. నేనెంతగా గాయపడ్డానో.

"ఇక ఆమె నాది కాదు. నన్ను అనుమానపక్షిగా నిరసించింది. ఈమెను నేను క్షమిస్తే – దేవతలు, వారంటూ ఉంటే – నన్ను క్షమించరు.

"నన్ను క్షమించు. ప్రేమగాఢతలో స్వార్థం ఉందనుకుంటాను. లేకపోతే నా అంతరంగం ముక్కలైపోతున్నట్లు ఈ ఆవేదనేమిటి? చాలు, ఇంక బాధపడను. ఇది స్వార్థమే. ఇక ఇతరులకోసం శ్రమపడతాను. ఆలోచిస్తాను. నాకోసం కాదు. ఈ సంఘర్షణలో అంతమైపోతే ఎంతబాగుండును. అది చాలా హాయిగా ఉంటుంది. ఆత్మహత్య తప్పా? గుళ్ళున్న పిస్తోలు పక్కలో పెట్టుకుని, విష రసాయనాలు గుప్పిట్లో పట్టుకుని పడుకున్నాను. కాని నన్ను నేను హత్య చేసుకోలేదు. నా చెల్లెలు ఎలిజబెత్ కోసం, నీకోసం బ్రతికివున్నా. నీకు చివరి వీడ్కోలు చెప్పి వుండేవాడినే..."

ఇంకా పదిహేను రోజులు ఈ ఫీల్డ్ ప్లేస్ భవంతిలో గడపాలి. ఆనందంగా గడపవలసిన సెలవులు తన తండ్రికి, తల్లికి విచారకరంగా మారిపోయాయి.

తన చెల్లెళ్ళందరికి ఇబ్బందికరంగా మారింది. ఎలిజబెత్ ఎన్ని సార్లు కబురు చేసినా హెరియట్ వచ్చి షెల్లీని చూడటానికి, వారితో గడపటానికి నిరాకరించింది. అప్పటికే పుకార్లు మొదలైనాయి. ఆమెకు మరెవరితోనో నిశ్చితార్థం జరిగిపోయిందని.

ఎదుటి వారిని సంతోషంగా ఉంచాలనే భ్రమను సంతృప్తి పరచటానికి షెల్లీ, హాగ్‌ని ఎలిజబెత్‌ను ప్రేమించమంటాడు. హాగ్ ఇంతవరకు ఆమెను చూడనే లేదు. ఎలిజబెత్ రాసిన కొన్ని కవితా పంక్తులను తన మిత్రునికి పంపుతాడు. అందులో అంతా మంచే ఉంది. నిరంకుశత్వాన్ని నిరసించింది. "అందరూ అన్నదమ్ములే– ఇనుపచువ్వతో కొడుతున్న తెల్లవాడు, దెబ్బలు తింటున్న నల్లవాడు అందరూ అన్నదమ్ములే --- ప్రపంచమంతా మంచే ఉంది." అవి ఇలా ఉన్నాయి :

అలాగే హాగ్ రాసిన కవితలు తన చెల్లెలికి ఇస్తాడు. "చూడు, ఇవి ఎంత మనోహరంగా ఉన్నాయో" అంటూ. అందులోనే షెల్లీని పచ్చని చెట్టులాగ, హెరియట్‌ని అల్లుకున్న తీగలాగ వర్ణిస్తాడు హాగ్.

"అవును, హుఁ! ఆ తీగే, చెట్టును నాశనం చేసింది. ఇప్పుడు పక్కనున్న మరో దేవదారు చెట్టును చుట్టుకుంది" చెల్లెలితో షెల్లీ అంటాడు.

ఆ పక్కనున్న చెట్టు పేరు హేలర్. చాలా సంపన్నుడు. తన భార్యను చక్కగా ప్రతి సాయంత్రం విందులకు, వినోదాలకు తీసుకువెళ్లి ఆమెకు ఆనందం కలిగిస్తాడు. అది దైవ సంకల్పం మరి.

"ఆమెకు నాకు పూర్తిగా తెగిపోయింది. ఆమె నయన సోయగాలు, యౌవనగంధం, కవోష్ణ మృదుస్పర్శ - ఇవేమీ నాకు చెందవు. ఇప్పుడామెకు పెళ్లికూడా అయిపోయింది. వాడొక మట్టిముద్ద. ఇంక ఆమెకు ఎటువంటి అనుభూతులు, ఆవేదనలు ఉండవు. మునుపటి శుభలక్షణాలన్నీ దుమ్ముకొట్టుకు పోతాయి. ఇకనుంచి ఆమె సంగతులు మాట్లాడవద్దు."

హాగ్‌ను ఫీల్డ్ ప్లేస్‌కు ఆహ్వానిద్దామని అనుకున్నాడు. ఆ విధంగా తన చెల్లెలు అతన్ని చూసి నిర్ణయానికి రాగలదని ఆశించాడు.

కాని తిమోతిగారు స్టాక్‌డేల్ రాసిన లేఖా ప్రభావంతో 'హాగ్ అనే ప్రమాదాన్ని' ఇక్కడి వరకు రానివ్వలేదు.



పొరుగు బాధ



షెల్లీ, హారియెట్ గ్రోవ్

ఐదవ అధ్యాయం

నాస్తికత్వం

ఆ విధంగా భారంగా, ఆ దురదృష్టపు సెలవులు గడిచి నెలకు పైగా జరిగింది. పూర్వం తిమోతి షెల్లీ తన కుమారుణ్ణి గర్వంగా పరిచయం చేసిన పుస్తక ప్రచురణకర్తలు ముండే & స్లాటర్, ఒక రోజు ఉదయం ఒక యువకుడు కాగితాల దొంతరలతో తమ దుకాణంలోకి, చొక్కా కాలరు తెరిచి ఉండగా, పొడవాటి జుత్తు ఎగురుతుండగా చొచ్చుకు వచ్చి, ఈ కాగితాలను ఒక్కొక్కటి ఆరు పెన్నీలకు అమ్మాలని, కనపడేటట్లు అద్దాల కిటికీలకు అంటించాలని హడావుడి చేశాడు. అలా వెంటనే ఆ కార్యం తనే నిర్వహించటానికి పూనుకున్నాడు.

ఈ పుస్తకాల దుకాణాదారులు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులను, వారి వెనుకనున్న సంపదను, వంశమర్యాదను మన్నించి చాలా అణకువగా ఉంటారు. కాని ఆ చిన్ని పుస్తకంలో ఏముందో చూస్తే వారు హతాశులయ్యేవారే. దాని శీర్షికే 'నాస్తికవాద అవసరం' – మతవాదాన్ని పూర్తిగా నిరసిస్తూ రాసిన రాతలవి. ఎందుకు దేవుడు లేడో, లేని దేవునికి మతముండదని గణితశాస్త్ర విధానంలో నిరూపించిన గొప్ప చిన్న గ్రంథం. దాని రచయిత జర్మయ్య స్టక్‌లే – ఇంతవరకు ఎవ్వరూ వినని పేరు ఇది.

"సత్యాన్ని తెలుసుకోవాలంటే పూర్తిగా పరిశోధించాలి. సాక్ష్యాలన్నీ సేకరించాలి. అలా కానప్పుడు అది సత్యమే కాదు" ఈ విధంగా మొదలైన దైవ నిరసన, గణితశాస్త్రపరంగా నిచ్చెన మెట్లపై దింపుతూ చివరికి దేవుడు ఉండటానికి ఆస్కారం లేదని దీనినే, Q E D సిద్ధాంతమని ముగించాడు జర్మయ్య.

షెల్లీకి గణితశాస్త్రం ఏమాత్రం తెలియకపోయినా దీనిలో ఎంతో సత్యం వుందని, ఇదే సత్యమని నమ్మాడు.

నైతికత ముఖ్యమని, దానికి దేవునితో పనిలేదని, మనిషి నీతికి కట్టుబడి జీవించాలని - ప్రపంచమంతా మంచితోనే నిండి ఉందని అందులో వివరించబడింది. వ్యక్తిగతంగా 'Vicaire Savoyard' సిద్ధాంతాన్ని ప్రచారం చేసినా నాస్తికత అనే పదం అతనికి బాగా నచ్చింది. ఆ పదంలో గొప్ప శక్తి దాగివుందని నమ్మి దానితోనే మత ఛాందసాన్ని ఎదుర్కోవాలని ప్రయత్నించాడు. ఈటన్‌లో తన మీద పడిన ముద్రతోనే, పడిపోయిన ఆయుధాన్ని తీసుకొని పోరాటానికి, Knight Errant లాగ, సిద్ధమయ్యాడు.

తనకు వారసత్వంగా వస్తున్న భౌతిక పౌరుషానికి మేధోశక్తిని, నైతికతను కలబోసి ఈ యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు. రాబోయే ప్రమాదాలను, అపవాదులను తిప్పి కొట్టటానికి సర్వసన్నాహాలు చేసుకున్నాడు.

అప్పటికింకా అరగంట కూడా కాలేదు. ఈ 'నాస్తిక అవసరం' కాగితాలు కిటికీలోకి చేరి - ఆ దుకాణంమీదుగా వెళ్తున్న రివరెండ్ జాన్ వాకర్‌గారు, ఈయన ఆక్స్‌ఫర్డ్ న్యూ కాలేజి కమిటీలో సభ్యుడు కూడా- ఆయన కంటబడింది ఈ 'నాస్తిక అవసరం'. ఆయనగారు దుకాణంలోకి దూసుకువచ్చి "ఏమండీ ముండేగారు, స్లాటర్‌గారు, దీని అర్థం ఏమిటి ?" అని నిలదీశారు.

"అయ్యా! నిజానికి ఇది ఇప్పుడే చూస్తున్నాం. దీని గురించి ముందుగా తెలియదు" అని సమాధానం చెప్పారు.

"ఏమిటీ - 'నాస్తికత్వం అవసరమా' ఈ శీర్షికే తెలుపుతుంది కదా చాలదా?" అని గట్టిగానే గద్దించారు.

"అవునయ్యా, తెలుస్తోంది - ఇప్పుడే తెలిసింది..."

"తెలిసింది కదా - వెంటనే ఈ కాగితాలన్నీ పోగుచేసి పొయ్యిలో పడవేయండి. ఒక్క కాగితం కూడా మిగలటానికి వీలులేదు" అంటూ ఆర్డరు వేశారు. నిజానికి అలా ఆజ్ఞాపించే హక్కూ, అర్హతా ఆయనకు లేదు. కాని విశ్వవిద్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని భయపడి ఆయన ఆజ్ఞాపించిన విధంగానే కాగితాలు పోగుచేయటం మొదలు పెట్టారు ముండేగారు.

"బాబూ, మీ మంచి కోసమే చెప్తున్నాం. ఇది ఆపండి. ఆ కాగితాలన్నీ ఇవ్వండి" అన్నారు, ఇంకా కిటికీలకు కాగితాలు అంటిస్తున్న షెల్లీతో.

"ఏమిటీ, నా మంచి కోసమా? ఈ ప్రపంచాన్ని బాగుచెయ్యాలని ఆక్స్‌ఫర్డ్ పక్షులకు అన్ని రకాలుగా వలలు విసిరాను. ఈ పుస్తకం కళాశాల మాస్టరుకి, వార్డెన్‌కు, డీన్‌గారికి, బిషప్‌గారికి అందరికీ చేరిపోయాయి– జర్మయ్య గారి సంతకంతో శుభాకాంక్షలతో – నా స్వదస్తూరితో..." అంటున్నాడు షెల్లీ.

* * *

కొద్దిరోజుల తరువాత హాగ్ గదికి కాలేజి బంట్రోతు వచ్చి 'మీకు డీన్‌గారు శుభాకాంక్షలు తెలిపారు. మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు' అని హాగ్‌ని కిందకి తీసుకుని వెళ్లాడు.

అక్కడ సమావేశ మందిరంలో ప్రధానాచార్యుడు, మిగతా సభ్యులు కూర్చొని ఉన్నారు. వారితోపాటు పరిశుద్ధాత్మలు కొందరు కూడ ఆసీనులై ఉన్నారు. కరుడు కట్టిన మతాచార్యులు, కండలు తిరిగిన సన్యాసులు ఉన్నారు. వీరందరికి షెల్లీ పొడవాటి జుట్టుపైనా, అతని తెరిచి ఉన్న కాలరుమీద అసూయ. అతని అద్భుతమైన వేషధారణ కూడా వారికి మింగుడు పడదు.

అప్పుడు డీన్‌గారు దుకాణంలో పెట్టిన కరపత్రాన్ని చూశారు. 'నాస్తిక అవసరం'

"ఇది రాసింది నీవేనా" అని కటువుగా అడిగారు షెల్లీని.

ఆయన ధోరణికి ఒళ్లుమండి షెల్లీ సమాధానం చెప్పలేదు.

"చెప్పు – నీవా? కాదా? అవునా ? కాదా ?" అని రెట్టించారు.

"అది నేనే రాశానని మీరు నిరూపించగలిగితే సాక్ష్యాన్ని చూపండి. ఈ విధంగా నన్ను నిలదీయటం ధర్మం కాదు. న్యాయం అసలే కాదు. ఇది న్యాయస్థానంలో జరగవలసిన విధానం – కాని స్వేచ్ఛగా జీవించేవానికి స్వతంత్ర దేశంలో జరగరాని అవమానం" అన్నాడు.

"అంటే దీని రచయిత నీవు కాదన్నమాట".

"దీనికి సమాధానం నేను చెప్పను".

"అయితే నిన్ను ఇప్పుడే కళాశాల నుంచి బహిష్కరిస్తున్నాం. నీవు రేపు ఉదయంలోపు వెళ్ళిపోవాలి" అని సీల్డు కవరు అందించారు.

* * *

షెల్లీ గదికి చేరాడు. 'బహిష్కరణ – ఆహా! బహిష్కరణ' అంటూ కోపంతో ఊగిపోయాడు.

ఇది చాలా దారుణమైన శిక్ష – అతని చదువు ఆగిపోతుంది. మరో కళాశాలలో చేర్చుకోరు. ఇక్కడి ప్రశాంత వాతావరణం, జీవనం కోల్పోతాడు. దారుణమైన తన తండ్రి కోపాగ్నికి గురికావలసి వస్తుంది. ఎంత భయంకరమైన శిక్ష.

హాగ్ కూడా కోపంతో రెచ్చిపోయాడు. తన స్నేహితునికి జరిగింది అన్యాయమని నమ్మాడు. అతని యువరక్తం షెల్లీని సమర్థించింది. ఇదే ముగింపు కాకూడదని అనుకుంటూ డీన్‌కి చిన్న ఉత్తరం పంపాడు.

ఆ వెంటనే బంట్రోతు 'మీకు డీన్‌గారి శుభాకాంక్షలు. మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు' అని వెంటబెట్టుకుని తీసుకువెళ్లాడు. అప్పటికింకా కింద సమావేశం ముగియలేదు.

"ఇది నీవే రాశావా?" డీన్.

అది తను రాసిన ఉత్తరమే. అవునన్నాడు. "మరి ఇది" అంటూ కరపత్రాన్ని చూపించాడు.

* * *

హాగ్ ఎంతో వివరంగా వాదించాడు. షెల్లీలాంటి మేధావి విద్యార్థికి అన్యాయం చేయవద్దని, ఎవరినీ అబద్ధం చెప్పటానికి బలవంత పెట్టకూడదని, ఇది వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అపహాస్యం చేయటమేనని అన్నాడు.

"ఇక చాలు", డీన్ గర్జించి "నిన్ను కూడా బహిష్కరిస్తున్నాం." అంటూ సీల్డు కవరు అందించాడు.


డీన్ ఎంత దారుణమైన మానసిక స్థితిలో ఉన్నాడంటే, కనబడిన వారినంతా కళాశాల నుంచి బహిష్కరించటానికి సిద్ధమయ్యాడు.

ఆరోజునే వీరిద్దరి బహిష్కరణ సమావేశపు మందిరంలో ప్రకటించారు. దాని మీద మాస్టరు, డీన్ సంతకాలు చేశారు. కాలేజి ముద్ర వేసి వుంది.

"అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పనందుకు కళాశాల నుంచి పంపించినట్లు" వివరించారు.



లీజెంట్ పార్క్ కాలేజి



ఆక్స్‌ఫర్డ్ బండి!

ఆరవ అధ్యాయం

సయోధ్య ప్రయత్నం

బహిష్కృతులిద్దరు పెట్టేబేడా సర్దుకొని ఆక్స్‌ఫర్డ్ బండిలో బయలుదేరారు. పుస్తకాల దుకాణదారునినుంచి ఇరవై పౌండ్లు అప్పుచేసి షెల్లీ బండెక్కాడు. తిమోతి గారినుంచి కబురు వచ్చేవరకు లండన్‌లో గడపాలిగదా.

లండన్‌లో అతను చూసిన అన్ని వసతి గృహాలు అసహ్యంగా ఉన్నాయి. కొన్ని ఇరుకు సందుల్లో, మరికొన్ని దుకాణాల గోల మధ్య, ఇంకొన్ని మురికికూపాల్లా – ఈ విధంగా తాను నివసించటానికి గూడే దొరకదన్న అనుమానం వచ్చింది. చివరికి పోలెండ్ వీధిలో దొరకవచ్చని, వార్సా – స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మరో పేరు కాబట్టి తనకి అదే సరైన చిరునామా అవుతుందని పోలెండ్ వీధిలో చూసిన మొదటి వసతే అతనికి నచ్చింది. ఆకుపచ్చని ద్రాక్షలతల ఆకులు, అప్పుడే పండుతున్న నల్లద్రాక్ష గుత్తులతో ఆ వసతి ప్రపంచంలోనే అందమైనదని నిర్ణయించాడు.

“ఇక్కడే ఉందాం. మళ్లీ ఆక్స్‌ఫర్డ్ రోజులు : కవిత్వం, పుస్తకాలు చదువుతూ చలిమంట దగ్గరలో చర్చించుకుంటూ, మన అభిప్రాయాలు తెలుపుకుంటూ ఇక్కడే ‘శాశ్వతంగా’ ఉండిపోదాం” అని హాగ్‌తో అంటున్నాడు.

దీనికి అభ్యంతర మేముంటుంది, వారిద్దరి తండ్రుల అంగీకారం తప్ప!

ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో జరిగిన సంఘటనల్ని విన్న తిమోతి గారు చాలా అవమానకరమని నొచ్చుకొని రెచ్చిపోయారు. ఆఁ! నిజమే! అంతటి ధనవంతుడు, పార్లమెంటు సభ్యుడు, ఆ ప్రాంతపు మెజిస్ట్రేటు – అవమానం కాదా తన కుమారుని బహిష్కరణ, అదీ నాస్తిక ముద్రతో.

తిమోతీ ఉదారవాదిగా అందరికీ తెలుసు. అటువంటి అభ్యుదయ భావాలుగల రాజకీయవాదికి మతసహకారం లేకపోతే ఎలా?

అప్పుడే కూర్చొని హాగ్ తండ్రికి ఉత్తరం రాశాడు : ఈ దురదృష్టపు సంఘటన మన బిడ్డలకు జరగటం విచారించ దగినదే. మీ వాణ్ణి వెంటనే ఇంటికి తీసుకువెళ్లటం మంచిది. ఇక మా వాడి సంగతి, అతనికి, 'పాలే' ఆస్తికవాదాన్ని వినిపిస్తాను అని ఉత్తరం ముగించాడు.

రెండో ఉత్తరం షెల్లీకి రాశాడు : తండ్రిగా నీకు జరిగిన అన్యాయానికి చింతిస్తున్నాను. కాని, దానికి కారణం నీ నేరపూరితమైన ఆలోచనలే అని గుర్తించాను. నీవు కూడా ఒక విషయం గుర్తించుకోవాలి. తండ్రిగా నా బాధ్యతలు, పార్లమెంటు సభ్యునిగా నా విధులు నేను నిర్వర్తించాలి గదా. నీ చెల్లెళ్ల భవిష్యత్తుకు, నీ తమ్ముని భావి జీవితానికి నా అవసరం ఉందికదా. అన్నిటినీ మించి ఒక క్రిస్టియన్‌గా నేను చిత్తశుద్ధితో ప్రవర్తించాలిగదా.

నీకు నానుంచి ఎటువంటి సహకారం కావాలన్నా, ఎటువంటి సంరక్షణ అవసరం ఉన్నా, నీ నుంచి నాకు సంతృప్తి కలిగే సమాధానాలు కావాలి.

మొదటిది : వెంటనే ఫీల్డుప్లేస్ ఇంటికి వెళ్లాలి. హాగ్, అదే నీ స్నేహితునితో అన్ని సంబంధాలు తెంచుకోవాలి- కనీసం కొంతకాలమైనా.

రెండోది : నేను నియమించే పెద్దమనిషి సలహా, సంప్రదింపులు తీసుకొని నీ నడవడిక మార్చుకోవాలి.

ఈ నియమాలు అంగీకారం కాకపోతే తిమోతి తన కొడుకును 'వదులు' కోవటానికి - అతనికిచ్చే భరణం ఆపివేయటానికి వెనుకాడడు. తరువాత షెల్లీ పరిస్థితులు ఎంత దారుణంగా పరిణమిస్తాయో ఊహించుకోవచ్చు. అలా ఉత్తరం ముగించారు.

దీనికి షెల్లీ చాల క్లుప్తంగా సమాధానం పంపాడు.

మీరు నా నిర్ణయాన్ని వినాలనే గౌరవం ఇచ్చినందుకు, నేను సమాధానం చెప్పాలికదా. మిమ్మల్ని మీ బాధ్యతలను ఇబ్బందిపాలు చేయటం నాకెంతో బాధాకరమైన విషయమే.

మీరు మీ కుటుంబం పట్ల, మీ క్రిస్టియన్ వ్యక్తిత్వం పట్ల బాధ్యతలను నా మూలంగా తక్కువ చేసుకోవద్దు. ఎందుకంటే మీరు చెప్పిన రెండు నియమాలు నాకు సమ్మతం కాదు. ఇక ముందు కూడా ఇటువంటి అభ్యర్థనలు పంపకండి.

మీ అభిమానానికి, మీ ప్రేమకు కృతజ్ఞతలతో...

మీ ప్రేమ పాత్రుడు, బాధ్యతగల కుమారుడు,

పెర్సి బీష్ షెల్లీ.

– – –

తండ్రీతనయుల సంబంధాలకు ముఖ్యమైన అడ్డంకి – తండ్రి ఎటువంటి ఘర్షణా కోరుకోకపోవటమే. అంతా ప్రశాంతంగా ఉండాలని ఆశించటమే. తాను కోరిన రెండు విషయాలను త్రోసిపుచ్చినప్పటికీ కొడుకు మీద ఎటువంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలో తిమోతి గారికి తోచలేదు.

ఆయన హృదయంలోని మంచితనం మరో ప్రయత్నం చేయమనే ప్రోత్సహిస్తోంది. అదీ, మధువులో మాధుర్యంతో పాటు శక్తి కూడా దాగివుంటుందనే నమ్మకం గల మంచివాడు. అందుకే ఇద్దరు స్నేహితుల్ని మిల్లర్ హోటల్‌కి విందుకి ఆహ్వానించాడు. అక్కడే మంచి మధువు, మంచి భోజనం దొరుకుతుంది.

'ఏది ఏమైనా యువకులను ప్రేమగా చూడాలి అనుకుంటూ' హోటల్ విందు శాలలో వారి కోసం వేచి ఉన్నాడు. తన అనుభవం, తన మాటకారితనం – పద్దెనిమిది సంవత్సరాల వయస్సు గల తత్త్వవేత్తను తప్పక ఒప్పించ గలుగుతాయని అనుకున్నాడు. అవసరమైనప్పుడు సంభాషణలో చక్కని అనుభవపూర్వకమైన సలహా పడవేస్తే కుర్రకుంకలు ఊరికే పడిపోతారు అని కూడా ఆలోచించాడు.

'ఎంత కాదన్నా నా వారసుడు కదా, ఈ సంపదకు అతనే భవిష్యత్ యజమాని కదా' అని పైకే అనుకున్నాడు.

పాలే ఆస్తికత్వాన్ని వల్లె వేసుకొంటూ స్నేహితులిద్దరికోసం ఎదురుచూస్తున్నాడు.

* * *

పోలెండ్ వీధినుంచి, సౌతార్క్ వీధిలో ఉన్న మిల్లర్ హోటల్‌కి నడిచి వెళ్తూ దారిలో వోల్టేర్ *ఫిలసాఫికల్ డిక్షనరీ* ని వీధిపక్క దుకాణంలోంచి తీసుకొని దాన్ని చదవటం లోని ఆనందాన్ని స్నేహితులు బాహాటం గానే తెలుపుకున్నారు.



నీలికళ్ల షెల్లీ

ఆ ఫ్రెంచి రచయిత, జహోవా పనికిరాని హింసను నిరసించాడు.

ఆ సరికి హోటల్‌కి చేరి తిమోతి గారితో మరో పెద్దమనిషి, 'గ్రహం' కూర్చొని ఆయన ఆతిథ్యాన్ని స్వీకరిస్తుండటం గమనించారు.

తిమోతి, హాగ్‌ని ఎంతో ఆదరంగా ఆహ్వానించాడు. తరువాత షెల్లీతో అసంబద్ధంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆయన ప్రవర్తన కూడా, బహుశా వైన్ ప్రభావమేమో, కొంత వింతగానే ఉంది.

'మా నాన్న గురించి ఏమనుకుంటున్నావు అని' హాగ్‌ని షెల్లీ అడుగుతాడు.

'ఓ, ఈయన మీ నాయన కాదు. ఆయన జ్యూస్ దేవుడు – జహోవా ఇప్పుడే కదా చదివాం' హాగ్ నవ్వుతాడు.

అంతే, షెల్లీ పెద్దగా నవ్వుతూ నేలమీద పడి, పడీ పడీ నవ్వుతాడు.

"ఏమిటి పెర్సీ, వంట్లో బాగాలేదా? ఏమైనా పిచ్చా? ఎందుకు అలా పడి పడి నవ్వుతున్నావు" తిమోతి కంగారు.

సరిగ్గా అదే సమయంలో వడ్డించటం మొదలు పెట్టారు, దీనితోపాటు మరికొంత పాత వైన్ కూడా.

విందు ముగిసిన తరవాత షెల్లీని బండి సిద్ధం చేయమని పంపి హాగ్‌తో "నీవు చాలా మంచివాడివి, నీవే చెప్పు, షెల్లీని ఏమి చేయమంటావో? అతని ఆలోచనలు

విపరీతంగా ఉన్నాయికదా" తిమోతి.

'అవునవును.'

"మరి నేనేం చెయ్యాలి" తండ్రి బాధ.

'షెల్లీ తన మరదల్ని పెళ్లిచేసుకొని ఉంటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు. అతనికి మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేయండి. అతనికి పెళ్లయితే నష్టమేముంది?" హాగ్.

"అది జరిగేపనేనా? షెల్లీ సంగతి తెలిసిందే కదా. ఫలానా అమ్మాయిని చేసుకోమంటే వినేరకమా?" తిమోతి బాధ. "వాడి సంగతి నాకు తెలుసు."

'ఆ విషయంలో నాకూ సందేహం లేదు. మీరు చేసుకోమంటే చేసుకోడు, కాని అందమైన అణకువ గల అమ్మాయిని పరిచయం చేయండి అంతవరకే. అతను తప్పనిసరిగా ఇష్టపడవచ్చు - ఒక వేళ ఒకరు కాకపోతే మరొకరిని ప్రయత్నించ వచ్చు కదా' ఇది హాగ్ సలహా.

ఇప్పుడు గ్రహం 'ఇది అద్భుతమైన సలహా, మంచి ఆలోచన' అని మెచ్చుకున్నాడు. గ్రహం, తిమోతి రహస్యంగా వారికి తెలిసిన అందమైన యువతుల గురించి మాట్లాడటం మొదలు పెట్టారు. అంతలో షెల్లీ తిరిగి వచ్చాడు. తిమోతి, మరో వైన్ సీసా కోసం కబురు పెట్టాడు.

అప్పటికే వైన్ ప్రభావంతో తను పార్లమెంటు సభ్యునిగా ఎంత పేరు ప్రఖ్యాతులున్నవాడో గొప్పగా చెపుతూ, చివరికి పార్లమెంటు స్పీకర్‌కూడా "మిస్టర్ షెల్లీ మీరు లేకపోతే నేను పార్లమెంటు ఎలా నడపగలను?" అని ఆశ్చర్యపోతాడని, ఆ ప్రాంతపు మెజిస్ట్రేటుగా తన గొప్పతనం - "మొన్ననే ఇద్దరు వేటగాళ్లను, వదిలి పెట్టించాను. తరువాత ఒకడు వచ్చి నన్ను ఎంతగానో తన కృతజ్ఞతలతో ముంచివేశాడు."

ఇదేమీ హాగ్‌కు అంతుపట్టలేదు. అవును వైన్ ప్రభావం అనుకున్నాడు.

తిమోతి "దేవుడున్నాడు నాకేమాత్రం అనుమానం లేదు. ఏమండీ హాగ్, మీకేమయినా అనుమానం ఉందా?"

'లేదు సార్'

"ఒకవేళ అలాంటి అనుమానం ఉంటే ఇప్పుడే నిరూపిస్తాను."

'నాకస్సలు లేదుసార్'

"అయినా నా వాదన వినాలని లేదా?"

'చెప్పండి' హాగ్.

తిమోతి తన జేబులన్నీ వెతికాడు. బిల్లులు, కాగితాలు, ఉత్తరాలు వగైరా. చివరికి ఒక కాగితం తీసి చదవటం మొదలు పెట్టాడు. షెల్లీని దృష్టిలో పెట్టుకొని. కొంతసేపు తరువాత షెల్లీ 'అరె, నేనిది విన్నానే' అని హాగ్ వంక తిరిగి 'ఎక్కడ విన్నాను' అంటాడు.

'అవి పాలే వాదనలు కదా' హాగ్

"అవును, ఇవి పాలే వాదనలే. పాలే పుస్తకంలోవే. అవన్నీ నా వాదనలే పుస్తకంలోకి ఎక్కించారు" అంటూ కాగితాలు మళ్లీ జేబులో పెట్టుకున్నారు.

విందు ముగిసింది. ఏవిధమైన శాంతి ఒప్పందాలు జరగలేదు. షెల్లీ తండ్రి మాట విననప్పుడు – తండ్రి షెల్లీకి ఒక పెన్నీ భరణం కూడా ఇవ్వనన్నాడు. హాగ్‌కి తిమోతీకి అభిప్రాయ భేదాలేమీలేవు. హాగ్ షెల్లీ లాగా కాదు.

షెల్లీ ఎప్పుడూ సిద్ధాంతాలపై రాద్ధాంతం చేస్తాడు. అతన్ని నొప్పించకుండా ఒప్పించలేము. అతని అహాన్ని గాయపర్చకుండా వాదించలేము.

హాగ్ చిన్నవాడైనా జీవితాన్ని అర్థం చేసుకున్నాడు. లోకం తీరు తెలిసినవాడు. వివాహవ్యవస్థ అంటే అతనికి ఉన్న ఆలోచనలు సక్రమమైనవి.

హాగ్ తిమోతి గారిని, న్యూ షోర్ హామ్ పార్లమెంటు సభ్యుని, వాక్చాతుర్యాన్ని, వాదనా పటిమను ఎంతో మెచ్చుకున్నాడు – కొద్దిగా వైన్ ప్రభావంతో మాట తడబడినా.

* * *

హాగ్ తన తండ్రితో కూడా శాంతి ఒప్పందానికి వచ్చాడు. ఆయన కూడా నిజాయితీగల బ్లూ టోరీ కుటుంబానికి చెందిన ఛాదస్తుడే. కొడుకుని గట్టిగానే మందలించాడు. షెల్లీ తండ్రి తిమోతి లాగానే.

హాగ్‌ని లా చదవమని తండ్రి సలహా ఇచ్చాడు. యార్క్ ఛాంబర్‌కు వెళ్లి చేరమన్నాడు. ఆ విధంగా షెల్లీని, పోలెండ్ వీధిలోని వసతి గృహంలో షెల్లీని వదిలి, వైన్ లతల ఆకుపచ్చదనంలో, పచ్చని, ఎర్రని ద్రాక్షగుత్తుల మధ్యలో, ఆ నీలికళ్ల ఆశ్చర్యాన్ని వదిలి వెళ్లిపోయాడు.



శీతాకాలం తర్వాత వసంతం



షెల్లీ - ది మూన్

ఏడవ అధ్యాయం

యువతుల పరిషత్

స్నేహితులు లేక, పని లేక, చివరకు చేతిలో చిల్లిగవ్వకూడా లేక షెల్లీ ఒంటరిగా లండన్ పోలెండ్ వీధిలో నిరాశలో కూరుకు పోయాడు. తనకు మిగిలింది కేవలం సమయమే. విషాద గీతాలు రాయటంలో, హాగ్‌కి ఉత్తరాలు పంపటంలో ఆ సమయాన్ని గడుపుతున్నాడు. సాయంత్రాలు ఏమిచేయాలో తోచక ఎనిమిది గంటలకే నిద్రపోతాడు. కేవలం నిద్రాదేవి మాత్రమే తన విషాద కథను మరిపింపజేసేది – కష్టాలకడలిని ప్రశాంతంగా ఉంచగలిగేది. మెలకువ రాగానే తన అందాల మరదలు – ఆమె కఠిన హృదయం గుర్తుకు వచ్చి నరకయాతన అనుభవించేవాడు. ఈ బాధామయ స్థితినుంచి తనను తాను కాపాడుకోవటానికి ఎంతో ఆవేదన చెందేవాడు.

“నేను ఆమెను ప్రేమించాను – ఇప్పుడు ఆమె నేను ప్రేమించిన వ్యక్తి కాదు. దీని బదులు హృదయం లేని, ఏమాత్రం ఇంగితం లేని చీకటి కీటకాలను ప్రేమించినా వ్యత్యాసం ఏముంటుంది?” అనుకుని సమర్థించుకుంటాడు.

ఇది ఎంత గొప్ప తార్కికంగా ఉన్నా అతనికి ఏమాత్రం ఊరట లభించలేదు. పైగా డబ్బు వ్యవహారం చాలా క్లిష్ట సమస్యగా మారింది. తండ్రి ఏమాత్రం దయ చూపటంలేదు. ఒక రోజున యాదృచ్ఛికంగా కనపడినప్పుడు ఆయన క్షేమ సమాచారం అడిగినప్పుడు “ఆఁ తమ దయవల్ల బాగానేవున్నాం” అని సమాధానం మాత్రం వచ్చింది.

అదృష్టవశాత్తు చెల్లెళ్లు తనను మరిచిపోలేదు. వారు, ఖర్చులు పోను మిగిలే చిల్లర డబ్బు అతనికే పంపేవారు. దానితోనే రోజులు గడిచేవి.

ఫీల్డ్ ప్లేస్ భవంతిలో ఎలిజబెత్‌ను ఎంతో కట్టడి చేశారు. ఆమె అతనికి ఎటువంటి సహాయం చేయలేకపోతోంది. తన చిన్న చెల్లెళ్లు ఇప్పుడు క్లాప్ హామ్‌లో ఉన్న శ్రీమతి ఫెన్నింగ్స్ నడిపే యువతుల పరిషత్తులో చదువుతున్నారు. షెల్లీ అక్కడికి వెళ్లి వస్తుంటాడు. చాల తొందరగా అక్కడ కౌమారంలో ఉన్న విద్యార్థినులు ఈ నీలికళ్ల, ఉంగరాలజుత్తు అందగాడితో, హెలెన్ సోదరునితో, పరిచయం పెంచుకున్నారు. అతని జేబులనిండా బిస్కట్లు, చాక్లెట్లతో కాలరు ఎగురుతుండగా వస్తుంటాడు. తన చుట్టూ చేరే తొలి యౌవనంలోని యువతులకు గొప్ప గొప్ప విషయాలు వివరిస్తుంటాడు.

ఆ విధంగా అందరిలోకి అందమైన యువతిని మరింతగా ఆకట్టుకున్నాడు. 'ఏమిటి ఇంతటి అందం అసూయ, ద్వేషాలకు బలికావలిసిందేనా?' అని ఆశ్చర్యపోయాడు. తన చెల్లెళ్ల స్నేహితురాలైన హారియెట్ వెస్ట్ బ్రూక్ చాలా చాలా సుకుమారి. పదహారేళ్ల పడుచు ప్రాయం. తేనె రంగు కురులు – పాలూ గులాబీలు కలబోసిన శరీర చాయ – చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా తేలిపోయే సొగసరి, సుగంధి.

నిజానికి షెల్లీని ఆమె రక్షించింది. తిమోతి తన కూతుళ్లను, అన్నను తరచు చూడరాదని ఆంక్షలు పెట్టినప్పుడు, హారియట్ చాపెల్ వీధిలో తన కుటుంబాన్ని కలవటానికి వచ్చేది. అప్పుడే షెల్లీ చెల్లెళ్లు ఇచ్చిన డబ్బు, కేకులు పోలెండు వీధిలోని మర్మయోగికి చేరవేసేది. అతనికి మరింత దగ్గరైంది. ఆ విధంగా తొలి యౌవనంలో ఉన్న ఆ యువతీ యువకులు గొప్ప స్నేహితులుగా మారారు.

హారియట్ వెస్ట్ బ్రూక్‌కి తల్లి లేదు. తండ్రి బాగానే సంపాదించాడు. ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న సామాన్యుడు. తన కూతురికి మంచి చదువు చెప్పించాలని ఆశిస్తున్నాడు. తల్లి పోయిన తరువాత పెద్దక్క ఎలీజా, చెల్లెల్ని గారాబంగా పెంచింది. పార్లమెంట్ సభ్యుని కొడుకు – గొప్ప జమీందారీకి వారసుడు – దేవతలాంటి అందగాడు – అలాంటి షెల్లీ మీద ఈ వెస్ట్ బ్రూక్ కుటుంబ సభ్యులు, అతని కోసమేగా పోలెండు వీధి వసతి గృహంలో హారియెట్ తీసుకువెళ్లే బిస్కట్లు, చాకెట్లతో కడుపు నింపుకుంటున్న ఈ ఎస్టేట్ వారసుని కోసం వాళ్లు చాలా ఆశలు పెట్టుకున్నారు.

అందుకే ఎలీజా ఈ హీరోను చూడాలని ఆశపడి ఒక రోజు తన చెల్లెలితో పోలండ్ వీధి వసతిగృహానికి వచ్చింది.

షెల్లీ, ఎలీజాను చూసి చాలా సిగ్గుపడ్డాడు. ఆమె ఎండిపోయిన యౌవనం, బక్కచిక్కి పాలిపోయిన శరీరం, చేపల్లాంటి కళ్లు, ఏమాత్రం వెలుగులేని చూపు, నల్లని పొట్టిజుత్తు – ఈ అవతారాన్ని చూసి షెల్లీ కుంచించుకుపోయాడు.

హారియెట్ సొగసు, సంతోషంతో వెలిగిపోయే ముఖానికి, ఈ ఎండిపోయిన శవానికి ఎక్కడా పొంతన లేదు.

కాని షెల్లీ ఆమెతో తరువాత మామూలుగానే ఉండగలిగాడు. కేవలం ఆమె స్నేహపూరితమైన ప్రవర్తన చూసి. నిజానికి హారియెట్‌ని ఆమె వెంటవుండి పోలండ్ వీధి వసతిగృహానికి తీసుకువచ్చేది. అంతేగాక షెల్లీని, వెస్ట్ బ్రూక్ గారు ఉన్నప్పుడు తమ ఇంటికి విందుకు కూడా ఆహ్వానించింది.

తరువాత అతని తాత్త్విక బోధనలన్నీ వినటానికి కూడా ఆసక్తి కనబరచింది. 'ఫిలసాఫికల్ డిక్షనరీ' చదివి వినిపించేది. దానికి అర్థం తాత్పర్యం అతన్ని అడిగి తెలుసుకొనేది.

ఈ విధంగా షెల్లీ-హారియెట్ స్నేహం యువతుల పరిషత్‌కు తెలిసిపోయింది. పరిషత్ యజమాని శ్రీమతి ఫెన్నింగ్స్, హారియెట్‌ను హెచ్చరించింది. "అతను నాస్తికవాది. అతని ఆలోచనలన్నీ అభ్యుదయ వాదానికి సంబంధించినవి. కాబట్టి అతని నైతికతను శంకించాల్సిందే....." అని కూడా వారించింది. అంతేకాదు, ఈ స్నేహాన్ని కొనసాగించితే పరిషత్ నుంచి బహిష్కరిస్తామని కూడా బెదిరించింది. పరిషత్‌లోని మిగతా పల్లెటూరి ఆడపిల్లలు, హారియెట్‌ను దూరంగా ఉంచటం మొదలుపెట్టారు. ఆ విధంగా హారియెట్ స్కూలు వాతావరణం ఆమెకు భరించరానిదిగా తయారైంది.

ఒక రాత్రి షెల్లీ ఒంటరిగా చలిమంట వెలుగులో చదువుకుంటున్నాడు. ఆ సమయంలో ఎలీజా కబురు – హారియెట్ కు జ్వరంగా వుందని 'దయచేసి మీరు వచ్చి ఆమెకు తోడుగా ఉండగలరా?' అని.

అతను వెళ్లే సరికి హారియెట్ పాలిపోయి, చందమామ లాంటి ఆమె ముఖంచుట్టూ జుట్టంతా పరుచుకొని, దుప్పట్ల కింద మరింత అందంగా ఉందనిపించింది. అంతలో వెస్ట్‌బ్రూక్ గారు పైకి వచ్చి షెల్లీని పలుకరించారు. ఇది షెల్లీని కాస్త ఇబ్బంది పెట్టింది.

సంప్రదాయాలు అంతగా పట్టించుకోని షెల్లీకి ఈ మర్యాద కాస్త సంకటంగానే ఉంది. ఇంత రాత్రివేళ కూతురు పక్కన తనని చూసి తండ్రి ఏమనుకుంటాడోనని కూడా ఇబ్బంది పడ్డాడు. కాని హారియెట్ తండ్రి ఎంతో మర్యాద పూర్వకంగా 'కింద నా స్నేహితులున్నారు, మీకు వీలయితే వచ్చి ఓ గ్లాసు వైన్ తీసుకోండి' అని ఆహ్వానించాడు కూడా.

షెల్లీ, ఈ ఆహ్వానాన్ని మర్యాదపూర్వకంగానే తోసిపుచ్చాడు. తన స్నేహితురాలు పక్కనే చాలసేపు కూర్చున్నాడు. ఎలీజా కూడా ఉంది. ఆమె ప్రేమ గురించి ధారాళంగా మాట్లాడుతుండగా, హారియెట్ తలనొప్పిగా వున్నట్లు చెప్పటంతో 'సరే నేను వెళ్తాను' అని వెళ్లిపోయింది. షెల్లీ అర్థరాత్రి దాటేవరకు హారియెట్‌తోనే ఉన్నాడు - కింద నవ్వులూ, కేకలూ వినపడుతూనే ఉన్నాయి.

మర్నాడు హారియెట్ చక్కగా లేచి తిరిగింది.

* * *

ఇప్పుడు షెల్లీ ఏకాంతవాసం కొంత మెరుగనిపిస్తోంది. ఈ అందమైన స్నేహితురాలు తరచు తనని చూడటానికి వస్తోంది. తన ఆలోచనలన్నీ ఆసక్తికరంగా విని తన జ్ఞానజ్యోతిని వెలిగించుకొంటోంది కూడ. కాని షెల్లీకి తన చెల్లెలు ఎలిజబెత్ ఎడబాటు కొంతబాధాకరంగా ఉంది. ఆమె దగ్గరనుంచి ఎలాంటి కబురు, ఉత్తరాలు రావటంలేదు. గదిలో పెట్టి బంధించారా? ఏమైనా సరే వెళ్లి చూడాలనుకున్నాడు. తనను ఎవరేం చేస్తారు? తండ్రి మాట్లాడక పోవచ్చు. చెప్పకుండా వెళ్తే బయటకు గెంటి వేస్తారా? ఒక దండయాత్రను రహస్యంగానే చేస్తే పోలా అనుకున్నాడు. అంత అవసరం రాకుండానే తన మేనమామ కెప్టెన్ పిల్‌ఫోల్డ్, షెల్లీకి అండగా నిలిచి తన ఇంటికి ఆహ్వానించాడు. ఆయన సముద్ర వీరుడు. ట్రఫాల్‌గర్ నావికాదళాన్ని నడిపిన నెల్సన్‌గారి శిష్యుడు. తన అద్భుతమైన మేనల్లునికి పూర్తి అండగా నిలబడి - బావగారితో రాయబారం నడిపాడు. షెల్లీ నాస్తికుడైనా, ఆస్తికుడైనా తనకనవసరం. అతను తన మేనల్లుడు. గొప్ప ఎస్టేట్‌కు వారసుడు. మేధావిగా, కవిగా పేరు గడిస్తున్న యువకుడు. అందుకని తన కక్‌ఫీల్డ్ భవంతికి వచ్చేయమని ఆహ్వానించాడు. అంతా పదిమైళ్ల దూరం ఫీల్డ్ ప్లేస్ భవంతికి.

షెల్లీ ఎంతో ఆనందంగా తన సిద్ధాంతాలన్నీ వినిపించి, ఆయనకు జ్ఞానోదయం కలిగించాడు – పదిరోజుల్లోనే. కెప్టెన్‌గారు, ఆ ఊరి రెక్టర్ గారిని, డాక్టర్ గారిని అదరగొట్టాడు కూడా. కక్‌ఫీల్డ్‌లోనే షెల్లీకి కుమారి హిచ్‌నర్ – ఈమె టీచర్‌గారు – పరిచయమయింది. ఆమె పక్కనే ఉన్న ఫైయర్ పాయింట్‌లో ఉంటుంది. ఆకాశం వంక చూసే ముక్కు. దాదాపు ముప్ఫైయేళ్ల బ్రహ్మచారి. రాజకీయాలు, అదీ రిపబ్లికన్ భావాలంటే సానుభూతి. తనను ఎవరూ అర్థం చేసుకోవట్లేదని ఎప్పుడూ బాధ పడుతుంటుంది. ఆమె చైతన్యాన్నిచూసి షెల్లీ ఆమెను ఎంతగానో మెచ్చుకొన్నాడు. ఆమె ఇంకా మధ్యేవాదిగా మిగిలిపోవటం పట్ల సానుభూతి చూపించాడు. ఆమెకు సరైన మార్గదర్శిగా ఉంటానని మాటఇచ్చాడు కూడా.

ఈ లోగా కెప్టెన్ పిల్‌ఫోర్డ్ గారు తన బావగారిని ధైర్యంగా ఎదుర్కొని, తనకు బాసటగా నార్‌ఫోక్ యువరాజు గారిని నిలబెట్టుకొని తిమోతి షెల్లీని మారుమాట్లాడకుండా చేశాడు.

పెర్సీ తన ఇంటికి అన్ని హంగులతో వెళ్లటానికి ఏర్పాటు చేశాడు. పైగా సంవత్సరానికి రెండువందల పౌండ్లు – అదీ ఎటువంటి షరతులు లేకుండా – ఖర్చులకు ఇచ్చేటట్లుగా ఒప్పించాడు.

* * *

షెల్లీ ఇప్పుడు తన చెల్లి ఎలిజబెత్‌ను కూడా చూడవచ్చు. చూసిన తరువాత ఆమెలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోయాడు. పూర్వం ఎంతో చైతన్యంతో సంతోషంతో ఉండేది. ఇప్పుడు కేవలం ఇతరులకోసమే బ్రతుకుతున్నట్లు, చిన్న చిన్న విందులు, వినోదాలతో కాలం గడపటంతో ఆనందాన్ని పొందటం చూసి కొంత నిరుత్సాహ పడ్డాడు.

ఇది వరకటిలా హోగ్ ఉత్తరాలు చదవటానికి ప్రయత్నించాడు. 'ఓహ్! అన్నయ్యా, నువ్వూ, నీ స్నేహితుడూ, నాకు తెలిసిన వాళ్లంతా మీ ఇద్దరినీ పిచ్చివాళ్ళంటున్నారు.'

తరువాత పెళ్లి, వివాహ వ్యవస్థ గురించి చిన్న ఉపన్యాసం ఇచ్చింది. మరింకేమీ మాట్లాడక పోవటంతో షెల్లీకి అసహ్యం పుట్టింది. తాము చదివిన సిద్ధాంతాలన్నీ, గాడ్విన్ తాత్త్వికత ఏమయిపోయాయి?

"అరె, పెళ్లి - అసహ్యకరమైన వ్యవస్థ. దాన్ని గురించి ఆలోచించినప్పుడు ఈ భయంకరమైన సంకెళ్ళను మనిషి కావాలనే సృష్టించి, మనలాంటి స్వేచ్ఛాజీవుల్ని బంధనాల పాలుజేశాడు.

మతము, వివాహం ఎంత అవసరం అంటున్నారో, నైతికత స్వేచ్ఛ గల ప్రేమ అంత అవసరం ఇప్పటి మానవాళికి. గౌరవం గల నీతిమంతులకు పెళ్లితో పని ఏమిటి? ఈ చట్టాలతో అవసరం ఏముంది?

చూడు దయచేసి 'మ్యారెజ్ సర్వీస్', చదువు. నీలాంటి ఉన్నతురాలికి పెళ్లి అనే బంధంతో ఎలాంటి గతి పడుతుందో అర్థమవుతుంది –" అని బోధించాడు.

"ఇన్నిజెప్పి నీ స్నేహితుణ్ణి పెళ్లిచేసుకోమంటున్నావ్?"

"ఔను, ఏదో చర్చిలోనో, మత తంతుతోనో కాదు. స్వేచ్ఛగా, కేవలం ప్రేమసాక్షిగా–"

"ఇదా నువ్వు ఇచ్చే సలహా?" అని ఈసడించింది.

ప్చ్! ఏమీలాభంలేదు. ఈమె ఎంత చెప్పినా అర్థం చేసుకోదు. ఇప్పుడీమె ప్రపంచం వేరు. ఈమెకు చికిత్స చేయలేము' అనుకుంటాడు. 'నన్ను నేను మోసగించుకోవటమే. ఇంక ఈమెను మార్చలేను. ఇప్పుడు కేవలం ఈమెకు భర్తను వెదికే సోదరునిగా ఉండాలి. అది సాధ్యం కాదు. నావల్ల కాదు' అనుకున్నాడు.

ఈ భవంతికి వచ్చిందే ఎలిజబెత్‌ను చూట్టానికి. ఈ పరిస్థితులో ఇక్కడ ఉండటం దేనికి?

తనను ఆహ్వానించే వాళ్లు చాలామందే ఉన్నారు.

తన మేనమామ కెప్టెన్‌గారు; వెస్ట్‌బ్రూక్ కుటుంబం ఈ వేసవికి వేల్స్ వెళ్తున్నారు. తనకి ఆహ్వానం ఉంది.

హాగ్ ఒక నెలరోజులు యార్క్‌కు రమ్మనాడు. ఈ చివరి ఆహ్వానం అతనికి నచ్చింది. కాని తన తండ్రికి ఇష్టంలేదని తెలుసు. ఆ మాత్రం చేత ఆగేవాడు కాదుకాని, తన మొదటి వేతనం సెప్టెంబరులో వస్తుంది. అప్పటివరకు ఓర్పుగా ఉంటే మంచిది కదా.

హాగ్ ఉత్తరంలో 'అవును అమ్మాయిలతో ఉండటం ఆనందం కదా' అని ఎత్తిపాడిస్తే, ఇతను, 'నీ జోకులు నన్ను బాగా నవ్విస్తాయి. కాని నాకు ప్రేమ గురించి ఏమైనా తెలుసు అనుకుంటే, నేను ఎవ్వరినీ ప్రేమించటం లేదు. నాకు వెస్ట్‌బ్రూక్ ఆహ్వానం ఉంది. వాళ్లను చాలా గౌరవిస్తాను' అని సమాధానం రాస్తాడు.

ఎక్కడికి పోవాలో తేల్చుకోలేదు. ఇంతలో తన తల్లిగారి మారుటి చెల్లెలు – థామస్ గ్రోవ్, (E.M.W) ఇలాన్‌కి రమ్మని ఆహ్వానించింది. అది అడివి చివర రాడ్‌నార్ షైర్. ఇక్కడ ఉంటే ఖర్చు తక్కువ. తన భరణం వచ్చే వరకు ఆగవచ్చు. అలా అనుకుని చివరి ఆహ్వానాన్ని మన్నించాడు.

దారిలో లండన్‌లో కుమారి హిచ్‌నర్‌ని కలిసి ఆమెను విందుకు తీసుకొని వెళ్దామని అనుకున్నాడు. కాని ఆ పంతులమ్మ ముక్కు పైకి పెట్టి అదంత మర్యాదగల పనికాదు అని తోసిపుచ్చింది. ఇద్దరికీ అంతటి ఆలోచనా అగాధం ఉంది.

షెల్లీ ఆమెకు పెద్ద ఉత్తరం రాశాడు సమానతల గురించి. 'నీవు నాకు ఆత్మ బంధువు' అని సంబోధించాడు.

ఆమె ఇక కలల్లో విహరిస్తూ, 'శ్రీమతి షెల్లీ' పేరు బాగానే ఉందే అనుకుంటూ అద్దంలో తన అందాన్ని పరీక్షగా చూసుకోవటం ప్రారంభించింది.



కొండ కోనల్లో షెల్లీ

ఐనిమిదో అధ్యాయం

తగులుకున్న గొలుసులు

మొదటిసారిగా షెల్లీ కొండల కోనల పర్వత సానువులలో ఏకాంతంగా వున్నాడు. జలజల దూకే సెలయేళ్ల సంగీతం వింటున్నాడు – కాని ఈ పర్వతాల ప్రభావం అతన్నేమీ కదిలించ లేక పోయింది. హాగ్‌కు వుత్తరం రాస్తూ "ఇది ఎంతో పవిత్ర ప్రదేశం కాని, చాలా నిరుత్సాహంగా – వర్ణరహితంగా, సాధారణంగా – అసలు లాభంలేదు. నిజానికి ఈ ప్రదేశం చాలా నిరాశ కలిగిస్తోంది".

చెట్ల నీడల్లో – జలపాతాల పాదాల చెంత కూర్చుని – చదువుకుంటూ – స్నేహితులు రాసిన ఉత్తరాలను మళ్లీ మళ్లీ మననం చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. తను ఎంతమందిని మానసికంగా తీర్చి దిద్దాడు. కుమారి హిచ్‌నర్, తన విశ్వాసపాత్రుడైన హాగ్, కెప్టెన్ పిల్‌ఫోర్డ్, దైవ భక్తురాలు ఎలీజా, అందాలరాశి హారియట్ – ఇంకా పేర్లు తెలియని ఎందరో ఎందరో! అందరికీ తనే కదా మార్గదర్శి!

ఇంతలో – వెస్ట్ బ్రూక్ కుటుంబం తిరిగి లండన్ చేరింది. అప్పుడే షెల్లీని ఎంతగానో కదిలించిన వుత్తరం, హారియట్ దగ్గర్నుంచి వచ్చింది – ఆమె తండ్రి తనని మళ్లీ శ్రీమతి ఫ్లెమింగ్ స్కూలుకు వెళ్లమంటున్నారని, అక్కడ తనతోటి విద్యార్థినులు నరకం చూపిస్తున్నారని – తనని పనికిమాలిన దానిగా వెలివేస్తున్నారని వాపోయింది – ఇంత భయంకరమైన ఖైదులో వుండే బదులు – ఆత్మహత్య చేసుకుంటాను – ఎవ్వరి ప్రేమను పొందలేని నేను ఎందుకు బ్రతికి వుండాలి? నాకు ఎవ్వరు లేరు – నాకు నేను పనికిరానపుడు – మరొకరికి ఉపయోగపడలేనపుడు – ఎందుకు బ్రతకటం? దేవుడే దయ చూపనపుడు మనిషి నియమాలు పాటించాల్సిన అవసరం ఏముంది? ఈ విధంగా ముగించింది!

షెల్లీ భయకంపితుయ్యాడు. ఈ హైస్కూలు విద్యార్థిని తర్కాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియలేదు. నిజానికి తనే కదా ఆమె బుద్ధిని, మనుసును తర్ఫీదు ఇచ్చి మార్పుతెచ్చాడు. మరి ఇప్పుడు ఆమెను నిర్లక్ష్యంచేసి – ఆమె మానానికి ఆమెని వదిలివేసి – ప్రాణాలు ఎలా తీయ గలడు?

ధైర్యాన్ని నూరిపోస్తూ ఉత్తరం పంపాడు – ఎదురు తిరగమని – ఎవ్వరికీ తల వంచరాదని – స్కూలుకు వెళ్లటానికి నిరాకరించమని బోధించాడు. ఆమె తండ్రికి కూడా – ఇదంతా దారుణమని రాశాడు.


ఆ ముసలి తండ్రి కోపంతో రెచ్చిపోయాడు. ఈ రాజకుమారుడెవ్వరు తనకు సలహా ఇవ్వటానికి – తన కుటుంబ వ్యవహారంలో జోక్యం చేసుకోవటానికి? ఇప్పటికి ఆర్నెల్ల నుంచి తన కూతుళ్ల చుట్టూ తిరుగుతున్నాడు.

ఎలీజా, ఈ కలల రాజకుమారుడు, తన చెల్లెల్ని పెళ్లి చేసుకుంటే బాగుంటుందని ఆశించింది, కాని – అంతస్తుల మాటేమిటి? మరేమిటి ఈ యువకుని ఆలోచన?

వెస్ట్‌బ్రూక్ గారు షెల్లీని, ఆ రోజు రాత్రి – అదే హారియెట్ గదిలో కూర్చున్నప్పుడే పరీక్షగా చూశారు – క్రిందికి వచ్చి తనతో వైన్ తాగమని ఆహ్వానించాడు కూడా, అయినా అతను రాలేదు.

సర్ బీష్ షెల్లీ మనుమడు – జమీందారు – సామాన్యులను లెఖ్కపెడతాడా? సమానత్వాన్ని విశ్వసిస్తాడా? ఓహో – పై పదిమంది – ధనవంతులు – ఎప్పుడూ మారరు! ఇవీ ఆయన ఆలోచనలు!

లాభం లేదు – తన కూతుర్ని క్లాప్ హామ్‌కి బయలుదేరమన్నాడు. హారియెట్, షెల్లీకి మళ్లీ వుత్తరం రాసింది – ఈ సారి ఆత్మహత్య బదులు మధ్యే మార్గం సూచించింది.


పద్ధెనిమిదేళ్ల షెల్లీ

ఇంటి వద్ద ఈ హింస భరించలేక పోతోంది–అవమానాలపాలయి దుఃఖిస్తోంది. కాని షెల్లీతో 'లేచి' పోవటానికి సిద్ధంగా వున్నానని రాసింది.

షెల్లీ - తలక్రిందులైపోయి వెంటనే లండన్ బండి ఎక్కాడు - ఈ పరిస్థితికి - హారియెట్ మానసికంగా ఎదగటానికి తన బాధ్యత కూడా వుందని నమ్మాడు.

ఆమె బుద్ధి వికాసానికి ధైర్య సాహసాలకు తనే కారణమనుకున్నాడు - అన్యాయాన్ని ఎదిరించడం కూడా తనే నేర్పాడని విశ్వసించాడు.

కాని ఈ లేచిపోవటం - ఎంతో అవినీతికరమైందని అతనికి తెలుసు - ఇప్పుడు తనకి ఆదాయం లేదు - ఉద్యోగం చేస్తాడని నమ్మకం లేదు. ఆమెను ఎలా పోషించగలడు? నిజానికి ఆమెను నిజంగా ప్రేమిస్తున్నాడా?

తన మరదలు నిరాకరించిన తర్వాత - మళ్లీ ఎవరినైనా ప్రేమించగలడా?

ఏది ఏమయినా హారియెట్ చాలా సుకుమారి - సౌందర్యవతి - ఆమెలో తనను ఆకర్షించే మనోహరమైన శక్తి ఏదో వుంది. ముఖ్యంగా ఆ రాత్రి విరబోసిన కురుల నడుమ చందమామలాంటి ఆ ముఖాన్ని ఎలా మరిచిపోతాడు? ఇటువంటి వెచ్చని ఆలోచనలు చాలా ఉత్సాహకరంగా వుంటాయి. అలాంటి ప్రియురాలితో ప్రయాణించే సాహసం ఎంతో గొప్పగా వుంటుంది.

షెల్లీ ఆమెని కలిసినపుడు - పాలిపోయివుంది! ఎంతో విచారంతో వుంది. "ఏమిటి వీళ్లు నిన్ను బాధిస్తున్నారా?" అంటాడు. 'లేదు-లేదు' నీ మీద ప్రేమ నన్ను దుఃఖంలో ముంచి వేస్తోంది. ఆమె కనురెప్పలు పైకిలేపి తనను చూసినపుడు - నిజాన్ని దాయలేకపోయింది. తనను పూర్తిగా మార్చివేసింది అతనే - షెల్లీ కలవకముందు తను మామూలు, అందరి లాంటి విద్యార్థినే - ఎర్రకోటు సైనికుని కోసం ఎదురుచూసే యువతే - పెళ్లి గురించి ఆలోచించినపుడు - కలలు కన్నపుడు - నల్లకోటు చర్చి యువకుడే - కాని షెల్లీని కలిసినపుడు ముందు అతన్ని పూర్తిగా మార్చాలని తపన పడింది, కాని, అతని తిరుగుబాటు ఆలోచనలు - మత నిరసన - రాజకీయ చర్చ వీటన్నిటిపై అతని తార్కికమైన సిద్ధాంతాలు ఆమెను ఊపిరాకుండా చేసి - సంతోషంగా ఓటమి పాలు చేశాయి. తనకంటే షెల్లీ చాలా ఉన్నతుడని అంగీకరించింది.

వేల్స్‌కు రానన్నపుడు - అతన్ని శాశ్వతంగా కోల్పోయినట్లు భయపడింది- అందుకే కొంచెం ఎక్కువగానే తన భయాన్ని వర్ణించి వుత్తరం రాసింది. ఆ విధంగా తన మనోహరుణ్ణి రప్పించుకోవటానికి ప్రయత్నించింది.

షెల్లీకి ఈ 'రక్షకుని' పాత్ర పై అంత నమ్మకం, గౌరవం లేదు. తను జీవించేది ప్రపంచాన్ని బాగుచేయటానికి - ఏ ఒక్కరికో భర్తగా, బందీగా మారిపోవటానికి కాదు - ఇందులో ఏమాత్రం న్యాయం లేదు - కాని ...

తను ఆమెను కేవలం ఒక్కమాట చెప్పి ఆనందింపచేయగలడు. ఆ ముఖాన్ని సంతోషంతో వెలిగించగలడు - అంతే - తన సిద్ధాంతాలన్ని తుంగలో తొక్కి ఆమె చేతిని అందుకున్నాడు - తన మనసు - ఆత్మ నీవే నన్నాడు.

ఎక్కడో మిగిలిన చిన్నపాటి ఇంగిత జ్ఞానం - అతన్ని వెంటనే ఆ 'రోజు' నిర్వహించబోయే కార్యం నుంచి రక్షించింది.

అనవసర సంఘటనలను ముందుకు తేవటంలోని ప్రమాదాన్ని గుర్తించాడు.

ఆమెకు నిజమైన సంకటస్థితి వాళ్లు కలిగిస్తే తనకు కబురు చేయమన్నాడు - ప్రపంచంలో ఏమూలనున్నా రెక్కలు కట్టుకు వాలతానన్నాడు. అంతే, ఆ రెక్కల మీదే ఆమెను ఎత్తుకు పోతానన్నాడు.

ఆమె ముఖంలో గులాబీలు విరిసాయి. తనను ప్రేమించే వాడు - తనకోసం వచ్చే ప్రేమికుడు - వున్నాడు. ఈ ఆలోచనే ఆమెను సంతోషంలో ముంచివేసింది.

* * *

ఆమెను వదిలి వచ్చేస్తుంటే ఎంతో వేదనకు గురయ్యాడు. ఈ వ్యవహారమంతా అతనికి అయోమయంగా వుంది - హాగ్‌కి వుత్తరంలో వివరించాడు. స్నేహితుడు వెంటనే సమాధానం పంపాడు. "ఆమెతో లేచిపోవటం చాలా ప్రమాదకరం. కావాలంటే పెళ్లి చేసుకుని తీసుకువెళ్లు. నీకు పెళ్లంటే అసహ్యం - నాకు తెలుసు - కాని పెళ్లి చేసుకోకపోతే ఎవ్వరు ఇబ్బంది పాలయ్యేది? ఆమే కదా - ప్రపంచం ఆమెను తప్పుపడుతుంది - నిరసిస్తుంది. నీకోసం ఆమె జీవితాన్ని త్యాగం చేయాలి. రక్షణను పోగొట్టుకోవాలి - దీనంతటికీ నీకేమి హక్కు వుంది? అది స్వార్థం కాదా? ఇది అన్నింటికంటే నేరం కాదా -" అంటూ తర్కించాడు.

"అవును పెళ్లి రొచ్చు మంచిది కాదు - నీకు నచ్చదు కాని, గాడ్విన్ రెండుసార్లు పెళ్లి చేసుకున్నాడు తెలుసా?" అంటూ ముగించాడు.

షెల్లీ, హాగ్‌కి రాస్తాడు – ఏదో ఒకరి మూలంగా ఈ ప్రపంచం మారదు –

గాడ్విన్ – 'రాజకీయ ధర్మం'లో (వివాహ బంధనాల) పెళ్లి సంకెళ్ళ గురించి రాసింది – ఏ ఒక్కరికో కాదు – మొత్తం ప్రపంచమంతా మారాలి– సంఘాన్ని మార్చి – సరికొత్త రూపు ఇవ్వాలంటే కేవలం ఒక్క ఉదాహరణ చాలదు. మార్పు మొదలుపెట్టిన వాడిని సంఘ శక్తులు రాళ్లతో కొట్టే స్థితి వుండకూడదు.

అదీ గాక సమాజంలో అతనేమీ తన కొత్త ఆలోచనలు వెంటనే ఆచరణలో పెట్టాలని తొందరలో లేడు –

కక్‌ఫీల్డు కేప్టెన్ గారు తన భవంతికి ఆహ్వానించారు.

అక్కడ తన 'ఆత్మబంధువు' పంతులమ్మ కుమారి హిచ్‌నర్ కలుస్తుందని తెలుసు.

ఆమెకు సత్యబోధన పూర్తి చేయాలని ఆలోచించాడు – అంతే హారియెట్‌కి నీ కబురు అందగానే వాలిపోతానని ప్రమాణం చేసి – లండన్ నుంచి బయలుదేరాడు.

పందొమ్మిదేళ్ల ప్రాయంలో వున్నవారికి – జీవితంలో ఏమి జరుగుతుందో ఎలా ముందుగా తెలుస్తుంది?

పూర్తిగా వారం గడవలేదు –


షెల్లీ చేసిన ప్రమాణంతో – తన గుండెల నిండా ప్రేమతో – హారియెట్ తన ఆకర్షణలను, కోరికలను అణచుకోలేక పోయింది – తనను భూతాలకు ఎరవేస్తున్నారంటూ షెల్లీకి ప్రమాద సూచికలను పంపింది.

అంతే షెల్లీకి మరో మార్గం లేదు – పెళ్లి మాట తర్వాత – ముందు ఆమెను 'రక్షించాలి' కదా !

మర్నాడు ఎడిన్‌బర్గ్ మెయిల్‌లో – ఈ ప్రేమపక్షులు ఉత్తరదిశగా ప్రయాణం సాగించాయి. అప్పటికి వారిద్దరి వయసు కలిసి ముప్పయి అయిదు దాటలేదు.

"ఇది నేను ఇష్టపడి చేస్తున్న కార్యం", "తొందరపాటులో– కామంతో – కాదు" అనుకున్నాడు, తన చిన్నారి ప్రియురాలు ఆనందమైన ముఖాన్ని చూస్తూ.

వీరు ప్రయాణిస్తున్న బండి – రాళ్లు, రప్పలమీద – గతుకుల దారిలో పరుగులు పెడుతోంది...



ఎడిన్‌బర్గ్ మెయిల్ బండి

తొమ్మిదో అధ్యాయం

చిన్నారి ప్రేమికుల జంట

యువ ప్రేమికుల జంట, అదీ మతోన్మాదులచే పీడించబడుతున్న యువజంటకు, మనోహరంగావున్న వారి కార్యాచరణ పట్ల వ్యామోహం – అణచుకోలేని విధంగా వుంటుంది.

ఎడిన్‌బర్గ్ పౌరులు ఈ ప్రేమికుల జంటను సాదరంగానే ఆహ్వానించారని చెప్పవచ్చు. అదీ వీరు ప్రకాశవంతమైన 'లేమి' నుంచి వచ్చారు కదా –

లండన్ నుంచి బయలు దేరేముందు – షెల్లీ తన స్నేహితుని దగ్గర కొంత సొమ్ము అప్పు చేశాడు. అయితే ఎడిన్‌బర్గ్ చేరే సమయానికి అతని దగ్గర పెన్నీ కూడా లేదు. ఈ పరిస్థితిలో – తన తండ్రి సహాయాన్ని ఆశించలేడు కదా – ఈ వార్త విన్న తర్వాత ఆయన కోపాన్ని – దాని ప్రభావాన్ని ఊహించుకోవచ్చు.

అయితే ఎడిన్‌బర్గ్‌లో అతనికి మంచి గృహయజమాని దొరికాడు. తన కథనంతా విని – అతనికి ఈ పిల్ల జమిందారు నుంచి డబ్బు త్వరలోనే వస్తుంది – పైగా హారియెట్ చాలా అందంగా ఉంది – ఇవన్నీ కలిసి ప్రేమ జంటకు తన క్రింది భాగం అద్దెకిచ్చేలా చేసింది.

అంతేగాక వారికి తక్షణ అవసరాలకు కొంత పైకం కూడా అప్పుగా ఇచ్చాడు. వారి పెళ్లి ఏర్పాట్లకూ సహాయం చేశాడు – అదీ స్కాట్ చర్చి పద్ధతిలో. ఒకే ఒక షరతు – పెళ్లయిన రాత్రి అతనికి – స్నేహితులకు విందు ఇవ్వాలి!

ఆ విధంగా ఎడిన్‌బర్గ్ వ్యాపారుల మధ్య – మన సర్ బీష్ గారి మనుమడు – తన పెళ్లి విందు ఆరగించాడు.

ఆ రాత్రి ఆవిరులు ఎగిసే మధువు, ఈ అందమైన ప్రేమికుల జంట – ఇవన్నీ వారి అతిథులకు మత్తు కలిగించాయి. వారు కొంచెం అతిగా వ్యవహరిస్తున్నట్లుగా షెల్లీకి అర్థమయింది. వారి హాస్యం మొరటుగా తయారయింది. హారియెట్ సిగ్గుతో ఎర్రబడిపోయింది – 'ఇక చాలు' అని షెల్లీ గుడ్‌నైట్ అన్నాడు – వాళ్లంతా గట్టిగా పగలబడి నవ్వారు.

మరికొంత సేపటికి ఆ జంట వున్న గది తలుపు కొట్టారు కూడా – షెల్లీ మర్యాద కోసం తలుపు తీసాడు. తనకు ఇన్ని రకాల సహాయం చేసిన ఆ ఇంటి యజమాని తన స్నేహితులతో వున్నాడు – కాస్త మాటలు తడబడుతుండగా "ఇక్కడ సంప్రదాయం – పెళ్లి కూతురు మాతో నృత్యం చేయాలి, ఆమెను మధువుతో స్నానం చేయిస్తాము" అంటున్నాడు – అంతే, "మీరొక్క అడుగు ముందుకు వేస్తే మీ తలలు పేలిపోతాయి..." షెల్లీ గట్టిగా అరుస్తూ రెండు చేతుల్తో పిస్తోళ్లు పట్టుకున్నాడు.

ఈ నాజూకుగా కనిపించే యువకునిలో చాలా ప్రమాదకరమైన వ్యక్తి దాగున్నాడని గుర్తించి – వారంతా 'గుడ్‌నైట్... అలాగే...' అంటూ జారుకున్నారు.

ఆ విధంగా షెల్లీ – హారియెట్ తమ తొలి యౌవన రాత్రిని ఆనందంగా పంచుకుని – ఒక్కటయ్యారు. ఆ అపరిచిత పట్నంలో, తమ ఇళ్లకు ఎంతో దూరంలో...

ప్రయాణంలో – ఇది నా ఇచ్ఛాపూర్వకమైన కార్యమే– మొదట, కేవలం కోరిక మత్తులో చేస్తున్న పని కాదు – అనుకున్న పెళ్లికొడుకు తర్వాత వారం రోజులు – ప్రేమలో తలమునకలై – మునిగితేలాడు.

హారియెట్ చాలా అందగత్తె – అంతేకాదు చక్కగా అలంకరించుకుంటుంది. తన జుత్తుని ఒక్క వెంట్రుకకూడా ప్రక్కకు పోనీయకుండా – సరిచేసుకుంటుంది. ఎప్పుడూ ఉత్సాహంతో ఉరకలు వేస్తుంది. ఆరోగ్యంతో – ఆనందంగా వెలిగిపోతుంటుంది. తన దుస్తుల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది.

గులాబి, తెలుపు రంగు కలిసి విరిసిన పూవులా మెరుస్తుంటుంది. పెద్దగా చదువుకోకపోయినా – ఎంతో లోక జ్ఞానం సంతరించుకుంది – అవసరమయిన పుస్తకాలు చదివింది. ఇప్పటికీ నీతిశాస్త్రాలు చదువుతూనే వుంది రోజంతా –

తన యజమాని – తన ప్రియుడు, అతని పద్ధతిలో విలువల విలువ, తన ధోరణిలో బోధించాడు.

'ఫెనిలోన్స్ టెలీమేక్' అతనికి ఇష్టమైన హీరో.

ఆమె – 'అసహనం' అనే పదాన్ని సమానత్వం – 'న్యాయం' అనే పదాలను వల్లె వేస్తుంటుంది – ప్రధాన న్యాయమూర్తి వినివుంటే తప్పక అభినందించేవాడు.

అదే సమయంలో (ఆంగ్లికన్) మతాన్ని నిర్లక్ష్యం చేసింది –కాలిప్సో నాసికా లాగా!

పిన్న వాళ్లకు – ఆనందాలు ఉత్సాహాన్నిస్తాయి – కాని వాళ్లు నివసిస్తున్న సంఘం – వారికి అలసట కలిగిస్తుంది.

హారియెట్ – అందంలోని మాధుర్యం, ఆకర్షణలోని ఉత్సాహం – ఆమె నిస్వార్థ తత్త్వం – షెల్లీకి ఎంతగానో నచ్చినాయి.

హాగ్ హెచ్చరికలు – హిచ్‌నర్ ఆసక్తి అతనికి గుర్తువచ్చినపుడు వాళ్లు ఏమనుకుంటున్నారా అని ఆలోచించేవాడు. కుమారి హిచ్‌నర్‌కు రాస్తాడు .... "నా ఆత్మబంధూ! ఇంకా నిన్నిలా సంబోధించవచ్చా? ఇంకా నాకు నీ స్నేహం మిగిలివుందా? నా ఈ చర్య వలన –

నైతికమో కాదో ఎలా తెలుస్తుంది – ఒక్కవారం రోజుల్లో, నా కార్యకలాపాలన్ని ఎలా మారి పోయాయి? నిజానికి పరిస్థితులకు మన మెంతవరకు బానిసలం?

నీవు అడగవచ్చు – నాస్తికుడనయిన నేను – ఈ వివాహపు తంతుకు – ఎలా లొంగిపోయానని? నన్ను నేను ఎలా ఒప్పించుకోగలిగానని –

"ఇదిగో ఈ విషయాన్నే నీకు వివరించాలని అనుకుంటున్నాను..." అక్కడి నుంచి హాగ్ తర్కాన్ని ముందుకు తెచ్చి తనమూలంగా హారియెట్ అవమానాల పాలు కాకూడదని, ఆమె గౌరవాన్ని కాపాడటానికే ఈ వివాహం అని చెప్పాడు –

"ప్రియమైన స్నేహితురాలా – నీవు కావాలంటే నన్ను నిందించవచ్చు – ఎందుకంటే ఇప్పటికీ నాకు చాలా ప్రియమైన స్నేహానివి నీవే –

హారియెట్‌కి పదహారేళ్లు – నీకు, వయసు రీత్యావున్న అర్హతతో నాకు సహాయాన్ని అందించ గలవు – ఔన్నత్యాన్ని ప్రేమపాత్రంగా చూపించ గలవు – హారియెట్ అందానికి నేను లొంగిపోయిన బానిసను – బలహీనమైన – బందీని..." అంటూ ముగించాడు –

ఆ ఉత్తరంలోనే ఆమెను ఎడిన్‌బర్గ్ రమ్మని ఆహ్వానించాడు. అతను ఎంత కవితాత్మకంగా రాసినా హిచ్‌నర్‌ను ప్రభావితం చేయలేకపోయింది ఆ ఉత్తరం– తరువాత, హారియెట్‌కు – తనకు వున్న వయసు వ్యత్యాసం కూడా ఆమెని ఆ ప్రాంతాలకు రాకుండా చేసింది. అంతే తన నిరాసక్తతను తెలియజేస్తూ రాసింది.

తరువాత ఒక రోజు – కాస్త ఎండగా ఉన్నప్పుడు తలుపుతట్టినట్టయి కిటికీలోంచి బైటకు చూసిన షెల్లీకి – హాగ్ కనపడతాడు – సంతోషంతో ఎగిరి గంతేసాడు. కొద్ది రోజులు తమతో గడపటానికి సంచితో సహా వచ్చాడు. అతనికి గొప్ప ఆహ్వానం లభించింది.

"ఆః చివరికి కలిసాం! ఇంకెప్పటికీ విడిపోకూడదు – నీకోసం – ఇక్కడే మరో మంచం వేయిస్తాను" అంటున్నాడు షెల్లీ – అంతలో హారియెట్ వచ్చింది. ఆమె అందాన్ని చూసి, ప్రకాశవంతమైన ఆమె సౌందర్యాన్ని చూసి – హాగ్ ఆశ్చర్యపోయాడు.

ఇంటి యజమానికి కబురు వెళ్లింది – అతన్ని రమ్మని, "మాకు మరో మంచం కావాలి – ఇప్పుడే – ఇక్కడే – వెంటనే" అని షెల్లీ తొందర చేశాడు. చివరికి పైన మరోగది ఇవ్వటానికి అతను అంగీకరించాడు.

ఆ ముగ్గురు స్నేహితులు ఎన్నో విషయాలు చెప్పుకున్నారు. ముగ్గురు ఒక్కసారిగా మాట్లాడటం మొదలు పెట్టారు – అంతలో టీ – కిందా మీదా ఒలకబోస్తూ – పనమ్మాయి తెచ్చింది. అంతే షెల్లీ – 'అలా బయటకు వెళ్దాం' అని వాళ్లను లేవ దీసాడు. మేరీ స్టువర్ట్ రాజప్రసాదం చూడటానికి బయలుదేరారు.

హారియెట్‌కి చరిత్ర బాగా తెలుసు – ఈ దురదృష్టవంతురాలయిన రాణీ చరిత్ర వాళ్లకు చెప్పింది. తర్వాత 'హోలీ మాడ్' చేరిన తర్వాత షెల్లీ ఇంటికి వెళ్లి ఉత్తరం రాయాలి – మీరు 'ఆర్థర్ సీట్' పైకి వెళ్లి పట్నం అంతా చూడమని చెప్పాడు.

హాగ్‌కి ఈ పరిసరాలు నచ్చాయి. అక్కడే చాలా సమయం కూర్చున్నారు. అతనికి ఆ యౌవనవతి సాన్నిహిత్యం బాగా నచ్చింది– అలాంటి తోడు ఉంటే ఎక్కడున్నా ఆనందంగానే ఉంటుంది. అంతలో కొండగాలి వీచింది – హారియెట్ గులాబీ పాదాలు అతని కంటబడితే – ఆత్రంగా చూస్తాడు – అంతే ఆమె మళ్లీ కూర్చుండి పోయి కాళ్ల మీద గౌను కప్పుకుంది.

'నే నిక్కడే వుండిపోతాను' అని అంది - ఆకలితో వున్న హాగ్, వెంటనే ఆమెను ఒప్పించలేమని ఒంటరిగానే - ఇంటికి వచ్చాడు - అతని వెనకనే పరుగుపెట్టుకుంటూ వచ్చింది.

ఆ విధంగా ముగ్గురు ఎంతో ఉల్లాసవంతమైన వారం గడిపారు. డబ్బు సమస్యవున్నా, షెల్లీ మేనమామ - పిల్ ఫోల్డు అతనికి ఎన్నో కానుకలు పంపాడు.

"కొడుకు మీద కోపం ఉండటం సహజమే - కాని అతన్ని ఆకలితో మాడ్చకూడదు కదా" అంటాడు.

తిమోతి - హాగ్ తండ్రికి రాశాడు. "నా కొడుకు - ఎవరినో లేపుకుపోయి స్కాట్‌లాండ్‌లో ఉన్నాడు - మీ కొడుకు కూడా అక్కడికి చేరినట్లు వార్త వచ్చింది - ఈ విషయం మీకు తెలియాలి కదా -" హెచ్చరించాడు.

ప్రతిరోజు ఉదయం షెల్లీ ఉత్తరాల కోసం బయటకు వెళ్లేవాడు - తిరిగి వచ్చిన తర్వాత 'బఫన్' పుస్తకాన్ని అనువాదం చేసేవాడు. అది ఈ మధ్యనే మొదలు పెట్టాడు.

హాగ్ - హారియెట్ వీధుల వెంట తిరగటానికి పోయేవారు.



<u>వింటేజ్ వైన్</u>

హారియెట్‌కి బిగ్గరగా చదవడం ఇష్టం - వాతావరణం బాగావుంటే పెద్దగా చదువుతూ - చాలా బాగా చదివేది - చక్కని గొంతుతో - మరింత స్పష్టమైన ఉచ్చారణతో-

ఆ విధంగా హాగ్ 'టెలిమేక్' లో చాలా భాగం విన్నాడు. అభ్యంతర పెట్టకుండానే.

'ఇడోమినస్' నీతిశాస్త్రం (క్రీట్) వినటానికి చాలా చప్పగా ఉండేది - కాని చదువరి అందం - అతన్ని వినేట్లు చేసేది - అలా రోజంతా ఆమెను చూస్తూ వింటుండేవాడు.

షెల్లీ రాసి, అలసి నిద్రపోయేవాడు. ఇది నిజంగా హారియెట్‌కి ఇబ్బందికరంగా వుండేది - హాగ్ కూడా ఆమెను సమర్థించేవాడు.

అతనికి తెలియకుండానే హారియెట్ తో చనువుగా వుండటం మొదలు పెట్టాడు.

సాంఘిక సూత్రాలు– నైతిక నియమాలు, ఆకర్షణీయమైన సౌందర్యం ముందు వెలవెలపోతాయి. దానికి దైవ భావనతో అవసరం ఏముంది?

అది హైలీ తోకచుక్క రావాల్సిన సంవత్సరం - చక్కని వాతావరణంలో రాత్రులన్నీ చుక్కలతో మెరుస్తున్న కాలం... అది 1811వ సంవత్సరం. అపురూపమయిన వింటేజ్ వైన్ సంవత్సరం!



తోకచుక్క

పదవ అధ్యాయం

హాగ్

అప్పటికి ఆరువారాలయింది. హాగ్ ఇక యార్క్ తిరిగి వెళ్లిపోవాలి. షెల్లీ – హారియెట్ జంటకు ఎడిన్‌బర్గ్‌లో వుండవలసిన అవసరంగాని – పనిగాని లేదు. నిజానికి ప్రపంచంలో ఎక్కడా అటువంటి అవసరం లేదు– ఆ కారణంగా వారిద్దరూ హాగ్‌తో బాటు యార్క్ నగరానికే వెళ్లటానికి నిర్ణయించుకున్నారు. అక్కడ హాగ్ ఇంకో సంవత్సరం గడప వలసి వుంది – ఆ తరువాత ముగ్గురూ లండన్‌లో 'ఎప్పటికీ' శాశ్వతంగా వుండిపోవటానికి, అక్కడే రాసుకోవటానికీ, చదువుకోవటానికీ నిర్ణయించుకున్నారు!

హారియెట్ అలసిపోకుండా – వాళ్లు – పెద్ద బండే మాట్లాడుకున్నారు– మార్గానికిరువైపులా – బార్లీ చేలు – అక్కడక్కడా ముల్లంగి – ఒకే మాదిరిగా పరిసరాలుంటే – విసుగుగానే ఉంటుంది.

'అరె – ఏది బార్లీ – ఏది ముల్లంగి ? తెలియకుండా వుందే' హారియెట్ ఆశ్చర్య పోతుండేది.

"ఎందుకు పిల్లా , ఆమాత్రం తెలీదా?" షెల్లీ – వేల ఎకరాలకు కాబోయే యజమాని – అంటాడు.

బండి మూల కూర్చున్న హాగ్ – ఏమిటి ఈ మాత్రం కూడా బోధించలేదా ఈ మేధావి? – Virtuous Idomenus తన శిష్యురాలికి? అని లోలోపల అనుకుంటాడు. ప్రయాణంలో సమయం గడిచిపోవటానికి – హారియెట్ 'హోల్‌క్రాఫ్ట్' నవల పైకి చదువుతుంటుంది.

ఆ రచయిత ఘాటయిన – కఠినమైన శైలి వారికి రుచించేది కాదు–

షెల్లీ నిట్టూర్పులు విడిచేవాడు.

"ఇదంతా అవసరమా సుకుమారీ" అంటాడు. 'అవును' హారియెట్ అంటుంది. "కొన్ని భాగాలు వదలి వేయవచ్చుకదా" అంటే, "అది ఎలా వీలవుతుంది?" అంటూ చదువుతుంది.

బండి ఆగగానే - షెల్లీ మాయమైపోయేవాడు - అలా మాయమైపోవటం అతనికి అలవాటయి పోయింది. ఒకసారి హాగ్ వెతికి పట్టుకోవలసి వచ్చింది - బెర్విక్ సముద్రతీరంలో- అస్తమించే సూర్యుణ్ణి - విచార వదనంతో చూస్తున్న షెల్లీని.

యార్క్ పట్నం షెల్లీకి ఏమాత్రం నచ్చలేదు.. అక్కడి మతపరమైన వాతావరణం - ఛాందస పౌరుల ముఖాలు ఏమాత్రం అతనికి ఉత్సాహాన్ని ఇవ్వ లేకపోయాయి. వాళ్లకు దొరికిన అద్దెగదులు- ఇరుకు సందులు - ఇరుకు మనుష్యుల మధ్య - ఇరుకు - ఇరుకు -

"ఇక్కడ వుండటం నా వల్ల కాదు" - అన్నాడు కాని - అక్కడ నుంచి కదలాలంటే డబ్బు చాలా అవసరం కదా -

తన మేనమామ పిల్‌ఫోల్డు గారిని చూడటానికి వెళ్దామనుకున్నాడు. కక్‌ఫీల్డులో కుమారి హిచ్‌నర్ కూడా వుంటుంది ! ఎలాగైనా ఆమెను యార్క్ తీసుకు రావచ్చునని ఆలోచించాడు. దారిలో - లండన్‌లో - ఎలీజాని కూడా రమ్మని అడగవచ్చు. హారియెట్ తన అక్క కోసం కలవరిస్తోంది!

ఆ విధంగా తన ఆత్మ బంధువులంతా ఒక చోట వుండవచ్చు- ఒకరోజు - బండిలో బయలుదేరాడు- హారియెట్‌ని - హాగ్‌ని వదిలి; ఇది చాలా వింత పరిస్థితే కాని - దీనిలో కూడా - వారికి వెసులు బాటు వుంది. అక్కడ వారిద్దరికీ తెలిసిన వాళ్లెవరూ లేరు - ఎడారిలో ఎవరూలేని చోట - ఎలాగైనా వుండవచ్చు- స్వేచ్ఛగా - వాళ్లిద్దరివీ చిల్లర ఆటలు - చిన్నపిల్లలా ఆడుకుంటూ కాలం గడుపుతున్నారు. హాగ్ హాస్యం ఆమెను ఎంతగానో సంతోష పెడుతుంది. ఇది షెల్లీ గంభీరమైన ప్రవర్తనకు పూర్తిగా వ్యతిరేకమైనా - హాగ్ ఎప్పుడూ ఆమెను మెచ్చుకుంటూనే వున్నాడు - ఎడిన్‌బర్గ్‌లోనూ- ప్రయాణంలోనూ.

షెల్లీ ఎప్పుడు మాస్టర్‌లా వుంటాడు - అతనే ఆమెకు అన్ని నేర్పాడు - ఆమె తప్పులన్నీ షెల్లీ ఎంతో ఓర్పుతో సరి దిద్దాడు - హారియెట్ ఎంతవరకు నేర్చుకోగలదు - అంతవరకే అలానే నేర్పాడు - కాని హాగ్ ఆమె చేసిందంతా గొప్పగా వుందని పొగడుతాడు.

ఆమె బట్టల్ని శ్రద్ధగా చూస్తాడు– ఆమె జుత్తు సరిచేసుకోవటం అభినందిస్తాడు. 'టెలీమేక్' ని శ్రద్ధగా వింటాడు – ఆమె చదవటం మెచ్చుకుంటాడు – ఎప్పుడూ సంతోషంగా సరదాగా వుంటాడు.

నిజానికి అతని ఆలోచనలు మరోరకంగా వుండేవి – అందమైన ఆమెతో ఎక్కువ కాలం ఒంటరిగా గడపటంలోని పరిస్థితి – అతనిలో కోరికలను లేపాయి. ఆమెపట్ల కాంక్ష పెరిగిపోతోంది.

మొదటగా – ఈ కోరికలోని అనైతికతను– తన ప్రాణస్నేహితుని భార్యను కోరుకోవటం – చాలా పాపంగా భావించాడు. కాని తెలివితేటలుంటే – ఆ తెలివిని తన కోరికలను సమర్థించుకోవటానికి అనువుగా వుపయోగించుకోగలడు–

షెల్లీ ఆమెను నా చేతుల్లో పెడితే నాదా తప్పు? ఇంతటి అందమైన, ఆరాధించదగిన ప్రియురాలు చెంతనుండగా – దూరంగా కూర్చుని నీతిశాస్త్రాలు రాయటం ఎంతవరకు సబబు? ఎంత పిచ్చితనం? ఆమె మంచి అందగత్తె – ఎంతటి ఆకర్షణ – ఆమె అలా వీధిలో నడుస్తుంటే ఎంతో బుద్ధిమంతులుకూడా కిటికీ చాటునుంచి చూస్తుంటారే? నిజంగా షెల్లీ ఆమెను ప్రేమిస్తున్నాడా? అతని ప్రేమలో వ్యతిరేకత వున్నట్లుంది – ఎప్పుడూ దూరంగా వుండటానికి అదే కారణమేమో? పైగా హారియెట్, ఆమె ఉదారవాది సంతానం కదా – ఏమాత్రం పవిత్రంగా వుంటుంది? అతని ఆలోచనలు ఈ విధంగా సాగుతున్నాయి.

హాగ్‌కి షెల్లీ పరిచయమైన మొదటి రోజు నుంచి – అతనిపై భిన్న అభిప్రాయాలున్నాయి.

షెల్లీ, నైతిక ధైర్యాన్ని – స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్ని అతని గొప్ప అంకితభావాన్ని ఎంతగానో అభినందించాడు – అతను చాలా ప్రత్యేకమైన వాడని నమ్మాడు. స్వచ్ఛమైన నీటిలో మెరిసే రత్నమనీ విశ్వసించాడు. అదే సమయంలో షెల్లీ తిరుగుబాటు తనం – అంతులేని శక్తి – ఏమీ సాధించలేకపోయిందనీ లోలోపల తేలికభావన వుండేది!

ఆక్స్‌ఫర్డ్‌లో జరిగిన సంఘటనలో షెల్లీతోపాటు తనూ శిక్ష అనుభవించాడు, అతన్ని సమర్థించి – మొదట్లో ఇదంతా అతని మీద వున్న అభిమానం – మెచ్చుకోలుతోనే – కాని రాను రాను – షెల్లీ పట్ల తన ఆరాధన తగ్గు ముఖం పట్టి – అతని లోపాలనే ఎక్కువగా చూస్తున్నాడు.

ఇప్పుడు తన అసంగతమైన వాంఛతో - ఈ దృష్టి మరింతగా వక్రించింది.

షెల్లీ కక్‌ఫీల్డు వెళ్లిన రోజునే - హాగ్ - తన వకీలు పని నుంచి రాగానే - హారియెట్‌ను బైటకు తీసుకువెళ్తాడు - ఆమె కళ్లల్లోకి చూస్తూ పిచ్చి పిచ్చిగా గొణుగుతాడు - ఆమె తన భర్త రాక గురించి ఎంతగా ఎదురు చూస్తుందో చెప్తుంది. షెల్లీతో పాటు తన అక్క ఎలీజా వస్తుందని అనుకుంటున్నట్లు కూడా అంటుంది. ఎలీజా చాలా అందగత్తె - ఆమె జుత్తు నల్లగా నిగనిగలాడుతుంది. చాలా తెలివిగలది - నన్ను జీవితంలో ఎన్నో సార్లు రక్షించింది తెలుసా? అంటుంది.

ఏమిటి ఈ చిన్న దానికి ఒక జీవితం- దానిలో కష్టాలూనా ? అని ఆశ్చర్యపోతాడు హాగ్. హారియెట్ - తన స్కూలు రోజులు, తన సావాసాలు, తన పెళ్ళికి అడ్డంకులు - ఎన్నో విషయాలు చెప్పి - "నీవు ఎప్పుడైనా ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నావా?" అంటుంది హఠాత్తుగా.

"ఎందుకు - అంత అవసరం ఏముంది?"

"నేను చాలా సార్లు అనుకున్నాను. ఎన్నో రాత్రులు కిటికీ దగ్గరచేరి చంద్రుణ్ణి, తారలను చూస్తూ - వాటికి వీడ్కోలు చెప్పాను - నా తోటి వాళ్లు నిద్రపోతుంటే వాళ్లకీ వీడ్కోలు చెప్పాను - చివరికి ప్రక్కమీద చేరి నిద్రపోయేదాన్ని..."

ఇలా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుండేవాళ్లు - గదులకు చేరింతర్వాత పుస్తకం చదివి వినిపిస్తుండేది.

ఆ సాయంత్రం ఆమె చదివిందేమిటో - తను విన్నదేమిటో హాగ్ తలకెక్కలేదు. టీ చేసినపుడు ఎంతో సరదాగా నవ్విస్తుంటాడు.

ఆమె 'గుడ్‌నైట్' చెప్పినప్పుడు తనలో తను - ఈమె ఎంతవరకు 'మంచిది' అనుకుంటాడు.

ఇక ఆ మర్నాడు - 'నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను' అంటాడు!

హారియెట్ చాలా కోపగించుకుంటుంది. ఆమెకు పదహారేళ్లయినా - తనను ఎంతో చక్కగా రక్షించుకోగలిగింది.

షెల్లీ గురించి – నైతికత గురించి ఉపన్యాసమే ఇచ్చింది.

"ఇది ఎంత దారుణం! షెల్లీ నన్ను నీ సంరక్షణలో పెట్టి వెళ్ళితే, నీవు నీ స్నేహితుణ్ణి – అతని నమ్మకాన్ని వమ్ము చేస్తావా? ఈ పాటికే నీకు మత్తు దిగి సిగ్గుపడి వుంటావు – మరొక్క మాట మాట్లాడకు.

షెల్లీకి ఈ విషయం చెప్పి అతన్ని బాధించను"

చాలా స్పష్టంగా ఆత్మ విశ్వాసంతో మాట్లాడింది.

ఇట్లాంటి ప్రేమ వ్యవహారాలు ఆడపిల్లలకు కొట్టినపిండి – వాళ్లను ఓడించడం కష్టం – ఎప్పుడూ వాళ్లదే విజయం – హారియెట్ ధైర్యం చెక్కు చెదర లేదు –

హాగ్ – ఇకముందు మంచిగా వుంటానని వాగ్దానం చేశాడు!!

ఆ మర్నాడు అతను పనినుంచి వచ్చే వేళకు – హారియెట్ ప్రక్కన ఒక పెద్దావిడ కూర్చునివుంది. – ఆమె జుత్తు నల్లగా నిగనిగలాడుతుంది. ముఖం తెల్లగా వుంది – ప్రక్కనుంచి చూస్తే గుర్రం ముఖంలా అనిపించింది – హాగ్ – ఇదిగో ఎలీజా నాకోసం వచ్చింది, అంటూ అతన్ని తన అక్కకు పరిచయం చేసింది.

ఎలీజా హాగ్‌కు హాయ్ చెప్పి – తర్వాత చెల్లెలితో కబుర్లు చెప్తూ – అతని ఉనికిని కూడా పట్టించుకోలేదు.

ఆహా! ఈమేనా ఎలీజా ఎంత భయంకరంగా వుంది – ఇక నా ఆటలు సాగవు – హారియెట్ విషయం ప్రస్తుతానికి ప్రక్కన పెట్టేద్దాం?

హాగ్‌కి ఇది చాలా అవమానంగా అనిపించింది! 'ఏమిటి ఈ రోజు టీ లేదా' అని కల్పించుకోబోయాడు.

'మాకు అవసరం లేదు' అని ఇద్దరూ – ఇంకామాటల్లోనే వున్నారు.

చివరికి హాగ్ టీ తయారుచేసుకొని మౌనంగానే తాగి – వెళ్లిపోయాడు.

ఆ రోజు నుంచి ఆ యింట్లో – అతనికి స్థానం లేకుండా పోయింది – ఒక రకంగా అంతా ఎలీజానే మంచీచెడూ చూడటం మొదలు పెట్టి తన అధీనంలోకి తెచ్చుకుంది –

నిజానికి హారియెట్ జీవితాన్ని మొదటి నుంచి – ఆమె అజమాయిషీ చేస్తుంది. పెళ్లయిన కొన్ని నెలలు షెల్లీకి ఆ బాధ్యత అప్పగించినా – ఇప్పుడు మళ్లీ తనే – పూర్తి అధీనంలోకి తీసుకుంది – అలాంటి హక్కు మరెవ్వరికీ లేదన్నట్లు!

"ఏమిటీ ! నిన్ను ఇతని దగ్గర వదిలిపెట్టి షెల్లీ వెళ్లిపోయాడా? నేను రాకపోతే నీ గతి ఏమికాను? వీడేమిటి నిన్ను 'ప్రియమైన' అని పిలుస్తున్నాడు? నువ్వు కూడా ఊరుకుంటున్నావే? ఆరి భగవంతుడా! ఈ విషయం తెలిస్తే మిస్ వార్ని ఏమంటుంది?"

హాగ్ అలా నడవటానికి వెళ్దామా అంటే – "ఏమనుకుంటున్నావు, హారియెట్ చాలా అలసిపోయింది!" అంటూ ఈసడించింది.

'ఏమయింది హారియెట్‌కి' అని హాగ్ ఆందోళన పడితే, "నీకు కనపడటంలేదా – ఆమెకు నరాల బలహీనత."

హారియెట్ పుస్తకం చదువుతానంటుంది – అదీ 'ఇడోమినస్' నీతి వాక్యాలు– ఇవి హాగ్‌కి చాలా అవసరం కూడా –

'ఏమిటి బిగ్గరగానా – నీ నరాలేమయిపోతాయి – 'మిస్‌వార్ని' ఏమంటుంది?" అంటుంది ఎలీజా.

ఓ! ఎవరీ – 'వార్ని' అని అడుగుతాడు, ఎలీజా లేనపుడు – "ఓ అదా – ఆమె నాకు చాలా కావాల్సింది."

'ఎందుకని, బాగా చదివిందా? మంచి స్థితిలో ఉందా?'

"అదేం కాదు – ఆమె కూడా చిన్న పరిషత్తు నడుపుతుంది?"

'అలాగా, సరే! ఇప్పుడు ఎలీజా గదిలో ఏం చేస్తుంటుంది? చదువుతుందా?'

"తల దువ్వుకుంటుంది" అంది నవ్వుతూ.

'అయితే మనం అలా నడుద్దాం' అంటాడు. మొదట్లో కాదన్నా తర్వాత 'సరే' అంటుంది హారియెట్.

హాగ్ తన మొదటి 'యత్నం' తర్వాత మంచిగా వుంటానని వాగ్దానం చేశాడు కదా – ఆమె సంతోషించినా – కొంచెం నిరుత్సాహపడింది.

తన అందం తెలిసిన హారియెట్‌కి – తన ఆకర్షణ గురించి తెలియదా!

అక్కడ వున్న ఎత్తైన వంతెన మీద నిలబడ్డారు. క్రింద వరదనీరు పారుతోంది.

హ్యూస్ నది విపరీతంగా ప్రవహిస్తోంది – వరదలతో అన్ని కొట్టుకుపోతున్నాయి. హారియెట్ "ఒక్కసారి ఊహించు– ఈ వరదలో ఎలీజా ఎలా కొట్టుకుపోతుందో. ఆమె జుట్టు విడిపోయి – ఆ దుంగలాగా దొర్లిపోతూ – అయ్యో! మిస్ వార్న్ ఏమంటుందో."

హారియెట్ తన నవ్వును దాయటానికి ముఖం తిప్పుకుంది.

"నీ నవ్వు ఎంత బాగుంటుందో తెలుసా – సంగీతంలా, సంతోషంగా" అంటున్నాడు. హారియెట్ యుద్ధ ప్రమాదం సమీపిస్తున్నదని పసికట్టింది.

ఆ మర్నాడు షెల్లీ తిరిగి వచ్చాడు – అనుకున్నదానికంటే ముందుగా. అతనికి అంతగా విజయం లభించలేదు– వెళ్లిన పనేమీ జరిగినట్లు లేదు.

తిమోతి దర్శనమే దొరకలేదు. ఆయన దృష్టిలో షెల్లీ పెళ్లి వ్యవహారం క్షమించరాని నేరంగా పరిగణించారు. "ఎంతమంది అక్రమ సంతానాన్నైనా భరించే వాణ్ణి" ఆయన బావమర్దితో అన్నాడు. "కాని ఈ పెళ్లి మాత్రం అంగీకరించలేను. మన అంతస్తుకు అవమానకరం. మళ్లీ ఈ విషయం నాతో మాట్లాడకండి".

కుమారి హిచ్‌నర్ అసలే నీతి నియమాలకు కట్టుబడి వుండే మనిషికదా – షెల్లీతో పాటే యార్క్ ప్రయాణం ఒప్పుకోలేదు. లండన్‌లో ఎలీజా తన కోసం ఆగలేదని తెలిసి యార్క్ తిరిగి వచ్చేశాడు! తన భార్య చెంత – స్నేహితుని దగ్గర కొంత ఊరట లభిస్తుందనుకున్నాడు. కాని ఇక్కడ వాతావరణం అంత అనుకూలంగా లేదు.

ఎలీజా రోజంతా తన గదిలో కూర్చుని జుత్తు దువ్వుకుంటూ వుండేది.

ఇక హారియెట్, హాగ్ మునుపటిలా చనువుగా మాట్లాడుకోవటంలేదు.

మొత్తానికి ఏదో అసాధారణమైన వాతావరణం నెలకొనివుందని గ్రహించాడు షెల్లీ.

హారియెట్ ఒంటరిగా తన దగ్గర వున్నపుడు "నీవిలా హాగ్‌తో ముభావంగా వుండటం నాకేమి నచ్చలేదు. అతను నా ప్రాణస్నేహితుడు. నేను లేనపుడు నిన్ను జాగ్రత్తగా చూసుకున్నాడు కదా, ఇప్పుడు మీ అక్క వచ్చిందని అతన్ని ఇలా నిర్లక్ష్యం చేయటం న్యాయంగా వుందా? అతను నా సోదరుని లాంటి వాడు"

హారియెట్ నిట్టూర్చి, "అవును - చాలా మంచి స్నేహితుడు" అంది తన గొంతులో అసహనం ధ్వనిస్తోంది.

షెల్లీ ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందాడు - ఏమిజరిగిందో చెప్పమని బలవంతం చేశాడు.

ఆమె జరిగిన కథ చెప్పింది - ఇప్పటికి రెండు సార్లు నా వెంట బడ్డాడు. మొదటి సారి నా మీద వ్యామోహం చూపినపుడు, నేను అది హాస్యంగానే తీసుకున్నట్లు నటించాను. అతను తన తప్పు గ్రహించినట్లే ప్రవర్తించాడు. అంతా సర్దుకుందని అనుకుని నీతో చెప్పకూడదనుకున్నాను. నిన్న మళ్లీ రెండోసారి నేను లేకుండా బ్రతకలేనని చెప్పాడు - నే నొప్పుకోకపోతే చచ్చిపోతానన్నాడు."

షెల్లీ తన రక్తం గడ్డ కట్టుకుపోతున్నట్లుగా బాధ పడ్డాడు. గుండె ఆగిపోతుందనే అనుకున్నాడు.

"ఏమిటీ? హాగ్ - హాగ్ ఇలా చేశాడా?... నీవు చెప్పలేదా - ఇలా అడగడం...?"

"అంతా అయింది - అన్నీ చెప్పాను, 'నీవు స్నేహితుడవు; స్నేహానికే మచ్చ తెస్తున్నావు- నమ్మకద్రోహానికి పాల్పడుతున్నా'వని చెప్పాను. 'ప్రేమకు ఇవన్నీ పడతాయా - ప్రేమించే వాడు - మంచి చెడులు చూసి ప్రేమిస్తాడా' అని అన్నాడు. పెర్సీ ఏమనుకుంటాడు అతను అన్నింటికీ అతీతుడు - అతని స్వచ్ఛమైన నైతిక హృదయానికి ఏ మరకలు అంటవు - నాకు ప్రేమ ముఖ్యం - ఇంకేవీ పట్టవు. అయినా మనం షెల్లీకి ఏమి హాని చేస్తున్నాం? అతనికి తెలియాల్సిన పనిలేదు. నాకు నీ ప్రేమను ఎందుకు పంచవు? షెల్లీకి అనురాగాన్ని ఇవ్వగలవు కదా? అతను నీ గురించి అంతగా ఆలోచిస్తున్నాడా? అన్నాడు" అని వివరించింది.

'అలా అన్నాడా?' అని షెల్లీ ఆశ్చర్యపోయాడు.

"అవును - అంతేకాదు - ఇంకా చాలా రకాలుగా పేలాడు - నీవు తర్కానికీ, విషయానికీ ముడిపెడతావనీ - ఆ రెంటికీ పొంతన లేదని - నీవు కేవలం - ఆలోచనల అగ్నివని- సంవేదనకు శీతలానివని - జీవితంలో ఇదే ముఖ్యమని - అని కూడా అన్నాడు. నాకు తోచినట్లు నేను సమాధానం చెప్పాను" అని చెప్పింది.

షెల్లీ సోఫాలో కూలబడ్డాడు - ఒక్కసారిగా ప్రపంచం మసకబారిపోతున్నట్లు, తన తల తిరిగి పోతూన్నట్లు, వళ్లంతా చల్ల బడిపోతున్నట్లు బాధపడ్డాడు.

"హాగ్ - నా భార్యను కోరుకున్నాడా? అదీ నేను అతని సంరక్షణలో ఆమెను వదిలి వెళ్లినపుడు? హాగ్ ఈ పని చేశాడంటే నమ్మలేక పోతున్నాను-



జఫర్‌సన్ హాగ్

అతన్ని చూసూ్త - అతనితో మాట్లాడుతూ ఎన్నాళ్ళు గడిపాను. కేవలం చూపులతోనే ప్రపంచాన్ని బాగుచేయవచ్చని అనుకునే వాణ్ణి - అరె ! ఇంతకంటే అవమానకరమైన ప్రయత్నం ఏముంటుంది? కాని - ఆక్స్‌ఫర్డ్ రోజులు గుర్తు చేసుకుంటే అతని ఔన్నత్యం - నిరాసక్తత ఎలా మరచిపోతాను- అతనితో మాట్లాడాలి. నిజాయితీగా ఆలోచించమని చెప్పాలి..." హారియెట్‌తో మొరపెట్టుకున్నాడు ఎంతో ఆర్తిగా...

హాగ్‌ను తనతో రమ్మన్నాడు. ఊరికి దూరంగా తీసుకువెళ్లాడు. హాగ్ అనుకుంటూనే వున్నాడు. అతనేమీ దాయాలని ప్రయత్నించలేదు - 'అవును నిజమే హారియెట్‌ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. ఎడిన్‌బర్గ్‌లో చూసిన మొదటి రోజు నుంచే - అది నా తప్పా? స్త్రీ సౌందర్యాన్ని ఎలా చూడకుండా వుండాలి? అందులో హారియెట్ లాంటి అందాల భరిణను ఆరాధించలేని అంధుణ్ణి కాదు... అవును నేనామెను ప్రేమిస్తున్నాను" అని ఖరాఖండిగా చెప్తున్నాడు.

"అది ప్రేమ కాదు - కామవాంఛ - అది జంతు సమానమైన వాంఛ - మనిషిని దుర్మార్గం నుంచి వేరు చేసే ప్రేమ వేరు - కామవాంఛ వేరు - నీది ప్రేమ కాదు - హాగ్, ఒక్కసారి ఆలోచించు - ప్రేమ - తన్నుతాను మరిచిపోతుంది- ఎవరిని ప్రేమిస్తావో వారు ఆనందంగా వుండాలని కోరుకుంటుంది. నీ చర్య వల్ల హారియెట్‌కు దుఃఖాన్ని మిగులుస్తావు. నీ ఆలోచనలు ప్రేమతో నిండినవి కావు - అవి స్వార్థపూరితమైన కామవాంఛలు... ఆలోచించు-"

'నీవేమైనా అను, మాటల్లో ఏముంది? ఏమైనా ప్రగాఢమైన కోరికలే కదా – నేను అణచుకోలేక పోయినవి – నా ఆలోచనలే అయితే అవే నా కోరికలు.'

"ఏ కోరికా గొప్పదికాదు – మన మనోశక్తి ముందు తలవంచ వలసిందే– ఒక్కసారి నా గురించి ఆలోచించావా? ఈ నీ చర్య నాకు ఒక్కసారిగా ఇరవైయ్యేళ్లు వయసునూ, దుఃఖాన్ని తీసుకువచ్చింది. నన్ను కకావికలు చేసింది.

నా గుండె పగిలిపోయింది. హారియెట్ గురించి ఆలోచించు, ఆమె ఎంతగా నలిగిపోయిందో."

హాగ్ – పాలిపోయాడు. ఎంతో బాధపడ్డాడు. సిగ్గుతో కుంచించుకుపోయాడు. నిజానికి, మానసికంగా కూలబడి పోయాడు. అతనికి షెల్లీ అంటే ఎనలేని అభిమానం. తన ప్రవర్తనకు తానే లజ్జతో తెల్లబడిపోయాడు.

"ప్రపంచంలో ఇలాంటి స్నేహితుని కోసం, ఎలాంటి ఆడదాన్నయినా వదులుకోవచ్చు" అనుకున్నాడు.

'పెర్సీ నన్ను క్షమించు, నేను ఎంతో సిగ్గుపడుతున్నాను, బాధపడుతున్నాను. జరిగిందానికి నాదే బాధ్యత. మరచిపోవటానికి ప్రయత్నిస్తాను.

నువ్వూ – హారియెట్ నన్ను క్షమించండి. నా మీద కోపం పెట్టుకోవద్దు. మనం స్నేహితులమే ఎన్నటికీ' అంటున్నాడు.

"నీ వంటే నాకు కోపం లేదు. నేను నిన్ను ద్వేషించడం లేదు. కేవలం నీ దుశ్చర్యనే నిరసిస్తున్నాను. ఏదో ఒక రోజు నీవే ఎంతటి తప్పు చేశావో తెలుసుకుంటావు. ఇప్పుడు నీ చర్యను నేనెలా నిరసిస్తున్నానో, ఆ రోజు నీవు కూడా నిరసిస్తావు. ఆ క్షణంలోనే నీ బాధ్యత తీరిపోతుంది. పశ్చాత్తాపం కంటే ప్రాయశ్చిత్తం ఏముంటుంది? నేను కాదు నిన్ను ద్వేషించేది. ఎందుకంటే – నేను 'మనిషి'ని మనిషిలాగా విలువ ఇస్తాను. అది కూడా తన తప్పు తాను తెలుసుకున్న వానిని ఎక్కువగా."

షెల్లీ ఎంతో హాయిగా ఫీలయ్యాడు – తన కోపాన్ని, అసూయను ఈ విధంగా అణగద్రొక్కగలిగినందుకు – హాగ్‌కు కూడా మంచి మార్గం చూప గలిగినందుకు – త్వరలోనే మరచి పోగల శక్తి వున్నందుకు.

కాని, ఆడవాళ్లు – ఇంత లోతుగా ఆలోచించరు – షెల్లీ ఇంటికి తిరిగి వెళ్ళి – 'నేను హాగ్‌ను క్షమించాను' అని చెప్పగానే, "ఏమిటీ? ఆ దుర్మార్గుణ్ని క్షమించావా?" అంది ఎలీజా గట్టిగా. "అంటే వాడు ఇక్కడే వుంటాడా? హారియెట్ స్థితి ఏంకాను?" అని ఆశ్చర్యపోయింది.

మర్నాడు వకీలు పని నుండి వచ్చిన హాగ్‌కు, ఖాళీ గదులే దర్శనమిచ్చాయి!



నాలుగు గుర్రాల బగ్గీ



పాత లండన్ వీధి

పదకొండవ అధ్యాయం

మధ్య వయస్కునితో మొదటి పరిచయం!!

అసహ్యకరమైన హాగ్ ప్రవర్తన నుండి దూరంగా పారిపోవటానికి నిశ్చయించుకుని – షెల్లీ – తన భార్యనూ – ఆమె అక్కనూ తీసుకుని లేక్స్‌కు బయలు దేరాడు. ఆ ప్రదేశానికి వెళ్లటానికి కేవలం మానసికమైన కారణమే. లండన్ లో పోలాండ్ వీధి లాగా ...

వేల్స్ జిల్లాలోనే – గొప్ప కవులు, ఉదారవాదులు, సౌతే, కొలరిడ్జి – అక్కడే చాలాకాలం నివసించారు – అదృష్టవశాత్తు వాళ్లను కలిసే అవకాశం రావచ్చుకదా! తన భావాలను – ఆలోచనలతో ఏకీభవించే గొప్ప వ్యక్తులను కలుసుకోవడం ఆనందదాయకమే కదా!

ఒక పూలవనంలో – కెస్‌విక్‌లో వీళ్లకు చిన్న వసతి గృహం దొరికింది. ఆ వనంలో తిరగటానికి వారికి అనుమతిలేదు. కాని ఆ యజమాని షెల్లీని, హారియెట్‌ని చిన్న పిల్లల్లా చూసి, ఆ పూలతోటలో ఆడుకోవటానికి అంగీకరించాడు!!

అక్కడ తపాలా బంట్రోతుకు, షెల్లీకి వచ్చే వుత్తరాల బరువు తొందర్లోనే తెలిసివచ్చింది. మొదట్లో హాగ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు ఇదివరకంత ఉత్సాహకరంగా సాగలేదు. హాగ్, హారియెట్‌కు చాలా పెద్ద ఉత్తరం రాశాడు – తనను గౌరవిస్తానని – కాని జీవితాంతం తననే ఆరాధిస్తానని కూడా – ఇది హారియెట్‌కు చిరాకు కలిగించినా – ఆమె అహాన్ని సంతృప్తి పరిచింది!

షెల్లీ, "దూర కాలాలు – నిన్ను మరిచిపోయేలా చేస్తాయి" అన్నాడు.

ఆమె తల అడ్డంగా ఊపింది – పాపం 'హాగ్' అన్నట్లు...

"దూరం – చిన్న చిన్న విషయాలను మరపింపచేస్తుంది – కాని కాలం గాఢమైన అనుభూతిని పెంపొందించవచ్చు" అంటుంది.

హాగ్ రాస్తాడు – 'హారియెట్ నన్ను క్షమించకపోతే – ఆమె పాదాలచెంత తల పగులగొట్టుకుంటాను' అని!

ఆమెకు ఆనందంతో పాటు విచారము కలిగింది. కాని చాలా కాలం ఎటువంటి విషాదవార్త హాగ్ నుంచి రాకపోయేసరికి – ఆమెకు – భయం తగ్గి – నిరాశే మిగిలింది!!

ఇక రెండవది – కుమారి హిచ్‌నర్ ఉత్తరాలు. హాగ్ తనకు దూరమవటంతో – షెల్లీకి ఇక ఈమె స్నేహమే మిగిలింది!

ప్రతిరోజు – ప్రత్యేకంగా ఆమెకు ఉత్తరాలు రాసేవాడు – హారియెట్ అందులోనే ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ – ఆహ్వానం కూడా పంపేది. వచ్చి తమతో కొన్నాళ్లుండమని.

ఆ దగ్గర్లోనే నార్‌ఫోక్ రాజకుమారుడు నివసించేవాడు – అప్పటికే – ఒకసారి షెల్లీకి – తిమోతీకి రాజీ కుదిర్చాడు. ఇప్పుడు డబ్బు సమస్య రోజురోజుకీ క్లిష్టమై పోవటంతో మళ్లీ ఆయన సహాయం కోరాలని నిర్ణయించారు షెల్లీ దంపతులు.

రాజకుమారుడు – షెల్లీనీ – హారియట్‌ను తన భవనానికి ఆహ్వానించాడు – ఎలీజాతో సహా ! ఒక వారాంతం గ్రేస్టోక్‌లో రాజభవనంలో, తనతో గడపటానికి.

ఆయనకు షెల్లీ విపరీతంగా నచ్చాడు. సహజంగానే, ఒక గొప్ప రాజకీయ పార్టీకి నాయకునిగా – ఈ భవిష్యత్ పార్లమెంటు సభ్యుని స్నేహాన్ని పొందటం – అదీ సంవత్సరానికి ఆరువేల పౌండ్లు భరణంగా పొందగల అర్హతగల కాబోయే జమీందారీ వారసుడు!

గ్రేస్టోక్ ఎస్టేట్‌లో హారియట్ చాలా హుందాగా వ్యవహరించింది. యువరాణి – షెల్లీ, హారియెట్‌ల అసాధారణ వివాహ కథ తెలుసుకుని, హారియెట్ అందానికి, మంచినడవడికకు ముగ్ధురాలయిపోయింది. చివరకు ఎలీజా కూడా చాలా మర్యాద పొందగలిగింది.

ఈ గ్రేస్టోక్ సందర్శన చాలా విజయాలను తెచ్చిపెట్టింది. మొదటగా, హారియెట్ తండ్రి మిస్టర్ వెస్ట్‌బ్రూక్ – తన కుమార్తె, యువరాజుగారికి అతిథిగా వుందని – అదీ ఎలీజాతో సహా – షెల్లీ జేబులో షిల్లింగ్ కూడా లేకుండా! తన కూతురు, అల్లుడు పేదరికంలో వుండకూడదని సంవత్సరానికి రెండు వందల పౌండ్లు కేటాయించారు!

అలాగే తిమోతి షెల్లీ తక్కువ చేయలేదు – ఆయన పూర్వపు భరణాన్ని పునరుద్ధరించారు. ఆ విధంగా – వారి పేదరికపు ప్రమాదం తప్పింది అప్పటికి.

ఇవన్నీ పొందటానికి షెల్లీ ఏమీ త్యాగాలు చేయలేదు– తన ఆలోచనలనూ – అభ్యుదయ భావాలను మార్చుకోలేదు. "ఇటువంటి ప్రదానాలకోసం నా రాజకీయ – మతపరమైన నమ్మకాలను మార్చుకోనని మీకు తెలియచెప్పాలి – అటువంటి బేరసారాలు కూడా మన మధ్య మర్యాద కాదు" అని తిమోతిగారికి రాస్తాడు.

"నీకు ఖర్చులకు ఇస్తున్నానంటే – అది కేవలం నీవు ఇతరుల దగ్గర చేయి చాచకుండా వుండేందుకే" అని సమాధానం – తండ్రీ కొడుకులకు మేధోపరంగా అంత వ్యత్యాసముంది. షెల్లీ ఆలోచనలను ఆయన ఎప్పటికీ చేరుకోలేరు!

* * *

గ్రేస్టోక్‌లో, కవి సౌతే స్నేహితుడైన విలియమ్ కల్వర్ట్‌తో షెల్లీకి పరిచయమైంది. ఆయనే కవిగారిని పరిచయం చేస్తానని తీసుకువెళ్తారు. ఆ విధంగా ఒక 'గొప్ప కవి'ని రక్తమాంసాలతో షెల్లీ కలుసుకోవటానికి సిద్ధపడతాడు – తను అంతగా గౌరవించే కవిగారిని తీరా కలుసుకున్న తర్వాత – చాలా ఆశ్చర్యపోవలసి వచ్చింది – ఎందుకంటే కవులంటే ఇప్పటివరకూ గంధర్వుల మాదిరిగా వూహించుకున్నాడు – చివరికి షెల్లీ చూసింది : చక్కగా సామాను సర్ది, నులివెచ్చగా వున్న ఇంటిలో – కవిగారి భార్య – శ్రీమతి సౌతే – ఒక సాధారణ గృహిణిలాగా, గుడ్డపీలికలు కుట్టుకుంటూ – మిగిలిన చీలికలతో ఆయన పుస్తకాలు 'బైండ్' చేస్తూ కనిపించింది. ఆమె తెలివితేటలన్నీ దుస్తులు తయారు చేయటంలోను – డబ్బులు లెక్కలు వేయడంతోనే కనబరుస్తోంది. ఈ విధంగా షెల్లీకి చాలా నిరుత్సాహం కలిగింది.

ఇక కవిగారు – ఆయనకు ఈ విషయాలు ఏమీ పట్టనట్లు – పట్టించుకోనట్లు కనపడ్డారు. ఆయన గౌరవనీయుడే, కాని తార్కిక శక్తి సామర్థ్యాలు ఏమీ వున్నట్లు లేవు.

"నేను అంగీకరిస్తాను – ఈ సాంఘిక పరిస్థితులు తప్పకమారాలి– కాని – ఒక్క విషయం మర్చి పోకూడదు – మార్పు చాలా నెమ్మదిగా సంభవిస్తుంది. ఇంకా ముఖ్యం అది చూడటానికి నీవూ – నేనూ జీవించి వుండము" అని సూత్రీకరించాడు.

పార్లమెంటరీ విధానాల్ని మార్చడానికి వ్యతిరేకి. కాథలిక్ మత నిర్మూలన కూడా – అన్నింట్లోకి తనను తాను క్రిస్టియన్‌గా ప్రకటించుకున్నాడు.

హతాశుడై – షెల్లీ అక్కడ నుంచి నిష్క్రమించాడు!!

సౌతే – చాలా గొప్పవాడు – షెల్లీలాంటి యువమేధావిని అంచనా వేయలేక పోయాడు – తాను అతన్ని ఎంత నిరాశ పరిచాడో కూడా ఊహించలేదు.

"చాలా ప్రత్యేకమైన యువకుడు" అనుకున్నాడు.

"అతని విచారమంతా – తనకు సంక్రమించబోయే ఆస్తిపాస్తుల గురించి – పైగా పార్లమెంటు సభ్యునిగా సంవత్సరానికి ఆరువేల పౌండ్ల వేతనం కూడా అతన్ని ఇబ్బంది పెడుతోంది – నేను కూడా అతని వయసులో ఇలాగే డబ్బులేక బాధలుపడి లేమి భావనలో ఉన్నాను కదా! ఇతన్ని చూస్తే – నాకు 1794 నాటి నా చిన్నప్పటి నేను గుర్తుకువస్తున్నాను. తనకు తాను నాస్తికునిగా ఊహించుకుంటున్నాడు. కాని నిజానికి అతను అద్వైతి.

అది ఒక బాలకావస్థ – మేమందరం అనుభవించిందే – దాటి వచ్చిందే!

నిజంగా అతను అదృష్టవంతుడు – ముందుగా నన్ను కలిశాడు! నా కంటే అతన్ని బాగుచేయగల వైద్యులెవరుంటారు? అందుకే – 'బర్కిలీ'ని ఇచ్చాడు. ఒక వారం రోజుల్లో అతను 'బర్కిలీయన్'గా మారిపోతాడు–

నన్ను కలుసుకోవటం అతన్ని ఎంతో ఆశ్చర్యపర్చింది. నాలాగా అర్థం చేసుకుని – అతనికి న్యాయం చేయగల వ్యక్తి తారస పడటం అదృష్టమేగా – ఇది అతను ఎంత వరకు అర్థం చేసుకున్నా – తప్పని సరిగా అతనికి రాబోయే ఆరువేల పౌండ్ల వేతనాన్ని సక్రమంగా – సద్వినియోగం చేస్తాడని ఆశిస్తాను", ఇవీ ఆయన ఆలోచనలు.

ఆ విధంగా – యువ–మధ్యవయస్కుల కలయిక జీవిత పథంలో జరిగింది. మొదటి వారు – రెండవ వారిని గౌరవంతోనే చూశారు. కాని నిరాశ ఎదురైంది. కాని మధ్యవయస్కుడు, యువకుణ్ణి చాలా దయతో –అనుమానంగా చూసి తప్పనిసరిగా అతని ఆలోచనలను మార్చగల శక్తి తనకువున్నదని నమ్ముతారు.

ఇక్కడే మధ్యవయస్కుడు – ఒక్క విషయం మర్చిపోయాడు. యువకుల ఆలోచనలు – మరో తరానికి చెందుతాయని, అవి అంత తేలికగా మార్చటానికి వీలుకాదని – (Leibniz nomads.) లాగా !

సౌతే దంపతులు – ఈ యువ జంటకు ఎన్నో విధాల సహాయ సహకారాలను అందించారు. కవిగారు వారుంటున్న చెస్ట్‌నట్ కాటేజి అద్దె తగ్గించమని యజమానికి చెప్పి ఒప్పించారు. కవిగారి భార్య హారియెట్‌కి, ఇంటి వ్యవహారాలెన్నో నేర్పింది. వంట చేయడంలో కూడా మెలకువలు చెప్పింది. బట్టలుతకటం కూడా బాగా అలవాటు చేసింది. ప్రక్కదుప్పట్లు – బల్ల మీద వేస్తున్న లేసు గుడ్డలు కూడా ఇచ్చింది. ఇది అంత సామాన్యమైన విషయం కాదు.

కాని ఇవేమీ షెల్లీ ఆలోచనా విధానాన్ని మార్చలేకపోయాయి. షెల్లీ ఆ సమయంలోనే – సౌతే కవి రాసిన ఒక వ్యాసం చదవటం తటస్థించింది – దానిలో ఆయన (సౌతేకవి) – 3వ జార్జి రాజు గురించి గొప్పగా "సింహాసనాన్ని అలంకరించిన 'అసమాన్య రాజు'గా" అభివర్ణించాడు.

ఇంతకంటే నేలబారుతనం ఇంకేముంటుంది? కేవలం 'ఆస్థానకవిగా' ఎదగటానికే ఇదంతా అని షెల్లీ నమ్మాడు – ఇలాంటి 'లేకి తనాన్ని' షెల్లీ ఎప్పటికీ మన్నించలేడు. "ఇవాళ్టి నుంచి ఏదో జీత భత్యాల కోసం ప్రాకులాడే బానిస లాగానే మిమ్మల్ని చూడగలను – ఇక ముందెప్పుడు మిమ్మల్ని చూడను" అని రాశాడు!!

సరిగ్గా ఈ సమయంలో – షెల్లీకి, 'గాడ్విన్' ఉన్నట్లు – అదీ లండన్‌లో ఒక చిరునామాలో 'బ్రతికి' వున్నట్లు తెలియవచ్చింది. 'రాజకీయ ధర్మం' రచయిత – వివాహ వ్యవస్థ 'నాశనం' చేసినవాడు, దైవత్వానికి శత్రువు – నాస్తికవాది, ఉదారవాది – తిరుగుబాటు దారు అయిన గాడ్విన్ బ్రతికే వుండటం – అదీ లండన్‌లో, ఒక చిరునామాలో జీవిస్తుండటం అంటే – ఒక అమూల్యమైన 'విలువ'కు – విలువల గురించి ఉత్తరం పంపగలమన్న మాట! ఎంత గొప్ప విషయం!

"మీరు ఆశ్చర్యపోవచ్చు" అంటూ మొదలుపెట్టి "నాలాంటి అపరిచితుని దగ్గర్నుంచి ఈ ఉత్తరం రావటం – దీనికి, ఎవరి పరిచయవాక్యాలు అవసరం ఉండదు – సామాన్యుని స్వేచ్ఛకు ! కాని ఈ స్వాతంత్ర్యానికి సంప్రదాయం మూలమైతే – తార్కికంగా నిందించలేము కదా!

నిజానికి ఈ వర్ణరంజితమైన మర్యాదలు – మనిషి నుంచి – మనిషిని విడదీయ కూడదు కదా!

'గాడ్విన్' అనే పేరు నన్నెంతగానో ఉత్సాహపరిచింది. గౌరవంతో – ఆశ్చర్యంతో – చీకట్లు కమ్మిన సమాజంలో ఆయన్ని ఒక మెరుపులాగా ఊహించుకున్నాను. 'మీరున్నారని' తెలుసుకోవటంలో నాలో చెలరేగిన భావోద్వేగాన్ని అర్థం చేసుకోవటానికి ఆశ్చర్యపోవనసరం లేదు. మీరిప్పటికే 'కీర్తి శేషులైన' వారి జాబితాలో చేరిపోయారని అనుకున్నాను. అది నిజం కాదు – మీరున్నారు – ఈ మానవజాతిని ఉద్ధరించే కార్యక్రమంలోనే ఇంకా ఉన్నారనే గాఢంగా విశ్వసిస్తున్నాను.

నేనిప్పుడే, ఈలాంటి పనిలోనే ప్రవేశించాను. నా ఆలోచనలు – వాదనలు మీతోనే ఏకీభవిస్తాయి. నేను సాధించింది తక్కువైనా – చెప్పుకో దగిందే –

ఇప్పటివరకు నాకు జరిగిన అన్యాయాలే – నా సిద్ధాంతాలన్ని సత్య దూరం కాదనే సత్యాన్ని తెలియజేస్తున్నాయి–" అంటూ ఉత్తరం ముగించాడు.

ఈ ఉత్తరం, గాడ్విన్‌ను ఎంతగానో ఆనందపరిచింది. 'రాజకీయ ధర్మం' ప్రచురించ బడినపుడు ఎంతగానో సంచలనం రేపింది. తర్వాత కాలంలో ఆయన్ను గురించి పట్టించుకున్న వాళ్లు తగ్గిపోయారు. ఆయన కూడా – ఈ ఉత్తరం రాసిన శిష్య పరమాణువులాగానే కొంత అర్థవంతమైన జీవితాన్ని గడిపినా – గతంలోకి వెళితే – ఒక మతబోధకునిగా జీవితం మొదలు పెట్టి, ముప్పయి ఏళ్లకు నాస్తికునిగా మారి, ఉదారవాదిగా – 1793లో 'రాజకీయ ధర్మాన్ని' ప్రచురించి ప్రఖ్యాతిగాంచాడు. అప్పటి ప్రధాని – పిట్‌గారు గాడ్విన్‌ను శిక్షించాలని అనుకున్నా – ఆ గ్రంథం చాలా ఖరీదుకు అమ్మటంతో – ఆరు గినీలు – అది ఎక్కువమందికి చేరి ప్రమాదకారి కాబోదని వదిలివేశారు.

ఆ తర్వాత నాలుగేళ్ళకు గాడ్విన్ – అప్పటివరకు తనతో వుంటున్న మేరీ వుల్ స్టోన్ క్రాఫ్ట్ అనే ప్రతిభగల రచయిత్రిని వివాహమాడాడు! పాపం – ఆమె తన మొదటి కాన్పులోనే ఆడపిల్లను కని కన్ను మూసింది.

ఈ వివాహ వ్యవస్థకు పెద్ద శత్రువు – మొదటి భార్య పోయిన వెంటనే మరో పెళ్లి చేసుకున్నాడు. – శ్రీమతి క్లెయిర్ మాంట్ – అప్పటికి విధవరాలు – ప్రక్కింటి పై వరండాలో నుంచి ఈయనకి వల విసిరింది!

వీరిద్దరి కాపురం కష్టాల దారే అయింది. ఇంటిలో అయిదుగురు పిల్లలున్నారు. అన్నీ చిక్కుముడులే!

మేరీకి ఒక కూతురు. మేధావి కూతురూ మేధావే. ఆమె పేరు మేరీ. శ్రీమతి క్లెయిర్ మాంట్‌కి అప్పటికే ఇద్దరాడపిల్లలు జేన్ – కార్లెస్. గాడ్విన్‌కి – రెండో భార్యతో ఒక కొడుకు!

చివరిగా అందరికంటే పెద్దావిడ – ఈ ఇంటిలో ఎవ్వరికీ చెందని – మేరీ వుల్‌స్టోన్ క్రాఫ్ట్‌కీ – ఆమె అమెరికన్ ప్రియుడు కాప్టెన్ గిల్‌బర్ట్ ఇమ్లేకి పుట్టిన కూతురు. ఆమె పేరు ఫానీ ఇమ్లే!

ఇదీ వీరి సంసారం !

గాడ్విన్ రెండో భార్య నోరు గల గయ్యాళి – మేరీని, ఫానీని చాలా నీచంగా చూసేది. తన పిల్లల పోషణకోసం – గాడ్విన్ నెలకొల్పిన బాలల గ్రంథాలయాన్ని ప్రస్తుతం ఈమె నడిపి ఇల్లు గడుపుతోంది...

ఎన్నో ఆదర్శాలు గల ఈ తత్త్వవేత్త మనుగడే అనుమానంగా మారిన సమయంలో – ఈ ఆశలు రేపిన ఉత్తరం చేతికందింది. ఆయన ఆత్మ గౌరవం – ఆయనకు అన్నం పెట్టలేకపోతున్నపుడు – కెస్విక్ నుంచి వచ్చిన ఈ శిష్యుని సందేశం ఊపిరిపోసింది.

బాల సాహిత్యాన్ని ప్రచురించి – బాధలపాలయిన మేధావికి – ఈ శిష్యునితో అదీ తనని 'మెరుపు'గా భావిస్తున్న వ్యక్తి పరిచయం తక్షణ అవసరమనిపించింది.

వెంటనే షెల్లీకి జవాబు పంపాడు – తన గురించి మరిన్ని వివరాలు కోరుతూ –

షెల్లీ తన స్వీయచరిత్రనే రాసి పంపాడు! వెంటనే ! తిమోతి గారి గురించి – ఆక్స్‌ఫర్డు డీన్ గురించి – తనకు రాబోయే ఆరువేల పౌండ్ల భరణం గురించి – హారియెట్‌తో వివాహం గురించి అన్ని వివరాలు పూసగుచ్చి పంపాడు! తను రాసిన రెండు నవలల గురించి ఆక్స్‌ఫర్డు కరపత్రం గురించి కూడా – వీటి ప్రతులను కూడా తాను ఎంతగానో గౌరవించే తన తాత్త్విక గురువుకు పంపాడు.

ఈ అద్భుతమైన 'స్వీయచరిత్ర' వివరాలను గాడ్విన్ ఇంటిల్లిపాదీ ఎంతో ఉత్సాహంతో – ఆశ్చర్యంతో చదివారు! కాని గాడ్విన్ గారిని ఏదో అనుమానం పీడిస్తోంది.

తాను ఇప్పుడు కుటుంబ యజమాని – అంటే తండ్రిగా తన అధికారాన్ని నిలబెట్టుకోవటం తన బాధ్యత – మునుపటికంటే కూడా.

బహుశా, తిమోతిషెల్లీగారు, కొడుకు మీద అనురాగంతోనే తన ఆంక్షలు – భరణం

నిర్ణయించి వుండవచ్చు. వయస్సులో చిన్నవాడు విమర్శించాల్సిన అవసరం లేదు.

విద్వాంసుడైనంత మాత్రాన – సహనశీలి కాకపోతే బోధకుడెలా అవుతాడు?

తను గురువుగా అంగీకరించిన గాడ్విన్ గాక, మరెవ్వరయినా ఈ విధంగా అని వుంటే, ఆయన్ను అసహనవాదిగా ముద్రవేసి బహిష్కరించేవాడే – కాని, ఎంత తిరుగుబాటుదారులైనా, యువతకు – వారసత్వం, అధికారం అవసరమనే అనిపిస్తుంది. అందుకనే – గురునామంతో దానికి తలవంచటానికీ వెనుకాడదు!

షెల్లీ వ్యక్తిత్వంలోని మార్మికత తాను ఆరాధించటానికి ఆరాటపడుతున్నట్లు వ్యక్తీకరిస్తుంది.

“అవును – నేను పాండిత్యం కోసం విద్యార్థిగా మారగలను!” “నా వినయం, నా ఆత్మ విశ్వాసం మొక్కవోనిది – సంపూర్ణమైనది కూడా! అయితే నా మీద పెత్తనం చలాయించని, శక్తి యుక్తులు ఆధిక్యతలను మాత్రమే సహిస్తాను!” అంటూ జవాబిచ్చాడు.

* * *

‘గాడ్విన్’ దొరికాడనే ఆనందంలో – షెల్లీ చాలా చాలా కార్యాచరణకు పథకాలు రచించాడు. ఇతరుల జీవితాలను పూర్తిగా ఉద్ధరించాలని – వారి విధి వ్రాతను తనతో బాటు తీసుకుపోవాలని– ఇదంతా చాలా చాలా సులువైన ‘ఆట’గా తోచింది.

అందుకు ఉదాహరణ హారియెట్, ఎలీజాలే కదా!

ఒక పెద్ద బంగళా అద్దెకు తీసుకుని – అదీ వేల్స్‌లో – అక్కడ కుమారి హిచనర్‌నీ, గాడ్విన్ (తన గౌరవనీయులైన గురువు) ఆయన మొత్తం కుటుంబ సభ్యులను తనతో పాటు జీవించమని ఆహ్వానించటానికి సిద్ధపడ్డాడు.

అయితే – గాడ్విన్ అపనమ్మకం – షెల్లీని ముందుకు సాగనీయలేదు. తన నిజాయితీని నిరూపించుకోవాలి కదా –

వయసులో చిన్న వాడయినా – దీనికి పథకం ఆలోచించాడు –

తను వేల్స్ ‘ధ్యానమందిరం’లో “శాశ్వతంగా” కుదురుకునే ముందు – ఐర్లాండ్‌లో, హారియెట్ – ఎలీజాతో పాటు, కనీసం మూడు మాసాలు – మతనిర్మూలన కార్యక్రమంలో పాల్గొని, ఆ దేశవాసుల నిద్రావస్థను వదిలించాలని పూనుకున్నాడు.

హారియెట్ సౌందర్యం – ఎలీజా ఎంతగానో దువ్వుకున్న కురులు – ఐరిష్ కాథలిక్‌లను ఏ విధంగా ఉద్ధరించగలవు ? దీనికి జవాబు ఎవ్వరూ ప్రయత్నించలేదు!


షెల్లీ మాత్రం, ఒక ఉపన్యాస పాఠం తనతోపాటు ఆ దేశవాసులకు వినిపించటానికి తీసుకువెళ్లాడు.

అందులో – తన తాత్త్వికతనూ, ఉత్తమ సలహాలను, మానవాళిపై ప్రేమను నింపి తయారు చేసాడు – అది వింటేనే ఏ హృదయమైనా కరిగి నీరయిపోతుందనీ ఆశించాడు.

కళ్లనిండా ఆశలు నింపుకుని – మన Knight Errant కత్తి వదిలి – కరపత్రాలతో పడవ నెక్కాడు, గ్రీన్ ద్వీపం చేరటానికి.

తనతోపాటు అందాల రాసి హారియెట్ –సలహాదారిణి ఎలీజా కూడా ప్రయాణమయ్యారు.

ఎలీజా, డబ్బు దస్కం – మిగతా చిల్లర పనులు చక్క బెట్టడానికి – తామిద్దరూ ఐర్లెండు పౌరులను మత మౌఢ్యం నుంచి ఉద్ధరించటానికి.



షెల్లీ ఫారెస్ట్ హోం

పన్నెండవ అధ్యాయం

సబ్బు నీటి బుడగలు...

అప్పుడెప్పుడో - 'The Knight of Rueful Countenance got stoned by the galley-slaves whom he wished to free' అని చదివాడు.

షెల్లీకి పిల్లికూతలూ, వెక్కిరింతలూ, ఆహ్వానం పలికాయి. అతని మొదటి సభలోనే - కేవలం మత ప్రాతిపదికపై ఉద్యోగసద్యోగాలు నిర్ణయించటం పొరపాటని చెప్పాడు.

మతం, మతమే - పేరేదయినా అన్నాడు !

సభికులు అతని బోధనలకంటే - ఎగతాళి కూతలనే ఎక్కువ ఆనందించారు.

అతను తీసుకు వచ్చిన ప్రసంగ పాఠం సారం కూడా - మత నిర్మూలనకు చివరి అడుగు అని - రాజకీయాలకు - మతం కాదు ముఖ్యం - నైతికత ఎంతో అవసరమని చెప్పాడు.

మీరు - బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం కోరే బదులు - మీరు మంచిగా, ఆలోచనాపరులుగా, వదాన్యులుగా రూపొందాలని బోధించాడు.

పాపం షెల్లీ, తన సందేశం సూటిగా వారి హృదయానికి తాకు తుందని ఆశించాడు. దీనికోసం ఏ త్యాగానికైనా సిద్ధమైనాడు.

హారియెట్ కూడా ఏమీ తక్కువ తినలేదు. పైగా సంస్కరణ ప్రసంగాలు ఎంతో ఆనందదాయకంగా వున్నాయి- చేతుల్లో జేబుల్లో కరపత్రాలు నింపుకుని ఆ యువ దంపతులు సాక్‌విల్లీ వీధిలో తిరుగుతూ - సానుభూతి పరుల చేతుల్లో ఈ హృదయాన్ని కరిగించే నివేదనా పత్రాలను పంచారు. వాళ్లున్న వసతి గృహం బైట వరండా నుంచి, వీధిలోకి అటుగా వెళ్తున్న అదృష్టవంతుల తలలపై ఈ సంస్కరణ పత్రాలు జల్లేవారు.

షెల్లీ ఎవరి టోపీలోనన్నా ఈ కాగితాన్ని తురాయిలా పెట్టినపుడు – హారియెట్ పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేది!

ఐర్లెండు ప్రజల మార్పిడి తథ్యమనే షెల్లీ నమ్మాడు. గాడ్విన్‌ని, కుమారి హిచ్‌నర్‌ను ఎప్పుడో ఆహ్వానించారు – ప్రతిరోజూ వస్తారనే ఎదురు చూశారు. వారిద్దరూ – షెల్లీ ఏ రోజైనా ఖైదు చేయబడతాడనే గాడ్విన్ నమ్మారు. అసలు రాజకీయ హత్య కూడా జరగవచ్చునని భయపడ్డారు.

కాని డబ్లిన్ రాజభవంతి – షెల్లీ 'నైతికత' గురించి చేసిన ప్రసంగాన్ని గమనించింది. పోలీసు షెల్లీ ప్రసంగ (కరపత్రపాఠాన్ని) పాఠాన్ని రాజప్రతినిధికి పంపారు. వీరు అది చదివి – ఏమిటి? 'సహనమూ, సహజీవనమూ' అని దీన్ని పెద్ద హాస్య ప్రహసనంగా పరిగణించారు.

ఇంతటి నిర్లక్ష్యం చాలా నిరుత్సాహకరంగా – ఇంకా ఐరిష్ ప్రజల ప్రతి స్పందన – అంతకంటే నిరాశా జనకంగా వుంది.

"పాపం మాంసం కొనలేక మద్యం తాగుతున్నారు" అని సానుభూతి చూపింది దయగల హారియెట్.

షెల్లీ ఎవరైనా దొంగనో, వీధి రౌడినో పట్టుకుని నీతిబోధ చేసి పోలీసుకు అప్పగించితే – వాళ్లు నవ్వుతూ, "తాగివున్నాడులే" అని వదిలి పెట్టేవారు – కాస్త సానుభూతితో! St Patrick's Night పండుగకు రాత్రి, పగలూ అందరూ తాగే వున్నారు.

రాజకోటలో పెద్ద విందే జరుగుతోంది – తిండికి లేని పేదలు – కోటలోకి వెళ్లే వంటకాల వెంట ఆత్రంగా పరుగులు పెట్టడం చూశారు. ఇంతటి అవమానం – పెర్సీని క్రుంగదీసింది – ఈ ముగ్గురు, ఇలాంటి దారుణాలు చూడలేక, ఇకముందు మాంసాహారం ముట్టకూడదని ప్రతిజ్ఞ చేశారు. ఆ విధంగా దారుణమైన జంతు హింసను – పక్షుల ప్రాణాలను రక్షించ బూనారు...

ఒకే ఒక్కసారి – అదీ శ్రీమతి నూజెంట్ భోజనానికి వచ్చినపుడు వాళ్లకు ఈ హింస తప్పలేదు – ఎందుకంటే – డబ్లిన్‌లో వీరికి తెలిసిన ఒకే ఒక ముఖం నూజెంట్. ఆమె దుస్తులు తయారీదారు. "మేము ఇంతగా 'ప్రేమిస్తున్నా', ఈ ఐరిష్ ప్రజలు మమ్మల్ని పట్టించుకోవటం లేదని" వీరి ఫిర్యాదు.

"నా నమ్మకం – పెర్సీ త్వరలోనే చాలా గొప్ప వానిగా గుర్తింప బడతాడు" హారియెట్ అంటుంది.

ఈ నమ్మకం షెల్లీకి అంతగా లేదు. ఏమాత్రం ఆధారం లేని భ్రమల సీమల్లో – ఈ ఐర్లెండ్, చక్కని గౌరవం గల యువతిలా కనిపించింది. తాను ఆమె కోసం – రక్షించటం కోసం యుద్ధం చేయటానికి – అవసరమైతే ప్రాణాలర్పించటానికి సిద్ధంగా వున్నాడు.

గుంపులు వారిని వెంటాడినాయి – బ్రిటీష్ సైనికులు అతనితో యుద్ధానికి దిగారు. – కాని తన ప్రసంగాలు – కరపత్రాలు వారిని పూర్తిగా మార్చి వేశాయి. తన తాత్త్విక –నైతిక సిద్ధాంతాలు జాతిని మొత్తం తమ దారికి తెచ్చాయి...

మెల మెల్లగా ఈ కల కరిగి పోసాగింది. చివరి ఆశాకిరణం ఐర్లెండ్ దేశపు ధూళి దూసరితమైన ఇళ్లకప్పుల మీద పొగ మంచులో కలిసి పోయింది – నిజమైన దేశపు నిర్మాణాలు – భవనాలు – కర్మాగారాలు – అడవులు, పొలాలు – అంతులేని ఆకారం లేని జన సందోహం అతని దృష్టిలోకి వచ్చింది.

అంతూపొంతులేని – చట్టాలు, సంప్రదాయాలూ – జూద గృహాలు, వేటగాళ్లు, రక్తసిక్తమైన మైదానాలు, న్యాయస్థానాలు– శిక్షా స్థలాలు – సైనిక పటాలాలు, రక్షక భట కేంద్రాలు, ఆహా ఐర్లెండ్ – ఎగతాళిగా, దుఃఖపర్యంతంగా వదురుతూ అసహనంగా – అందులోనే పండుగ జేసుకుంటూ –

ఈ అసత్యద్వీపం, Enigmatical Ireland, నిగూఢంగా నృత్యం చేస్తోంది.

దారుణమైన ఈ సత్యాన్ని దిక్కుతోచక చూస్తూ – షెల్లీ మాత్రం ఏం చేయగలడు? ఏమి ఆశించగలడు? – దిగులుతో కూలబడి పోయాడు –

గాడ్విన్ వదిలి పెట్ట కుండా – తన శిష్యుణ్ణి తిరిగి వచ్చేయమని రోజూ పోరాడాడు. ఈ ఆట ముగించమన్నాడు.

షెల్లీ తన శిష్యరికం తీసుకున్నప్పటి నుంచి – గాడ్విన్ గొంతులో పెద్దరికం నింపుకుని మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నన్ను నమ్ము షెల్లీ – నువ్వు రక్తపాతం సృష్టిస్తావు, చూస్తావు " అని భయపెట్టాడు.

"మానవ జాతి శ్రేయస్సు కోసం – శాంతియుతమైన – సంఘటిత శక్తి, కూటమి అవసరమని, కార్యాచరణ విధానాన్ని – ఒక్క ప్రక్క, ఎలీజా ఎర్రని గుడ్డ కుట్టు కుంటుంటే, హారియెట్ రొట్టెల పిండికి తేనె పూసి ఆహారం సిద్ధం చేస్తుంటే– రూపొందించటం గాడ్విన్ కనీసం ఊహించగలిగినా అంతగా భయపడేవాడుకాదేమో?

చివరికి గాడ్విన్ హెచ్చరించినా, షెల్లీ తన కార్యక్రమ విధుల నుంచి – అణగారిన వర్గాల వున్నతి కోసం – నిజానికి వారికి దాని అవసరంలేదు – విముక్తుడైనాడు.

ఏదో కొద్ది మంది మినహా – వీరు కూడా అతన్ని వాడుకోవటానికి – డబ్లిన్‌లో మరెవ్వరూ షెల్లీని పట్టించుకోనే లేదు.

నిజానికి ఐరిష్ దేశస్తునికి – ఇంగ్లాండు వాడంటే చాలా చులకన – అదీ ఐర్లెండును ప్రేమించే ఇంగ్లీషు వాడంటే మరీ – అదీ ఈటన్‌లో చదివి – ఆక్స్‌ఫర్డ్ నుంచి బైటకు వచ్చిన వ్యక్తి – ఈ ఐర్లండ్ గందరగోళాన్ని, ధూళిని భరించగలడా?

ఇక్కడి దురాగతాలను – పేదల దుఖాన్ని కళ్లారా చూసిన షెల్లీకి – ఇంగ్లీషు పల్లెటూరి అందాలు – ఆనంద వనాల ఆవశ్యకత గుర్తుకు వచ్చాయి.

"నేను ఓడిపోయాను" అతను గౌరవించే స్నేహితుడు గాడ్విన్‌కి రాస్తాడు "జీవితంలో మళ్లీ ఎప్పుడూ అజ్ఞానులకు బోధించటానికి ప్రయత్నించను.

ఇక నా ప్రయత్నమంతా –నేను సాధించ బోయేది – నేను మట్టిలో కలిసి పోయిన తర్వాతే మూర్తిమంతమవుతుంది."

హారియెట్ – మిగిలిన కరపత్రాలన్నీ కట్టలు కట్టింది. వాటన్నిటిని కుమారి హిచ్‌నర్‌కు పంపింది. ఆమె ఈ మండే కాగితాలు లేకపోయినా వెచ్చగా ఉండగలదు.

ఎలీజా తను కుడుతున్న ఎర్రటి గుడ్డను మడత పెట్టింది. ముగ్గురూ పడవలో ఇంగ్లాండు బయలుదేరారు.

* * *

ఇప్పటి తన ప్రణాళికలో రెండో భాగమయిన లేక్స్‌లో వసతి గృహం – అందులో తన ఆధ్యాత్మిక సభ్యులు – అందర్నీ చేర్చటం – దానితో 'అన్ని సమస్య' లూ పరిష్కారమై పోతాయి!

అంతకు ముందు – షెల్లీ పెళ్లికాక పూర్వం నివసించిన పరగణాలో, తమ అన్వేషణ ఫలించిందనే అనుకున్నారు. అక్కడి అడవి వాతావరణం, పల్లెటూరి పరిసరాలు సౌందర్యం – అతన్ని ఎంతగానో ఆకర్షించాయి.

ఆ వసతి దగ్గర్లో – ఒక సెలయేరు కొండ మీద నుంచి దూకుతోంది – ఆ ప్రవాహంలో గులక రాళ్ళన్నీ మెరుస్తూ నవ్వుతున్నాయి. చిన్న చిన్న నీటి గుంటల్లో కాగితం

పడవలు చేసి – ఒక అడుగు పొడవు పడవను తయారు చేసి – దానికి అయిదు పౌండ్ల నోటును తెరలాగా అమర్చి వదిలి చప్పట్లు కొట్టాడు – దగ్గర్లోని పిల్లి భయపడి అరిచింది.

కుమారి హిచ్‌నర్ వచ్చి – ఈ నూట ముప్పయి ఎకరాల ఎస్టేటును, తన తండ్రి హిచ్‌నర్‌తో పంటలు పండిస్తుందనీ ఆశించాడు!

కాని, ఈ వ్యవహారం ముందుకు సాగలేదు. బెడిసికొట్టింది. కక్‌ఫీల్డు సోది రాయుళ్లు – హిచ్‌నర్ గారికి చాలా కోపం తెప్పించే రీతిలో తన కూతురు కుమారి హిచ్‌నర్‌కీ – షెల్లీకి అక్రమ సంబంధం వుందని ప్రచారం చేసి అల్లరి చేశారు. దీనికీ కారణం వుంది. అంతకు ముందు – షెల్లీ ఆహ్వానాన్ని చాలా గౌరవనీయంగా భావించి కుమారి పంతులమ్మ ఊరూ, వాడా కూడా ప్రచారం చేసుకుంది మరి. అదిగో ఆ కారణంగా – ఫిల్‌ఫోర్డ్ గారి భార్య దీనికి చిలవలు పలవలు అల్లి – ఈ ప్రణాళికను – ఆచరణీయం కానీయలేదు.

అరె – ఈ ప్రపంచం ఎంత సంకుచితమైనది ? ఎంతటి రోగపూరితమైనది ! ఇది షెల్లీని చాలా నిర్ఘాంతపరిచింది.

తను – తన భార్యతో దూరంగా స్కాట్‌లాండ్‌లో ప్రేమ పెళ్లి చేసుకుని, కలిసి వుంటున్నపుడు – హారియెట్‌కి అన్యాయం ఎలా చేస్తాడని భావించారు. ఇంత నీచంగా ఆలోచిస్తారా అని ఆశ్చర్యపోయాడు.

దీని వలన పాపం కుమారి హిచ్‌నర్ ఎంత బాధ పడిపోయిందోననీ ఆలోచించాడు.

ఈ సందర్భంలోనే – హిచ్‌నర్‌గారికి కాస్త ఘాటుగానే రాశాడు. "అయ్యా – నా కోపాన్ని, ఆశ్చర్యాన్ని అణచుకోవటానికి కాస్త ఇబ్బంది గానే వుంది, మీ అమ్మాయికి, నేను పంపిన ఆహ్వానాన్ని తిరస్కరించారని తెలిసి! అరె ఇదేమి హక్కు ? మిమ్మల్ని ఆమెకు యజమానిగా ఎవరు నియమించారు? ప్రకృతి సిద్ధంగా – ఇంగ్లండు చట్టాలు సంతానాన్ని – వ్యక్తిగత ఆస్తిగా దఖలు పరచవు. శలవు. ఈ సారి మీ జవాబు వినేసరికి – మీ ఆలోచనలు సరళీ కృతమవుతాయని ఆశిస్తాను."

షెల్లీ దంపతులు వేల్స్ వదలి వెళ్లే ఆలోచనలో వున్నారని తెలిసి గాడ్విన్ – తన స్నేహితునికి చెందిన ఒక కుటీరాన్ని సూచించాడు. అది అద్దెకు లభిస్తుందనీ – ఒకసారి చూడమని.

హారియెట్, షెల్లీ ఆ కుటీరం చూడటానికి వెళ్లి చాలా నిరుత్సాహపడ్డారు. అది చాలా చిన్నది – ఏ వసతులూ లేవు. అసలు అసంపూర్తిగానూ వుంది. ఈ అనవసర ప్రయాస నుంచి తిరుగు ప్రయాణంలో వారికి ప్రకృతిలో ఒదిగిపోయిన చిన్న గ్రామం కనిపించింది.

ఆనందకరమైన వాతావరణంలో 'లిన్ మౌత్' కూర్చుని వుంది. అదృష్టవశాత్తు అక్కడ వున్న ముప్పయి కుటీరాల్లో ఒకటి అద్దెకు ఇవ్వటానికి వుంది – గులాబీ మొక్కలు పైకి సాగుతూ – పూలు పూస్తున్నాయి. పొన్న చెట్లు, కదంబాలు చుట్టూ వున్న ఆ కుగ్రామం వారికి ఒక అద్భుతంగా కనిపించింది. ఇక ఇక్కడే 'శాశ్వతం'గా ఉండి పోవటానికీ – మూడు వందల అడుగుల ఎత్తు నుంచి సముద్రతీరం చూస్తూ సాయంత్రాలు గడిపేయటానికి నిర్ణయించారు!

ఈ విషయం తెలిసి గాడ్విన్, కాస్తగట్టిగానే రాశాడు : "మీ ఆలోచనలు – అవసరాలు చాలా ఖరీదయినవిగా వున్నాయి. నిజానికి గాడ్విన్ శిష్యునికి చిన్న – సామాన్యమైన వసతి చాలు!"

ఇలాంటి వుత్తరం తిమోతి గారి నుంచి వచ్చివుంటే – షెల్లీ చాలా కోపంగా సమాధానాలు – గులక రాళ్లలాంటి ఉదాహరణలతో పంపేవాడు – కాని తండ్రి దగ్గర తీసుకున్న చనువు – 'బయట' వ్యక్తికి వర్తించదు కదా –

షెల్లీ దీనికి సమాధానం తనకు అనుకూలంగానే రాయాలనుకున్నాడు – మీరు సూచించిన వసతి చిన్నదే–కాని అది ఇద్దరు (అవివాహితులు) అదీ (ఆడా–మగా) ఒకే పడకటింటిలో ఎలా వుంటారు? మున్ముందు – సమాజం మారితే ఇది సంభవంకావచ్చు – కాని ఇప్పటి పరిస్థితులతో అది ఎంతవరకు గౌరవం? ఏదయినా ఈ భావాలు తిరుగుబాటుగా అనిపించవచ్చని, కాస్త జాగ్రత్తగానే అన్నాడు – గురువు దీనిని త్వరలోనే మరచిపోయాడు.

కొండమీద అందమైన పర్ణశాల, త్వరలోనే గొప్ప పరిణామాన్ని చూసింది. అది, కుమారి హిచ్‌నర్ రాక!

షెల్లీకి ఇది – తన మేధోపరమైన అవసరాన్ని పూడ్చగలిగిన పరిణామంగా ఆశించాడు. పైగా హారియెట్‌కు దీనితో పోయేదేమిలేదు. హిచ్‌నర్ ఆమెకు 'ఆత్మ బంధువు'గానే వుంటుంది – షెల్లీకి ఖాళీని పూరిస్తుంది. వీరిద్దరూ – ఈ కలయికను అంగీకరించగల మేధో పరిణతి వున్నవారే!

ఆ కుగ్రామంలోని వాసులు – ఆశ్చర్యంగా చూసేవారు. షెల్లీ, ముదురు, బక్కపలచని అపరిచిత వ్యక్తితో కొండలు కోనలు తిరుగుతుంటే – ఆమెతోనే తన ఆలోచనలు, ఆచరణ సాధ్యమైన కార్యక్రమాలను గురించి చర్చించేవాడు. (Virtue) 'విలువలు' ప్రచారం కష్టంగా మారిపోతోంది. ప్రచురణ కర్తకు శిక్ష పడింది (Pellory) 'గలీలియో' కి పట్టినగతి – షెల్లీని ఏమీ భయపెట్టలేదు. కాని లండన్ ప్రచురణ కర్తను గాలికి వదిలివేయలేడు కదా!

అతనికి కొన్ని మాంత్రికమైన ప్రణాళికలు తెలుసు – లార్డ్ కాజిల్‌లీగ్ పోలీసుల కళ్లు కప్పి – అతను రాసిన చక్కని మత నిరసన ప్రతాలను – పడవల్లా చేసి – మైనం రాసి తెరచాపలా మార్చి బరువు కోసం అడుగున సీసం పెట్టి సముద్రంలో వదలి పెట్టేవాడు. రాత్రి దీపపు గాలి బూరలు చేసి తన సందేశాన్ని ప్రపంచానికి ఆకాశం నుంచి వర్షించేవాడు. చిక్కని ఆకుపచ్చని సీసాల్లో కాగితాలు – అదే ఈ సమాజాన్ని మార్చే మంత్రాలు రాసినవి, చుట్టి – గట్టి బిరడాలు పెట్టి సముద్రపుటలపై వదిలేవాడు. మెరిసే ఎమరాల్డ్ తరంగాలు వాటిని ఇతర తీరాలకు మోసుకు పోవడం ఆనందంగా చూసేవాడు.

ఇంతగా కష్టపడి తన సందేశాన్ని చేరవేసిన తర్వాత – అతని కిష్టమైన మరో క్రీడ – సబ్బు నీళ్లతో బుడగలు చేసి ఊదేవాడు –

ఈ సబ్బునీటి బుడగలు – తన గుమ్మంలో కూర్చుని చిన్న బూరతో బుగ్గల్నిండా గాలి నింపి ప్రపంచంలోకి పంచరంగుల్లో వదిలేవాడు.

ఆ బుడగల ఉపరితలాలు – భూమిని – ఆకాశాన్ని వర్ణభరితంగా ప్రతిఫలించేవి. అవి గాలిలో తేలిపోతూ అలా అలా మాయమయిపోవడం చూస్తుండేవాడు...

కాసేపు బుడగలాట ఆపి – ఈ తార్కికమైన రాగరంజితమైన బుద్బుదాలను పద్యపాదాలతో బంధించాల్సిన అవసరాన్ని గుర్తించి –

వెలుతుర్లో మెరుస్తున్న – ఊదా, హరిత, బంగారు వర్ణాల సబ్బు నీటి బుడగల్ని అక్షరబద్ధం చేయుటం ప్రారంభించాడు.

* * *



సబ్బు నీటి బుడగల్లో ప్రపంచం!





సబ్బు నీటి బుడగలు



పదమూడవ అధ్యాయం

గురువు - స్నేహితుడు

లిన్‌మౌత్ గులాబీలు వెలిసి పోతున్నాయి. శిశిర పవనాలు తేలిక మబ్బుల్ని రాలుతున్న ఆకుల్లా, ఆకాశంలో చెదర గొడుతున్నాయి. మిస్ హిచ్‌నర్ జాతకం మారబోతోంది.

ఎప్పుడూ ఎదురుగా కనపడుతున్న ఈ పెళ్ళికాని పంతులమ్మ హారియెట్‌కు చిరాకుగా మారింది.

షెల్లీ కల కూడా కరగటం మొదలయ్యింది. మిస్ హిచ్‌నర్ నేలబారు తెలివి తేటలు త్వరలోనే తేట తెల్లమవటంతో అతను - తన కథానాయికను ఎంత తప్పుగా అంచనా వేశాడో తెలుసుకో గలిగాడు.

ఎంతో కష్టపడి - వెంటపడి ఆమెను తన పంతులమ్మ పదవి నుంచి తీసుకు రాగలిగాడు - ఇప్పుడు తిరిగి పంపటం మరింత కష్టమయిపోయింది! అలా అని ఈ శిశిర ఋతువులో - ఏకాంత సాయంత్రాలు ఆమెతో గడపటం నరకప్రాయంగా మారినాయి. అదే పట్టణ వాతావరణంలో ఎక్కువ మంది స్నేహితుల మధ్య ఈమెను భరించటం కొంత వరకు తేలికయ్యేదేమో!

అదే సమయంలో గాడ్విన్ - తన గౌరవనీయులైన స్నేహితుడు - లండన్ వచ్చేయమని తొందరపెడుతున్నాడు.

ఆ విధంగా ఈ 'శాశ్వత'గృహాన్ని వదిలి కొంతకాలం లండన్ వెళ్లటానికి నిర్ణయించుకున్నారు.

* * *

ఎంతో ఉత్సాహంగా అక్టోబరు 1812 నెలలో ఒకరోజు సెయింట్ జేమ్స్ వీధిలోని తమ హోటల్ గది నుంచి గాడ్విన్ గారిని మొదటిసారిగా కలవటానికి బయలుదేరారు.

గులాబీలాంటి హారియెట్ స్వచ్ఛంగా చిన్నగా - ఎత్తైన తన భర్త పక్కన నడుస్తూ - తమకెలాంటి స్వాగతం లభిస్తుందోనని ఆశ్చర్యపోతున్నారు. ఇంతకు పూర్వం కుమారి హిచ్‌నర్ వారిని దర్శించటానికి వెళ్లినపుడు చాలా నిరుత్సాహపడవల్సి వచ్చింది.

అంతే మరి గాడ్విన్ సూక్ష్మదృష్టి అలాంటిది !

బాలల గ్రంథాలయం మొదటి అంతస్తులోని హాలులో గాడ్విన్ కుటుంబం అంతా చేరి వుండటం గమనించారు, షెల్లీ దంపతులను చూడాలనే ఉత్సాహంతో!

అప్పుడే మన తత్త్వవేత్త - పొట్టిగా, లావుగా, బట్టతలతో, మేధావిలాగా, మతాధికారిలాగా, తిరుగుబాటు సిద్ధాంత కర్తలందరిలాగే కనిపించాడు.

ఆయన రెండో భార్య నల్లని సిల్కు దుస్తుల్లో - ఆకు పచ్చ కళ్లజోడుతో - ఈ సంస్థానాధీశుని మనుమణ్ణి, అతని భార్యను అంచనా వేయటానికన్నట్లు - వాళ్ళతో సఖ్యంగానే ఉంది. ఫానీ ఇల్లే కూడా వుంది, సుకుమారంగా - ఆలోచనామగ్నమై జీన్ క్లేర్మాంట్ - పుష్టిగా ఆరోగ్యంగా అందంగా - ఇటాలియన్‌లా మెరిసిపోతోంది.

"నా కూతురు మేరీ ఇప్పుడు స్కాట్‌లాండ్‌లో వుంది - అందుకే రాలేకపోయింది" గాడ్విన్ చెప్పారు. "ఆమె అచ్చం తల్లిలాగే ఉంటుంది. మీ కిప్పుడే మేరీ తల్లి వర్ణ చిత్రాన్ని చూపిస్తాను" అని వారిద్దర్నీ తన చదువుకొనే గదికి తీసుకు వెళ్లారు.

షెల్లీ ఎంతగానో ఆతృతతో మేరి వుల్‌స్టోన్‌క్రాఫ్ట్ బొమ్మ చూసి మంత్ర ముగ్ధుడై పోయాడు.



న్యూటన్ ఇల్లు - యాపిల్ చెట్టు

అందరూ కూర్చుని కబుర్ల లో పడిపోయారు.

గాడ్విన్ - షెల్లీ : పదార్థానికి ఆత్మకి సంబంధం, ఇప్పటి మత సంస్థల పరిస్థితులు - జర్మన్ సాహిత్యం గురించి చర్చలు సాగించారు.

ఆడవారంతా సంభాషణలను మౌనంగానే వింటున్నారు.

హారియెట్ - గాడ్విన్ అచ్చంగా సోక్రటీస్‌లా వున్నాడని అనుకుంది. పెద్ద నుదురుతో; ప్రక్కన షెల్లీ ఒక గ్రీకు వీరునిలా అందంగా, గౌరవపూర్వకంగా అణచుకుంటున్న అసహనంతో కనిపించాడు.



ఇజాక్ న్యూటన్

త్వరలోనే గాడ్విన్ కుటుంబంతో షెల్లీ దంపతులు చాలా దగ్గరయ్యారు. గాడ్విన్ తరచూ షెల్లీ వుంటున్న హోటల్‌కు వచ్చేవారు. ఇద్దరూ కలిసి నడక సాగించేవారు.

ఒక్కోసారి శ్రీమతి గాడ్విన్ వీరిద్దర్నీ విందుకి ఆహ్వానించేది. ఒక్కోసారి ఎలీజాను - హిచ్‌నర్ని కూడా రమ్మనేది, కాస్త అయిష్టంగానే.

ఎప్పుడన్నా హారియెట్ కూడా విందు ఏర్పాటు చేసేది!

నవంబరు, 5వ తేదిని - గై ఫాక్స్ రోజు - షెల్లీ దంపతులు గాడ్విన్ కుటుంబంతో విందారగించారు. విందు తర్వాత తొమ్మిదేళ్ల విలియమ్ గాడ్విన్, 'నేను టపాకాయలు - కాకరపూవొత్తులు వెలిగించటానికి వెళ్తున్నాను - నా స్నేహితుడు 'న్యూటన్'తో అన్నాడు. సరిగ్గా ఇదే సమయంలో షెల్లీ - తన అత్యంత గౌరవనీయుడైన స్నేహితుడు గాడ్విన్‌తో ఏదో అత్యంత ముఖ్యమైన సిద్ధాంతాన్ని, చర్చిస్తున్నాడు! కాని ఈ 'టపాకాయలు' అనే మాట విని అతనిలోని 'ఫీల్డుప్లేస్' రోజుల నాటి 'పరుసవేది' ఒక్కసారిగా మేల్కొని - ఒక్క క్షణం తటపటాయించాడు - టపాకాయల మోత - సంభాషణల మధ్య - (కాథరిన్ వేల్స్ రంగురంగుల మంటలతో లండన్ వీధులను వెలిగించటంలా) రాకెట్లు పంపడంలోని ఆనందం... ఆహా!

'నేనూ వస్తాను నీతో' అని ఆ తొమ్మిదేళ్ల విలియమ్‌తో వెళ్లాడు.

ఈ దీపావళి వెలుగులు అయిపోగానే – బాలకుడైన న్యూటన్ ఈ యువ షెల్లీని చూసి ఆశ్చర్యపోయాడు – తమతో పాటు ఆడుతూ కథలు చెప్తున్న షెల్లీని తన యింటికి తీసుకు వెళ్ళి తల్లిదండ్రులకు పరిచయం చేశాడు!

షెల్లీ సంతోషంగా వెళ్లాడు – న్యూటన్ కుటుంబం చాలా ఆరాధనీయుల్లా కనిపించారు. హాయిగా, సంస్కారయుతంగా, సామరస్యంగా మాట్లాడుకుంటూ గడిపారు!

మిస్టర్ న్యూటన్ – షెల్లీని ఎంతగానో ఆకర్షించాడు. అప్పటికే ఎన్నో సూత్రాలను షెల్లీకి ఏకరవు పెట్టాడు –

భూమధ్య రేఖ నుంచి ఉత్తరంగా ఆదిమానవుడు ప్రయాణం చేసి ఈ చలి దేశాలలో కుదురుకున్నపుడు – అసహజమైన అలవాట్లకు లోనయ్యాడు. అప్పటి నుంచి అతని కష్టాలు మొదలయ్యాయి. అట్లాంటి అలవాట్లలో దుస్తులు ధరించటం.

నిజానికి 'న్యూటన్' పిల్లలంతా దిసమొలతోనే పరుగులు పెడుతున్నారు.

మరో దురలవాటు – మాంసాహారం. న్యూటన్ కుటుంబం అంతా శాఖాహారులే! షెల్లీ ఎంతగానో ఉత్సాహపడ్డాడు.

"నిజానికి మనిషికి – మాంసం తినే జంతువుకి సంబంధమే లేదు. ఇతనికి తన వేటను పట్టుకునే కోర పళ్లుగాని, వాడి గోళ్లుగాని లేవు. అతని పలువరస విధానం చూస్తే తప్పక శాఖాహారిగానే బ్రతకాలి. మాంసం తినటంలోనే ఇతనికి జబ్బులు మొదలయినాయి. అది అతనికి విషం.

ఇక్కడే మీరు ప్రొమిథియస్ కథ అర్థం చేసుకోవాలి – ప్రొమిథియస్ అంటే మానవుడు – నిప్పు కనిపెట్టి – వండటం మొదలు పెట్టాడు – అప్పుడే ఒక రాబందు అతని కాలేయాన్ని తినటం చూస్తాం. ఆ రాబందే – హెపటైటిస్ – కామెర్లు ! ఇదీ సత్యం"!

న్యూటన్ కుటుంబం – శాఖాహారులయిన తరువాత ఇంత వరకు వైద్యుని అవసరం లేదు. మందులతోనూ పనిలేదు. వారి పిల్లలు ఎంతో ఆరోగ్యంగా వున్నారు.

షెల్లీ వారిని చూసి – శిల్పులు చెక్కిన బొమ్మల్లా వున్నారని అనుకున్నాడు!

అక్కడ నుంచి – తరచూ న్యూటన్‌ని కలుస్తుండే వాడు. అతని గొంతు వినపడగానే – న్యూటన్ సంతానం అంతా అతని చుట్టూ మూగేవారు. అందర్నీ నర్సరీకి తీసుకు వెళ్లాడు.

తరువాత శ్రీమతి న్యూటన్ – ఆమె చెల్లెలు మేడమ్ బోయిన్ విల్లీ – అతనంటే పడి చచ్చిపొయ్యేవారు, పిల్లల్లాగానే!

ఇక గాడ్విన్ ఇంట్లో : ఫానీ, జేనీ అతని మాటలు వింటూ సాయంత్రాలు గడిపేస్తారు – ఆనందంగా. అతని అందం వాళ్లను మైమరపించేది! అతని వాదనలు ఎదురులేనివిగా తోచేవి!

రిపబ్లికన్ కుటుంబంలో వాడయినా– ఈ యువ జమీందారు – గొప్ప సంపదకు వారసుడు – అయినా డబ్బును లెఖ్ఖచేయని వాడు. రమణీయమైన కాంతితో వెలిగిపోతున్నాడు!

ఇక షెల్లీ విషయానికొస్తే –

ఈ ఇద్దర్లో, ఫానీ నెమ్మది, కొద్దిగా మార్మికమైనది. కాని జేనీది ఉడుకురక్తం – ప్రచండమైన శక్తి గలది. షెల్లీ – తనకి మళ్లీ పూర్వపు ఆనందం – ఉత్సాహం నిండిన రోజుల్లో వున్నట్లు వుంది – తన నారాధించే అక్కచెల్లెళ్ళు తన చుట్టూ మూగుతున్నపుడు!

హారియెట్‌తో గాడ్విన్ సంతానానికి అంతగా సయోధ్య లేదు, ఆమెకో వ్యక్తిత్వం లేనట్లు – కేవలం షెల్లీ, మాటల్నే చర్విత చరణం చేస్తున్నట్లు – పైగా సరిగా వ్యాకరణం కూడా రానట్లు మాట్లాడుతోందని వారి భావన!

“అరె పాపం షెల్లీ – ఈ పిల్ల అతనికి తగిన పెళ్లాం కాదు !”

అనుకునేవారు – అతడు వెళ్లగానే!

దీని అర్థం! నిజానికి అలాంటి వాడు తమకు దక్కకుండా మరొకరి అధీనంలో వున్నాడే అని యౌవనం లోని అమ్మాయిలంతా అనుకునేదే –

వాళ్లు – హారియెట్ లేనపుడు – ఆమె మీద విరుచుకు పడేవారు – చాలా నర్మగర్భంగా – అయినా షెల్లీకి అర్థం అవుతాయని తెలిసే–

"హారియెట్ నన్ను భయానికి లోను చేస్తుంది. ఆమె అంత గొప్ప యువతి" ఫానీ, షెల్లీతో అనేది. "ఏమిటి హారియెట్ 'గొప్పదా' - కేవలం నువ్వే ఆమెను నిందిస్తున్నావు. నా దృష్టిలో ఇది సరైనది కాదు. నిజానికి ఆమె సహజమైన సరళమైన ప్రవర్తనే ఆమెకు పెట్టని ఆభరణాలు! మరే అలంకరణలు ఆమెకవసరం లేదు. పెట్టుడు అలంకారాలు సొగసులు అసహ్యకరంగా వుంటాయి. అలాంటి ఉదాహరణ, ఆమె నా ముందున్నంత కాలం - నీ వ్యాఖ్యలు నన్ను మార్చలేవు" షెల్లీ ఖండించేవాడు.

కాని తరువాత కాలంలో ఫానీ చెప్పిన విషయాలే అతనికి గుర్తుకు వచ్చాయి...!



ఒంటరి ప్రయాణం (మిస్ హిచ్‌నర్)

పధ్నాల్గవ అధ్యాయం

మిస్ హిచ్‌నర్

తన కుటుంబ సభ్యులతో పూర్తిగా సమాధానపడి, హాగ్, యార్క్‌లో వకీలు విద్యపూర్తి చేసుకుని, చివరికి లండన్‌కి చేరాడు.

తన వెచ్చని గదిలో ఒక సాయంత్రం హాయిగా చదువుకుంటుండగా ప్రక్కన టీ పొగలు కక్కుతుండగా - క్రింద బజారు తలుపు దబ దబా బాదటం వినపడింది.

తర్వాత తలుపు ఒక్కసారిగా తెరుచుకుని వెనుక గోడకు తగిలింది. భవనం దద్దరిల్లింది. హాగ్‌కు ఒక్కసారిగా షెల్లీ, మెరిసే కళ్లు - ముందుకు వంగిన ఆజానుబాహుడు గుర్తుకు వచ్చి - ఇంకా షెల్లీ నా స్నేహితుడైతే, ఇది అతనే -

ఆ మెట్లు ఎక్కే తీరు - అదే ఆక్స్‌ఫర్డ్ హాస్టల్‌లో మాదిరిగా గది తలుపు తోసుకుని, చొక్కా కాలరు తెరుచుకుని, కళ్లు మెరుస్తుండగా - ఆ మేధావి గంధర్వుడు ఈ భూమి మీదకు పొరపాటున ఊడిపడ్డాడేమో అనిపించాడు!

"నీ 'ప్రత్యేక ప్లీడరు' చాలా కష్టం మీద నీ చిరునామా ఇచ్చాడు. ఈ సంవత్సరం అంతా ఏమయి పోయావు?

నేను ఈ మధ్యనే ఐర్లెండు నుంచి తిరిగి వచ్చాను. ఆ దేశవాసులకు మానవత్వమంటే తెలియచెప్పి, మత ఛాందసాన్ని వదిలి పెట్టమని బోధించి వచ్చాను.

తర్వాత వేల్స్ - చాలా చక్కని ప్రాంతం వెళ్లాం. హారియెట్ ఆరోగ్యంగా వుంది - త్వరలో తల్లి కాబోతోంది! ఏయ్ - నువ్వు 'బర్క్లీ' చదివావా? ప్రస్తుతం 'హెల్విటియస్' చదువుతున్నాను. చాలా తెలివిగల రచయిత - కాని చప్పగా వుంటుంది."

ఇంకా మాట్లాడుతూనే వున్నాడు. హాగ్ తన స్నేహితుణ్ణి ఎంతో గౌరవంగా, అనురాగపూరితంగా ఒక చెంత నిందాపూర్వకంగాను చూశాడు!

షెల్లీ గాక ఇంకెవ్వరు 'హెల్విటయిస్' గురించి చర్చిస్తారు. తాము ఎటువంటి అసహ్యమైన వాతావరణంనుండి విడి పోయిన తర్వాత కూడా? అదీ సంవత్సరం తర్వాత??

కాని షెల్లీ పూర్తిగా నిమగ్నమైపోయి, చేతులు తిప్పుతూ – గది అంతా వేగంగా గబగబా తిరుగుతూ పుస్తకాలు తెరుస్తూ, ప్రశ్నలను సంధిస్తూ – సమాధానం కోసం ఎదురు చూడకుండా– మాట్లాడుతూనే వున్నాడు–

ఈ తీరు తన స్నేహితుణ్ణి ఇబ్బంది పెడుతుందనీ మరిచిపోయాడు.

ఆ విధంగా అర్ధరాత్రి దాటేవరకూ మాట్లాడుతూనే వున్నాడు గట్టిగా – హాగ్ పొరుగు గదుల వారు – తమకు నిద్రా భంగం అవుతోందని – హాగ్‌ను హెచ్చరించి వెళ్లారు.

హాగ్, షెల్లీని ఇంక వెళ్లమని – చాలా రాత్రి గడిచిందనీ అన్నాడు.

నీ ఇరుగు పొరుగు ఒట్టి దద్దమ్మలు – వారికి తెలియదు అసలు రాత్రిళ్లేకదా మన ఆత్మలు మేల్కొని స్వేచ్ఛగా తిరుగుతాయి!

"ట్రిమెడాక్' దగ్గర, 'వేల్స్' ప్రాంతానికి, 5000 ఎకరాలు సముద్ర తీరాన్ని ఉపయోగంలోకి తేవాలని ఒక సంస్థ నమోదు చేశాను. నేనే వంద పౌండ్లు ముందుగా జమ కట్టాను. దీనికోసమే నా జీవితమంతా, నా శక్తి, నా ధనాన్ని ఖర్చు పెట్టదల్చుకున్నాను." ఇంకా మాట్లాడుతూనే వున్నాడు.

హాగ్ అతన్ని మెల్లిగా బైటకు నడిపించి తలుపు వేయబోతుండగా "సరే వెళ్తాను – అయితే ఒక షరతు – నీవు రేపు రాత్రికి మాతోపాటు విందారగించాలి." హాగ్ సరే అన్న తర్వాత అతను బజారువైపు నడిచాడు.

వెళ్లేముందు, "హారియెట్ చాలా సంతోషిస్తుంది – కాని మిస్ హిచ్‌నర్‌ను– నీవు భరించాలి మరి" అన్నాడు. 'ఇంక రెండు రోజుల్లో వెళ్లి పోతుందిలే.'

'ఎవ్వరూ నీ ఆత్మ బంధువా?' హాగ్.

"ఆఁ బాబోయ్! అలాంటి అసహ్యకరమైన వానపామును! మేము 'ఎర్ర దెయ్యం' అంటాం! సరే రేపు కలుద్దాం" అంటూ విడిపోయారు.

* * *

మర్నాడు సాయంత్రం 6 గంటలకు - తన రాకను తెలియచేస్తూ చీటీ పంపాడు.

హారియెట్, అతన్ని ఎంతో సంతోషంగా ఆహ్వానించింది. ఆమె ఇంకా ఇంకా చిన్నదిగా, విరుస్తున్న పూవులా మెరిసి పోతోంది.

'అరె ఎలాంటి ఎడబాటు ! ఇక ఎప్పటికీ వుండదులే'... 'ఎప్పటికీ ఇక లండన్‌లోనే వుండి పోతాము' అంటోంది.

ఎలీజా అతన్ని అనుమానంగానే చూసింది. చల్లని చేతినందించి- నిశ్శబ్దంగా ఓ మూల కూర్చుండిపోయింది!

'నీవు చాలా ఆరోగ్యంగా కనపడుతున్నావు' హారియెట్‌తో అంటున్నాడు.

ఎలీజా 'పాపం! అసలే నరాల బలహీనతతో బాధపడుతోంది' - అంది.

'ఈ ఇంటి వాతావరణము ఏమీ మారలేదు!' అనుకున్నాడు! 'జాగ్రత్తగా మాట్లాడాలి సుమా!'

అంతలో షెల్లీ ఒక్క-సారిగా గదిలోకి దూసుకు వచ్చాడు - ఫిరంగి గుండులా!

తర్వాత వడ్డన కార్యక్రమంతో విందు పూర్తయింది.

భోజనం తర్వాత ఎలీజా, హారియెట్ చెవిలో గుసగుస లాడింది. హారియెట్, హాగ్‌కి గుడ్‌నైట్ చెప్పి వెళ్లిపోయింది. మళ్లీ ఆదివారం విందుకు రమ్మంది!

"ఆ రోజే మన 'ఎర్ర దెయ్యం' వెళ్లి పోతుంది. ఆమెతో మాట్లాడటం కష్టమే- కాని నీవు బాగా మాట్లాడగలవు - షెల్లీ చెప్పే వుంటాడు!" అని ఎలీజా వంక చూసింది.

హిచ్‌నర్ పేరు వినగానే ఎలీజా ముఖం చిట్లించుకుంది.

"ఆమెను భరించటం కష్టం! షెల్లీని ప్రేమలో దింపటానికి విశ్వప్రయత్నం చేసింది - అసలు నిజంగానే షెల్లీ ఆమెను ప్రేమిస్తున్నట్లు నటించింది! నేను కేవలం ఇల్లు సర్దటానికి పనికి వస్తానని ప్రచారం చేసింది.

ఆమెను వదిలించుకోవటానికి - పాపం పెర్సీ సంవత్సరానికి 100 పౌండ్లు ఇస్తున్నాడు!"

షెల్లీ ఇది నిజమేనని చెప్పాడు. ఇలా ఇవ్వటం తన రాబడిలో నుంచి నాల్గోవంతు – తెలివి తక్కువతనమే – కాని ఆమె ఉద్యోగం వదిలి వచ్చింది. తన గౌరవం పోగొట్టుకుందట!

ఆమె నిజంగా దారుణమైన జీవి! అనాకారి! పై మెరుగులతో శిఖండి – జంతు ప్రమాణంలోని ఆడది!

ఈ నాలుగు నెలలు ఎలా భరించానో – నిజంగా అలాంటిది స్వర్గంలో వుంటే – అంతకంటే నరకం మరేదీ వుండదు.

పైగా కవిత్వం రాస్తుంది.

స్త్రీల హక్కుల గురించి – ఒక దస్తావేజు రాసింది.

"అందరూ – అందరు మగవారే – ఇంక ఆడది ఒక్కతే మిగిలివుంది!"

అంటూ భయంకరంగా నవ్వటం మొదలు పెట్టాడు.

* * *

మర్నాడు హాగ్ వచ్చాడు – ఆ నాటి కథానాయికను చూడటానికే – చాలా విసుగ్గా కనిపించింది కాని – నమ్రతగానే వుంది.

చాలా భారీ విగ్రహం – బక్కగా, కాస్త కండలు తిరిగినట్లు – నల్లటి శరీరం. షెల్లీ, నేను బయటికి పోవాలి అని వెళ్లిపోయాడు. హెరియెట్ తలనొప్పి వంకతో గదిలోకి వెళ్లిపోయింది.

చివరికి హాగ్ ఈ ఇద్దరినీ బైటకు తీసుకు వెళ్లవలసి వచ్చింది.

అతని కుడి ప్రక్కన 'ఎర్ర దెయ్యం', ఎడం ప్రక్కన 'నల్ల రత్నం' (ఆ పేరు అతనే పెట్టాడు) ముగ్గురు సెయింట్ జేమ్సు తోటలోకి నడిచారు.

కార్నీలియా చెప్పినట్లు – వీళ్లే నా రత్నాలు, వజ్రాలు అనుకున్నాడు.

వాళ్లిద్దరూ – మధ్యలో తన ఉనికిని కూడా మరచిపోయి పోట్లాడటం మొదలు పెట్టారు. ఎలీజా చాలా గట్టిగా మెత్తగా వాతలు పెట్టింది. హిచ్‌నర్ – హాగ్‌తో మాట్లాడుతున్నట్లు నటిస్తూ స్త్రీల హక్కులు' వాదిస్తోంది.

చివరికి ఎలీజా నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఇంటికి చేరిన తర్వాత - హాగ్‌ని ప్రక్కకు పిలిచి "అలాంటి కీటకంతో అంత సేపు ఎలా మాట్లాడావు? ఎలా భరించావు? హారియెట్ నిన్ను క్షమిస్తుందా; తప్పని సరిగా కోపగించుకుంటుంది!" ఎలీజా! అంటోంది.


కాని హారియెట్ - ఏమిటి ఇంకా ఆమెతో అలసిపోలేదా? అని నవ్వింది.

మధ్యాహ్నం భోజనం తర్వాత హాగ్ కావాలనే - హిచ్‌నర్‌తో స్త్రీల హక్కుల' గురించి మాట్లాడటం మొదలు పెట్టాడు. అంతే 'ఎర్ర దెయ్యం' రెచ్చి పోయింది.


పాపం మన అక్క చెల్లెళ్లు - ఈ సంభాషణే అపరాధం క్రింద విచారం వెలిబుచ్చ లేక ఇబ్బంది పడ్డారు!

ఎలీజా 'నీకు తెలియదు - ఆమె ఎంత గబ్బు కొడుతుందో దగ్గర కెళ్తే తెలుస్తుంది.' అని హాగ్‌తో అంది రహస్యంగా!

అంతలో ఆమె సామాను బండిలో పెట్టారు. బండి కదలగానే - షెల్లీ ఇంటిలో ఆనందంతో ఆటలూ - పాటలూ వినిపించాయి.



ఎటు నీ ప్రయాణం?



హారియెట్ వెస్ట్ బ్రూక్

పదిహేనవ అధ్యాయం

హారియెట్

మిస్ హిచ్‌నర్ వెళ్లిపోయిన కొన్ని మాసాలు చాలా ఆనందంగా గడిచి పోయాయి.

నిజానికి వీరి చేతిలో చిల్లి గవ్వ కూడా లేకపోయినా అంతరంగంలో గొప్ప సంతృప్తితో వుండిపోయారు.

షెల్లీ దీర్ఘ కవిత 'క్వీన్ మాబ్' మొదలు పెట్టి – కేవలం అది రాయటంలోనే జీవితం ధన్యమవుతుందని – జీవిత ధ్యేయంగా, అందుకోసమే జీవిస్తున్నట్లుగా తలచాడు.

ఇక హారియెట్ తన ఒక అనుకూలమైన స్తబ్దతతో, తన శక్తినంతా తన సృష్టి కోసమే గడుపుతూ, అదే ఆనందంగా – మిగతా విషయాలపట్ల నిరాసక్తతతో వుండిపోతుంది.

ఈ సమయంలోనే కొంతకాలం వేల్స్‌లో – మరొకసారి ఐర్లెండ్ వెళ్లివచ్చారు కాని – రాజకీయాల జోలికి పోలేదు.

తన భర్తను సంతృప్తి పరచటానికి, హారియెట్ లాటిన్ అభ్యసించటం మొదలు పెట్టింది. తన సొంత ధోరణిలోనే నేర్పటం – అదీ వ్యాకరణం లేకుండా – వర్జిల్, హోరేస్ పుస్తకాల్లోకి దింపాడు!

ఆమె లాటిన్ నేర్చుకుని చదువుతుండగా – అతను తన దీర్ఘ కవితను సాగించాడు. చరిత్ర కూడా చదివాడు.

గాడ్విన్ – నీకు చారిత్రక స్పృహ లేక పోవటంతో నీ నిర్ణయాలు గురి తప్పుతున్నాయి – అనటంతో, చరిత్ర మీద అసహ్యమున్నా చదువు తున్నాడు.

సాయంత్రాలు హేరియెట్ ఐరిష్ పాటలు పాడేది. 'రాబిన్ అడైర్' లేదా 'కేట్ కియర్నీ' వార్తలు చదివేవారు. వార్తలన్నీ అభ్యుదయ రచయితల మీద ఫిర్యాదుల విచారణలతో నిండి వుండేవి.

తరచుగా ఈ అపరిచిత స్నేహితులకు తన మద్దతు తెలియజేస్తూ – వారి తరఫున అపరాధ రుసుము చెల్లించటానికి తయారయ్యేవాడు. ఎప్పుడూ చేతిలో పది పౌండ్లు వుండని షెల్లీ, వారికోసం ఎక్కువ వడ్డీకి సొమ్ము అప్పుచేసేవాడు.

ఇక ఇప్పుడు హేరియెట్ ప్రసవ సమయం ఆసన్నమైంది. షెల్లీ తన 21వ సంవత్సరంలో అడుగు పెడుతున్నాడు. ఇది చాలా ముఖ్యమైన పుట్టినరోజు – తన తండ్రితో సామరస్యం కుదిరే అవకాశాలున్నాయి. అందుకే లండన్ తిరిగి వచ్చాడు.

ఆల్బి మార్లే వీధిలో వున్న కుక్స్ హోటల్లో గదులు తీసుకున్నారు. ఎలీజా హేరియెట్‌ను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటోంది. షెల్లీకి ఆమె అతి జాగ్రత్త ఇష్టం వుండదు. ప్రకృతి తన పని తాను చేసుకుపోగలదని అతని విశ్వాసం.

అతను వారితో లేనపుడు – ఎలీజా సంసారపు సాధక బాధకాలు హేరియెట్‌కు బోధించేది!

"అరె – 21 ఏళ్లకే తన తండ్రితో సమాధాన పడలేక పోతున్నాడే – నిన్ను కోడలిగా ఆ జమిందారు కుటుంబం అంగీకరించి – వారి భవంతికి తీసుకువెళ్లాలికదా! కాబోయే జమిందారు భార్యగా నీకో స్థానముండాలి కదా! నీవు అతన్ని సరిగ్గా దారిలో పెడితే – నీకీ పాటికి వుండటానికి ఇల్లు – తిరగటానికి బగ్గీ వుండేవి తెలుసా?" ఈ విధంగా నూరి పోస్తోంది.

నిజానికి హేరియెట్ ఆలోచనలు ఈ దిశగానే సాగేవి. తనలాంటి సౌందర్యవతికి – గౌరవనీయమైన జీవనశైలి, సుఖప్రదమైన జీవితం – ఉండాలి కదా– ఎప్పుడూ మేధావికి అణకువగా పడివుండటం ఎంతవరకూ న్యాయం?

తను వీధిలో నడుస్తుంటే – తనకు లభించే గౌరవాన్ని గమనించినప్పుడు –తన శక్తి సామర్థ్యాలు తెలిసి వస్తాయి. అంతేకాదు ఈ యౌవనం ఎక్కువ కాలం శాసించ లేదనీ తెలుసు!

శక్తి గల రాజ్యం – బలవంతంగా వున్నపుడే – తన స్థానాన్ని స్థిరపరచుకోవాలి కదా – అలాగే తన సౌందర్యం, యౌవనం ఆసరాగా వున్నపుడు – శత్రువయిన మగవాడిని తన దారికి తెచ్చుకోవాలి కదా! అదీ, ఇంకా వయసు మీద పడక పూర్వమే.

అంతేకాక ఎలీజా ఎప్పుడూ చూపించే సానుభూతి, అదిగో అలాంటి ఆ సానుభూతి వచనాలే మనందరి ఆనందాన్ని పాడు చేస్తాయి. కేవలం ఒక మూర్ఖపు సలహాతో!

ఎలీజా ప్రేరణతో – హారియెట్ సణుగుడుతో షెల్లీని ముందుకు తోయటంతోనూ – నార్‌ఫోక్ యువరాజుగారి సలహా మేరకు – తన తండ్రి గారికి మరొక విన్నపం పంపాలని నిర్ణయించుకున్నాడు.

నిజానికి ఈ నిర్ణయం వెనకాల – తన తల్లిని చూడాలనే కోరిక, కుటుంబ సభ్యులతో కలిసి వుండాలనే బంధమేగాక, తన వయసు మళ్లుతున్న తండ్రి గారిని – దూరం నుంచి దర్శించాలని – కాలం తెచ్చిన మార్పును, గ్రహించాలన్న ఇచ్ఛతోనే వ్రాయటంలో తప్పులేదని అనుకున్నాడు!

ప్రియమైన నాన్నగారూ,

మిమ్మల్ని మరొక్కసారి అడగటంలో – నా అభ్యర్థన అదే, మీతో మన కుటుంబంతో కలిసిమెలిసి ఉండే అవకాశాన్ని కలిగించమని – ఇకముందు నా పొరపాట్లతో ఇటువంటి పరిస్థితి ఉత్పన్నం కాబోదనీ అనుకుంటున్నాను.

మనం తండ్రీ కొడుకుల మాదిరి మరింత విశ్వాసంతో దగ్గరవ్వాలని, భవిష్యత్తులో ఎటువంటి ఎడబాటుకు నేను కారణం కాబోనని – మన కుటుంబ సభ్యుల ఆనందాన్ని, నా ప్రవర్తన ద్వారా పాడు చేయననీ చెప్ప దలచుకున్నాను.

రాత్రి మాతో పాటు విందులో పాల్గొన్న జాన్ గ్రోవ్ మీరు ఆరోగ్యంగా వున్నారని చెప్పటం నా కెంతో ఆనందాన్ని కలగచేసింది.

నా భార్య, నేను మీకు నమస్కారాలు తెలియజేస్తూ –

మీ ప్రేమ పాత్రుడు

పి.బి. షెల్లీ.

దురదృష్టవశాత్తు – తిమోతి షెల్లీ, తన కలవాటయిన తప్పుడు నిర్ణయాలతో బిష్ విధేయతను పరీక్షించాలని – యూనివర్సిటీ కాలేజీ అధికారులకు – తనిప్పుడు చర్చి నమ్మకాలకు కట్టుబడి వున్నానని వ్రాయమన్నారు. సహజంగానే షెల్లీ దీనిని తిరస్కరించగా – తండ్రి ఇక తనతో ఉత్తర ప్రత్యుత్తరాలు మానివేయమన్నాడు!

"నేను అంతగా దిగజారిన బానిసను కాదు" – నార్‌ఫోక్ యువరాజుకు రాస్తూ షెల్లీ –

"నా అభిప్రాయాలను ఆలోచనలను – అవికూడా నేను సత్యమని పూర్తిగా నమ్మినవాటిని బహిరంగంగా వదులు కోలేను.

బుద్ధి గల వాడెప్పుడూ తను విశ్వసించిన సిద్ధాంతాలను, సత్ప్రవర్తనను గాలికి వదిలివేయటం – మేధో పరమైన పరీక్ష కాబోదు!

నా ఆత్మగౌరవానికి భంగం కలిగించని ఎటువంటి త్యాగాలకయినా, నేను సిద్ధంగా వున్నాను. ఎందుకంటే – ఆత్మగౌరవం లేకుండా బ్రతకటం అవమానకరం, బాధాకరం కూడా! బరువు చేటు కూడా" అని ముగించాడు.

ఎలీజా ఇది చాలా అనుచితమైన మూర్ఖత్వమని నిర్ణయించింది.

"అరె– హారియెట్ త్వరలో కనబోతోంది – ఆమెకు తిరగటానికి కనీసం ఒక బండి కూడా లేదే – ఇక వీధుల వెంటబడి నడవాలా?" అని దెప్పి పొడిచింది.

కోపంతో షెల్లీ – అప్పు చేసి బండి కొన్నాడు. కాని తను ఉపయోగించటానికి నిరాకరించాడు.

అతనికి బండిలో తలుపులు మూసుకుని బందీలా ప్రయాణించడం కంటే – పెద్ద పెద్ద అంగలతో నడవటం అదీ హాగ్ తోడుంటే మరింత ఉత్సాహంగావుంటుంది.



ఫానీ ఇమ్లే

ఇంటి దగ్గర – ఎలీజాతో నరకంలావున్న షెల్లీకి, ఆనందకరమైన ప్రదేశాలు– తనకు ఆహ్వానం పలికేవి చాలానే వున్నాయి.

స్కిన్నర్ వీధిలో గాడ్విన్ గారిల్లు - అక్కడే ఫానీ, జేనీ, షెల్లీని ఎంతో సంతోషంగా ఆహ్వానిస్తారు.

చెస్టర్ స్క్వేర్‌లోని న్యూటన్ నివాసం ఆప్యాయతకు అనురాగానికి నెలవు! అక్కడి వివేకవంతమైన వాతావరణం - మర్యాద మన్నన అతన్ని ఎంతో ఉపశమింపచేసేవి.

శ్రీమతి న్యూటన్ చక్కని సంగీతకారిణి - డస్సెల్ శిష్యురాలు - పియానో ముందు కూర్చొని సంగీతం వినిపించేది.

షెల్లీ, చుట్టూ పిల్లలు మూగివుండగా రగ్గు మీద కూర్చుని వాళ్లకి మెల్లిగా దెయ్యాల కథలు వినిపించేవాడు! పియానో వింటూ !!

చాలా తరచుగా శ్రీమతి డీ బోయిన్ విల్ - న్యూటన్ గారింటికి వస్తుంటుంది. అక్కాచెల్లెళ్ళిద్దరూ - గొప్ప వంశంలో పుట్టారు. ఆంగ్లో - ఫ్రెంచ్ విద్యనభ్యసించారు. షెల్లీకి ఫ్రెంచ్ తత్త్వవేత్తలంటే - ఆరాధన.

ముఖ్యంగా మేడమ్ బోయిన్ విల్ అతన్ని ఎంతగానో ఆకర్షించింది. ఆమె - ఒక కాందిశీకుణ్ణి వివాహం చేసుకుంది - ప్రేమించి.

ఆయన - ఆంద్రె చెనియర్, లా ఫయిూట్ ప్రభృతులకు స్నేహితుడు. ఇంతకంటే ఏమి కావాలి షెల్లీ ఆమె పట్ల ఒక కవితావేశంతో ఆకర్షింపబడటానికి?

ఆమె మాట్లాడే కళ్లు - ఎంతో వివేకంతో వికసించిన బుద్ధి కుశలత, ఆధునిక భావాలు - ఇప్పటి యువతుల కంటే ముందున్న ఆమె సమాచార వైభవం - ఇవన్నీ షెల్లీని కట్టిపడేసేవి.

జీవితంలో మొదటి సారిగా తనతోపాటు ఆలోచించగల, తన మేధోపరమైన ఆకలిని తీర్చగల స్త్రీల సమక్షంలో వున్నాడు!

నిజానికి - హారియెట్‌తో జీవించటంతో - ఆడవారంటే - చిన్నపిల్లలనే భ్రమలో వుండిపోయాడు.

ఏదయినా ఒక ఆలోచన చెప్పాలంటే - దానిని అతిసామాన్యంగా కుదించి చెప్పాల్సి వచ్చేది.

మేడమ్ బోయిన్ విల్లీకి తన అభిప్రాయాలను వివరించటానికి శ్రమపడాల్సిన అవసరమే లేదు. పైగా ఆమె భాషాపరిజ్ఞానం, సూక్ష్మగ్రాహ్యత ఇవన్నీ ఎంతగానో అతన్ని ఆనందపరిచాయి.

వారిద్దరితో - అభిప్రాయాలను పంచుకోవటం - ఆలోచనలతో ఆడుకోవటం - చాలా ఉత్సాహభరితంగా ఉంటుంది.

నిజానికి – అధ్యయనం, సంస్కార వంతమైన ప్రవర్తన, ఇవి రెండూ కలిసిన స్త్రీలో మనం నాగరికత మూర్తిమత్వాన్ని చూడవచ్చు.

ఒక పరమార్థాన్ని సాధించగలిగాననే రహస్యానందంతో , తన పరిసరాలు – అనుకూల వాతావరణంతో నిండి వున్నాయని – ఇప్పటి వరకు జరిగిందంతా ఒక వికారమైన – వ్యర్థమైన సమయమని తలపోస్తాడు.

ఇక బోయిన్ విల్లీ సోదరీమణులు - వీరికి షెల్లీ, ఒక గొప్ప వరంలా కనిపించాడు. ఈ అందగాడు - గొప్ప వంశజుడు - తమ అభిప్రాయాలను గౌరవించటమే గాక ఆలోచనాపరుడు - అతని పిన్నవయసు మొండితనం తగ్గుముఖం పట్టి, ఇపుడు వినయంతో, సహనంతో వినగలుగుతున్నాడు.

ఇంత నిస్వార్థపరుని ఇంతవరకు ఎక్కడా కలవలేదు – ఇంత వదాన్యుడు, సర్వ ప్రాపంచిక విషయాలపై నిరాసక్తుడు, వారికి తారసపడలేదు.

మామూలుగా గంభీరంగా వుండే షెల్లీలో అంతర్గతంగా హాస్య చతురత వుంది. ఎంతో సహజ సిద్ధమైన ప్రవర్తనగల వాడు - ఎటువంటి పటాటోపాన్ని భరించలేడు.

ఎంతో మర్యాదమన్ననలను చూపగల జమీందారీ వారసుడు!

"అరె, ఇంతకంటే అద్భుతమేముంటుంది. ఒక సాధుపుంగవుడు – మన మధ్యలో సామాన్యునిలా వుండటం ఎంత రమణీయం?" అనుకుంటారు!

* * *

కాస్త అసూయగా వున్నా - హాగ్ తన మిత్రుని ప్రవర్తనను ఎంతో అనురాగంతో అర్థం చేసుకున్నాడు.

గాడ్విన్ సంతానం షెల్లీని ఎల్ఫ్ కింగ్ అనీ - కింగ్ ఆఫ్ ఫారే అని సంబోధించి సమ్మానించేవారు.

న్యూటన్ ఇంటిలో - షెల్లీని *ఏరియల్* అనీ, *ఒబిరాన్* అని అనేవారు. షెల్లీ కనపడగానే - అతని చుట్టూ మూగి కబుర్లు చెప్పేవారు.

షెల్లీని పట్టుకోవటం కాస్త కష్టమైనపనే...

ఎప్పుడు ఎలా వస్తాడో - ఒక్కసారిగా ప్రత్యక్షమవుతాడు. సమయం సందర్భం కష్టమే - ఒక్కోసారి కవితాత్మకంగా తన లోకంలో వుండిపోయి - తనకి ఆహ్వానం వున్న సంగతి మరచిపోతాడు.

మరొక్కసారి అందరి మధ్యలో కూర్చుని ఎంతో గంభీరమైన విషయాలు మాట్లాడుతాడు. ఒక్కసారిగా ఏదో గుర్తుకు వచ్చినట్లు ఎక్కడికో వెళ్ళిపోతాడు.

హాగ్ హాస్య మాడేవాడు - "కొన్ని దేశాల్లో ఈ నమ్మకం వుంది - గొర్రెలు ఇరవయినాలుగ్గంటల్లో ఒక గంట నరకానికి వెళ్లి వస్తాయని, నువ్వు కూడా అంతేనా" అంటాడు.

మరోసారి - తన కిష్టమైన యువతితో చర్చల్లో ఉన్నపుడు పరిసరాలు - సమయం మరచి పోయేవాడు.

రాత్రి నిద్రలోకి జారుకునేది - చర్చలు - అభిప్రాయాలు కొనసాగుతూనే వుండేవి... తొలి సంజ వెలుగులు కనిపించేవి - అప్పటి వరకు, ఈ మన్మథుని మధుర సంభాషణలను ఊపిరి బిగబట్టి వింటున్న, విదుషీమణుల కనులు వాలిపోతుంటే...

షెల్లీ - ఇక ఇప్పుడు నిద్ర సమయం కాదని, ఉదయపు చల్లని గాలులు - పూల పరిమళాలు మోసుకొస్తుండగా అలా నడిచి వెళ్ళి పోయేవాడు.

అరె - రాత్రి అంతా నీవు అందగత్తెలకు ఏమి చెప్తున్నావు? హాగ్ ఆశ్చర్యం!

'నిజానికి నాకూ తెలియదు' అంటాడు షెల్లీ. హారియెట్‌కీ ఆశ్చర్యమే తన భర్త ఈ యువతులకు ఏమి బోధిస్తున్నాడోనని!

ఇప్పుడు ప్రసవ సమయం దగ్గర కొచ్చింది. ఆమెను తరచూ ఇంటి దగ్గరే వదలి షెల్లీ తిరుగుతూండేవాడు.

అతనికి ఎక్కడ ఆనందంగా ఆహ్వానం లభిస్తుందో అక్కడే సమయం గడుస్తుండేది.

మొదట్లో హారియెట్‌కీ ఆహ్వానం వుండేది. ఆమెకు శ్రీమతి గాడ్విన్‌తో పొసగలేదు.

ఇక మేడమ్ బోయిన్‌విల్లీ స్థాయికి, ఎంతటి అందగత్తె అయినా - పైగా షెల్లీ లాంటి కవికి భార్య కూడా, ఎదగలేక - ఆమె దృష్టిలో సామాన్యురాలు గానే ఉండి పోయింది.



'ద క్లౌడ్' షెల్లీ రచన

పదహారవ అధ్యాయం

సాదృశ్యాలు

పాప పుట్టింది. నీలి కళ్లతో... నాన్న ఇయాంతి అని పేరు పెట్టాడు. తల్లి, ఎలిజబెత్ అని కలిపింది.

షెల్లీ, పాపను ఎత్తుకుని గది అంతా తిరిగాడు. తన పాటే పాడుతూ...

ఈ ప్రాపంచిక రాగద్వేషాల నుంచి దూరంగా – అతీతంగా ఈ ప్రాణిని రక్షించాలనే ఆలోచనే అతనికి ఆనందాన్నిచ్చింది. తల్లి పాలతోనే పాప పెరగాలని ఆశించాడు. తల్లీ బిడ్డలను పూవుల్లా చూసుకోవాలని ఉవ్విళ్లూరాడు! ఈ అతి ఉత్సాహంతో ఎలీజా ఉనికిని మరచిపోయాడు.

హారియెట్ – అక్క సలహాతో – పాప కోసం పాలిచ్చే ఆయాను మాట్లాడుకుంది. 'ఆహా – కూలి తల్లి' షెల్లీ కోపంగా అన్నాడు. కాని హారియెట్ ఈ విషయంలో ఏ మాత్రం లొంగలేదు.

అంతేగాక – బిడ్డ పుట్టిన తరువాత ఆమెలో ఒక వింత మార్పు చోటుచేసుకుంది. గత తొమ్మిది నెలల స్తబ్దతను – నిర్వ్యాపకాన్ని ఇప్పుడు పూరించాలని ఆరాట పడింది. లాటిన్ పాఠాలు అటకెక్కించింది. ఇప్పుడు ఎంత వరకు వీలయితే అంతసేపు దుస్తులు, అలంకరణ దుకాణాల వెంట తిరగాలని – నగలూ నట్రా పోగుచేయాలనీ తాపత్రయ పడుతోంది. ఇది షెల్లీకి ఎంత అసహ్యంగా వుందో, అంత తెలివిమాలిన పనిగా తోచింది.

ఆమె అవసరాలన్నిటినీ తీర్చటానికి సిద్ధంగా వున్నాడు కాని – ఇటువంటి ఖరీదయిన గుడ్డ పీలికల మీద – తను ఎంతో కష్టపడి తేగలిగిన సొమ్మును – అభ్యుదయవాదుల శిక్ష తగ్గించటానికి ఉపయోగపడాలి కాని – ఇటువంటి పనికిమాలిన అలంకరణలకా?

ఆ విషయమే భార్యకు, వదినకు గట్టిగా తెలియజెప్పాడు. ఇక ఎలీజా, షెల్లీ లోపాలన్నీ ఏకరువు పెట్టసాగింది.

"గాడ్విన్, కుటుంబానికి ఎంత ఖర్చుపెడుతున్నాడు – అపరిచితులైన రచయితలను రక్షించటానికి, జరిమానాలకు ఎంత తగలేస్తున్నాడు – కాని సొంత భార్యకు ఒక మంచి గౌను కొనలేడా? అదీ ఎంతో సుకుమారి – సౌందర్యవతి – ఇలా చాలీచాలని జీవితాన్ని గడపాలా? పద్ధెనిమిదేళ్ల ప్రాయంలోగాక ఇంకెప్పుడు మంచి – ఖరీదయిన దుస్తులు ధరిస్తుంది" ఇదీ ఆమె వాదన.

అక్కడతో ఆగలేదు. మేజర్ ర్యాన్ అనే మిలిటరీ ఆఫీసరుని, ఇంటికి రానిస్తోంది. ఈయన ఐర్లాండులో పరిచయమై, ఇప్పుడు లండన్‌కు దిగుమతి అయినాడు. అతని ఉద్దేశ్యం కూడా – ఇంతటి అందగత్తె – ఇంత సాధారణ జీవితాన్ని గడపటమా అనే!

ఇప్పటి వరకు ఆమె షెల్లీ మీద గల ప్రేమతోనే లాటిన్ నేర్చుకున్నా – తత్త్వ శాస్త్రం చదివినా – ఇక మీదట అంత వత్తిడి భరించలేదు. ఇప్పుడు ఆమె ఆనందమంతా దుకాణాల కిటికీల మీద – అద్దాల వెనక నగల మీద !

పరిస్థితి చూసి – ఈ పట్టణ జీవితం నుంచి ఆమెను – దూరంగా తీసుకు పోవాలని – ప్రేమికుల మధ్య అపోహపు నీడలు రాక మునుపే – లే యెండలో ప్రేమను మళ్లీ విరబూయించాలని ఆశించాడు.

బగ్గీ సిద్ధం చేయించి – 500 పౌండ్లు అప్పు చేసి, అదీ 2000 పౌండ్లు భవిష్యత్తులో ఇచ్చే ఒప్పందం మీద – ఎడిన్‌బర్గ్ ప్రయాణమయ్యారు.

ఎలీజా ఎలాగు తప్పదు కదా!

ఈ ప్రయాణం – నిత్యమూ మారుతున్న ప్రకృతి పరిసరాలు వారికి ఎంతో ఊరట గలిగించాయి. తిరిగి లండన్ చేరే సరికి ఎంతో ఉత్సాహంగా వున్నారు. కాని అతి తొందర్లోనే – మళ్లీ పాత స్పర్థలన్నీ నిద్ర లేచాయి.

హారియెట్, ఎలీజా చక్కని ఇంటికోసం, రంగు రంగుల దుస్తుల కోసం, విందులు వినోదాల కోసం వెంపర్లాట సాగించారు. ఇదంతా షెల్లీకి జీర్ణించుకోలేని పత్యంగా, అదీ తన భార్య ఈ రకంగా వ్యవహరించటం భరించలేక పోయాడు. ఇంకా అతనికి ఆమె మీద ప్రేమ ఉన్నా – ఏ మూలనో అసహ్యాభావం మొలకెత్తినట్లు కనుగొన్నాడు.

హాగ్ వీళ్లను చూడటానికే వచ్చాడు – హారియెట్‌ను చూసి చాలా ఆరోగ్యంగా, మరింత అందంగా వుందనుకున్నాడు. ఆమె ఇప్పుడు అతని కోసం పుస్తకం చదవటానికి సిద్ధంగా లేదు. తనతో పాటు నగల దుకాణానికి తీసుకుపోయి, బయట వదిలి, తాను లోపల గంటల తరబడి వుండి పోయింది. అతనికి, ఆమె పట్ల విసుగుదల మొదలయి – అది షెల్లీకి తెలిసేట్లుగా ప్రవర్తించాడు.

ఇప్పుడు షెల్లీ దంపతుల మధ్య, మూడో వ్యక్తి నమ్మకంగా ప్రవేశించినట్లే.

* * *

షెల్లీని, హాగ్‌ను బ్రెక్‌నెల్ గ్రామంలో, తమతో కొన్ని రోజులుండటానికి మేడమ్ బోయిన్ విల్లీ ఆహ్వానం పంపింది. అంతకంటే ఆనంద మేముంది! అక్కడే వారికి ఆమె కుమార్తె కార్నీలియా పరిచయమైంది. సంస్కారంతో పాటు ఆలోచనాపరురాలు, పైగా అందగత్తె, చక్కని తోడు. శ్రీమతి న్యూటన్ కూడా వచ్చారు. షెల్లీకి తాను ఆ కుటుంబ సభ్యులతో గడిపిన ఆనందకరమైన సాయంత్రాలు గుర్తుకు వచ్చాయి.

మేడమ్ బోయిన్ విల్లీని – 'మాయి వకానా' అని పిలుస్తాడు – ఆమె 'తలాబా' కథానాయికలా జుట్టు నెరిసినా – ముఖారవిందం అందంగానే వుంది. యౌవనంలో వున్న, కార్నీలియా ఆకర్షణీయంగా – యిద్దరి స్నేహితులకు ఇటలీ భాష నేర్పుతుంది. ఆమె తల్లి, ఫ్రెంచ్ తత్త్వవేత్తల పాఠాలను వల్లె వేస్తుంది.

"నువ్వు సంతోషంగా వుండు. ఎదుటి వారిని సంతోషంగా వుండనీ – అందుకోసం ఎవ్వరినీ బాధ పెట్టకు", ఇదే పరమ ధర్మమని – షామ్‌ఫోర్ట్ (Chamfort) సూత్రాన్ని మరీ మరీ చెప్పింది!

ఈ బ్రాక్‌నెల్ గ్రామంలో, ఏ విషయమైనా షెల్లీకి ఆనందంగానే వుంది. చిన్న చిన్న ఆటలు కూడా ఆలోచనాపరంగానే వున్నాయి.

కార్నిలియా – లేవగానే 'పెట్రార్క్' పదాలు చదివేది. ఉదయం నుంచి ఆ రోజంతా –

ఈ ఇద్దరి యువకుల మధ్య నడక సాగిస్తూ తోటలో – ఆ ప్రేమ పదాలు – ఎంతో మధురంగా నిదానంగా చదివేది.

"ఉదయాలు ఇలా మార్దవంగా మొదలయితే – మన ఆలోచనలు మధురంగా మారతాయి. – మాటలు – చేతలు మరింత చైతన్యంగా వుంటాయి" అంటుంది.

ఈ మాటలు – ఈ దినచర్యలు షెల్లీకి ఇవే నిజమనిపించాయి, అవసరమనిపించాయి. వారి నివాసం చక్కగా, ఆరోగ్యకరంగా సామాన్యంగా వుంది – పటాటోపానికి దూరంగా – షెల్లీకి ఆ ఆడంబరాలే అసహ్యం – ఈ ప్రదేశం, అతనికి ఒక బాధ్యత లేని స్వేచ్ఛనిచ్చింది.

తరువాత హారియెట్‌కి ఆహ్వానం పంపారు.

మేడమ్ బోయిన్ విల్లీ ఆమెను సాదరంగానే ఆహ్వానించింది.

"చాలా చక్కనిది చిన్నారి. కాకపోతే, ఈమె మన కవి పండితునికి సరిజోడీ కాదేమో – అయినా నిండా పద్ధెనిమిదేళ్లు లేవు కదా" అంది హాగ్‌తో.

హారియెట్, తనకు సరైన స్థానం ఇవ్వకుండా పెర్సీ – తనకంటే ఎక్కువగా కార్నిలియాతో 'పెట్రార్క్' చదువుతూ గడుపుతున్నాడని బాధపడింది.

తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకునే మార్గం ఆలోచించకుండా, సమయం వృధా చేస్తున్నాడని, ఈ వాతావరణంలో తనకు తగిన మర్యాదలు జరగటం లేదని భావించింది.

అందరూ 'విలువలు' గురించి, రిఫార్మ్ బిల్ గురించి చర్చ సాగిస్తుంటే – హారియెట్ తన కొంటె చూపుల్తో హాగ్‌ను రెచ్చగొట్టేది. ఇది గమనించిన షెల్లీ చాలా చికాకు చెందాడు – తను హాగ్‌ను క్షమించగలడు – కాని హారియెట్, తన నుంచి వేరు కాదు కదా, ఆమె మనసు, మేధ తను 'తయారు' చేసిందే కదా– తను తర్ఫీదు ఇచ్చింది కదా – మరి దీని లోపల మరో హారియెట్ దాగి వుందా ? ఈ భావనే అతన్ని ఆశ్చర్యపరిచింది, గాయపరిచింది.

రహస్యమైన అసూయ కంటే ఆడదానికి మూర్ఖత్వమేముంటుంది?

నిజానికి కార్నీలియా అంటే అసూయ పడడంలో న్యాయముంది. కాని హారియెట్ వెకిలి చేష్టలు – తెలివి తక్కువ ఎత్తి పొడుపులు – న్యాయ బద్ధమైన తన భావోద్వేగాన్ని– తన నీచమైన ప్రవర్తనతో చాలా చిన్నబుచ్చింది. ఇది షెల్లీని ఎంతగానో బాధించింది. దీనితో హారియెట్ మరింతగా అగౌరవం పాలయినట్లనుకుని – "ఎలీజా నిజమే చెప్పింది – షెల్లీ చాలా స్వార్థపరుడు. అతను చేసిందే సరైనదని అనుకుంటాడు. అతనికి ఇక్కడి నీరసమైన

వాతావరణం, పనికిరాని చర్చలు – చచ్చు ఇటాలియన్ కవిత్వం ఇష్టం కాబట్టి నన్నుకూడా వాటిని ఇష్టపడమంటున్నాడు –

కాని నన్ను నా ఇష్టమొచ్చినట్లు బ్రతకవద్దని చెప్పటానికి అతనికి హక్కేముంది?

ఈ కార్నీలియా 'పెట్రార్క్' చదివితే, నాకంటే గొప్పదయిపోతుందా? ఈయన గౌరవించే ఈ ఆడవాళ్లు – యౌవన వతులు కాదు– నాలాగా సౌందర్యవతులూ కాదు. ఇతనికి త్వరలోనే నా అవసరం వస్తుంది" ఇవీ ఆమె ఆలోచనలు.

అలా అనుకుంటూనే – ఎలీజా చెంతకు, లండన్ వెళ్ళిపోతానని చెప్పింది. ఆమెకు ఆతిథ్యమిచ్చిన వారు అందుకు పెద్దగా ఆటంకం చెప్పలేదు – మర్యాదకు ఉండమన్నా.

"పాపం షెల్లీ – అతనికి తగిన భార్య దొరకలేదు" అని – గాడ్విన్ కుమార్తెల్లాగానే అనుకున్నారు – ఈ ఇంటి ఆడవారు.

హారియెట్ మెల మెల్లగా ఎలీజా దగ్గరే ఎక్కువకాలం వుండటం అలవాటు చేసుకుంది – షెల్లీ బ్రాక్‌నెల్‌లో వుంటుండగా. తన భార్య – మేజర్ ర్యాన్‌ను తరచూ కలుస్తున్నట్లు వార్తలు చేరాయి.

పెళ్లయిన తర్వాత మొదటిసారిగా షెల్లీకి – ఇలాంటి అంశానికి ఆస్కారం వుండ వచ్చనే భావన కలిగింది. అలాంటి ఊహనే అసహ్యంగా భావించేవాడు. అలాంటి పరిస్థితి ఇప్పుడు ఎదురుగా హారియెట్ రూపంలో కనపడుతుంటే తట్టుకోలేక పోయాడు – ఇంతకు పూర్వం అతనికి తెలియని భయానకమైన వేదనను అనుభవించాల్సి వచ్చింది.

తార్కికంగా – ఈ సామాన్యురాలి నుంచి తనను తాను విముక్తి చేసుకోగలడా అనుకున్నాడు. ఇప్పుడు అసలు అతను ప్రేమిస్తున్నది, కార్నీలీయా లాంటి దేవతనే గాని – హారియెట్‌ను కాదు. మరి ఆమెను ప్రేమించనపుడు – తెగ తెంపులు చేసుకోవటంలో తప్పేముంది?

అతని నమ్మకం – ఎప్పుడైనా సరే మమతానురాగాలు కరువయినపుడు – ఒకరి నుండి ఒకరికి స్వేచ్ఛ లభించాల్సిందే!

అయితే ఇదంతా ఆలోచించటానికే – కాని కార్యాచరణలో పెట్టలేదు. ఇప్పుడు పెర్సీ షెల్లీ – హారియెట్ వెస్ట్‌బ్రూక్ వేరు వేరు కాదు.

వారు – గత అనుభూతులు, ఆలింగనాలు, ఆనందాలు, బాధలు – ఇయాంతి – ఇవన్నీ కలబోసి, కలిసిపోయిన ఒక గూటి పక్షులు!

దీని నుండి వారికి విముక్తి ఎలా లభిస్తుంది?

అంతే – వెంటనే లండన్ బయలు దేరాడు – తన తప్పులు ఒప్పుకోవటానికీ – క్షమాపణలు అడగటానికీ!!

కాని అతనికి ఎదురైంది – ఆమె కాఠిన్యమూ – ఎగతాళి!



పెర్సీ షెల్లీ

మనసు విప్పి మాట్లాడుకోవటానికి అవకాశం లేకుండా పోయింది! తన చిన్నారి భార్య – నిన్న మొన్నటి వరకూ అణగిమణగి వుండే బాలిక! ఇప్పుడు అహంకారంతో – నిర్లక్ష్యంతో ఎదిరించింది. ఇంత మార్పు – ఇంత తక్కువ సమయంలో ఎలా సంభవం?

అతని పూర్వానుభవంతో – హారియెట్ గర్వంగా కనిపించిన సందర్భాలలో – అనునయించి ప్రేమ హస్తం అందించేవాడు –

ఇప్పుడు అతనికి ఆ అవకాశమే ఆమె ఇవ్వ లేదు!

ఆమె ఎద ఇనుపతలుపులు వృధాగా తట్టి తట్టి అలసిపోయాడు. ఇక చేసేది లేక వీధుల వెంబడి తిరుగుతూ – ఎలాంటి మూర్ఖుణ్ణి ! ఎప్పుడూ – నన్ను ప్రేమించని యువతితో బంధించబడి వుండిపోయాను –

నిజానికి ఆమెనన్ను సంపదకోసం – కీర్తికోసం మాత్రమే పెళ్లిలోకి దింపింది. ఇప్పుడు ఆ అవకాశం లేదని తెలిసి – తాను చేసిన పొరపాటుకు నన్ను శిక్షిస్తోంది.

మంచులాంటి మనసు, రాయిలాంటి మనిషి! అయ్యో – అయ్యో – అనుకున్నాడు.

అతను ఒంటరిగా హారియెట్‌తో ఎక్కువసమయం గడిపివుంటే, ఈ విషయం ముందే తెలిసేదేమో. కాని ఎలీజా ఎప్పుడూ ఇద్దరి మధ్యలో వుంటూనే వుంది – ఇప్పుడు శత్రువులా – రాయిలా – మరో ప్రక్క మేజర్ ర్యాన్ – భర్త చేసిన గాయాలకు మందులు పూయటానికి సిద్ధంగా వున్నాడు.

ఇలా కొన్నాళ్లు తిప్పలు పడి – సంఘర్షణలో గడిపి – ఒక్కసారిగా అతని శక్తి హరించుకుపోయింది. ఏ దారీ తెలియనపుడు – తోచనపుడు – ఈ స్తబ్దత – నిరాశనుంచి – బైటపడటానికి – ఆక్స్‌ఫర్డ్ రోజుల మాదిరిగానే – ఆరిపోయే కొవ్వొత్తి ఒక్కసారిగా వెలుగు చిమ్మినట్లు అతని మనోశక్తి ప్రజ్వరిల్లింది!

హారియెట్ కఠిన వైఖరిని భరించలేక – ఇంక ఛిద్రమైన వివాహాన్ని కాపాడుకోలేక – 'బ్రాక్‌నెల్' ఆతిథ్యానికి ఒక నెల రోజులు గడపటానికి, తానొక్కడే వస్తున్నట్లు రాశాడు.

ఈ నెలరోజుల్లో హారియెట్ వినాశనం – ఇప్పుడున్న నీచమైన పరిస్థితుల్లో– పూర్తవుతుందని – తప్పనిసరిగా ఈ దారుణం జరుగుతుందని – ఇంక తనకు పోరాడే శక్తి లేదని నమ్మాడు.


ఏమి మిగిలింది? ఎండలో ఒళ్లారబెట్టుకుంటున్న కీటకాన్ని నేను. రాబోయే కాల మేఘం – ఇక నన్ను చావు మంచులో గడ్డ కట్టిస్తుంది.

సుఖాలన్నీ విచ్చుకున్నపూలే!
తుంచితే రాలిపోయే రేకులే!
నీటిలో రాలే మంచుపూలు
ఒక్క క్షణం మెరిసి కరిగి పోవా!

– బర్న్స్

ఇప్పటి వరకూ తను భ్రమించిన రత్నాల భవనం – హారియెట్, ఇయాంతి, ఎలీజాలు ఒక్కసారిగా తిరుగుబాటు దారులు నివసించే నిర్మాణంలా అనిపించింది. వారిని బైటకు లాగాలని ఎంతగానో విఫలయత్నం చేశాడు.

అతని బలహీనమైన అస్త్రాలన్నీ భారమైన సత్యాల క్రింద నిర్వీర్యమైపోయాయి.


Beware;
I am fearless, and
therefore powerful.
-Mary Shelley

పదిహేడవ అధ్యాయం

ప్రేమ దేవత రెండవ అవతారం

తన ఇష్టమైన భార్య అమాయకపు ముఖం గుర్తుకు వచ్చినపుడు – షెల్లీకి తమ అపోహలు మాపుకునే ఆశ చిగురించేది.

"నీ వాలుచూపు లేమితో బ్రతకాలి కదా, నీ నిర్లక్ష్యపు నీడలో చంపుతావా?" అని ఎంతో ఆర్తిగా కవిత రాసి పంపాడు.

నిజంగా అతని వేదన, ఆమె అర్థం చేసుకుందా? అతనికి ఎప్పటికీ తెలియదు.

ఎన్నో మార్లు ఆమెను వదిలి – లండన్ వదిలి వెళ్లిపోయేవాడు ఎటో!!

తన మీద కసి తీర్చుకోవటం కోసమన్నట్లు – అతను లండన్ రాగానే, కూతుర్ని తీసుకుని *బాత్* ఊరికి వెళ్లిపోయేది!

షెల్లీకి లండన్ దాటి పోవటానికి అవకాశం లేకుండా పోయింది. అతని న్యాయ సలహాదారు – షెల్లీ కుటుంబం అతన్ని, వారసత్వపు అర్హత నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలియజేశాడు.

ఇప్పటికే అప్పుల్లో తలమునకలుగా ఉన్న షెల్లీ – తన అవసరం ఉన్న , స్నేహితుల కోసం మరిన్ని కష్టాల్లో నడవటానికి వెనుకాడ లేదు.

గాడ్విన్ గారి బాలల గ్రంథాలయం దివాలాకు వచ్చింది. ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో వున్న తత్త్వవేత్త – ఎటూ పాలుపోక తన అవసరాన్ని షెల్లీకి తెలియజేశాడు – మూడు వేల

పౌండ్లు – చాలా పెద్ద మొత్తం! అతను సహాయం చేసే ఆలోచనలో వున్నాడని తెలిసి – ఇప్పుడు బ్రహ్మచారి జీవితం గడుపుతున్నాడనీ, అతని అందమైన అర్ధాంగి అతనికి దూరంగా వుంటోందనీ తెలిసి – గాడ్విన్, షెల్లీని తన ఇంటికి ఆహ్వానించటానికి వెనుకాడలేదు.

షెల్లీ ఎంతో ఇష్టంగా ఈ ఆహ్వానాన్ని మన్నించి – మళ్లీ తన చుట్టూ చేరే యువతుల సాన్నిధ్యం ఇప్పుడు చాలా అవసరం కదా – పైగా, గాడ్విన్ గారి మరో కూతురు 'మేరీ' కూడా వచ్చిందని కబురు! పదిహేడేళ్ల పడుచుప్రాయం – చైతన్యంతో వెలిగిపోతున్న ఆకర్షణ – నేర్చుకోవాలనే తపన, అన్నింటికంటే – ఎంతో పట్టుదల – సహనం కల మేరీ, స్కాట్‌లాండ్ నుంచి వచ్చింది. అప్పటికే ఫానీ, జేనీ మేరీ గురించి – అందం, ఆకర్షణ తెలివితేటలు ముప్పేటగా మేరీలో వున్నట్లు షెల్లీకి వర్ణించి చెప్పి వున్నారు!

అప్పటికే షెల్లీకి ఆమె తల్లి 'మేరీ వుల్‌స్టోన్ క్రాఫ్ట్' కీర్తి ప్రతిష్టలు తెలుసు – అదిగో అవన్నీ కలసి – అతనికి ఎప్పుడెప్పుడు 'మేరీ'ని కలుద్దామా అనే ఉత్సుకత పెరిగిపోయింది!

అతని అవసరం? తన ఆనందమంతా ఇప్పుడు ఈ విశ్వంలో మార్మికమైన శక్తులన్నీ చెల్లాచెదురుగా వుండి ఏదో ఒక సుందర రూపంలో ప్రత్యక్ష మవుతాయని అతని ఆశ! అదే అతని అవసరం కూడా – ప్రేమ అతనికి ఒక గొప్ప వ్యక్తీకరణ – సమగ్రమైన విశ్వాసం, సమపాళ్లలో కలసిన భౌతిక – బౌద్ధిక సమ్మేళనం.

ఈ సంధిలో – సంధిగ్దపు సమయంలో – షెల్లీని రక్షించటానికే అన్నట్లు మేరీ ప్రత్యక్షమైంది. లేదంటే అతని ఆలోచనలు ఫానీనో – జేనీనో చుట్టుకునేవి – కాని మేరీ అతన్ని ఆ ప్రమాదం నుంచి రక్షించింది ! అతని అదృష్టం కుదురుకుందనే చెప్పాలి!

ఆమె ముఖం ఎంతో తెల్లగా, స్పష్టంగా వుంది – బంగారు రంగు జడలు, గుండ్రని ముఖానికి రెండు వైపులా అలంకరించి వున్నాయి. ఆమె నుదురు చాలా నదరుగా వుండి కపిలవర్ణంలోని కనులు కబుర్లు చెపుతుంటాయి.

షెల్లీకి ఒక్కసారిగా ఉద్వేగంతోనూ ఆవేదనతో కూడిన అనురాగం పెల్లుబికింది – హోమర్ చదివినపుడు, ప్లూటార్క్ చదివినపుడు ఇలాంటి వేదనే అనుభవించాడు!!

మేరీలో ఒక గొప్ప సాహసిని దర్శించాడు. ఈ సున్నితమైన సౌందర్యంలో సాహసం కలసి వుండటం అతన్ని ఎంతగానో ఆకర్షించింది.

'ఆ - ఎంత ఉద్వేగం, ఎంత ఉత్సాహం అనుకున్నాడు. ఆమె - శీతల నవీన స్వరం విని -

సెలయేరు - నదీ సంగమంలా నిలబడిన మేరీ - అందం - తెలివి, కళాత్మకంగా కలగలిసిన యౌవనంలో వుంది! సున్నితమైన ఆమె భుజాల చుట్టూ తన చేతులు వేసి సోదర భావంతో- ఆమె కనుల్లో వెలుగు చూడాలను కున్నాడు. ఆమె ఆశ్చర్యాన్ని తనతో పాటే సప్తవర్ణాల చాపంకావలకు పరుగులెత్తించాలనీ ఆశించాడు.

హారియెట్ వెస్ట్ బ్రూక్ ఇతని ఆశయాన్ని పూర్తిగా మూర్తిమంతం చేయలేకపోయింది. కొంతకాలం ఆమెతో అతను ఆశించిన ఆనందకరమైన మేళవింపు - అంతఃబాహ్య సౌందర్యాల మేళవింపు ఈ కఠినమైన కాల పరీక్షకు నిలబడ లేకపోయింది. నిజానికి ఆమె మేధోపరమైన అశక్తతను దాటలేక పోయింది. కొత్త ఆలోచనలకు కరువు లేక పోయినా నిర్లక్ష్యపు నిరాసక్తత ఆమె చూపులో కనిపించేది. అంతకు మించి - ఆమె కులుకు, తళుకు బెళుకులు, పనికిమాలిన కుయుక్తుల ప్రేలాపన - మోసకారి తనం ఇవన్నీ కూడా షెల్లీని ఘాత పరిచినాయి.

కాని, మేరీ రాగివన్నె కళ్లు నిజాయితీతో మెరిసేవి. నాజూకుగా - సున్నితంగా వుండేది. ఒక గొప్ప రచయిత ప్రాపకంలో పెరిగిన మేరీ, అన్ని శృంఖలాలనుంచి, ముఖ్యంగా స్త్రీ పరమైన ఉదాసీన మూర్ఖత నుంచి బయటపడగలిగింది. ఆమె కంఠస్వరంలో సంస్కారవంతమైన, ఖచ్చితత్వం ధ్వనించేది.

ప్రతి సాయంత్రం గాడ్విన్ కుటుంబ సభ్యులతో విందారగిస్తూ - మేరీని చూస్తుండేవాడు. గాడ్విన్ ఆర్థిక బాధలు వింటూ - సమాచార వ్యవస్థ, దేశబడ్జెట్ చర్చిస్తూ - మేరీని చూస్తుండేవాడు !

మేరీ - తన వంతుగా, షెల్లీని ప్రేమించటానికి సిద్ధంగా వుంది ! ఇందుకు ఆమె చెల్లెళ్లు ఎంతగానో ప్రోత్సాహం అందించారు. గత కొద్ది మాసాలుగా ఆమెకు రాసిన వుత్తరాలలో, ఈ అందమైన కవి గురించిన వివరాలే వున్నాయి. అయినా వారి వర్ణనలేవీ - అతని భౌతిక సౌందర్యానికి సాటి రాలేదు ! మేరీ, నిజానికి తానెంతగా షెల్లీని ఇష్టపడుతుందో వెంటనే గ్రహించింది. అతనెప్పుడూ జీవితంలోని బాధలగురించి చెప్పకపోయినా - అతను ఆనందంగా లేడని గ్రహించింది.

ఇలాంటి నేపథ్యంలో ఒక సాయంత్రం – ఆమె తల్లి వర్ణచిత్రం చూస్తూ వాళ్లిద్దరే వున్నపుడు – ఆమె తన బాధలు చెప్పింది. తండ్రి పూజనీయుడని, మారుటి తల్లి గర్హించదగినది – కేవలం ఆమె ప్రవర్తన తనను తండ్రి నివాసానికి దూరంగా వుండేట్లు చేస్తున్నదని – తనకు శాంతి తన తల్లి సమాధి చెంతనేనని – ప్రతిసాయంత్రం అక్కడకే వెళ్లి ధ్యానం చేస్తానని చెప్పింది. షెల్లీ ఉత్సాహంగా 'నేనూ రావచ్చా' అంటాడు.

* * *

ఆ విధంగా అయిదేళ్ళ విరామం తరువాత – ఒక అందాల భరిణ ప్రక్కన – స్మశానంలో కూర్చుంటాడు. ఈ సారి అతని సహచరి నిబద్ధత గల ప్రేమమూర్తి. రెండవ సారి అతనిని ప్రేమించటానికి ఆ యువతి అతని ప్రక్కనే వుంది – కాని పాపం షెల్లీ ఇపుడు ఒంటరి వాడు కాదు. వివాహితుడు– ఒక కూతురు కూడా. తెలియని శక్తి ఏదో తనని మేరీ వైపు ఆకర్షిస్తున్నట్లు తెలుసుకుంటాడు. ఆమెను తన బాహువుల్లోకి తీసుకోవాలని – ఆమె లేత పెదవులను అందుకోవాలనీ – తపించాడు – ఆమె కూడా అలాంటి స్థితిలో ఉందని గ్రహించాడు.

ఆమెకు ఏమివ్వ గలడు? తనకేమో వివాహమయ్యింది. నిజమే – వివాహం ఒక ఒడంబడిక మాత్రమే అని తెలుసు. మనసులో ప్రేమ లేకపోతే – ఆ బంధానికి విలువ లేదు – అది రాజీనామానే!

హేరియెట్‌కి ఇంతకంటే ఎక్కువ వాగ్దానం చేయలేదు. పైగా ఇప్పుడామె మేజర్ ర్యాన్‌కు ఉంపుడు గత్తెగా వుంటోంది!

తన కిప్పుడు నైతిక బాధ్యత కూడా లేదు!

ఏది ఏమయినా – తన వివాహం మాత్రం రద్దవదు కదా! అందుకని మేరీకి తానేమీ మాట యివ్వలేడు.

కేవలం, ఒక అపవిత్రమైన అస్తిత్వాన్ని మాత్రమే చూపించగలడు– ఇలాంటి పని తన మొదటి ప్రేమికురాలయిన హెరియట్ గ్రోవ్ విషయంలో చేయలేకపోయాడు–

ఏది ఏమయినా – అర్థం చేసుకున్న ప్రేమికుల మధ్య – ఎంతటి నిరాశవున్నా నైతికంగా ఒంటరితనం వుండదు కదా –

మేరీతో తన భార్య గురించి పూర్తి నిజాన్ని చెప్పాలని నిర్ణయించాడు.

ప్రేమవివాహం తరువాత ప్రేమ చచ్చిపోయినా – లౌకిక కట్టుబాట్లకు లోబడి నిశ్శబ్దపు గూటిలో వుండిపోతుంది చాలా సమయం – కాని తన గాయాలను బాహాటంగా ఎండబెట్టుకోవటంలోని చేదు అనుభవాన్ని ఆనందంగానే భావిస్తాడు.

షెల్లీ, హారియెట్ గురించి ఇప్పుడు తనకు అర్థమైనట్లు వివరించి చెప్పాడు – మానవ సహజమైన రాగద్వేషాలకు లోబడి, మారిన నైతిక విలువల పరిధిలో, ఒక ఆధ్యాత్మిక కారణ క్రమంలో – వివరించి చెప్పాడు.

ఇప్పుడు తనకు ఒక తోడు కావాలి, తన తత్త్వాన్ని, తన కవిత్వాన్ని అర్థం చేసుకోగలిగిన ఒక భాగస్వామి కావాలి. హారియెట్ ఈ రెంటినీ పూరించలేకపోయింది.

తనకు దక్కకుండా పోయిన ద్రాక్షపళ్లను, కుళ్లిపోయిన వాటిగా చిత్రించటంలో మానవ సహజమైన, బాధాకరమైన ఆనందాన్ని పొందగలిగాడు.

మేరీకి 'క్వీన్ మాబ్' పుస్తకాన్ని ఇచ్చాడు. దాని లోపల హారియెట్‌కు అంకితం ఇచ్చినట్లుగా ముద్రించి వుంది. అక్కడ రాస్తాడు... 'స్లోబెన్ డార్ఫ్ యువరాజు ఆమెను వివాహం చేసుకోగోరతాడు, కేవలం అది అదృష్టంగా భావించి– ఆమె తన స్వార్థంతో అతన్ని కారాగారం పాలు చేసి వెళ్ళిపోయింది.'

మేరీ తన గదికి వచ్చిన తర్వాత దానికి కొనసాగింపుగా రాస్తుంది.

'ఈ పుస్తకం నాకెంతో పవిత్రమైంది. మరే ప్రాణి కూడా ఇందులో తొంగి చూడకూడదు. ఇక్కడ నా ఇష్టం వచ్చినట్లు రాసుకోవచ్చు – ఈ రచయితను ప్రేమిస్తున్నాను. ఇది తెలియజేయటానికి ఎలాంటి శక్తి చాలదు. మాది ప్రేమ మాత్రమే. మేము వాగ్దానం చేసుకున్నాం పరస్పరం : నేను నీకు దక్కక పోవచ్చు కాని, నీకు దక్క మరెవ్వరికీ దక్కను – కేవలం నేను నీ దానినే'

ప్రేమతో ఒక ముద్దు – ఎవరూ చూడని ఓరచూపు...
ఎవరికీ అర్థం కాని ఓ చిరునవ్వు...
గుండె చప్పుడు చెప్పే గుసగుసలు...
నీ వెచ్చని చేతి మెత్తని రాపిడి...   నేను నీ కోసమే...

ఈ దొంగచూపులు చేతి రాపిడులూ గాడ్విన్‌గారు బాగానే గమనించారు. ఎవరూ చూడకపోయినా.

ఆయనను, ఈ వివాహితునితో తన కూతురు వ్యవహారం చాలా ఇబ్బంది పెట్టింది. ఆమెకు అందులోని ప్రమాదాన్ని తెలియజెప్పాడు కూడ. అదే విధంగా షెల్లీకి రాశాడు.

'ముందు నీ భార్యతో తెగతెంపులు చేసుకో. అప్పటి వరకు ఈ ఇంటి ఛాయలకు రావద్దు' అంటూ.

ఇలాంటి నిషేధాలూ, ఆంక్షలూ ఎంత సున్నితమైనవి అయినా – అసలు వ్యవహారాన్ని ముందుకు తీసుకువెళ్తాయి.

షెల్లీకి తను ప్రేమించిన మేరి సాన్నిహిత్యం నిషేధింపబడటంతో ఒక నిర్ణయానికి రావాలనుకున్నాడు. ఇప్పుడు హారియెట్ వ్యవహారంలో ఎలాంటి అపరాధ భావం లేదు. ఎందుకంటే, తప్పంతా ఆమెదే అనే అభిప్రాయంలోనే వున్నాడు. అప్పటికీ హాగ్, పీకాక్, వీరిద్దరూ దీన్ని ఖండించారు కూడా.

'ఆమెకు కావల్సింది డబ్బు మాత్రమే. అది నేను అందేట్లు చేస్తాను, ఆమె భవిష్యదవసరాలకు, ఆమె స్వేచ్ఛగా వుండగలదు' అనుకున్నాడు.

అలా అనే లండన్‌కు రమ్మని రాశాడు. ఇప్పటికి నాలుగు నెలలుగా అతన్నుంచి దూరంగా వుంది. చాలా అనారోగ్యంగా కూడా ఉంది. ఆ స్థితిలోనే అతని దగ్గరకు వచ్చింది.

అప్పుడు చెప్తాడు, 'నీ నుంచి దూరంగా ఉండదలుచుకున్నాను. ఇప్పుడు మరొకరితో వెళ్లిపోవాలనుకుంటున్నాను. ఎప్పటికీ నీ స్నేహితుణ్ణే.'

ఈ పిడుగులాంటి వార్త హారియెట్‌ను మరింత క్రుంగదీసింది. అలాంటి స్థితిలో ఆమెకెంతో సేవ చేశాడు. ఇది ఆమెను మరింతగా బాధించింది. ఆమె కాస్త కుదుట పడగానే తన వాదనను మళ్లీ వినిపించాడు.

'చూడు– స్త్రీ పురుషుల సంగమం ప్రేమ వుంటేనే పవిత్రమైనది. ప్రేమ లేని రోజున దానికి విలువే లేదు. ఎందుకంటే అనురాగం లేకపోతే, పరస్పరానందాన్ని పొందలేరు. ఏ రోజునైతే ప్రేమరాహిత్యమౌతుందో అప్పుడు అది బంధమే కాదు. దాని వల్ల బాధలే కాని ఏమాత్రం ఉపయోగం వుండదు.

కలిసి వుండాలనే స్థిరభావంలో ఏమాత్రం విలువ లేదు – ప్రేమలేకుండా. పైగా దాని విషప్రభావం మూలంగా విపరీత పరిణామాలు చోటుచేసుకుంటాయి.'

ఇలాంటి సాలె గూటిని అల్లి, తన వాదనలతో ఆమెకు కాళ్ళు, చేతులు కదలకుండా చేస్తాడు. అప్పటికి హారియెట్‌కు అర్థమయ్యింది – ఇక తను ఒంటరిదానినని.

తన మత విశ్వాసాలను అతనికి వినిపించినప్పుడూ ఇలాగే తనని మాట్లాడకుండా చేయగలిగాడు – ఎదురు లేని తార్కిక వాదనలతో.

ఇప్పటికీ, తన బాధకు ఎక్కడో దారి వుండి వుండాలి – ఆమె సరిగా ఆలోచించే స్థితిలో ఉంటే – ఆ మార్గం కనిపించేదే. కాని ఏమి చెప్పాలో, ఏమి చేయాలో ఆమెకు తెలియకుండా పోయింది.

అగుపించని బంధాలనుంచి తెంచుకుంటున్నట్లుగా కలలు కనేది. మేరీని ఇష్టం వచ్చినట్లు తిట్టి తృప్తి పడేది. దీనంతటికీ కారణం మేరీయే. షెల్లీని తన అమ్మ సమాధి చెంతకు తీసుకువెళ్లి తన అమ్మ జ్ఞాపకాన్ని, ఇలాంటి నీచమైన, సిగ్గుమాలిన పనికి వాడుకుందని తిట్టిపోసింది. తన భర్త బోళాతనాన్ని తలుచుకుని బాధ పడింది.

మేరీ విషయానికి వస్తే – ఆమెకు, హారియెట్ అంటే ఏమాత్రం సానుభూతి, జాలి లేదు. షెల్లీ లాంటి వ్యక్తిని పెళ్లి చేసుకునే అదృష్టం పట్టినా, అతనిని సంతోషపెట్టక పోగా తన మోసపూరితమైన, చపలమైన ప్రవర్తనతో కష్టపెట్టి దిగజారింది.

షెల్లీ వదాన్యత, మేరీకి తెలుసు. హారియెట్‌కు కావలసిన డబ్బు తన భరణంలోనుంచి సర్దుబాటు చేస్తున్నాడని తెలిసి కాస్త ప్రశాంతంగా ఉండగలిగింది. హారియెట్‌కు డబ్బే ప్రధానం కదా అనుకుంది.

షెల్లీ, మానసికంగా చాలా క్రుంగిపోయాడు. భావోద్వేగాలతో అతలాకుతలమై పోయాడు. హారియెట్‌ను చూడగానే అతనికి తాము ప్రేమగా గడిపిన క్షణాలు గుర్తుకు వచ్చేవి. మళ్లీ మేరీ చెంతకు రాగానే ఆమె ప్రశాంతమైన రమణీయతకు లొంగిపోయేవాడు.

తన మానసికమైన ఒత్తిడి తట్టుకోలేక నిద్రమాత్రలు (పూర్వం బెర్విక్‌లో వాడినవే) ఎక్కువగా వాడటం మొదలు పెట్టాడు.

పీకాక్‌కు తన దగ్గరున్న సీసాను చూపించి 'ఇదిగో, ఇది లేకుండా వుండను - నీవు చెప్పిన సోఫోకిల్స్ కవితను కూడా చర్విత చరణం చేస్తున్నాను.'

నువ్వు సంతోషంగా వుండేదెప్పుడు ?
బ్రతుకు ముళ్లబాటలో ఎగబాకుతున్నప్పుడా?
లేక త్వరగా మృత్యుదేవత ఒడిలో జారిపోతున్నపుడా?



దిక్కు తోచక!

రెండవ స్వప్నం



మరో తీరానికి

మొదటి అధ్యాయం

ఆరు వారాల యాత్ర

తెల్లవారు ఝామున నాలుగు గంటలకు బండి రమ్మని చెప్పారు. షెల్లీ, రాత్రంతా గాడ్విన్ ఇంటి ఎదురుగా వేచి ఉన్నాడు. వెన్నెల వెలిసి పోవటం – నక్షత్రాలు నిద్రపోవటం – చివరకు ఆ ఇంటి నూనె దీపాలు కొడిగట్టటం చూస్తూనే ఉన్నాడు.

ఎట్టకేలకు మేరీ నిశ్శబ్దంగా హాలు తలుపు తెరిచింది. చివరి క్షణంలో అక్కకు తోడుగా ప్రయాణమైన జేనీ క్లేర్‌మాంట్ సామాను బండిలో పెట్టించింది.

ఆ – దూర ప్రయాణంలో మేరీ బాగా అలసిపోయింది. కాని షెల్లీ మధ్యలో ఆగటానికి ఇష్టపడలేదు – ఒకవేళ గాడ్విన్ వెంబడించే ప్రమాదం ఉందని.

సాయంత్రం నాలుగు గంటలకు డోవర్ రేవు చేరారు. అక్కడ మామూలు సరిహద్దు ఇబ్బందులు, నావికుల బేరాలు పూర్తయిన తర్వాత చిన్న పడవ మాట్లాడుకుని ఇంగ్లీషు ఛానల్ దాటి కాలీస్ రేవు చేరడానికి సాహసించారు.

ముందు వాతావరణం బాగానే ఉంది. ఆల్బియన్ కొండ కొనలు దూరమై పోతున్నాయి. ఈ పలాయనులు ప్రస్తుతానికి క్షేమంగా ఉన్నట్లే.

సముద్రపుగాలి చల్లగా సేదతీర్చింది. మేరీ చాలా చాలా అలసిపోయి షెల్లీ ఒడిలో పడి నిద్రపోయింది. షెల్లీ మానసికంగా డస్సిపోయినా, ఆమెను తన భుజం ఆసరా ఇచ్చి నిద్రపుచ్చాడు. ఆకాశంలో చంద్రుడు కారు మేఘాల వెనక్కు వెళ్ళిపోయాడు. తుఫాను తాకిడి, చీకటిలో మెరుపుల వెలుతురులో సముద్రపు భీభత్సాన్ని చూశారు. తెల్లవారుతుండగా తుఫాను తగ్గుముఖం పట్టింది. వెలుగు రేఖలు విచ్చుకున్నాయి. భానుని కిరణాలు ఆశావహంగా

అరుణ వర్ణంతో ఆకాశాన్ని వెలిగించాయి. మబ్బులన్నీ విడిపోయి తీరంలో ఫ్రాన్సు దేశం ఆహ్వానం పలికింది.


మేరీ నిద్రమత్తు వదిలింది. కాలిస్ వీధుల్లోని ఉత్సాహం రణగొణ ధ్వనులతో మత్స్యకారుల రంగురంగుల దుస్తులు ఆనందాన్ని కలిగించాయి. అర్థం కాని కొత్త భాష ఆమెలో ఆసక్తిని రేపింది.

ఆరోజు చిన్న హోటల్‌లో గడిపారు. వారి సామాను డోవర్ నౌకలో రావలసి వుంది. తీరా సామానుతో పాటు ఆకుపచ్చ కళ్లజోడుతో శ్రీమతి గాడ్విన్ కూడా దిగింది. ఆమె ఎలాగైనా జేన్‌ను తీసుకుపోవాలని ప్రయత్నించింది. కాని షెల్లీ వాక్చాతుర్యం ఆమెను ఒంటరిగానే తిప్పి పంపించింది.

సాయంత్రం ఆరు గంటలకు, ఆ ముగ్గురు ప్రయాణికులు కాలిస్ రేవు వదిలి మూడు గుర్రాల గూటి బండిలో బోలోన్ బయలుదేరారు.

* * *

వారు స్విట్జర్లాండ్ చేరాలనే ప్రణాళికతో బయలుదేరారు, దారిలో కొన్ని రోజులు పారిస్‌లో గడిపి. కాని అక్కడికే వారి సొమ్ములు నిండుకున్నాయి. షెల్లీ దగ్గర ఫ్రెంచి వ్యాపారస్తుడైన టావర్‌నీర్‌కు ఉత్తరం ఉంది. ఆయనే వారికిక్కడ బ్యాంకర్ అన్నమాట. అతన్ని తాముంటున్న హోటల్‌కు భోజనానికి రమ్మన్నారు. టావర్‌నీర్ వచ్చి - ఇద్దరు యువతులతో ఆజానుబాహుడైన ఈ అందగాడి ప్రయాణం ఎందుకో అర్థంకాలేదు. చివరికి షెల్లీ తన గడియారం - మెడలోని గొలుసు తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అతనికి ఎనిమిది 'నెపోలియన్' నాణాలు వచ్చాయి. రెండు వారాలు తిండితిప్పలకు సరిపోవచ్చు. ఆ విధంగా కాస్త స్థిమితపడి - పారిస్ వీధులు - లోవరీ మ్యూజియం - నోట్రాడోమ్ అన్నీ తిరిగారు. సాయంత్రాలు గదిలో కూర్చుని మేరీ తల్లి కవితలు - బైరన్ కవితలు చదవటానికి - సమయం గడిపారు.



మోయలేని బరువు

ఒక వారం తర్వాత, టావర్‌నీర్ - మంచివాడే, 60 పౌండ్లు ఇవ్వటానికి - అంగీకరించాడు. కాని ఈ సొమ్ము వారిని గమ్యానికి చేర్చదని, ఒక గాడిదను సామాను మోయటానికి కొని, నడక సాగించటానికి నిర్ణయించారు!! షెల్లీ సంతకెళ్లి, చిన్న గాడిదను కొని తెచ్చాడు - ఆ మర్నాడు చిన్న బండిలో 'చారెన్‌టన్' సరిహద్దుకు బయలుదేరారు. వారి వెనకనే ఆ చిన్న గాడిద సామాను మోసుకొస్తుంది!



నెపోలియన్ నాణెం

1814లో ఫ్రాన్స్‌లో ఈ మార్గాలన్నీ దుర్గమంగానే ప్రమాదకరంగా వున్నాయి. అప్పుడే సైనిక పటాలాలు కవాతు చేస్తున్నాయి. దారి దొంగలు ప్రయాణీకులను దోచుకోవడం సర్వసామాన్యమయిన విషయం. అక్కడి పొలాల్లో పనిచేస్తున్న రైతులు - కూలీలు ఈ ప్రయాణీకులను వింతగా చూస్తున్నారు. ఈ అసాధారణమైన బండి ఇద్దరు యువతులు - నల్లటి సిల్కు గౌన్లతో - ఉంగరాల జుట్టుతో - వెనుక చిన్న గాడిదతో - వారికి అంతుబట్టలేదు. నాలుగయిదుమైళ్ల తర్వాత షెల్లీ - జేనీ చివరికి ఆ గాడిదను మోయవలసిన పరిస్థితి తలెత్తిందంటే నవ్వాలి. తర్వాత ఆగిన గ్రామంలో ఆ గాడిదను అమ్మి ఒక బండిలాగే 'మ్యూల్'ని కొన్నారు. వీరు ప్రయాణిస్తున్న పరగణా అంతా యుద్ధం తర్వాతి వాతావరణంలో నాశనమయి వుంది. గ్రామాలు సగం పైగా శిథిలమయిపోయాయి. ఇళ్ల కప్పులు లేవు. తగలబడిన ఇళ్లు నల్లని దూలాలతో దారుణంగా వున్నాయి.

పాలకోసం అడిగితే - అక్కడి రైతు, కోసాక్ సైనికులను తిట్టాడు. అతని ఆవులను తోలుకు పోయినందుకు.

వారు విశ్రాంతి తీసుకోవాలంటే - దారిప్రక్క వసతులు దారుణంగా దుమ్ము కొట్టుకు పోయి వున్నాయి. వాటిని వాడుకోటానికే భయపడ్డారు. పందికొక్కులు విచ్చల విడిగా తిరుగుతున్నాయి. భయంతో, రాత్రంతా కూర్చుని గడపటంలో అలవాటు పడ్డారు. రాత్రి వెలిగే పొయ్యి గదిలో - వాతావరణాల్ని వేడెక్కించేది నిద్రకు - మెలకువకు మధ్యలో - చిన్న

పిల్లల ఏడుపులు వినపడేవి. ఎక్కడో చెక్క మంచాలు విరుగుతున్నట్లు కలలు వస్తుండేవి.

మేరీ – తన తండ్రిని తలుచుకుని బాధపడింది. షెల్లీ, హారియెట్ గుర్తుకు వచ్చి ఇబ్బందిపడ్డాడు.

'ట్రాయిస్' వూరినుంచి షెల్లీ – హారియెట్‌కి చాలా పెద్ద ఉత్తరం వ్రాశాడు. వెంటనే వచ్చి – స్విట్జర్లాండులో తమను కలవమని! తమకు దగ్గర్లోనే వుండాలని, ఆ విధంగా తమ స్నేహాన్ని స్థిరంగా వుంచుకోగలమని – మేరీ ఆరోగ్యం గురించి రాశాడు. ఇది చాలా సామాన్యమైన విషయంగా భావించాడు–

ఆమె తప్పని సరిగా వచ్చి కలుస్తుందనీ నమ్మాడు. 'ప్రపంచం' అనుకోవచ్చు ఇలాంటి జీవితం అనైతికమని – అయినా ఇలాంటి లోకంతో పనేముంది? దాని ఇష్టా ఇష్టాలను పట్టించుకోవాలా?

ఇలాంటి అసూయాద్వేషాల కంటే – ప్రేమ, కరుణ ముఖ్యంగాదూ?

కాని హారియెట్ ఎలాంటి జవాబు రాయలేదు–!

* * *

Pontarlier, Neufchatel మీదుగా పయనించి – Lake of Four Cantons చేరారు.

షెల్లీ Brunnenలో కుదురుకుందామని అనుకున్నాడు – అది – స్వతంత్రాన్ని సమర్థించే – పరగణా చాపెల్ విలియం టెల్ దగ్గర్లో వుంది. అక్కడ వున్న ఒక ఖాళీ వసతి – చాలా పురాతనమై గుట్ట మీద వున్న బంగళా – ఎవరూ చుట్టు ప్రక్కల లేరు. త్వరలో శిథిలమయి పోవచ్చు కూడా. అందులో రెండు గదులు అద్దెకు తీసుకున్నారు– ఆరు మాసాలు ఉండటానికి. అందుకు కావాల్సిన మంచాలు – పరుపులు సామానులూ కొన్నారు. ఆ వూరి వైద్యుడు – వూరిపెద్ద వచ్చి పలకరించి వెళ్లారు.

అదే రోజు షెల్లీ ఒక గొప్ప నవలరాయడం మొదలు పెట్టాడు 'The Assassins'

ఇక అక్కడే వాళ్లు 'శాశ్వతంగా' వుండి పోవటానికి నిర్ణయించుకున్నారు!

* * *

ఆ రాత్రి, వారి పొయ్యి మండలేదు - ఇలాంటి విషయాలు షెల్లీకి అంతగా తెలియదు. అయినా ప్రయత్నించాడు. ఫలితం లేదు.

గదులన్నీ పొగతో నిండి పోయాయి. బయట వర్షం కర్కశంగా తలుపులు - కిటికీలు బాదుతోంది!

వారి ముగ్గురికి ఒక్కసారిగా ఒంటరితనం కమ్ముకొచ్చింది. వెంటనే తమ ఇంటిలోని సుఖాలు - క్షేమం గుర్తుకు వచ్చాయి. వెచ్చని టీ, తమ చుట్టూ తమ భాష మాట్లాడే చిరునవ్వుతో తిరిగే వారు - వాళ్ల పేర్లతో పిలిచే వారు. అందరూ గుర్తుకు వచ్చారు !

షెల్లీ ఇంకా ఎంత సొమ్ము వుందో లెక్కవేశాడు. 28 పొండ్లు మిగిలాయి. అందరిలో ఆందోళన మొదలయ్యింది.

అంతే, షెల్లీ - 'ఇంటికి వెళ్లిపోదాం' అని అన్నాడు.

అలా అనుకోగానే - అందరిలో ఉత్సాహం పెల్లుబికింది.

"ఇది ఎంత హాస్యాస్పదంగా వుందంటే", తర్వాత జేనీ రాసింది - "మేము ఆ ఇంటిలో సామాను అన్నీ కొని - ఆరు మాసాలు ఉండటానికి నిర్ణయించుకున్నాము.

రెండో రోజునే - తిరుగు ప్రయాణానికి నిర్ణయించటం! అదీ అక్కడి పొయ్యి సరిగా వెలగలేదని - పొగలు కమ్మిందని! డోవర్ తీరం వదిలి - ఇంగ్లండు కొండలు కనపడకుండా పోగానే - ఇంక ఎప్పుడూ వీటిని చూడననుకున్నాను. కాని ఇప్పుడు..."

ఈ నిర్ణయం అర్థరాత్రి సమయంలో తీసుకున్నారు. మర్నాటి ఉదయమే - వర్షం కుండ పోతగా వుండగానే - స్విస్‌లోని - లూసెర్న్‌కు పడవ ఎక్కారు. ఆ వూరి 'బ్రన్నెన్' పెద్ద, వారు వెళ్లిపోయారని తెలిసి ఎంత ఆశ్చర్యపోయాడో!

లూసెర్న్ నుంచి - ప్రయాణీకుల నౌక ఎక్కి (Bale) బేల్ చేరారు. అక్కడి నుంచి కోలోన్.

వాతావరణం అద్భుతంగా వుంది. సాయంత్రపు చీకట్లలో చుక్కలు వెలుగుతున్నాయి. నావికులు ప్రేమ గీతాలు పాడుతున్నారు.

షెల్లీ The Assassins రాస్తున్నాడు.

మేరీ, జేనీ చెరొక నవల రాయటం మొదలు పెట్టారు. తమ చుట్టూ కొండల మీది కోటల శిథిలాలు – వీరి పుస్తకాల్లోని నాయకులకు గొప్ప నేపథ్యాన్నిచ్చాయి.

తరువాత డచ్ మెయిల్ బండి, వారిని ఎక్కించుకుని చెక్క యిళ్లు, నిద్రాణంగా వున్న పంటచేలు – కాలువల, గాలిమరల దారుల్లో ప్రయాణం చేసింది.

రోటర్ డామ్ చేరేసరికి, ఇంక వారి చేతిలో – చిల్లిగవ్వలేదు – చాలా సేపు మాట్లాడిన తర్వాత ఒక నౌకాధిపతి వీరిని ఇంగ్లీషు ఛానెల్ దాటించటానికి అంగీకరించాడు – ఆ రోజు వారి పరిస్థితిలాగానే – సముద్రం చాలా అల్లకల్లోలంగా వుంది.

షెల్లీ, నౌకలో ఒక తోటి ప్రయాణీకునితో 'బానిసత్వం' గురించి వాదిస్తున్నాడు. మేరీ, జేనీ అతన్ని సమర్థిస్తున్నారు, ఎంతో ఉత్సాహంగా! నిజానికి మర్నాడు వారికి కనీసం తినటానికైన వుంటుందో లేదో తెలియదు – కాని పెర్సీ బుద్ధికుశలత మీద వారికి ఎనలేని నమ్మకం – మనిషి సిద్ధుడనీ విశ్వసిస్తారు.



రెండు రోజుల మకాం!

రెండవ అధ్యాయం

కష్టకాలం

ఆ విధంగా లండన్ చేరిన తర్వాత – బండిలో ఇద్దరు యువతులతో సరాసరి – బాంకుకే వెళ్లాడు సామానుతో సహా! అప్పటికే హారియెట్ తన ఖాతాలోని సొమ్మంతా తీసుకువెళ్లి పోయింది. మేరీకి – జేనీకి చాలా కోపం వచ్చింది.

ఇప్పుడు బండికి డబ్బు ఇవ్వలేని స్థితి – పోలీసు స్టేషన్‌కి వెళ్లడం ఇష్టంలేక హారియెట్‌ను చూడటమే మేలనుకున్నారు. షెల్లీ దగ్గర ఆమె చిరునామా వుంది. చివరికి అక్కడకే వెళ్లి తలుపు కొట్టాడు. హారియెట్ తన భర్త తిరిగి వచ్చాడనే అనుకుంది కాని, కింద తన శత్రువు వేచి వుందని తెలిసి కోపంతో వూగిపోయింది– కాని, షెల్లీకి కొన్ని పౌండ్లు అప్పుగా ఇచ్చి, ఆ కష్టం నుంచి గట్టెక్కించింది –

వారు ముగ్గురు – ఇరుకు సందులో ఒక వసతి చూసుకున్నారు. వారి పరిస్థితి విషమంగా తయారయ్యింది. గాడ్విన్ గారు వీరికి దర్శనమే ఇవ్వలేదు.

షెల్లీ వాదన – "నేను మీ 'రాజకీయ ధర్మానికి' ఉదాహరణ చూపించాను" అని! ఇది ఆ గ్రంథ కర్తను మరింతగా కుపితుణ్ణి చేసింది. ఆయన దృష్టిలో 'రాజకీయ ధర్మం' ఒక సిద్ధాంతం! అది ఎంత వరకు ఆచరణీయం? అది ఆదర్శం మాత్రమే! అయినా అది రాసి చాలాకాలం అయ్యింది. లండన్‌లో – దయా దాక్షిణ్యాలు కరవయిన ఈ సంఘంలో ఆయన్ను తన యింటిలోనే – తన స్నేహితుల సమక్షంలోనే తనను – తన కూతుర్ని ఇలా అప్రతిష్ఠ పాలుచేయటం – అదీ తన సిద్ధాంత గ్రంథాన్ని అడ్డుపెట్టుకుని – ఆయన భరించలేక పోయాడు – వారిని ఎప్పటికీ క్షమించలేనని తేల్చి చెప్పాడు.

జాన్ టేలర్ గారికి రాస్తూ, ఈ దుస్సాహస యాత్రను "ఎంతో విచారకరమైన కథ ఒకటి చెప్పాలి – ఈ సరికే మీకు తెలిసి వుంటుంది – షెల్లీ పేరు. మిమ్మల్ని ఇంకా మబ్బులో వుంచటం నాకిష్టం లేదు– అతను వివాహితుడు – నా కూతుర్ని లేవదీసుకు పోయాడు. ఇంతకంటే దారుణం నా కింకేమి కావాలి – జరగాలి"?

"మేరీ నా ఒక్కగానొక్క కూతురు - ఆమె ఆరోగ్యరీత్యా స్కాట్‌లాండ్‌లో వుంటోంది. మార్చి 30న లండన్ వచ్చింది. షెల్లీ జూన్ 18న లండన్‌కి వచ్చాడు - మా యింటికి విందుకు ఆహ్వానించాను. ఆదివారం - 26 జూన్ - మేరీతో పాటు వాళ్ళమ్మ సమాధి చెంతకు వెళ్లారు. బహుశా అక్కడే ఈ దురాగతానికి బీజం పడివుంటుంది. అతను ఎంత పిచ్చివాడంటే తన ప్రణాళిక మొత్తం నాకు చెప్పాడు. నా అంగీకారం కోసం, అతను చేస్తున్నది ఎంతటి అనైతికమో విడమర్చి చెప్పాను. - ఒప్పించాననే అనుకున్నాను. కాని జూలై 27 రాత్రి మేరీని -జేనీని నాయింటి నుంచి తీసుకు పోయాడు - మర్నాడు నిద్ర లేచేసరికి వారి ఉత్తరం చూశాను."

టేలర్ గారిని, ఈ విషయం ఎవ్వరికీ తెలియనీకుండా దాయమన్నాడు. ఎలాంటి అపవాదు తన కూతుళ్లకు రాకూడదని. "అపవాదు అన్నమాట ఉపయోగించినపుడు - నాకు పూర్తి అవగాహన వుంది. ఈ నేరం మేరీదే - జేనీ కేవలం ఒక పావు మాత్రమే..."

* * *

అప్పటికే షెల్లీ - మేరీ తండ్రిగారి అప్పులు తీర్చటానికి చాలా అప్పులే చేశాడు. ఇప్పుడు గాడ్విన్ అవన్నీ తిరిగి చెల్లించే స్థితిలో లేడు - పైగా ఆయనకు కొత్త అవసరాలు వున్నాయి. అదిగో ఆ అవసరాలే ఆయన్ను అయిష్టంగానైనా చెడిపోయిన ఈ విశ్వాస ఘాతకుడు - షెల్లీతో, సంపర్కంలో వుంచినాయి. 'నా అంతరాత్మకు వ్యతిరేకంగా' అని ఆయన ఎంత చెప్పినా - మేరీ, జేనీ ఆహా 'ఎంత నాటకం - ఏమి తాత్త్వికుడు-' అని ఆశ్చర్యపోయేవారు.

శ్రీమతి గాడ్విన్ - తన మరో కూతురు ఫానీని వారిని చూడకుండా ఆంక్షలు పెట్టింది. ఒకసారి తాను ఒంటరిగా జేనీని చూడటానికి వెళ్ళినపుడు మెట్ల మీద షెల్లీ కనపడితే - వెంటనే ముఖం తిప్పుకుంది.

హారియెట్‌కి ఇప్పుడు కావలసింది ఏమీలేదు. ఇంకా కొంత సొమ్ము మిగిలివుంది. అది గాక తండ్రి కొంత పంపిస్తున్నాడు. కాని చంటిపిల్లతో అనారోగ్యంతో ఆమె ఏమాత్రం సంతోషంగా లేదు. ఇరుగు పొరుగు వారికి తన విషాద సాహస గాథ వినిపించి, వినిపించి విసుగు తెప్పిస్తోంది. తన స్నేహితురాలయిన కాథరిన్ నూజెంట్‌కు - డబ్లిన్‌లో దుస్తుల తయారీదారు, పెద్ద వుత్తరమే రాసింది.

"ఏ వయసుకు ఆ ముచ్చటన్నట్లు - ఎప్పటి కష్టాలప్పటివి! నా కష్టాలు దేవునికే తెలియాలి! ఇయాంతి క్షేమంగానే వుంది. ఇప్పుడు పధ్నాలుగు నెలలు - ఆరు పళ్ళు వచ్చాయి. ఈ పాప లేకపోతే నేనేమై పోయేదానినో? ఎలీజా కూడా నాతోనే వుంది.

ఈ లౌకిక ప్రపంచం నాకు చాలా పరీక్షలు పెట్టింది. ఈ విధంగా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు.

కాని కాలం అన్ని గాయాలను మాన్పుతుంది. నా పాప కోసం నేను చాలా కాలం బ్రతకాలి. తరచు ఉత్తరాలు రాస్తుండు.

నీ ఆరోగ్యం ఎలా వుందో తెలుపుతుండు. ఎప్పుడూ నిరాశ చెందకు . నాకయితే ఎలాంటి ఆశ మిగిలినట్లులేదు - ఇంత మంచితనం పూర్తిగా మోసపూరితమై భ్రష్టుపట్టిపోయిన తర్వాత - ఈ ప్రపంచంలో ఏదీ ఖచ్చితంగా వుండదు. మరో లోకం వుందని అనుకుంటాను. ఇక్కడ బాధలు పడినవారు - ఆ లోకంలో సుఖపడతారని ఆశిస్తాను ! ఎలీజా నాతోనే వుంది. ఆమె నీకు బాగా తెలియదు. నిజంగా ప్రేమించదగింది. ఇప్పటికి శలవు.

నీ శ్రేయోభిలాషి - స్నేహితురాలు

ఇయాంతి చాలా అల్లరి చేస్తోంది... ఎ. షెల్లీ.

* * *

ఒక్కోసారి ఆమె చాలా ఆశాజనకంగా వుంటుంది. తన స్నేహితులు - ఇలాంటి ప్రేమ వ్యవహారాలు ఎక్కువ కాలం సాగవు - అతను త్వరలోనే నీ ఒడిలోకి వస్తాడని చెప్తుంటారు.

అలాంటి సమయంలోనే షెల్లీకి రాస్తుంది - స్నేహపూర్వంగా. ఆమెకు ఇప్పటికీ ఇదంతా మేరీ నిర్వాకమనే నమ్మకం. నిజానికి తన భర్త చాలా మంచివాడనే ఆమె మనసు చెప్తుంది. అంతమంచి వాడు 'తన బిడ్డలనిద్దర్ని' వదలిపోతాడా? (షెల్లీ ఎప్పుడూ హారియెట్‌ని కూడా 'చిన్నపిల్ల'గానే పరిగణించాడు.)

ఒక్కోసారి మూర్ఛలాగా, నరాల బలహీనతతో నిరాశలో కూరుకుపోతుంది. అలాంటి సమయంలోనే ఇతరుల బ్రతుకులను మరింతగా కష్ట పెట్టాలని చూస్తుంది. అప్పటికే అప్పులు చేసింది. వాళ్లందర్నీ షెల్లీ మీదకు తోలింది. గాడ్విన్ కూతుళ్ళ మీద కోపంతో - గాడ్విన్ బాకీ దారుల్ని మరింతగా పురి కొల్పింది. అలాంటి సమయంలో - మేరీ, హారియెట్‌ను ఇంతవరకూ చూడకపోయినా "ఆహా! ఆ భయంకరమైన స్త్రీ" అని నిట్టూర్చేది.

నవంబరులో, ఒక రోజు తన ఆరోగ్యం సరిగాలేక బాధలో – షెల్లీకి కబురుపెట్టింది. మొదటగా అతనే గుర్తువస్తాడు. అంత రాత్రిలో హడావుడిగా వచ్చాడు. ఆమెకు కేవలం స్నేహ హస్తం అందించి ఆదుకోవటమే అతని ఆలోచన. హారియెట్ – అతని చనువును అపార్థం చేసుకుని కౌగలించుకోబోయింది. షెల్లీ చాలా మెత్తగా – తోసిపుచ్చాడు!

ఆ నవంబరు చివరిలో ఆమెకు ఎనిమిది నెలల బాబు పుట్టాడు! అందు మూలంగా కూడా వారికి సయోధ్య కుదరలేదు.

షెల్లీకి, ఆ బిడ్డకు తండ్రి తానే అని నమ్మకం లేదు.

* * *

ఇన్ని ఇక్కట్ల మధ్య – మేరీతో చాలా సంతోషంగా వున్నాడు. వారిద్దరి ఆలోచనలు – ఇష్టాలు ఒకే రకంగా వుండేవి. ఇద్దరూ – ఈ జీవితాన్ని ఒక వరంలా భావించేవారు. వయసుతో పాటు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తపన పడేవారు.

చదివిన పుస్తకాలే చదివే వారు. అతనితో పాటు – బ్యాంకులకు, న్యాయవాదుల దగ్గరకు వెళ్తుండేది. ప్రభుత్వ అధికారులను కలిసేవారు. సర్పెంటయిన్ నదిలో కాగితం పడవలు షెల్లీ ఒదులు తుంటే, ఆక్స్‌ఫర్డ్ రోజుల్లా మేరీ ప్రక్కనే కూర్చుని ఓపికగా తన నాజూకైన వేళ్లతో పడవలు మడిచి ఇస్తుండేది.

అతను నేర్పగా, లాటిన్, గ్రీక్ ఆసక్తిగా నేర్చుకుంటోంది. ఈ విషయంలో హారియెట్ ఎప్పుడూ వెనకబడే ఉండేది. షెల్లీ మొదటి భార్య ఈ చదువు చప్పగా ఉన్నట్లు భావించేది కాని – మేరీ ఈ విద్యలో గొప్ప సంస్కారం ఉందని ఆనందించేది. అదే ప్రేమను మానవీయం చేస్తుందని తెలుసుకుంది. కేటులస్, థియోక్రిటస్, పెట్రార్క్– వీరందరి రచనలు చదువుతుంటే ఈ ప్రేమికులకు మరింతగా సాన్నిహిత్యం పెరిగేది.

షెల్లీ ఎంతో ఆసక్తితో, తన ప్రియురాలు ఈ విద్యను అభ్యసించటం, అదీ ఎంతో ఇష్టంగా, తన వ్యక్తిత్వాన్ని పరిపుష్టం చేసుకోవటానికని గమనించి ఆనందించాడు. ఆమె తనకంటే మేధావిగా అంగీకరించటానికి వెనుకాడలేదు.

* * *

జేనీ తన పేరు అంతగా బాగోలేదని 'క్లెయిర్' అని మార్చుకుంది. ఎంతో చురుకైన, ఆకర్షణీయమైన క్లెయిర్ ఒక నీడలా మిగిలిపోయింది షెల్లీ, మేరీ ప్రేమకథలో. వీరిద్దరికి

ఇంత దగ్గరలో నివసించటం ఆమెకు నిజంగా బాధాకరమైన పరిస్థితే. ఆమెకు పెర్సీ అంటే పిచ్చి అభిమానం. అది వ్యక్తం చేయటానికి వెనుకాడలేదు. ఇది మేరీకి కంట్లో నలుసు మాదిరిగా తయారైంది. కాని షెల్లీకి దీనిలో ఎటువంటి అభ్యంతరకరమైన భావమూ కనపడలేదు.

అతనికి ఒంటరితనమంటే అసహ్యం. మేరీ ఇప్పుడు తల్లి కాబోతోంది. అందుకని ఎక్కువగా ఇంటిపట్టునే ఉంటోంది. షెల్లీతో అర్థరాత్రి వరకు సాహిత్య చర్చలు చేయలేక పోతోంది. షెల్లీ, క్లైయిర్‌ను తనతో పాటు లాయర్ల దగ్గరకు, సర్పెంటయిన్ నదీ తీరానికి తీసుకు వెళ్తుంటాడు. ప్రతి సాయంత్రం గడపమని క్లైయిర్‌ను అర్థిస్తాడు. ఆమెతో హారియెట్ గురించి, కుమారి హిచ్‌నర్ గురించి, తన చెల్లెలు గురించి వివరంగా చెప్తుంటాడు. అతనికిలా మనసు విప్పి మాట్లాడుకోవటం చాలా ఇష్టం. అభిప్రాయాలను చర్చించుకోవటం, నిర్మొహమాటంగా ఆలోచనలు వ్యక్తీకరించటం, ఆసక్తికరంగా ఉండేది. ఎందుకంటే క్లైయిర్‌తో అతనికి ఎటువంటి లౌకిక అనుబంధం లేదు కదా! కాని మేరీకిది తలనొప్పిగానే అనిపించేది. ఆ విషయం క్లైయిర్‌కి తెలియజేసింది కూడా. దానితో ఆ రోజంతా ఆమె చెల్లెలు ఎంతో చిరాకుగా, విచారంగా గడిపేది.

సాయంత్రం మేరీ నిద్రపోగానే షెల్లీ ఆమెను ఓదార్చేవాడు. చాలా తెలివిగా ఓర్పుగా తమ ముగ్గురు అనుబంధంలోని మంచి చెడులు వివరించి చెప్పేవాడు. అతని మంచితనాన్ని, దయను క్లైయిర్ ఎక్కువ కాలం భరించలేకపోయేది. 'నేను చాలా బాధలు పడ్డాను' అని వాపోయేది.

'అవన్నీ నువ్వు ఊహించుకున్నవే! నీవు మేరీ మాటలకు, చేతలకు అనవసరమైన ప్రాముఖ్యతనిస్తున్నావు. నిజానికి మేరీకి నీమీద చెడు ఉద్దేశ్యాలేమీ ఉండవు' షెల్లీ.

'ఏది ఏమైనా నేను చాలా బాధలు అనుభవించాను. కాని నన్ను దయగా, ప్రేమగా చూసేవాళ్లంటే నాకు చాలా ఇష్టం.'

ఈ సంభాషణంతా షెల్లీ దాయకుండా మేరీకి చెప్పేవాడు. పైగదిలో క్లైయిర్ తనలో తను మాట్లాడుకుంటూ, నిద్రలో నడుస్తుండేది. ఒకోసారి అలాగే క్రిందికి వచ్చి ఒంటరి తనం భరించలేకపోతున్నట్లు బాధపడేది. అప్పుడు మేరీ తనతోపాటు పడుకోబెట్టుకొని నిద్రపుచ్చేది. షెల్లీ పై గదిలోకి వెళ్లేవాడు.

ఇలాగే తరుచూ జరుగుతుండేది. క్లెయిర్ తన నరాల బలహీనతను షెల్లీకి వివరించేది. రాత్రంతా దెయ్యాలు, భూతాలు గురించి మాట్లాడుకొని చివరకు వాళ్లు ఒకరిని ఒకరు జడిపించుకునే స్థితికి వచ్చేవాళ్లు.

'ఏమైంది నీకు ? నీలో చావు కళ కనపడుతోందే ? నీ కళ్ళు... బాబోయ్! అలా చూడకు భయంగా వుంది' షెల్లీ అంటాడు.

'నిన్ను చూసినా భయంగా వుంది. ఇక్కడి గాలి స్తంభించింది. దెయ్యాలు తిరుగుతున్నాయి. మనం వెళ్లిపోదాం' అంటూ క్లెయిర్ తొందర చేసేది.

ఆ విధంగా విడిపోయిన తరువాత షెల్లీ, మేరీ గదికి వచ్చేవాడు. కాసేపట్లో పై నుంచి కేకలు వినపడేవి. తరువాత మెట్లమీద దొర్లుకుంటూ ఎవరో పడినట్లు – ఒళ్లంతా కొంకర్లు పోయి క్లెయిర్ కిందకు వచ్చి– తన దిండు కింద ఏదో ఉందని, ఎవరో చెయ్యి పట్టుకు లాగేరని చెప్పేది. షెల్లీ ఇదంతా ఆసక్తిగా వినేవాడు.

మేరీ నమ్మనట్లు – క్లెయిర్ ఎంత త్వరగా వదిలి వెళ్లిపోతే అంత మేలు అందరికి అనుకుంటుంది.

* * *

ఈ సంఘ బహిష్కృతులు తమ స్నేహితులనెవర్నీ కలవటం లేదు. శ్రీమతి బోయిన్ విల్లీ, శ్రీమతి న్యూటన్ కుటుంబాలు ఎంత విశాలహృదయం కలిగిన వారైనా, షెల్లీ సాహస కృత్యాలను ఆహ్వానించలేకపోయారు. గాడ్విన్‌గారి లాగానే వీరికి కూడా ఆదర్శాలను, ఆచరణలో పెట్టడంలో ఏదో లౌకికమైన ఇబ్బందులున్నట్లు గమనించారు.

మరో పక్క అనుమాన పూరితుడైన హాగ్, పీకాక్ – వీరిప్పటికీ హారియెట్ అమాయకత్వాన్ని సమర్థిస్తూ షెల్లీని తప్పుపడుతున్నారు.

కాని వారికి మానవత్వం మెండుగా వుంది, ప్రేమానురాగాలు ఏదో మానసిక వ్యాధిలా హాస్య ధోరణిలోనే తీసుకున్నారు.

షెల్లీ హాగ్‌ను కాస్త అనుమానంగానే ఆహ్వానించాడు. ఇలాంటి కుటిలుడు, మేరీని, క్లెయిర్‌ని ఇబ్బంది పెడతాడనే కొంత వెనకాడాడు. అలాగే మేరీకి అతని ప్రవర్తన ఏమాత్రం నచ్చలేదు కూడా. 'హాస్యగాడిగా బాగానే వున్నాడు. కాని ముఖ్యమైన విషయాలొచ్చేసరికి అతని వాదనంతా అసత్యమే' అనుకుంది.

నిజానికి హాగ్, కాలం గడిచే కొద్ది అచ్చమైన ఇంగ్లీషు వాడిలా తయారవుతున్నాడు. సంకుచితంగా, సంప్రదాయబద్ధుడైనట్టు, ఆటల గురించి పబ్లిక్ పాఠశాలల గురించి మంచి పాత వింటేజ్ వైన్ గురించి మాట్లాడతాడు. మేరీని చూసి 'చాలా ఆకర్షణ గలది, అంత మేధావి కూడా' అని షెల్లీకి చెప్తాడు. షెల్లీ అదే మాట మేరీకి చేరవేస్తాడు.

ఆ తరవాత హాగ్ వచ్చినప్పుడు, మేరీ కాస్త ఓర్పుతో కూడిన సానుభూతి చూపింది. నిజానికి అతని నైతిక సూత్రాలన్నీ గుడ్డివానికి రంగుల మాదిరిగానే వుంటాయి. ఇలాంటి కరుడుగట్టిన పాపికి, దేవతల్లాంటి వీరి మధ్య చోటు లేదు. అయినా, అతని వాక్చాతుర్యానికి ఆనందిస్తారు. అతని నిరాసక్తత ఒక ముసుగు అని మేరీ అనుకుంటుంది. అతనికి నిజాయితీ అంటే భయం. తన నిజస్వరూపం బయటపడితే ఇటువంటి అరుదైన సాన్నిధ్యం దొరకదని జాగ్రత్తగా వుంటాడు. ఇలాంటి హావభావాలను దాచి పెట్టడంలో అతను దిట్ట.

అతనికున్న కొద్దిపాటి సంస్కారంతోనే మేరీకి, క్లెయిర్‌కి - ఓవిడ్, అనాక్రియాన్ అనువాదం చేయటంలో సహాయ సహకారాలు అందించాడు. వారిద్దరినీ షెల్లీ లేనప్పుడు టోపీల దుకాణాలకు, దుస్తుల దర్జీల దగ్గరకి తీసుకువెళ్తాడు.

మేరీకి - హారియెట్‌కి ఈ దుకాణాల విషయంలో చాలా వ్యత్యాసం ఉంది. మేరీ టోపీలను, దుస్తులను కేవలం అవసరానికే కొంటుంది. షెల్లీ ఎప్పుడూ పొరపాటున అవి అనవసర అలంకారాలుగా అనుకునే అవకాశం ఇచ్చేది కాదు. ఎందుకంటే ఆమెకు కూడా అలాంటి ఆడంబరాలు ఏమాత్రము నచ్చవు.



రోమ్ వీధి

మూడవ అధ్యాయం

విలియమ్ గాడ్విన్ ...

వసతి గృహ సహాయకుడు, షెల్లీకి ఒక చీటీ తెచ్చిచ్చాడు. వీధికి ఆ వైపు ఒక యువతి నిలబడి ఉందని చెప్పాడు.

ఆ చీటీ పంపింది ఫానీ - దాని సారం : అప్పుల వాళ్లు షెల్లీని అరెస్టు చెయ్యాలని పన్నాగం పన్నుతున్నారని.

షెల్లీ-మేరీ పరుగున ఫానీ కోసం వెళ్లారు. ఆమె భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. గాడ్విన్ పెట్టిన ఆంక్షలు అట్లాంటివి. కాని ఆమెకు మనసులో షెల్లీని చూడాలనే కోరిక బలంగా ఉంది. పైగా ఇప్పుడు అతను తన అక్కకు చెందినవాడు.

అలా పారిపోతున్న ఫానీని షెల్లీ దగ్గరలోనే పట్టుకోగలిగాడు. ఆమె - 'చట్టరీత్యా మిమ్మల్ని బంధించాలని చూస్తున్నారు. మీ చిరునామా ప్రచురణ కర్త ఇచ్చాడు. పైగా గాడ్విన్ మిమ్మల్ని రక్షించడానికి పొరపాటున కూడా రాడు' - అని చెప్పింది.

షెల్లీకి, మాయమై పోవటం తప్ప మరో దారిలేదు. చేతిలో సొమ్ము లేదుకదా. వెంటనే మరో వసతికి వెళ్లిపోటానికి సిద్ధమయ్యాడు మేరీని, జేనీ (క్లెయిర్)ని ఇక్కడే వదిలి. ఆ విధంగా షెల్లీకోసం వచ్చేవారిని తప్పుదారి పట్టించవచ్చని అనుకున్నారు.

ఆ కారణంగా మొదటి సారిగా ప్రేమికులు ఎడబాటు భరించాల్సి వచ్చింది. ఇది ఇద్దరికీ భరించరానిదిగా మారింది. ఏ పార్కులోనో, చర్చిలోనో కలుసుకుని వెంటనే విడిపోయేవారు. మేరీ వెనుకనే పోలీసులు రావచ్చు. కాని ఆదివారం - ఆ రోజు అరెస్టు చెయ్యరు - అర్థరాత్రి వరకూ కలిసి వుండే వారు. ఒక సాయంత్రం విడిపోలేక, మేరీ, షెల్లీతో పాటు అతను ఉంటున్న హోటలుకు వచ్చింది. ఆ హోటల్ యజమాని అనుమానంగా

చూసి, కనీసం ఎటువంటి సామాను లేదని, ముందుగా చెల్లిస్తే కాని భోజనమైనా పెట్టనని షరతు పెట్టాడు.

షెల్లీ, పీకాక్ కోసం కబురు పెట్టాడు. అలా ఎదురు చూస్తూ జేబులోనుంచి షేక్స్పియర్ పుస్తకం తీసి మేరీ కోసం Troilus and Cressida చదివి వినిపించాడు. వారిద్దరూ ఈ పఠనంలో మునిగి ఆకలి దప్పులను మరిచిపోయారు ఆ రోజంతా. మర్నాడు ఉదయం ఫలహార సమయానికి పీకాక్ తన దగ్గర సొమ్ములేక కేకులు పంపాడు.

జీవితం దుర్భరమైతే, అది కలిసి అనుభవించటంలోనే ఆనందం ఉంటుంది.

ప్రేమకు ఎప్పుడూ దురదృష్టమే తోడుగా ఉంటుంది.

* * *

వారు ఎడబాటుగా ఉన్నప్పుడు రహస్యంగా చిన్న చిన్న ఉత్తరాలు పంపుకునేవారు.

"ఓ నా ప్రియమైన ప్రేమా ! మన ఆనందాలు ఇంత తక్కువ సమయంలో ఇన్ని అంతరాయాలతో నిండి ఉన్నాయేమిటి ? ఇలా ఇంకెన్నాళ్ళు ? రేపు సెయింట్ పాల్ చర్చిలో కలుసుకుందాం. అంతకంటే ముందుగా వీలుకాకపోతే – సంధ్య వేళ ప్రార్థనలో ప్రేమను మర్చిపోకు. నేనూ మర్చిపోను" అని షెల్లీ రాసేవాడు.

'గుడ్‌నైట్ ప్రియా !' మేరీ జవాబు 'రేపు నీ పెదవుల మీద ముద్రతో ఆశీర్వదిస్తాను. నన్ను హత్తుకో. నీ మేరీని కౌగిలించుకో. నేను మంచిగా ఉంటాను. అల్లరి చేయను. గ్రీకు నేర్చుకుంటాను. ఇంకా చాలా ఉంది. కలిసినప్పుడు చెప్తాను. నన్నెలా సన్మానిస్తావు?'

* * *

జనవరి, 1815 వీరికి గడ్డుకాలం గడిచిపోయిందనవచ్చు. ఎవరూ కోరుకోకపోయినా కాని అందరూ అనుకున్నట్లుగానే షెల్లీ తాతగారు సర్ బీష్ షెల్లీ తన 83వ యేట మరణించారు. ఇది దుఃఖ వార్తయినా, ఒక రకంగా షెల్లీ కష్టాలు గట్టెక్కినట్లే.

క్లెయిర్‌తో కలిసి షెల్లీ – ఫీల్డ్ ప్లేస్ భవంతికి బయలు దేరాడు. ఎంతో ఆదుర్దాగా ఆవేశంగా. ఇప్పుడు తిమోతిగారికి కొత్త హోదా 'సంస్థానాధీశునిగా' వచ్చింది. దానితో మరింత అహంకారిగా కోపగించుకున్నాడు.

షెల్లీని భవంతిలోకి రాకుండా అడ్డుకున్నారు. ఆ భవంతి మెట్ల మీద కూర్చుని మిల్టన్ – 'కోమస్' చదువుకున్నాడు. వైద్యుడు వచ్చి తండ్రి ఆగ్రహంగా వున్నట్లు చెప్పాడు. అంతలో అతని మారుటి తమ్ముడు సిడ్నీ వచ్చి వీలునామాలోని విషయాలన్నీ తెలియజేశాడు.

చాలా అసామాన్యమైన వీలునామా – తాతగారి ముఖ్య లక్ష్యం – తన వంశానికి గొప్ప వారసత్వ సంపద అప్పగించి పోవాలని – దానికోసం ఇప్పుడున్న ఆస్తులన్నీ ఏకం చేసి అనేక తరాలుగా అందించాలని!

ఎంత తక్కువగా లెక్కవేసినా రెండు లక్షల పౌండ్ల విలువగల ఎస్టేటు వుంటుంది. దీనిలో ఎనభైవేల పౌండ్ల భాగం పెర్సీకే చెందాలని – అదీ తన తండ్రి తదనంతరం!

తాను ఇంత జాగ్రత్తగా అభివృద్ధి చేసి పెంపుజేసిన ఎస్టేటును తరువాత తరాల వారు ఇంకా ఇబ్బడి ముబ్బడిగా పెంచాలని – ఆ తర్వాత తరాల వారికి అందించాలని ఆశించారు. పెద్ద కుమారుడు వారసుడుగా ఈ పరంపర సాగాలనీ రాశారు. దీనికి తన మనుమడు పెర్సీ సంతకం కూడా అవసరమని మెలిక పెట్టారు.

దీనికి పెర్సీ అంగీకరించి సంతకం చేస్తే – తన తండ్రి తదనంతరం ఎస్టేటు మొత్తానికి వారసుడవుతాడు.

ఒకవేళ ఆ విధంగా సంతకం చేయకపోతే – తండ్రి తదనంతరమే – ఎనభైవేల పౌండ్లు అతనికి దక్కుతాయి. ఇదీ విషయం, వీలునామాలో...!

ఈ విషయం తెలుసుకొని షెల్లీ లండన్ తిరిగి వెళ్ళాడు. తన లాయర్లతో కలిసి చర్చించాడు.

ఈ తరాల పరంపరలపై అతనికి నమ్మకం లేదు. అలా అని సంతకం చేయాలని అనుకోవటం లేదు. అతని సిద్ధాంతానికి, ఆదర్శానికి ఇది పూర్తిగా వ్యతిరేకం. ఇలాంటి కాలయముని చట్టాలు అతను అంగీకరించడు. అంతే కాదు తనకోసం, తన సంతానం కోసం ఈ సంపదను పోగుచేయటం అతని కోరిక కానే కాదు.

అతను కోరుకునేది మర్యాదగా బ్రతకడానికి ఖర్చు పెట్టుకోగలిగిన ఆదాయం అంతే. కొంత అప్పులు తీర్చడానికీ కావాలి.

అది సాధించటానికి తన లాయర్ల ద్వారా తన తండ్రికి కొన్ని ఆస్తులు వదులు కోవటానికి సిద్ధపడి కబురు చేశాడు. తిమోతిగారు సంతోషించినా, అది ఎంత వరకు చట్టపరమైనదో తెలియక ఊరుకోవలసి వచ్చింది. చివరికి షెల్లీ చిన తాతగారి ఆస్తి కొంత,

18వేల పౌండ్ల వరకూ, అమ్మటానికి సిద్ధపడ్డాడు. దీని మూలంగా షెల్లీకి అత్యవసరంగా సంవత్సరానికి వెయ్యి పౌండ్ల ఆదాయం వస్తుంది. మూడు వేల పౌండ్లు అప్పులు తీర్చటానికి అందుబాటులోకి వస్తుంది. ఇది గొప్ప అదృష్టం కాకపోయినా చాలా వరకూ అతని కష్టాల కడలి దాటినట్లే.

షెల్లీ ముందుగా ఆలోచించింది హారియెట్ గురించే. సంవత్సరానికి రెండువందల పౌండ్లు ఏర్పాటు చేశాడు. దీనికి తోడు మరో రెండు వందల పౌండ్లు హారియెట్ తండ్రిగారు ఇస్తున్నారు. ఈ మొత్తంతో ఆమె నిశ్చింతగా గడపవచ్చు.

తర్వాత గాడ్విన్ గారి అప్పులు తీర్చటానికి సిద్ధపడ్డాడు. అందుకోసం వెయ్యి పౌండ్లు తన సంవత్సరాదాయం నుంచి పక్కన పెట్టాడు. కాని, దీనికి తన 'గౌరవ నీయుడైన స్నేహితుడు' ఈ మొత్తం చాలా తక్కువని విచారం వెలిబుచ్చాడు.

ఈ విషయం తెలిసి షెల్లీ, తన కోపాన్ని అణుచుకుంటూ "అరె! మీ కూతుర్ని లేవదీసుకు పోయిన వాడికి మీరిట్లా వ్రాయవచ్చా, అదీ సొమ్ముకోసం? పైగా కూతురితో తెగతెంపులు చేసుకున్నానని ప్రగల్భాలు పలికి... ? దీని వల్ల ఆమె ఎంత కష్టం అనుభవించిందో తెలుసా?" - అంటూ రాశాడు.

దీనికి గాడ్విన్ "నేను అప్పు మాత్రమే చేస్తున్నాను. కాని మేరీని రానివ్వను. అది నా గౌరవానికి భంగం.

అంతేకాదు, నా అప్పులు తీర్చటానికి కూతుర్ని అమ్ముకున్నానన్న నింద కూడా నాకు వద్దు" అని తన పేరుతో షెల్లీ పంపిన చెక్కు తిప్పి పంపుతూ తమ ఇద్దరి పేర్లూ ఒక కాగితం మీద ఉండకూదని, కాని చెక్కు తన స్నేహితులైన జోసఫ్ హ్యూమ్ పేరగాని, జెమ్స్ మార్టిన్ పేరగాని రాయమన్నాడు. అప్పుడే దాన్ని సొమ్ము చేసుకుంటానన్నాడు.

ఈ సందర్భంలో షెల్లీ ఆయనకు రాస్తాడు.

"నాకొక విషయం అర్థం కావటం లేదని ఒప్పుకోవాలి. అది మన మధ్యనున్న ఆర్థికపరమైన లావాదేవీలు- మిమ్మల్ని నా పట్ల వ్యవహరించే తీరుని ఎలా ప్రభావితం చేస్తుందని?

మేము ఫ్రాన్స్ నుంచి తిరిగి వచ్చినప్పుడు మీ ధోరణిలో మార్పు లేదు. ఇప్పుడూ మారలేదు. నిజానికి నేను గాని, మీ కూతురు మేరీ గాని మీ నిరాదరణకు నిరంతరమూ

లోనయ్యాం. ఇది ఇలా జరిగి ఉండవలసిన అవసరం లేదు. మీతో పాటు మా చుట్టూ ఉన్న లోకం కూడా మమ్మల్ని చాలా వేధించింది.

నిజానికి, మీ అభిప్రాయాన్ని మానవజాతి గౌరవించినంత కాలం మమ్మల్ని, అమాయకులైన మీ సంతానాన్ని మోసగాళ్లతో, వ్యభిచారులతో జమ కట్టాల్సిన అవసరం లేదు.



విలియమ్ గాడ్విన్

మీరు మా పట్ల చూపించిన దారుణమైన, కఠినమైన వైఖరే నన్ను ఆశ్చర్య పరుస్తుంది. కోపోద్రిక్తుణ్ణి చేస్తుంది. అలాంటి పరిస్థితుల్లో మీ బాగోగులు గురించి ఆలోచించవలసిన అవసరం నాకేమిటి ? ఇంకా 'క్షమ' గురించి మాట్లాడకండి. నా రక్తం ఉడికిపోతోంది. నాలో కోపం రగిలిపోతోంది. ఇన్ని జరిగినా, ఒక ప్రేమ జీవిగా మీ శతృత్వాన్ని, మానవజాతి అసహ్యాన్ని భరించగలిగాను."

దీనికి గాడ్విన్ జవాబు.

'మీ ధోరణి మన మధ్య ఏ మాత్రం రాజీ తీసుకురాదు. అదే మాదిరిగా నాకూ సమాధానం రాయటం ఇష్టం లేదు. దీని వలన మన మధ్య ఇంకా చేదు అనుభవమే మిగులుతుంది. ఏది ఏమైనా నేను మీ ప్రవర్తనను, దాని ద్వారా నాకు కలిగిన నష్టాన్ని అంగీకరించలేను.'

చివరగా షెల్లీ రాస్తాడు;

"అయితే మన మధ్య సమాచారాన్ని డబ్బుకే పరిమితం చేద్దాం.

నేను, నా పరిధిలో చేస్తానన్న సహాయం చేయటానికి అన్ని విధాలా ప్రయత్నిస్తాను. ఇది మీ తక్షణ అవసరాలకు తప్పనిసరి కదా!"

ఈ ఉత్తరంలో ఉన్న నిరసన స్వరం, గాడ్విన్ తత్త్వవేత్తను ఆ రుణం తీసుకోకుండా ఆపలేకపోయింది.

* * *



లార్డ్ బైరన్ (డాన్ వాన్)

నాల్గవ అధ్యాయం

లార్డ్ బైరన్

నెలలు నిండక మునుపే మేరీ బిడ్డను కన్నది. వైద్యుడు మరణశాసనం రాశాడు కూడా.

షెల్లీ, ఉయ్యాలకీ, మేరీ మంచానికీ మధ్య కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ కాపలా కాస్తున్నాడు. ఆమె చెల్లెళ్ళు తోడుగా ఉన్నారు.

ఫానీ పసిబిడ్డకు గుడ్డలు తెచ్చింది, శ్రీమతి గాడ్విన్ పంపగా. కాని మన తత్త్వవేత్త ఎటువంటి చలనం లేకుండా ఉండిపోయాడు.

హాగ్ తరచూ వచ్చి వార్తలు చెప్తుండేవాడు. ఆ రోజు జరిగింది, మర్నాడు జరగబోయేది కూడా. ఇది మేరీకి చాలా ఉత్సాహాన్నిచ్చేది. అప్పటికే జ్వరంతో బాధపడుతూ ఎప్పుడూ షెల్లీ సన్నిధిలో ఉంటున్న మేరీకి, ఇది ఒక ఆటవిడుపుగా ఉండేది.

వైద్యుడు చెప్పినట్లు కాకుండా పసిబిడ్డ బతికి బట్టకట్టింది. మేరీ చాలా ఆనందపడింది కూడా. కాని ఆ ఆనందం ఎక్కువ కాలం నిలబడలేదు. ఓ దురదృష్టపు రోజు ఉదయాన్నే నిద్రలేచి చూసేసరికి, తన బిడ్డ కన్ను తెరవలేదు. ఇంతకంటే దుఃఖం ఏముంటుంది తల్లికి...

* * *

షెల్లీ, క్లెయిర్ తమ సాయంత్రపు షికార్లకు వెళ్తూనే ఉన్నారు. అనారోగ్యంతో మేరీ ఇంటి దగ్గరే ఉండిపోతుంది. కుర్చీలో కూర్చుని అల్లుకుంటూ తన బిడ్డను తలుచుకునేది. ఇప్పటి వరకు అమ్మను... కాని ఇప్పుడు? ఇలా ఎప్పుడూ అనుకుంటూనే ఉండేది. నిద్రలో పాప బ్రతికి ఉన్నట్లు కలలుకనేది. మళ్లీ ప్రాణంతో వచ్చినట్లు భ్రమపడేది. కళ్లు తెరిచి చూస్తే ఉయ్యాల ఖాళీగా ఉండేది. బజారులోనుంచి గుంపుల కేకలు వినపడుతుండేవి. అప్పుడు దొమ్మీలు జరుగుతున్నాయి. ఫ్రాన్స్ యుద్ధ భయం పెట్టింది.

మేరీకి ప్రపంచమంతా కన్నీటి తెరలోంచే కనపడుతోంది.

ఇప్పుడు, క్లెయిర్ ఇంట్లో తిరగటం మేరీకి మరింతగా విసుగు పుట్టిస్తోంది. ఆమె షెల్లీని ప్రేమిస్తోందని తెలుసు. షెల్లీ చాలా విశ్వాసపాత్రుడనీ తెలుసు.

అతని నైతికత మానవాతీతమైనది. అతని వ్యక్తిత్వం దేవతా సమానమైనది. అతను ఏమాత్రం ప్రలోభానికి లోను కాకుండా తనను ఇష్ట పడుతున్న యువతికి పెట్రార్క్ చదివి వినిపించగలడు. ఆ అమ్మాయికి చదువు చెప్పగలడు – రాత్రంతా మేల్కొని ఏమాత్రం 'ప్రమాదం' జరగకుండా!

నా ప్రియమైన షెల్లీ, దేవతలను, దెయ్యాలను బాగా అర్థం చేసుకోగలడు – ఆడవారికంటే, అనుకునేది మేరీ.

సాయంత్రం అతనితో ఒంటరిగా ఉన్నప్పుడు తన అసూయ, భయాలను తెలియ పరిచేది. ఇది – ఈ భావన నిజంగా షెల్లీకి అర్థమయ్యేది కాదు. ఇది చాలా నేలబారు ఆలోచన. ఇలాంటి ఆలోచనలు దేవతలాంటి మేరీకి రాకూడదని అనేవాడు.

ప్రేమయొక్క అనంతత్వం అతనికి తెలియనిది కాదు. అలాంటి ప్రేమను పంచివ్వటంలో తన ప్రియురాలిని తక్కువ చేయటం కాదు. క్లెయిర్ లాంటి చైతన్యంతో వెలిగిపోయే యువతి సాన్నిధ్యం అతనికి చాలా అవసరం. కానీ, రాను రాను ఈ ముక్కోణపు సంబంధాలు (ఈ మూడుస్తంభాలాట) ఊపిరాడకుండా చేస్తున్నాయని గుర్తించాడు.

క్లెయిర్‌ను దూరంగా పంపించమని, మేరీ, అతన్ని అర్థించింది.

'నీ స్నేహితురాలు' ఇప్పుడు ఇలాగే పిలుస్తుంది క్లెయిర్‌ని. చాలా రోజులు క్లెయిర్‌కు ఏదైనా నివాసం ఏర్పరచాలని వెదికారు. ఎక్కడైనా గవర్నెస్‌గా కుదురుకుంటుందని లేదా ఎవరింటిలోనైనా పెద్దవారికి తోడుగా పెట్టాలని ప్రయత్నించారు.

దురదృష్టమేమంటే, వీరి ఫ్రాన్స్ సాహసయాత్ర వార్తలు బాగానే ప్రచారం జరిగి, అలాంటి అవకాశం లేకుండా పోయింది.

అసలు క్లెయిర్‌కి వెళ్లాలని లేదు.

తన మేధోపరమైన సాన్నిహిత్యం – పెర్సీతో – ఈమె చాలా సంతోషం అనుభవిస్తోంది. దాని పర్యవసానం కోసం ధైర్యంగా ఎదురు చూస్తోంది కూడా.

చివరికి మేరీ పోరుతో విన్‌మౌత్‌లో శ్రీమతి బ్రిక్‌నెల్ ఇంట్లో ఉండటానికి ఏర్పాటు చేశారు.

మేరీ తన డైరీలో ఇలా రాసుకుంది.

శుక్రవారం - అంతగా బాగుండలేదు. ఉదయం ఫలహారం తరువాత స్పెన్సర్ చదివాను. షెల్లీ తన స్నేహితునితో బయటకు వెళ్లాడు. ముందుగా అతనే తిరిగి వచ్చాడు. *ఓవిడ్* అనువాదం తొంభై లైన్లు చేశాను. హాగ్ వచ్చాడు. *ఓవిడ్* చదివాను. షెల్లీ క్లెయిర్‌తో షికారుకు వెళ్లాడు. తిరిగి వచ్చిన తరువాత టీ తాగాం.

షెల్లీ, అతని స్నేహితునితో సంభాషణలతో ఇవాళ ముగిసింది.

శనివారం - షెల్లీ బయలుదేరాడు. క్లెయిర్ అనుసరించింది. ఆమెతోనే తిరిగి వచ్చాడు. హాగ్ ఐదు గంటల వరకూ రాలేదు. షెల్లీ మళ్లీ బయటకు వెళ్లాడు. చాలా సేపటి వరకు రాలేదు. ఆందోళన ఎక్కువయింది. అతని కోసం బయలు దేరాను. బయట వర్షం. చివరికి షెల్లీ ఆరున్నరకి వచ్చాడు. *ఓవిడ్* చదివాను. ఛార్లెస్ క్లెయిర్ మాంట్ టీకి వచ్చారు. చిత్రాల గురించి మాట్లాడాము.

నేను కొత్త డైరీ మొదలు పెట్టాను.

* * *

క్లెయిర్ పల్లె ప్రాంతానికి తరలి వెళ్లిపోయింది. అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఆమెను సేదతీర్చింది - ఇన్నాళ్ల వత్తిడి తర్వాత ప్రశాంతత లభించినట్లు.

కాని ఆమె చైతన్యానికి, ఉత్సాహానికి పల్లెటూరి ఒంటరితనం ఎక్కువకాలం ఆనందాన్ని ఇవ్వలేదు.

జీవితానికి అర్థం అంటూ ఉండాలి కదా. ఆ అన్వేషణలో ఆమె సఫలీకృతమైంది.

ఎవరైనా ప్రేమిస్తున్నారంటే వారు పొరపాటుగా ఊహించుకున్నట్లే. తమకొక అరుదైన వ్యక్తి తారసపడినట్లు, వారిమూలంగానే ప్రేమోద్వేగం కలిగినట్లు భావిస్తారు.

అసలు విషయం, ప్రేమ అంతరంగంలో ఉండేదే! ఆ ప్రేమకు దారి చూపగా తారసపడిన వ్యక్తిని అన్వేషించి కనుగొన్నట్లు, ఒక వేళ అలా లభించకపోతే ఆ వ్యక్తిని తానే సృష్టించుకొన్నట్లుంటుంది.

నా నిరీక్షణా నిష్ఠురతతో...

ఈ ప్రకృతి నుండి నీవు ఉద్భవించాలి.

...లేని నిన్ను సృష్టిస్తాను.

రాని నిన్ను రప్పిస్తాను... – కె.

ఒక సామాన్య యువతికి, ఈ ప్రేమాన్వేషణ తనకు తెలియకుండానే జరిగిపోతుంది. కాని క్లెయిర్ విషయంలో, అదీ చైతన్యంతో తొణికిసలాడే ఉడుకు రక్తం గల యువతి తనకు కావలసింది సాధించుకుంటుంది.

తన అక్క ప్రియుడైన షెల్లీని, తనవైపు ఆకర్షించుకోలేనని తెలుసుకున్న తరువాత – కనీసం ముగ్గురూ కలిసి బ్రతకలేమని తెలిసిన తరువాత...

ఆమె తనచుట్టూ పరికించి చూసింది – తన కథానాయకుడు, తన ప్రేమకు అర్హుడైన కథానాయకుడు ఎక్కడున్నాడా అని.

కొంతమంది, రచయితలకు లేదా సిపాయిలకు లేదా నటులకు ప్రేమలేఖలు రాస్తారు. కాని క్లెయిర్ స్వతహాగా కవితా హృదయం కలది. అందుకని కవినే ఎంచుకుంది. అదీ అప్పుడు గొప్పగా వెలిగిపోతున్న 'లార్డ్ బైరన్‌ని'. అప్పటికే అతనిపై ఉన్న ఆరాధనా వైరుధ్యాలను – అతను ఎంత గొప్పగా ఆరాధించబడుతున్నాడో అంత నీచంగా ద్వేషించబడుతున్నాడు ఇంగ్లాండులో...

క్లెయిర్‌కు అతని కవితలన్నీ కంఠతా వచ్చు. షెల్లీ ఎంతో ఉత్సాహంగా ఆమెకు ఎన్నో సార్లు వినిపించాడు.

అతని చుట్టూ అల్లుకున్న మంచీచెడుల కథలన్నీ వినే ఉంది. అతని ప్రమాదకరమైన ఆకర్షణ సమాచారం సేకరించింది.

బైరన్ అసాధారణమైన అందం, అతని అంతస్తు – అతను లార్డ్ – అతని మేధ – రచయితగా అతని కీర్తి – ప్రగతి శీలమైన అతని ఆలోచనలు – అతని ప్రేమ వ్యవహారాలు, ఇవన్నీ కలబోసి చూస్తే క్లెయిర్‌కి ఒక పూర్ణచంద్రుడైన కథానాయకుడు కనిపించాడు లార్డ్ బైరన్‌లో...

అప్పటికే అతనికి, చాలా గొప్పనారీమణులతో వివాహేతర సంబంధాలున్నాయి. ఆక్స్‌ఫర్డ్ యువరాణి, ఫ్రాన్సెస్ వెబ్‌స్టర్ లేడి, లేడీ కారోలిన్ లాంబ్ – ఈమె అతన్ని కలిసిన మొదటి రోజున తన జర్నల్‌లో రాసుకుంది. 'అబ్బా ! మహాచెడ్డ, పిచ్చి, ప్రమాదకరం ఇతని పరిచయం' అని రాసి తరువాత, 'కానీ, ఈ పాలిపోయిన అందగాడితోనే నా తలరాత ముడిపడి ఉంది' అని కలిపింది.

అప్పటికే అతనికి వివాహమయింది. ఆ తరువాత ఇంగ్లండు అంతా ఈ కథ చెప్పుకునే వాళ్లు. వివాహం జరిగిన తరువాత బగ్గీలో ఎక్కి "ఇప్పుడు నీవు నా భార్యవు. ఈ అర్హత చాలు నేను నిన్ను అసహ్యించుకోవటానికి. నీవు మరొకరి భార్యవై వుంటే బహుశా నేను ఇష్టపడే వాడినేమో" అన్నాడని. ఆమె పట్ల ఎంత దారుణంగా ప్రవర్తించాడంటే సంవత్సరం తిరగక ముందే విడాకుల కోసం అభ్యర్థన పెట్టుకుంది.

క్లెయిర్ – ఆమెకు ప్రమాదకరమైన సాహసాలే కావాలి. తనంటే తనకంత నమ్మకం, బైరన్ చిరునామా తెలుసుకొని తన అదృష్టాన్ని పరీక్షించ దలుచుకుంది.

క్లెయిర్, బైరన్‌కు రాస్తుంది :

పూర్తిగా అపరిచితమైన వ్యక్తి, మీకు రాయటానికి సాహసిస్తోంది. నాకు ఎలాంటి దానాలు అవసరం లేదు. అలాంటి స్థితిలో కూడా లేను. ఈ ఉత్తరం ఎలాంటి అదృష్టానికి నోచుకుంటుందోనని ఆలోచించటానికే వణుకుపుడుతోంది. ఒకవేళ ఇది అవివేకమయిన చర్యగా మీరు భావించినా, ఆశ్చర్యపోను.

ఇది మీకు వింతగా, ఆశ్చర్యంగా ఉండవచ్చు. కాని నా సుఖసంతోషాలు మీ చేతుల్లో పెడుతున్నాను. ఇంతవరకు ఎటువంటి మచ్చాలేని యువతి, ఒక రక్షకుడు గాని భర్తగాని లేని స్వతంత్రురాలు, కేవలం మీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడటానికి సిద్ధపడిందంటే – అదీ కంపించే హృదయంతో – ఎన్నో ఏళ్లనుంచి మీ మీద ప్రేమతో, మీకు ప్రేమను, కరుణను అతి జాగ్రత్తగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉండి, మిమ్మల్ని ఆరాధిస్తున్నదంటే – మీరు ఆమెను మోసగిస్తారా? లేక నిశ్శబ్దంగా ఉండిపోతారా?

దయచేసి వెంటనే రాయండి.

E. TREFUSIS, 21 NOLEY PLACE, MARY LE BONNE

* * *

లార్డ్ బైరన్ – 'డాన్ వాన్'గా ప్రసిద్ధి చెందిన గ్రంథకర్త. ఎటువంటి సమాధానం పంపలేదు. ఇలాంటి అపరిచిత వ్యక్తి ఎంత గొప్పగా రాసినా అతనికిది పిల్లలాట కిందే లెఖ్ఖ.

కానీ ప్రపంచంలో ఎవరు అలసిపోయినా – ఆడదాని ఓర్పుకు సాటిరారు. అదీ తన కన్యాత్వం కాపాడుకోవటంలో... అలసిపోయిన స్త్రీకి అసలు సాటిరారు.

రెండోసారి తనబాణాన్ని ఎక్కుపెట్టింది.

"ఆదివారం ఉదయం, లార్డ్ బైరన్‌గారిని అర్థిస్తున్నాను. ఈ సాయంత్రం ఏడు గంటలకు మీకు వీలయితే, ఈ యువతి చాలా అవసరంగా కలిసి, ముఖ్యమైన వ్యవహారం చర్చించాలి. అదీ ఎంతో రహస్యంగా"

అంటూ కబురు పంపింది.

లార్డ్ బైరన్ తాను ఊరిలో లేనట్లు పనివాడితో కబురు పంపాడు.

క్లెయిర్, బైరన్‌కు 'డ్రూరీలేన్ థియేటర్'లో పరపతి ఉందని తెలుసుకొని తనకు అక్కడ ప్రవేశం కావాలని అడిగింది.

బైరన్ అక్కడి మేనేజర్‌ను అడగమన్నాడు.

అప్పటికీ ఆమె పట్టు వదలలేదు.

'నాకు కావలసింది నాటకంలో వేషం కాదు. నేను సగం నవల రాశాను. దాని మంచిచెడులు బైరన్‌గారు చూసి చెప్పాలి' అని సందేశం పంపింది.

అప్పటికీ అతను సమాధానం ఇవ్వలేదు. ఇక చివరి అస్త్రం ప్రయోగించింది. అదీ మగవాడు, ఆత్మగౌరవంగలవాడు తిరస్కరించలేని విధంగా..

"నేను అవివేకిగా కనిపించవచ్చు. ఇబ్బందికరంగాను ఉండవచ్చు. కానీ కాలమే నిర్ణయిస్తుంది. నా ప్రేమ, సాత్వికమైనదని, ఆర్ద్రమైనదని – దీనిలో ఎలాంటి ప్రమాదం లేదని నా భవిష్యత్తు మీతో ముడిపడి ఉందని –

'నా ఈ ప్రణాళిక మీకు అంగీకారమౌతుందా? ఈ గురువారం సాయంత్రం మనం ఊరు వదిలి వెళ్ళిపోదాం. అక్కడ మనకు పూర్తిగా ఏకాంతం. క్షేమకరం. మర్నాడు ఉదయం తిరిగి రావచ్చు. నేను అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను. ఎటువంటి అనుమానం ఎవరికీ రాకుండా. మీరు కూడా మీ వాళ్లకు తెలియనీకండి'

"మీతో కేవలం కొద్దిసేపు గడపటానికి, సమయం కేటాయించండి, మీరు వెళ్లిపొమ్మని చెప్పిన మరుక్షణం నేనక్కడ ఉండను. మీరు ఏమి చేసినా, చేయకపోయినా మీ సున్నితమైన ప్రవర్తనతో, పాటు మీ అసలు సిసలైన ముఖాన్ని గుర్తుపెట్టుకుంటాను."

ఆ విధంగా లార్డ్ బైరన్ అనే డాన్ వాన్ వలలో పడ్డాడు. ఇంత సుదీర్ఘంగా వదలకుండా అనుసరించే ప్రయత్నాన్ని కాదనలేక, తన ఓటమిని అంగీకరించటానికి సిద్ధమయ్యాడు.

ఎలాగూ ఇంగ్లండు వదిలి వెళ్లిపోవాలనే నిర్ణయించుకున్నాడు. స్విట్జర్‌లాండ్‌కో, ఇటలీకో ప్రయాణం కావాలనే ఆలోచనతో ఉండటంతో, క్లెయిర్ వ్యవహారం అతని నిర్గమనాన్ని ముందుకు తీసుకువెళ్లింది. అయిష్టంగానే... ఈ ఆహ్వానం లేని అందగత్తెతో...



ఇంగ్లీష్ చానెల్ - తుఫానులో

అయిదవ అధ్యాయం

ఏరియల్ - డాన్ వాన్

షెల్లీ - బైరన్

క్లెయిర్, తప్పని సరిగా బైరన్ వెనుకనే స్విట్జర్‌లాండ్ వెళ్లాలని నిశ్చయించుకుంది. ఇందుకోసం షెల్లీ దంపతులను తనకు రక్షగా ఏర్పాటు చేసుకుంది. వారికి కూడా మార్పుకోసం ఇంగ్లండు వదిలి వెళ్లిపోవాలని వుంది. బైరన్ ఎలాగూ స్విట్జర్‌లాండ్ వెళ్లేందుకు సిద్ధంగానే ఉన్నాడు. ఈ నీలికళ్ల చిన్నది ఒక జ్వాలాముఖి - ఒక అగ్నిజ్వాల.

క్లెయిర్, బ్రాక్‌నెల్ దగ్గర ఉన్నప్పుడు షెల్లీ జంట విండ్సర్ అడవి సరిహద్దులో బిషప్ గేట్ వద్ద ఉంటున్నారు. ఈ అడవి అంచుల్లో, ఓక్ చెట్లనీడల్లో షెల్లీ తన దీర్ఘ కవిత, క్వీన్ *మాబ్* తరువాత రాశాడు. దాని పేరు *ఎలస్టర్ లేక స్పిరిట్ ఆఫ్ సాలిట్యూడ్.*

ఇది తన ఊహా జనిత, అధి ఆత్మిక అనుభవాల నివేదన. తాను గత సంవత్సరం గడిపిన కొండలు కోనలు, నదీతీరాలు, అడవి ప్రాంతాలు – ఈ నేపథ్యంగా కవిత సాగింది. ఇది, తను ఇంతకు మునుపు రచనలకంటె భిన్నస్వరంలో ఉంది. నిరాశా నిస్పృహల ఓదార్పులో, గత కాలపు అనుభవాల విశ్వాసం, మత, నైతిక పరమైన సిద్ధాంతాలు – ఇవన్నీ ఇంకా తనను కట్టిపడవేసే కట్టుకొయ్య అయితే అది మరింతగా భూమిలోకి దిగబడిందనుకోవచ్చు.

దాని ముందుమాటలో, కవిని – ప్రేమకోసం తపించే వ్యక్తిగా దర్శించి ప్రేమ సాఫల్యం కాని స్థితిలో మరణిస్తున్నట్లు చిత్రిస్తాడు.

అరె – అలా చనిపోవటం మేలు కదా, సామాన్యుల మాదిరి ప్రాపంచిక సుఖాల్లో బ్రతకడం కంటే?

అలా జీవించేవారు – ఔదార్యంతో వంచింపబడిన వారు కాదు.

పవిత్రమైన జ్ఞాన తృష్ణతో సంకుచితులు కారు.

మూఢనమ్మకాల పిచ్చి భ్రమల వల్ల, మోసపోయిన వారూ కాదు.

ఈ మర్త్యలోకంలో దేనినీ ప్రేమించ లేని వారు.

ఊర్థ్వ లోకాలపై ఎటువంటి ఆశలు లేని వారు.

అయినా సాటివారి పట్ల సానుభూతి లేని వారు.

మానవీయ ఆనందాలు – దుఃఖాల అనుభూతికి లోను కాని వారు.

అయ్యో – ఇంకా వీరిలాంటి వారు శాపగ్రస్తులు.

నైతికంగా మరణించిన వారు.

అలాంటి వారు స్నేహితులూ కారు – ప్రేమికులూ కారు – తండ్రులూ కారు. – అసలీ ప్రపంచ పౌరులే కాదు.

వారు దేశానికి ఉపయోగపడే వారూ కాదు.

వారి జీవితం వృధా – కేవలం వృద్ధాప్యం కోసం ఎదురు చూస్తూ సమాధులు కట్టుకొనే వారు...

* * *

షెల్లీకి తన గత కార్యాలపట్ల ఎటువంటి చింతా లేకపోయినా, ఇంగ్లండులో బ్రతుకు దుర్భరంగా ఉంది. తన అవివాహిత భార్య మేరీ సమాజంలో చాలా అవమానాలు పడుతోంది. కనీసం ఇక్కడి నుంచి మరో దేశానికి వెళ్తే తమ కథ తెలియని ప్రదేశంలో కొత్త స్నేహితులు దొరకవచ్చు.

మేరీకి చక్కని బాబు పుట్టాడు. జనవరి 1816. తన తండ్రిపేరు – విలియమ్ అని పెట్టింది. ఇప్పుడు ఇంటి ఖర్చు పెరిగిపోయింది. పైగా ఒక నర్సును కూడా భరించ వలసి వస్తోంది.

స్విట్జర్‌లాండ్‌లో ఖర్చు తక్కువ. అలా అని క్లెయిర్ తన అక్కగారిని ఒప్పించటానికి ఎక్కువ కష్టపడలేదు.

ఈ ముగ్గురు తమ మొదటి సాహస యాత్రలాగే మళ్లీ ఇంగ్లండు వదిలి, ఫ్రాన్సు చేరి – బర్గుండి, జూరా మీదుగా జెనీవా చేరారు.

ఆ దగ్గరలోని సేచిరాన్‌లో హోటల్ యాంగిల్ టెర్రీలో కుదురు కున్నారు. ఆ హోటల్ జెనీవా సరస్సు అంచున నిలబడి ఉంది. కిటికీలోంచి నీలి సరసు అలలపై సూర్యకిరణాలు మెరవటం, ఆ పైన నల్లని కొండల బారు లేత ఎండలో ఊగుతున్నట్లు, ఇంకా ఆ పైన తెల్లమబ్బులు మంచుకొండలతో మాట్లాడు తున్నట్లు – ఓహ్! ఏమి వాతావరణం...

ఇంగ్లండు విచారపూరితంగా మబ్బులు మూసిన పగళ్లు – వర్షంతో తడిసే రాత్రిళ్లతో పోలిస్తే – ఇది స్వర్గమే.

ఒక చిన్న పడవ అద్దెకు తీసుకొని ఆ నీటిమీద తేలుతూ రోజంతా గడిపేవారు, చదువుకుంటూ – నిద్రపోతూ...

* * *

ఆ విధంగా సంతోషంగా చిన్న పిల్లలాంటి ఈ ముగ్గురూ – పైన నీలి ఆకాశం, కింద నీలి సరస్సు, మధ్యలో ఈ చిన్నపిల్లలు – రోజులు దొర్లిపోతుండగా...

తన సామాను అన్నిటితో – *ఛైల్డ్ హెరాల్డ్* రచయిత ఫ్లాండర్స్ రేవు దగ్గర ఇంగ్లీష్ ఛానల్ దాటుతూ వీరిని కలిసేందుకు ప్రయాణం చేస్తున్నాడు.

ఇంగ్లండు, సమయానుకూలంగా మారిపోతుండే నైతిక విలువల పిచ్చిలో ఎంత మేధావి అయినా, ప్రతిభగల కవి అయినా, బైరన్ లాంటి విశృంఖల జీవనశైలి గలవానిని తన తీరాలనుంచి వెంటాడి వేటాడింది.

అతను ఏ విందులోనైనా ప్రవేశించగానే ప్రతి స్త్రీ ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోతుంది– ఏదో సైతాను అతని రూపంలో వస్తున్నట్లు.

విసిగిపోయి అలాంటి కపట సమాజాన్ని వదిలి తన పాదాలకు ఆ నేలతాలూకు ఇసుక రేణువులు కూడా ఉండకూడదని, విదిలించుకొని అతను తీరం దాటుతున్నాడు.

అతనికి వీడ్కోలు ఎంతో ఆసక్తికరంగా జాతర్లాగా జరిగింది.

సమాజం, తన కట్టుబాట్లపై తిరుగుబాటు దారుణ్ణి ఎంత కర్కశంగా శిక్షిస్తుందో, అతన్ని చూసి అంతగా అసూయ చెందుతుంది ఆశ్చర్యంతో.

డోవర్ రేవు దగ్గర ఈ యాత్రికుడు నౌక ఎక్కే చోట అతనికి వీడ్కోలు ఇచ్చేందుకు రెండు వరసల్లో నిలబడి చేతులూపారు- అదే సమాజంలోని పౌరులు. గొప్పింటి స్త్రీలు తమ పనివాళ్ళ దుస్తులు ఎరువు తెచ్చుకొని ఎవరూ గుర్తుపట్టకుండా అతన్ని చూసేందుకు గుంపులో కలిసిపోయారు. అతని అంతులేని సామాన్లలో సోఫాలు, పుస్తకాలు, ఖరీదైన కప్పులు, గ్లాసులు ఇంకా కుక్కలు, నెమళ్ళు, పనివాళ్లను గుర్తించి ఆశ్చర్యపోయారు.

సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బైరన్ తన తోటి ప్రయాణీకులకు తన తాతగారు, ఎడ్మిరల్ బైరన్ ఇలాంటి వాతావరణాన్ని ఫౌల్ వెదర్ జాక్ అని అనేవాడని, పెద్ద పెద్ద బూరల మోతతో బయలుదేరేవాడని గుర్తు చేశాడు. ఇలా చెప్పటంలో అతనికి ఏదో ఆనందం లభించేది. తుఫానులో ధైర్యంగా ప్రవేశిస్తున్నట్లు కనిపించేవాడు.



లార్డ్ బైరన్

దురదృష్టం ఏమిటంటే అతనికోసం కష్టకాలం ఎదురు చూస్తోంది.

* * *

కొద్ది రోజుల తర్వాత యాంగిల్ టెర్రే హోటల్ దగ్గర కలకలం మొదలైంది. అక్కడున్న వారందరూ ఈ లార్డ్ రాకకోసం ఎదురు చూస్తున్నారు.

క్లెయిర్ ఎంత నిర్భయంగా ఉన్నా కొంత బెరుకుగానే ఎదురు చూస్తోంది.

షెల్లీ తన ఆనందోత్సాహాలతో అసహనంగా ఉన్నాడు.

అతనికి క్లెయిర్ - బైరన్ వ్యవహారం ఏమీ ఆందోళన కలిగించలేదు. పైగా తనూ మేరీ సంబంధంలాగా క్లెయిర్, బైరన్‌లు కూడా కలిసి జీవించాలని ఆశించాడు.

షెల్లీ దంపతులు బైరన్‌ను చూసి ఏమాత్రం నిరుత్సాహపడలేదు.

అతని గర్వోన్నతి, మేధో సంపత్తి మిమ్మల్ని ఆశ్చర్య పరుస్తాయి. అతని చంద్రకాంతి లాంటి శరీరచ్ఛాయ మిమ్మల్ని ఆకర్షిస్తుంది. అద్భుతమైన అతని నీలి నీలి కనులు ఆకట్టుకుంటాయి. గాలికి కదిలే ఉంగరాల జుట్టూ పలకరిస్తుంది. తీర్చి దిద్దినట్లున్న అతని కనుబొమ్మలు ఆహ్వానం పలుకుతాయి. కొటేరు లాంటి ముక్కు , చక్కని చుబుకం, నిండైన పెదవులు – బైరన్ బొమ్మను పూర్తిచేస్తాయి.

అతని నడకలో ఏదో లోపం ఉన్నట్లు అనిపిస్తుంది. 'వంకర పాదం' అంటారు కొందరు. అతను 'చీలిన పాదం' అంటాడు – ఎందుకంటే చేతగాని వాని కంటే ప్రమాదకారి మేలు కదా !

మేరీ, అతని లోపం ఇబ్బంది పెడుతున్నట్లు గ్రహించింది. కొత్తవారి ముందు రెండు అడుగులు వెయ్యాలంటే వారి దృష్టిని మరల్చడానికి అతను తప్పనిసరిగా వారిని నవ్వించటానికి మాట్లాడి నడిచేవాడు.

యాంగిల్ టెర్రీ హోటల్ రిజిస్టర్‌లో 'వయసు' రాయాల్సి వచ్చినప్పుడు – 'ఒక వంద' అని రాశాడు!!

బైరన్ – షెల్లీ చాలా హాయిగా కలిసిపోయారు. షెల్లీ లాంటి సమవుజ్జీ దొరికినందుకు బైరన్ ఎంతో ఆనందించాడు. ముఖ్యంగా అతను పడిన కష్టాలన్నీ విన్న తర్వాత ఈ జమీందారు ఎలా ఇంత రమణీయంగా, స్థిమితంగా ఉండగలుగుతున్నాడని ఆశ్చర్యపోయాడు. అతని సంస్కారం అద్భుతమనుకున్నాడు.

బైరన్ కూడా బాగా చదివిన వాడే కాని, షెల్లీ లాగ ప్రతి సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాలనుకోడు.

షెల్లీ చదివింది – తెలుసుకోవటానికి.

బైరన్ చదివింది – అందరిని అదరగొట్టటానికి.

ఈ విషయం లార్డ్‌కు బాగా తెలుసు. అతను షెల్లీ సంకల్పం గొప్పదనీ, శక్తివంతమైనదనీ గుర్తించాడు. అది ఎక్కుపెట్టిన బాణం లాంటిది.

తన శక్తి – తన ఉద్వేగాల మీద, తన ఉంపుడుగత్తెల దయాదాక్షిణ్యాలమీద ఖర్చయిపోతున్నదనీ తెలుసు.

షెల్లీ, నిగర్వి అయిన షెల్లీ – తన పట్ల వ్యక్తపరిచే మెచ్చుకోలును, ఆశ్చర్యాన్ని పట్టించుకునేవాడు కాదు. బైరన్ కూడా తన భావాన్ని కనిపించనీయకుండా జాగ్రత్త పడేవాడు.

బైరన్ రచన 'చైల్డ్ హెరాల్డ్' చదివి ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు షెల్లీ. ముఖ్యంగా మూడో అధ్యాయం వింటూ ఎంతో ఆసక్తిగా కదిలిపోయాడు. ఆ

పద్యాలలోని ఆ కవితా శక్తి ఎగిసి పడే అలల్లా వరదలా దూకి పడుతూంటే బైరన్ మేధా సంపత్తిని గుర్తించి ఎప్పటికైనా తాను అలాంటి ఉధృతికి తూగ గలనా? అనుకున్నాడు. బైరన్‌లోని కవి, షెల్లీని ఆశ్చర్య పరిస్తే అతనిలోని లౌకిక పార్శ్వం దిగ్భ్రమకు లోను చేసింది.

బైరన్‌లో ఒక తిరుగుబాటు దారుణ్ణి చూస్తాననుకున్నాడు. కాని అతనికి కనిపించింది గాయ పడిన గర్విష్టి దొర. రాగ ద్వేషాలకు, కష్టాలకు, కన్నీళ్లకు, సుఖదుఃఖాల దొంతర్లలో మునిగిన మానవుణ్ణే చూడగలిగాడు.

ఇది షెల్లీకి చాలా బాల్యావస్థలా అనిపించింది.

బైరన్ సంప్రదాయమంటే నిరసిస్తాడు – కాని దాన్నే నమ్మి అందులోనే నివసిస్తాడు. సంప్రదాయం, తన కోరికలకు అడ్డుగా నిలిచిందని, పక్కలకు తోసివేస్తాడు. అందుకు చింతిస్తాడు కూడా.

ఇదే పని షెల్లీ నమ్మి ఆచరించాడు. ఎంతో నిజాయితీగా జాగరూకతతో.

అదే సంఘం అతన్ని బహిష్కరిస్తే – షెల్లీ కీర్తి ప్రతిష్టలకోసం ప్రాకులాడలేదు. భర్తగా తనకు మంచి పేరు లేకపోయినా ప్రేమ – నిజమైన ప్రేమకు విలువ ఇచ్చాడు. ప్రేమను గౌరవించాడు.

అతను వివాహానికి – భ్రష్టత్వానికి మధ్యే మార్గం ఏమీ చూడలేదు. తన విమర్శకులను నిర్భయంగానే ఎదుర్కొన్నాడు. అదీ సంప్రదాయ బద్ధంగా వారిని గెలవడం కష్టమని తెలుసుకున్నాడు.

షెల్లీ, స్త్రీని ఒక ఉత్తేజపూర్వకమైన ఉత్ప్రేరకంగా దర్శించాడు.

అదే బైరన్, తన విశ్రాంతి సమయాన్ని గడపటానికి ఒక వనరుగా చూశాడు.

షెల్లీ దేవతా సమానుడు – దేవతల కంటే ఉన్నతుడు. స్త్రీకి పూజనీయంగా విలువనిచ్చాడు.

బైరన్ మానవ మాత్రుడు – చాలా సామాన్యుడు. స్త్రీని కోరుకున్నాడు. తన కోరికలు తీర్చే, శారీరక వాంఛలు తీర్చగలిగిన రక్తమాంసాల ముద్దగానే చూశాడు. 'ఈ ఆడది ఒక రోగం. వారితో బ్రతకలేము – వారు లేకుండానూ బ్రతకలేము.

నిజానికి ఇప్పటికీ తేల్చుకోలేక పోతున్నాను, ఆడదానికి ఆత్మ అనేది ఉంటుందా' అని.

'నాకు, ఆదర్శ స్త్రీ, కాస్త తెలివి కలిగి, నన్ను అర్థం చేసుకుని సుఖపెట్ట గలిగితే చాలు. నా కంటె తెలివి గల దాన్ని భరించలేను' అంటాడు.

వీరిద్దరి సంభాషణలూ ఒకోసారి వింతగా ఉండేవి. షెల్లీ తనకు తెలియకుండానే నర్మగర్భంగా బైరన్‌ను ఆట పట్టిస్తుండేవాడు. బైరన్ అంతగా పట్టించుకునే వాడు కాదు. వారిద్దరూ ఒకరికొకరు గొప్ప జత కుదిరింది. హాయిగా రోజులు గడిపారు.

షెల్లీ, ఎప్పుడూ రక్షకుడుగానే వ్యవహరిస్తుంటాడు. బైరన్‌తో జీవితాన్ని మరింత అర్థవంతంగా పరిగణించమని చెప్తుంటాడు. కాని బైరన్, తన జీవన శైలిని గొప్ప ఉదాహరణతో సమర్థించుకుంటాడు. నిజానికి షెల్లీలోని నైతికతను ఇది బాధించినా అతని వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోయేవాడు.

ఇద్దరికీ నీళ్లంటే పిచ్చి ఇష్టం. ఒక పడవ కొన్నారు. దానిలో మేరీ, క్లెయిర్‌తో పాటు జెనీవా సరస్సులో షికారు వెళ్తారు. బైరన్ సహాయకుడు ఇటలీవాడు పోలీడోరి కూడా ఉంటాడు.

షెల్లీ – బైరన్ మౌనంగా పడవను వెన్నెల వెలుగులో తేలుతున్న మబ్బుల్ని గమనిస్తూ నడిపేవారు.

క్లెయిర్ తన మధురమైన గాత్రంతో పాడేది. ఈ వెన్నెల, ఈ మబ్బులు, ఈ పాట – వారిద్దరినీ మెరుస్తున్న నీటిమీద నుంచి భావనాలోకాలకు తీసుకుపోతాయి.

ఒకనాటి రాత్రి రయ్యిన వీస్తున్న గాలిని లెక్కచెయ్యక, బైరన్ అల్బేనియా పాట పాడతానని, 'ఇప్పుడు జాగ్రత్తగా వినండి' అని ఒక వింత కూతలాగా పాడాడు. వారి నిరాశను గమనించి పగలబడి నవ్వుతాడు. నిజానికి, వారెంతో తీయని పాట వినాలని ఎదురుచూస్తున్నారు. అప్పటి నుంచీ మేరీ, క్లెయిర్, బైరన్‌ని 'అల్బీ' అని ఎగతాళి చేస్తుంటారు.

* * *

కవులిద్దరూ జెనీవా సరస్సు చుట్టూ సాహిత్య యాత్ర చేస్తారు. రూసో తన 'నూవెల్ హిలోసీ'

"క్లారెన్సు – మధురమైన క్లారెన్సు – గాఢమైన ప్రేమ జన్మస్థలం"

లుసానె అండ్ ఫెర్నీ, గిబ్బన్ స్మృతులు, వోల్టేర్ జ్ఞాపకాలు ఇలా సాగేది వారి యాత్ర.

* * *

షెల్లీ ఉత్సాహం, బైరన్‌కు చాలా ఉపయోగపడింది. దీని ప్రభావంతో అతను గొప్ప కవితలు రాస్తాడు. ఒకసారి మిల్లేర్ దగ్గర సరస్సులో గాలి తాకిడికి బోటు తిరగబడి పోయేదే-

బైరన్ ఈతకు సిద్ధపడుతూ, బట్టలూడదీస్తుంటాడు.

ఈదటం రాని షెల్లీ, చేతులు కట్టుకొని ఎంతో ప్రశాంతంగా కూర్చుంటాడు. అతని ధ్యాన ముద్ర బైరన్‌ను ఆశ్చర్యపరుస్తుంది. కాని బైటకు కనపడనీయడు.

తరువాత చాలా కాలానికి ఈ సంఘటన గురించి చెప్తూ షెల్లీ, "నాకు తెలుసు, నన్ను బైరన్ రక్షించగలడని - కాని అది ఎంత సిగ్గుపడాల్సిన విషయం" అంటాడు.

* * *

హోటల్ పరిసరాలు విసుగు పుట్టిస్తాయి. తమ చుట్టూ వున్న వారి అనవసర కలుపుగోలు తనంతో విసుగు చెంది - షెల్లీ పరివారం 'కోలిగ్ని' దగ్గర - అదీ సరసు అంచునే ఒక కుటీరం అద్దెకు తీసుకున్నారు.

బైరన్ - విల్లా డెయోడాటిలో - వీరికి దగ్గరలోకే మారాడు.

రెండిళ్లకూ మధ్య ఒక ద్రాక్ష తోట మాత్రమే వుంది. ఆ ద్రాక్ష తోటలో పని చేసేవారు చాలా ప్రొద్దున్నే వస్తారు. ఆ సమయంలో క్లెయిర్ - బైరన్ ఇంటి నుంచి - షెల్లీ నివాసానికి పరుగుపెట్టేది!

అలాంటి సమయంలోనే - ఆమె కాలిజోడు - ఒకటి వూడిపోయింది. కంగారులో అక్కడే వదిలి వెళ్లిపోతుంది.

ఈ ద్రాక్ష తోటలో పనివారు ఈ ఇంగ్లీష్ మిస్‌కి చెందిన ఆ జోడును తీసుకువెళ్లి - ఆ వూరి మేయరు గార్కి అందజేశారు!!

* * *

క్లెయిర్ ప్రేమ వ్యవహారం అంతగా సాగలేదు. ఇప్పుడు కడుపుతో వుంది కూడా. బైరన్ ఆమెతో విసిగి పోయాడు. అది పైకి వ్యక్తం చేశాడు కూడా! కొంతకాలం - ఆమె కంఠస్వరం - ఆమె యౌవనం - శరీరం ఇవన్నీ అతనిని వివశుణ్ణి చేశాయి. త్వరలోనే విసుగుజెంది - ఆమెతో తనకేమీ 'బంధం' లేదు - ఈమె తనంతట తానుగా వచ్చి తన మీద పడిందని విసుక్కున్నాడు.

"వెళ్లిపో - అమ్మాయి - అరె! నిజానికి ఎవ్వరు వెళ్లిపోయారు - నేను కాదా? ఇంతవరకూ 'ట్రోజాన్ యుద్ధం' తర్వాత నాకంటే ఎక్కువగా గాయపడిందెవరు?

నన్ను - అందరూ నిందిస్తారు - స్త్రీల పట్ల దురుసుగా వుంటానని - దానిలో నిజమెంతో కాని, వారికోసం ప్రాణాలు వదిలేది ఎవ్వరు? నా జీవితమంతా - వారితో - వారి కోసము ఖర్చయి పోయింది కదా!" ఇవీ అతని ఆలోచనలు!

* * *

షెల్లీ వెళ్లి, బైరన్‌తో, క్లెయిర్ భవిష్యత్తు గురించి - పుట్టబోయే బిడ్డ గురించి మాట్లాడతాడు.

క్లెయిర్ విషయంలో బైరన్ నిర్లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఆమెను వదిలించుకోవాలని - మళ్లీ ఎప్పుడూ తన ముఖం చూడకూడదని అంటాడు.

షెల్లీకి చెప్పేందుకు ఏమీలేదు - కాని బిడ్డ హక్కులు కాపాడాలి కదా!!

బైరన్ - బిడ్డను తన సోదరి 'ఆగస్టా'కు ఇవ్వాలనుకుంటాడు - దీనికి క్లెయిర్ అంగీకరించదు. అయితే సంవత్సరం వయస్సు రాగానే - తానే బాధ్యత తీసుకుంటానని - సర్వాధికారాలు తనవేనని షరతు విధిస్తాడు.

ఇక ఇటువంటి పరిస్థితుల్లో - ఆ ప్రాంతంలో వుండటం షెల్లీ పరివారానికి ఇష్టం వుండదు.

కవులిద్దరి మధ్య వైరమేమీలేదు.

కాని ఈ సంప్రదింపులు - బేర సారాలు క్లెయిర్‌కు చాలా బాధాకరంగా వున్నాయి - కాని షెల్లీకి ఇవి చాలా సహజంగా కనపడతాయి.

బాధ పడింది - క్లెయిర్ కదా - పైగా మేరీకి, బైరన్ సూటి పోటి మాటలు బాధ పెడతాయి. కోపం తెప్పిస్తాయి.

బైరన్ అంటాడు -

ఆడవారికి - మగవారితో పాటు కూర్చొని భోజనం చేసే హక్కు కూడా లేదు. వారుండవలసింది అంతఃపురంలో లేదా జనానాలో.

ఇలా అనగానే మేరీ ఉల్‌స్టోన్ క్రాఫ్ట్ గారి కూతురు కోపంతో ఊగిపోయింది. ఆమెకు మళ్లీ ఇంగ్లండు మర్యాదలు, పల్లెటూరి అందాలు గుర్తుకు వచ్చాయి. అక్కడ నది పక్క కుటీరం ఇంత దూరానికి స్వర్గంలా అనిపించింది.

షెల్లీ తన స్నేహితులకు రాస్తాడు. తమ కోసం ఒక నివాసం చూసి వుంచమని.

మళ్లీ ప్రయాణం మొదలవుతుంది.

* * *

వీళ్లు వెళ్లిపోయిన తరువాత బైరన్ తన సోదరికి రాస్తాడు.

'అక్కా - ఇప్పుడు తిట్టకు. ఇంతకంటే ఏమి చేయను? ఒక పిచ్చి పిల్ల నా అభ్యంతరాలన్నీ తోసి పుచ్చి నా వెంట పడింది. లేదా, నా ముందు నడిచింది. నా కంటే ముందే ఇక్కడుంది.

ఆమెను తిప్పి పంపటానికి ఎన్ని తిప్పలు పడ్డానో ... చివరకు వెళ్లిపోయింది.

ఇంతకంటే ఏమి చెప్పను. నేను చేయగలిగింది ఇదే. నేనామెను ప్రేమించలేదు. ఇంకా ప్రేమంటూ ఏమీ మిగిలి లేదు. నిజానికి ఏ స్త్రీని ప్రేమించలేను. అదీ నన్ను, నా సిద్ధాంతం నుంచి తప్పించటానికి ఎనిమిది వందల మైళ్లు వచ్చిన ఆడదాన్ని, అసలు ప్రేమించలేను. ఇప్పటివరకూ జరిగింది ఇది. అంతా ముగిసి పోయినట్లే'.

* * *



జెనీవా సరస్సు

షెల్లీ, నిజానికి, బైరన్‌ను ఏదో విధంగా 'రక్షించా'లనే ఆశించాడు.

బైరన్‌ను కవిగా ఎంతగా మెచ్చుకుంటాడో, లౌకిక వ్యవహారాలలో అతని నడతకు అంతగా నొచ్చుకుంటాడు. బైరన్ కీర్తి కాంక్షను, షెల్లీ ఎంతగానో వ్యతిరేకించేవాడు.

"గొప్పతనం, మంచితనం కలిస్తేనే కదా అనంతంగా సాగేది.
మంచివారి ఆలోచనల నుంచే కదా శక్తి, సౌందర్యాలుద్భవించేది.
హోమర్ , షేక్స్పియర్ రచనలు లేకపోతే ఈ మానవజాతి ఏమయిపోయేది?
నిన్ను కీర్తికోసం తాపత్రయపడమని చెప్పను.
నీ రచనలు స్వచ్ఛమైన సామాన్యమైన శక్తి నుంచి జనించాలి.
నిన్ను నీవు వ్యక్తీకరించుకోవాలి.
నీలాంటి వారి బాధలు, బంధాలు అర్థంచేసుకొని చెప్పగలగాలి.
ఒక్క విషయం గుర్తుంచుకో...
కీర్తి కాంత తనకు మార్గం చూపే వారి వెంట వచ్చే అల్లురాలు కాదు."
లార్డ్ బైరన్ – ప్రస్తుతం వెనీస్ ప్రయాణంలో ఉన్నాడు.
ఇలాంటి సలహాలు వినే శ్రద్ధ లేదు.
పూజనీయమైన, పవిత్రమైన ఆలోచనలు అతనికి అంతగా నచ్చవు.



విల్లా డయోె డాటి (స్విస్ బైరన్ నివాసం)



ఫానీ ఇమ్లే

ఆరవ అధ్యాయం

ప్రేమవనంలో సమాధులు

గాడ్విన్ గారింట్లో ఆనందాన్ని, చైతన్యాన్ని నింపిన ముగ్గురు యువతుల్లో ఇప్పుడు ఒక్కరే వున్నారు. 'ఫానీ ఇమ్లే'.

ఆమె గాడ్విన్ సంతానం కాదు, శ్రీమతి గాడ్విన్ కూతురూ కాదు! కాని వారితోనే జీవిస్తూ – నాన్న – అమ్మా అంటూ తిరుగుతోంది. ఆమె చాలా సౌమ్యురాలు –

నెమ్మది కలది – కాని ఇంతవరకూ ప్రేమికుడు గాని, భర్త గాని లభించలేదు.

నిస్వార్థం, అణకువ ఇలాంటి గుణాలను మగవారు అభినందిస్తారు – ఆ దారిలో వెడుతూ...

ఒకోసారి ఫానీ ఆశ్చర్య పోతుంది – ఎప్పుడైనా పెర్సీ తన గురించి ఆలోచిస్తుంటాడా అని. అక్కడితో ఆగకుండా గుండె దడ దడ లాడుతుండగా అతనికి ఉత్తరం వ్రాస్తుంది. కాని ఆమె అస్పష్టమైన అనురాగపు ఆలోచనలను మేరీ మొగ్గలోనే తుంచి వేస్తుంది.

నిశ్శబ్దం రాజ్యమేలే ఆ ఇంట్లో, అదీ ఆర్థికమైన ఇబ్బందులతో, విచారగ్రస్థమైన వాతావరణంలో – శ్రీమతి గాడ్విన్ తన అసంతృప్తిని ఫానీని అవమానించటంలో వ్యక్తపరిచేది. తత్త్వవేత్త ఫానీకి చాలా స్పష్టంగా అర్థమయ్యేట్టు వ్యవహరించాడు, ఇక ఏ మాత్రం ఆమెను పోషించలేమని – ఏదైనా తన జీవితం తన జీతంతోనే గడపాలని.

ఆమెకు గొప్ప ఆశలేమీ లేవు. ఏదైనా పంతులమ్మ ఉద్యోగం దొరికితే చాలనుకుంది. మేరీ, జేనీ ఇంట్లోంచి పారిపోవటం గాడ్విన్ కుటుంబానికి చాలా అగౌరవం తెచ్చిపెట్టింది. చాలా పాఠశాలల పెద్దలు, ఇలాంటి ఇంటి నుంచి, మంచి టీచరు వస్తుందని ఆశించలేకపోయారు.

ఫానీ, మానసికంగా కుంగిపోయి ఒక రకమైన అసూయావేశంలో మేరీ, జేనీ సాహస జీవితాన్ని ఊహించుకుని దూరం నుంచే ఆశ్చర్యపోయేది. అలాంటి సాహసం ఎంత వింతగా ఉంటుందో, అంత ప్రమాదం పొంచి ఉంటుంది. నిజానికి జెనీవా సరస్సు అంచుల్లో లార్డ్ బైరన్ సమక్షంలో, ఇప్పుడు ఇంగ్లండు మొత్తం ఆడిపోసుకుంటున్న బైరన్ కవి సముఖంలో ఉండటం ఎంత అద్భుతం.

ఫానీ రాస్తుంది :

"అతను, నిజంగా మీరు పంపిన బొమ్మంత అందంగా ఉంటాడా? అతని కంఠస్వరం గంభీరంగా ఉంటుందా? మీ ఇంటికి వచ్చినప్పుడు చాలా సామాన్యంగా లెక్కలేనట్లు వచ్చి వెళ్లి పోతుంటాడా? నిజంగా అతనిమీద లండన్‌లో చెప్పుకునే పుకార్లన్నీ నిజంగా నిజమేనా? అతని జీవనశైలి అలాగే ఉంటుందా? నాకు ఎంతో తెలుసుకోవాలని ఉంది. అతని రచనలు చదివితే, ఆ విధమైన అభిప్రాయం కలుగదు. నాకు తప్పనిసరిగా సమాధానం రాయండి. నేను కవిగా ఎవరిని ఇష్టపడుతున్నానో అతను మంచి వ్యక్తి కూడా అయివుండాలి.

మీ పడవ ప్రయాణం చాలా బాగా జరిగి వుండాలి. అప్పటికప్పుడు ఆయన రాసిన 'పొయెట్' రచనను చాలా తొందర్లో చదవాలని అనుకుంటున్నాను. లండన్‌లో ఎప్పుడు ప్రచురిస్తారు. నాకు వ్రాత ప్రతి పంపగలరా?

అతనితో చెప్పండి, అది చదవటానికి ఎంతో ఉత్సాహపడుతున్న వ్యక్తి ఒకరున్నారని.

కవులు, తమ తోటివారికి ఎలాంటి మేలు చేస్తారో చెప్పటం కష్టం."

ఈ ఉత్తరాలను సానుభూతితో చదివేవారు మేరీ, క్లెయిర్. పాపం ఫానీ ఎప్పటికీ స్కినర్ వీధిలో, గాడ్విన్ పుస్తకాల మధ్య, అప్పుల బాధలో, శ్రీమతి గాడ్విన్ దెప్పిపొడుపులతో ఎలా భరిస్తుందో పాపం ఫానీ.

ఈ ఆలోచన వారిద్దరికీ తమ స్వేచ్ఛను మరింత ఆహ్లాదకరంగా దర్శించటానికి దారి తీసింది.

ఆమె ఒంటరి తనం తలుచుకుంటే, తమకు తమ ప్రియుల సన్నిధిలోని ఆనందం ద్విగుణీకృతమైంది.

మేరీకి, ఫానీ మీద ఉన్న అభిమానంతో వారు జెనీవా నుండి బయలుదేరే ముందు ఫానీ కోసం, షెల్లీని చిన్న చేతి గడియారం కొనమంది.

* * *

షెల్లీ పరివారం ఇంగ్లండు చేరి, *బాత్* లో నివసించటానికి వెళ్లేముందు లండన్ వచ్చి ఫానీని పలకరించారు. ఆమె చాలా నిరాశా, నిస్పృహల్లో ఉంది. 'నేనెవ్వరికీ అవసరం లేదు' అనుకుంటుంది. షెల్లీకి వీడ్కోలు చెప్పే సమయంలో ఆమె కంఠం కంపించింది.

తరువాత *బాత్* లో ఉన్నప్పుడు షెల్లీకి అంత అనురాగంతోనూ రాసింది. అయితే జీవితంలో ఏ ఆశా లేనివారు, హాయిగా జీవిస్తున్న వారికి ఏమి రాస్తారు?

ఇప్పుడు గాడ్విన్ మరింతగా ఆర్థికంగా దిగజారే ఉన్నాడు.

వీరి ఒత్తిడి తట్టుకోలేక, ఎవిలీనా ఉల్‌స్టోన్‌క్రాఫ్ట్ ఫానీని గవర్నెస్‌గా తీసుకోవటానికి సిద్ధపడి ఆయనకు ఈ విధంగా రాసింది.

"ఇక్కడి మధ్య తరగతి కుటుంబాల వారికి మేరీ, జేనీ సోదరి టీచర్‌గా వస్తుందంటే చాలా ఇబ్బందిగా వుంటుంది."

ఒక దురదృష్టపు రోజు షెల్లీకి, బ్రిస్టల్ నుంచి ఆసక్తికరమైన ఉత్తరం వచ్చింది. అందులో ఫానీ అందరికీ వీడ్కోలు చెప్పింది.

"ఇంక ఎప్పటికీ తిరిగిరాని ప్రదేశానికి వెళ్తున్నాను" అంటూ ముగించింది.

మేరీ వెంటనే, షెల్లీని బ్రిస్టల్ పంపింది.

రాత్రికి తిరిగి వచ్చి, షెల్లీ ఏ వార్తా చెప్పలేకపోయాడు.

మళ్లీ మర్నాడు వెళ్లి, మేరీకి, చాలా విషాద వార్తను మోసుకొచ్చాడు.

ఫానీ బ్రిస్టల్ వదిలి కేంబ్రియన్ బండిలో స్వాన్‌సీకి బయలు దేరిందని, అక్కడ మేక్ వర్త్ హోటల్‌లో దిగిందని, బాగా అలసిపోయానని వెంటనే గదికి వెళ్ళిందని.

మర్నాడు కిందికి రాకపోయేసరికి గదితలుపులు బలవంతంగా తెరిచారు. ఆమె పక్కమీద మరణించి వుంది. ఆమె ముఖం చుట్టూ నల్లని జుట్టు పరుచుకొని వుంది. షెల్లీ, మేరీ ఇచ్చిన జెనీవా గడియారం ఆమె చేతికి వుంది. నిద్ర మాత్రలు సీసా కూడ పక్కనే ఉంది.

పూర్తిచెయ్యని ఉత్తరంలో ...

“చాలా కాలంనుంచి అనుకుంటున్నాను. ఈ వ్యర్థమైన జీవితాన్ని అంతం చేద్దామని. నా జన్మ దురదృష్టకరం. ఇప్పటి వరకు నన్ను పెంచి పోషించిన వారికి చాలా ఇబ్బందులు కలిగించాను. నా మరణం మీకు బాధ కలిగిస్తుంది. కాని త్వరలోనే మరిచిపోతారు. నా లాంటి జీవి అసలు ఉన్నట్లుకూడా గుర్తుండకపోవచ్చు.”

గాడ్విన్ తన *'రాజకీయ ధర్మం'* అనే పుస్తకంలో ఆత్మహత్య నేరం కాదని వాదించాడు. అయితే రాబోయే ముప్ఫైయేళ్లు అలాంటి చావు ఎంతవరకు సమర్థనీయమో నిర్ణయిస్తాయి అని రాశాడు.

ఈ విషాదం తరువాత గాడ్విన్, మేరీ ఇంట్లోంచి వెళ్ళిపోయిన పిమ్మట మొదటిసారిగా ఉత్తరం రాశాడు.

“దీనిని గురించి ఎటువంటి ప్రచారం చేయకండి. ఇప్పటికే సిగ్గుతో చచ్చిపోతున్న నన్ను, మరింతగా బాధించకండి” అంటూ.

* * *

ఫానీ మరణం, షెల్లీని మానసికంగా ఎంతగానో కృంగదీసింది. దీనికి తోడు శ్రీమతి గాడ్విన్ తన దురుసు నోటితో – ఈ పాపమంతా షెల్లీ దే అన్నట్లు ఆడిపోసుకుని – “నిన్ను ప్రేమించే – అది చచ్చిపోయింది” అన్నట్లు వ్యవహరించింది.

ఈ ఆరోపణతో అతనికి – ఫానీ ప్రవర్తనలోను కొన్ని ప్రేమభరితమైన కోణాలు గుర్తు వచ్చాయి. దీనికి తనే తెలియకుండా కారణమయ్యానని తనని తనే నిందించుకున్నాడు.

ఆమెను ఎప్పుడూ ప్రలోభపెట్టకపోయినా, తన తెలివి తక్కువ తనం వల్లనే, ఆమెలో ప్రేమభావాలు చిగురించి వుంటాయని ఆలోచించాడు.

హేరియెట్‌తో తెగతెంపులు చేసుకున్నపుడు, తనకు మానసికంగా అవసరమయిన ఆడదాని సాన్నిహిత్యం – సున్నితత్త్వం ఈమెలో చూశాడు – అంతవరకే – కాని దానికి కొనసాగింపు ఆమెలో ప్రేమాంకురం!

అతను స్నేహ భావాన్నే వ్యక్తపరిచినా –

మరొకరి మనస్సు తెలుసుకోవటం ఎంత కష్టతరం? మనకే ఉద్దేశ్యం లేకపోయినా – మరొకరికి ఎంత కష్టం కలిగిస్తాం. మన చుట్టూ వున్న భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా – కనీసం వాటి వునికి కూడా గుర్తించలేక పోవటం ఎంత దురదృష్టం...

మనకు మంచి వుద్దేశ్యాలున్నంత మాత్రాన మంచి జరగాలని లేదు. నిర్దాక్షిణ్యంగా ఎంత హాని చేయవచ్చునో. అవగాహనా రాహిత్యంతోనూ అంత హానీ జరుగుతుంది.

ఈ ఆలోచనలతో అతను నిరాశలో కూరుకు పోయాడు...

ఇలాంటి స్థితినుంచి బైటపడటానికి – తనకు పరిచయమున్న సాహిత్య విమర్శకుడు – యువకుడు – లీ హంట్ (Leigh Hunt) తో గడపటానికి హాంప్‌స్టెడ్ హీత్ – అదీ – Vale of Health లో వుంది – ఎంతో సుందరమయింది. ఆహ్లాదరకమైన ప్రదేశం ఇప్పటికీ.

హంట్ – అతని భార్య, షెల్లీకి చక్కని ఆతిథ్యమిచ్చారు. వారి సంతానంతో షెల్లీ హాయిగా ఆడుకుంటాడు.

ఆ పరిసరాల ప్రభావంతో ఫానీని – గాడ్విన్‌ని మరచిపోయాడు – ప్రశాంత చిత్తంతో తిరిగివస్తాడు.

* * *

అతని కోసం ఒక ఉత్తరం వుంది. అది హాక్ హాం – తన సేవకుని వంటివాడే, పంపాడు –

హారియెట్ ఎక్కడ వుందో – ఎలా వుందో తెలుసుకోమని తనే హాక్ హాంని కోరాడు. ఆమె – మార్చిలోనూ – సెప్టెంబరులోనూ తన భరణం తీసుకుంది – తర్వాత ఎక్కడ వుందో తెలియలేదు – అక్టోబర్ నుంచి...

"మీ దగ్గర నుంచి వుత్తరం వచ్చి నెలపైనే గడిచిపోయింది. మీకు వెంటనే సమాధానం ఇవ్వకపోవటం ఇబ్బందిగావుంది. మీరు కోరిన సమాచారం – శ్రీమతి షెల్లీ, మీ సంతానం క్షేమ సమాచారం –

ఈ సమాచారం సేకరించటానికి కొంచెం కష్టపడాల్సి వచ్చింది.

శ్రీమతి షెల్లీ చిరునామా కోసం ప్రయత్నిస్తుంటే, ఆమె మరణించినట్లు వార్త తెలిసింది. ఆమె తనను తాను నాశనం చేసుకున్నట్లు – సర్పంటైన్ నదిలో నుంచి గత మంగళవారం ఆమె శరీరాన్ని వెలికి తీసినట్లు రూఢిగా తెలిసింది. పంచనామా జరిపి 'నీటిలో మునిగి చనిపోయింది' అని తేల్చారు. మీ యిద్దరి పిల్లలూ లండన్‌లో బాగానే వున్నారని సమాచారం–" ఇదీ సారాంశం.

షెల్లీని ఈ వార్త అతలాకుతలం చేసింది. అప్పటికప్పుడు బయలుదేరాడు. – అతని మనసులో ఆ చంటిపిల్ల లాంటి ముఖం – తనెంతగానో ప్రేమించిన హారియెట్ సుందరమైన

ముఖారవిందం – నదీగర్భంలోని బురదలో ఉబ్బిపోయి వుండటాన్ని ఊహించుకోలేకపోయాడు – తన సంతానాన్ని వదిలి – ఎలా ఇంతటి దారుణమైన నిర్ణయం తీసుకోగలిగింది?

హంట్ – హక్ హామ్ అతనికి అన్ని వసతులు కలిగించి ఓదార్చారు. అప్పుడు Time లో వచ్చిన వార్తలు అతనికి ఇచ్చారు.

"గురువారం – గౌరవనీయమైన స్త్రీ – నిండు నెలలతో వుంది – సర్పంటైన్ నదిలో నుంచి బైటకు తీయబడింది – క్వీన్ వీధిలో ఆమె ఇంటికి శవాన్ని చేర్చారు. అప్పటికి ఆరువారాలుగా కనిపించని ఈమె చేతికి, ఎంతో విలువైన ఉంగరం వుంది– కేవలం తన గౌరవాన్ని కాపాడుకోలేకే – ఈ దారుణానికి దారి తీసిందని – ఆమె భర్త – విదేశాలలో వున్నారని తెలిసింది."

క్వీన్ వీధిలో పుకార్లకు కొదవేమీ లేదు – హారియెట్‌కి తన భర్త దగ్గర్నుంచి వుత్తరాలు రావటం లేదు – దీనికి కారణం – ఆమె పూర్వ చిరునామా నుంచి అది ప్రస్తుత చిరునామాకు పంపబడలేదు.

కొన్నాళ్లు మిలిటరీ ఆఫీసరుతో కలిసి వుందని – అతనికి ఇండియా వెళ్లవలసిన ఉత్తర్వులు రావటంతో, మళ్ళీ వంటరిదై పోయిందని – తర్వాత ఇంకొక యువకునితో కలిసి వుందని – ఈ విషయాలు తెలిసి వెస్ట్ బ్రూక్ కుటుంబం ఆమె దగ్గర్నుంచి పిల్లలిద్దర్ని తీసుకుపోయారని – ఇప్పుడు రాబోయే ప్రమాదాన్ని – గ్రహించి – చివరికి నదిలో దూకిందని–

ఆ రాత్రి షెల్లీకి కంటిమీద కునుకు లేదు – 'నిండు గర్భిణి' ఇవే అక్షరాలు కనపడుతున్నాయి.

అరె – జీవితం ఇలా అంతం కావాలా ? ఎంత పిచ్చితనం ? హారియెట్ తాలూకు మధుర క్షణాలన్నీ అతని మనసును ముసురుకున్నాయి. అతనికి అయిష్టంగానే.

హారియెట్ ప్రేమలు – హారియెట్ భయాలు – హారియెట్ నిరాశలు – ఇవన్నీ అతనికి తెలిసిన భావోద్వేగాలే – కొన్ని సంవత్సరాలు 'హారియెట్' తన సర్వస్వం! కాని – హారియెట్ – నా భార్య – పతితురాలు – వ్యభిచారిణి!

హారియెట్, నా భార్య – ఆత్మహత్య !

అయ్యో! ఎంత దారుణం !

కొంత సేపు దీనికి తనేమైన కారణమా అని ఆలోచించాడు. కాని ఎటువంటి ఆధారం కనబడలేదు.

నేను చేయవలసినదంతా చేశాను - నా శక్తికి మించి - నా ప్రతి చర్య ఆమెకు సహాయం అందించాలనే -

ఆమెతో విడిపోయినప్పుడు - మా మధ్య ఇక ప్రేమ అనే భావన లేదు -

ఆమె కోసం ఇంకెన్ని త్యాగాలు చేయాలి - ఎంత అపకీర్తిని మోయాలి?

తన తర్కం - 'అవసరం లేదు' అనే చెప్పింది - హాగ్, పీకాక్ - 'అవసరం లేదు' అనే అన్నారు. అదే మళ్లీ మళ్లీ చెప్పించుకున్నాడు, ఎక్కడో తన అంతరంగంలో కదిలే అపరాధ భావాన్ని తుడిచేయటానికి ...

సంప్రదాయక బంధాలు తుంచివేయటంతో అవ్యక్త శక్తులు నిద్ర లేస్తాయి.

దీని పర్యవసానం ఎవరూ ముందుగా ఊహించ లేరు!

స్వేచ్ఛా స్వాతంత్ర్యం అనేది శక్తి యుక్తులు గలవారికే మేలు చేస్తాయి. అర్హత గల వారికే దాని ప్రయోజనం ! కాని బలహీనులకు ? ఓహ్!

హారియెట్ ఆత్మ చాలా బలహీనమైనది. చిన్నపిల్ల - హారియెట్ - మునిగిపోయింది, కథ ముగిసిపోయింది.

ఆ మర్నాడు - మేరీకి రాస్తాడు - హారియెట్ పిల్లలకు తల్లిగా వుండమని.

అతని న్యాయసలహాదారు - వెస్ట్‌బ్రూక్ కుటుంబం అతని - మత సమ్మతం కాని జీవన విధానం -

మేరీతో అతనికి చట్ట విరుద్ధమైన జీవితం - వెరసి - తన సంతానం మీద అధికారం ఇవ్వకపోవచ్చునని, అనుమానం వ్యక్తం చేస్తాడు !

* * *



సర్పంటైన్ నదిలో హారియెట్



మాయని గాయాలు, మరపురాని జ్ఞాపకాలు

ఏడవ అధ్యాయం

సాంఘిక నియమాలు

గాఢమైన ప్రేమతో – విశ్వాసంతో హాయిగా జీవిస్తున్న ప్రేమికులను – మత పరంగా, లేక లౌకికమైన వివాహ బంధం ఏ విధంగా మరింత సంతోషపెడుతుంది?

కాని అలాంటి సంఘటన, మన గర్విష్టి పండితుడు తన అహాన్ని తృప్తి పరుస్తుందని, తన కూతుర్ని లేవదీసుకు పోయిన వ్యక్తే ఆమెకు వివాహ బంధంతో 'గౌరవాన్ని' కలగచేస్తున్నాడని ఆనందించాడు. ఆమెకు 'లేడీ షెల్లీ' బిరుదు లభిస్తుందని సంతోషించాడు. కాని దీనితో షెల్లీకి, గాడ్విన్ మీద వున్న కాస్త గౌరవం కూడా గాలికి కొట్టుకు పోయింది. అతని మీద విపరీతమైన అసహ్యం పుట్టింది.

హారియెట్ చనిపోయిన తర్వాత – ఆ వెంటనే ఈ పెళ్లి తంతు జరుపుకోవటం ఎంత వరకు మర్యాద? కాని లౌకిక శక్తులు – దేవుని దీవెనల కోసం ఆగవలసిన పనిలేదు అని వక్కాణించాయి. అప్పటికే ప్రకృతి ఆ జంటను రెండు సార్లు దయతలచి కడుపు పండించింది.

ఆ విధంగా తన ప్రథమ భార్య శరీరాన్ని సర్పన్‌టైన్ నదిలో నుంచి బైటకు తీసిన రెండు వారాలకు పెర్సీ బ్రెడ్ వీధిలోనున్న మిల్ట్రెడ్ చర్చిలో మేరీని వివాహం చేసుకున్నాడు.

గాడ్విన్ సంతోషంగా సాక్షి సంతకం చేశాడు – శ్రీమతి గాడ్విన్ తన సంతోషం నటిస్తూనే – సంతకం పెట్టింది. ఆ సాయంత్రం తాము లేచిపోయిన తర్వాత మొట్ట మొదటిసారిగా స్కిన్నర్ వీధిలో గాడ్విన్ గారింటిలో వధూవరులు విందారగించారు.

షెల్లీ విందు – చాలా సంశయాత్మకంగా జరిగింది. అక్కడే – ఫానీ తిరిగింది – అక్కడే హారియెట్ ఎన్నో సార్లు పెర్సీతో పాటు భోజనం చేసింది. వీరి జ్ఞాపకాలు వారిని వెన్నాడి వెంటాడుతూ వారికి మనశ్శాంతి లేకుండా చేసాయి. విందు సమయంలో వుండవలసిన సంతోష వాతావరణం లోపించింది.

ఆ రాత్రి మేరీ తన జర్నల్ రాసింది, 'లండన్ వచ్చాను – పెళ్లి జరిగింది – అంతే – *'లార్డ్ బెస్టర్ ఫీల్డు'* చదివాను.'

మేరీ చాలా ధైర్యవంతురాలు – పాపం, మునిగిపోయిన హారియెట్ ఈమెకు దరిదాపుల్లోకి కూడా రాలేదు!

* * *

ఈ పెళ్లివార్త గాడ్విన్ చుట్ట పక్కాలందరికీ చేరింది. మన తత్త్వవేత్త తన సోదరునికి ఇలా రాస్తాడు.

"ప్రియమైన సోదరా!

నీకు ఒక కుటుంబంవుంది కదూ – అందులోని చిన్ని చిన్ని మొక్కలు పెరిగి వృక్షాలవుతున్నాయి కదా! నీవూహించలేవు – నా కొడుకు – నిన్న గాక మొన్న పుట్టినవాడు. అప్పుడే పధ్నాలుగేళ్లు వచ్చాయి. మా అమ్మాయికి ఇరవయి సంవత్సరాలు – ఇప్పుడు చెప్పబోయే వార్త – ఆ అమ్మాయి తోనే చర్చికి వెళ్లాను. ఆమె సర్ తిమోతి షెల్లీగారి కుమారుణ్ణి – అదే ఫీల్డుప్లేస్ (ససెక్స్) సంస్థానాధీశుడైన తిమోతి గారే – వివాహం చేసుకుంది.

అంటే ఈ లౌకిక ప్రపంచపు తుచ్ఛమైన అభిప్రాయంలో – ఆమె చక్కగా కుదురుకున్నట్లే. ఆమె భర్త – ఆమెను సుఖపెట్టగలడని ఆశిస్తాను. నీకు ఆశ్చర్యం కదా – ఇలాంటి పేద పిల్లకు అంతటి అదృష్టం ఎలా పట్టిందని ? అంతే అదృష్ట-దురదృష్టాలు, కష్ట సుఖాలు కావడి కుండలు! నా వరకు నేను ఇలాంటి ఆశ్చర్యకరమైన – విషయాలు పట్టించుకోను – సంపదల్ని లెక్క చేయను.

ఆమె అదృష్టం – ఆమె సుఖంగా – గౌరవంగా వుండగలగటం."

* * *

ఈ వివాహం – షెల్లీకి ఒక మేలు చేసింది. తన సంతానం మీద హక్కును నిరాకరిస్తున్న వారి వాదన కొరగాకుండా పోయింది.

అయితే వెస్ట్‌బ్రూక్ కుటుంబం, షెల్లీ మీద – న్యాయస్థానాన్ని ఆశ్రయించటం మానలేదు.

ఇలాంటి మత విశ్వాసం లేని – నాస్తికుని సంరక్షణలో సంతానాన్ని ఉంచటం ప్రమాదకరమని పిటిషన్ వేసారు. అందుకు షెల్లీ రాసిన *'క్వీన్ మాబ్'* పుస్తకమే సాక్షి అని చెప్పారు.

అయితే షెల్లీ లాయర్లు – *'క్వీన్ మాబ్'* పుస్తకాన్ని సమర్థించలేదు – అది కేవలం పందొమ్మిదేళ్ల విద్యార్థి రాసిన అపరిపక్వమైన రాతలేనని వాటికి విలువ ఇవ్వ వలసిన పనిలేదని –

నిజానికి షెల్లీ వివాహ వ్యవస్థను విశ్వసిస్తాడని – ఇప్పటికి రెండు సార్లు చర్చిలోనే ఆ విధి పూర్తిచేశాడని వాదించారు.

షెల్లీ సంతానాన్ని సాకే అధికారంగాని, సత్తాగాని వెస్ట్‌బ్రూక్ కుటుంబంలో – కాఫీ హోటల్ నడిపిన యజమానికి గాని, చదువు, బాధ్యత సంస్కారం లేని ఎలీజాకి కాని లేవని వాదించారు.

షెల్లీ మాత్రం ఇది కపట వాదన అని, లాయర్లతో ఏకీభవించలేదు. ఇప్పటికీ తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానని, ఒక వేళ తను ఈ సాంఘిక ఆచారాల్ని పాటిస్తే, వాటిని విమర్శించే హక్కు కోల్పోవలసిన అవసరం లేదని జడ్జిగారికి రాస్తాడు.

దీనితో జడ్జిగారు –

"తండ్రికి ఉండవలసిన బాధ్యత, నైతిక విలువలు, చట్టపరంగా పాటించని వ్యక్తికి సంతానం బాధ్యతలను కోర్టు ఏవిధంగా కట్టబెడుతుంది? అతను ఏవైతే నైతిక విలువలు అంటున్నాడో అవి చట్టపరంగా నిలబడవు కదా..."

ఇలాంటి వ్యాఖ్యానాలతో షెల్లీ సంతానాన్ని ఆర్మీ డాక్టర్ హ్యూమ్ సంరక్షణలో ఉంచి సంవత్సరానికి పన్నెండు సార్లు షెల్లీ చూడవచ్చని షరతు విధిస్తారు.

ఈ తీర్పు షెల్లీని కుదిపి వేసింది. దీని మూలంగా అతన్ని ఇప్పటి నాగరిక ప్రపంచం వెలివేసినట్లయింది. అతను ఏదో ఘోరమైన తప్పుచేసినట్లు అధికార పత్రం జారీ చేసింది...

* * *

ఈ కోర్టు కేసు నడుస్తుండగా మార్లో పరిసరాల్లో చక్కని ఇల్లు కొంటాడు. చుట్టూ పచ్చికతో పెద్ద హాలు అందులో లైబ్రరీ, వీనస్ బొమ్మ, అపోలో విగ్రహం ఇలా అన్నీ

అమర్చుకుంటాడు. ఆ విధంగా మన ఏరియల్ (గంధర్వుడు) మానవమాత్రులందరిలాగానే ఓ ఇంటివాడయాడు.

ఇక్కడే ఈ పచ్చికలోనే, తన సంతానం రేపు వేసవిలో ఆడుకుంటారు. విలియం, క్లారాలతో పాటు, క్లెయిర్ కూతురు అల్బా కూడా ఇక్కడే గంతులు వేస్తుంది.

అల్బా తండ్రి బైరన్ దగ్గరనుంచి ఇంతవరకు ఎటువంటి వార్తా రాలేదు.

కోర్టు వ్యవహారాలు షెల్లీ ఆరోగ్యం మీద చాలా ప్రభావం చూపాయి.

బాగా సన్నబడిపోయాడు. ఎక్కువ హడావుడి పడుతున్నాడు. ఇంకా ముందుకు వంగి పోయాడు. రాత్రుళ్లు నిద్రపోలేక పోతున్నాడు – పక్కటెముక్కల్లో విపరీతమైన బాధతో. వైద్యులు దానికి చికిత్స చెప్పలేకపోయారు. కేవలం నరాల అస్తవ్యస్తతే కారణమన్నారు.

షెల్లీ మానసిక స్థితి విపరీతమైన నిరాశలో మునిగి పోయింది. ఇప్పటి వరకు అతని సదభిప్రాయాలు, సత్ప్రవర్తన చివరికి అతనికి అంతులేని కష్టాలను మూటగట్టి ఇచ్చినాయి. ఏ పని చేయాలన్నా కంపించి పోతున్నాడు.

ఈ గుంపుల నుంచి ఈ ప్రమాదకరమైన జనసందోహాలనుంచి దూరంగా, దూరంగా వెళ్లిపోవాలని – వీరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో తెలియని ప్రమాదకారులని వీరి మోహాల, ఈ సమూహాల మోహాల గాలి తీవ్రతను భరించలేక దూరంగా దూరంగా వెళ్లిపోవాలనుకున్నాడు.

ఈ లౌకిక ప్రపంచపు భ్రష్టాచారాలు – ఇందులో తనకు ఎటువంటి ఆనందం, సంతృప్తి ఉండదని తెలుసుకున్నాడు. ఇక్కడ తన ప్రేమకు, ఆవేదనకు తావు లేదని ఇంతకంటే, తన ఊహాప్రపంచంలో తనెంతో మానసికానందం పొందగలనని నిర్ణయించుకున్నాడు.

తన కవిత్వానికి అవసరమైన ప్రతిరూపాల అస్పష్ట స్వరూపాలు, ఛాయా మాదిరి ఆకారాలు అతని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. అతని ఆవేదన ఉద్వేగాల భావ తరంగాలపై, ఊహా చిత్రాలు వర్ణ శోభితమై కొత్తకాంతులతో తన కవితా ధారగా రూపొంది, వ్యక్త మౌతున్నాయి. ఇంతకాలం తన నిజ ప్రపంచాన్ని దాచి పెట్టిన ఇంద్రజాల దివ్య భవనాల సముదాయం ఇప్పుడు భూమి నుంచి విడిపడి

పోయి ఏదో అవ్యక్త శక్తి ఆకర్షించినట్లు మాయతెరలన్నీ తొలగి, కాంతులీనే గాజు భవనాలు, గాలి మందిరాలు తేలుతూ అతడి దృష్టిలోకి వచ్చి మంద్రంగా మార్మికంగా కదలాడుతూ తమ స్వయం ప్రకాశంతో అద్భుతమైన కవిత్వభాషలో వ్యక్తమౌతున్నాయి.

అవి ఊపిరి పోసుకున్నచోటే, ఇప్పుడు అతను తన నిజ ప్రపంచాన్ని చూడగలుగుతున్నాడు. నల్లటి నేలను, పచ్చని చేలను, మనుషుల కఠిన రూపాలను, ఆడవారి విపరీత చేష్టలను, సమాజపు కాఠిన్యాన్ని, అధికారాన్ని చూసి వీటినుంచే దూరంగా వెళ్లిపోవాలని ఆశించాడు.

తాను ఆశించిన *విప్లవం* – రక్తపు బొట్టు చిందకుండా ఈ ఆదర్శమైన *విప్లవం* కోసం ఎంతగానో తపించాడు. ఈ విప్లవం ఇద్దరు ప్రేమికులు, తన వ్యక్తి గత అనుభవాల సమ్మేళనం ఇది అతనికి నేర్పిన పాఠం – స్త్రీ ప్రేమ మాత్రమే ఇలాంటి విప్లవాన్ని సాధ్యం చేస్తుందని, స్త్రీ ప్రేమయే అవ్యక్త శక్తిని, ధైర్యాన్ని ప్రసరిస్తుందని విశ్వసించాడు.

లాయన్ – సిన్‌తా – వీరిద్దరూ ప్రేమికులు – తిరుగుబాటు దారులు. సమాజపు చట్టంలోనుంచి స్వేచ్ఛకోరిన ప్రేమజంట – తనకూ మేరీకి ప్రతిరూపాలు.

వీరి పోరాటంలో, వీరి ఆదర్శాల మూర్తిమంత వ్యాపకంలో ప్రాణాలు పోగొట్టు కుంటారు. ఒకరినొకరు ఆర్తితో ముద్దు పెట్టుకుంటూ – చుట్టూ మంటలు చెలరేగుతుంటే తమ బాధ అనంతమైన ఆనందంగా మారిపోతుంటే ప్రాణాలు విడుస్తారు.

ఇప్పుడు తన సత్య ప్రపంచంలో బాధలు, బరువులు లేవు. ఇందులోనుంచి బయటపడి నిజమైన ఆనందాన్ని అన్వేషించాలి –

మరో లోకంలో – మరో కాలంలో – మరో యుగంలో ఈ ఆనందాలు వర్థిల్లాలి అని జీవిస్తాడు.

థేమ్స్ నదిలోని చిన్న చిన్న గుట్టలమీద హంసలు గూళ్లు కడుతుంటాయి. వాటిలో తన సమయం గడుపుతుంటాడు.

తన చిన్నబోటులో వెల్లకిలా పండుకుని ఆకాశంలో మబ్బుల్ని, మారిపోయే చిత్రాల్ని చూస్తుంటాడు. వాటినుంచే అతనికి గొప్ప స్పందన, ప్రేరణ లభిస్తుంది. ఎప్పుడూ మారిపోయే మేఘాలు వర్ణచిత్రాలు అతనికి ఎంతో ఆనందాన్నిస్తాయి. తన

జీవితం – పరమార్థం ఈ ప్రకృతి చిత్రాలను, పరిసర అందాలను కవిత్వంలో శాశ్వతంగా బంధించాలని, వ్యక్తీకరించాలని విశ్వసించాడు.

* * *

ఈ వేసవి సమయం అంతా ఈ వ్యాపకానికే సరిపోయింది.

ఈ పనిపూర్తి చేసి – లండన్ వెళ్ల వలసి వచ్చింది. ఎంతో మందిని పోషించాలి – డబ్బు కొరత ఇబ్బందికరంగా మారింది.

మేరీ – తన సంతానం – క్లెయిర్, అలెగ్రా అందరూ తనమీదే ఆధారపడి వున్నారు. చాలా తరచుగా గాడ్విన్ కుటుంబం వచ్చి తిష్టవేస్తారు.

తన కొత్త స్నేహితుడు లీ హంట్ – అతని భార్య – అయిదుగురు సంతానం వీరంతా వస్తారు ! పీకాక్ –నవలలు రాయడానికి సంవత్సరానికి వంద పౌండ్లు ఇస్తుంటాడు–అతనికి ఏమీ సంబంధం లేని చార్లెస్ క్లెయిర్ మాంట్–

ఇతను ఫ్రాన్స్‌లో ఎవరినో ప్రేమించాడు – ఆ పెళ్లి షెల్లీ చేస్తానన్నాడు !

ఎప్పటి మాదిరిగానే – డబ్బు అవసరాలకి అప్పులకోసం పోవాలి ! వీళ్లందరికీ తనే దిక్కు – గాడ్విన్ అంటాడు – నీవు చాలామంచి గుర్రానివి! నీ చుట్టు వున్న ఈగలు – నిన్ను సుఖంగా వుండనీయవు.

మేరీ – చాలా చక్కగా పనులు చక్కబెట్టేది. ఆమె సన్నిధిలో అతను ఈ ప్రపంచంలోకి వచ్చేవాడు – ఆమెను తన కవిత్వంలో 'సిన్‌తా' రూపంలోనే కనిపించేది. తమ అతిథులకు ఏ మాత్రం లోటు రానిచ్చేది కాదు.

షెల్లీని, మార్లో ఇంటిని అమ్మేయమని సలహా ఇచ్చింది. అది మరీ చల్లగా వుంది. ఆ వాతావరణం నీకు పడటంలేదు – కాస్త వెచ్చగా వున్న ప్రదేశానికి – ఇటలీకి – వెళ్లిపోదాం – అని ప్రణాళిక చేసింది.

ఇల్లు అమ్మటానికి పత్రికలో ప్రకటన చేయమంది. మధ్యవర్తికి ఆ వివరాలు ఇవ్వమంది. ఇంత చల్లని ఇంటిలో వుంటే నీ ఆరోగ్యం పాడయిపోతుందని ఆందోళన చెందింది. ఇటలీ వెళ్లేముందు తన తండ్రి గారి సమస్యలు కొన్నైనా తీర్చి పోవాలని సూచించింది.

లండన్ నుంచి వచ్చే సమయంలో విలియంకోసం, చక్కని 'సీల్‌స్కిన్' టోపీ బహూకరించాలని, అది బంగారు రంగు రిబ్బనుతో చుట్టి ఉండాలని కోరింది!

'ఇప్పుడు నా చుట్టూ పిల్లలున్నారు – పిల్లలకోడిలా – అల్బా నన్ను పీకుతుంది. విలియం ఆడుతున్నాడు. క్లారా మంటలోకి చూస్తుంది. ప్రస్తుతానికి సెలవు'.

అన్ని పనులు చక్కబెట్టి రమ్మంది.

ఈ కష్టాలన్నీ గట్టెక్కి నీకు కావలసిన రీతిలో గడపవచ్చు' అని లౌకికమైన ప్రణాళిక రచించింది. ఈ రకంగా ఉత్తరం రాసి పంపింది.

* * *

మేరీకి, క్లెయిర్ కూతురు అల్బా ఇంట్లో ఉండటం ఇబ్బందిగా వుంది. ఈ పిల్ల ఎవరు అని అందరూ ఆరా తీస్తున్నారు. ఎన్ని చెప్పినా చివరికి – క్లెయిర్‌కి షెల్లీకి చెందిన సంతానంగా పుకార్లు పుట్టిస్తున్నారు.

అల్బాను, ఎంత వీలయితే అంత తొందరగా బైరన్‌కి అప్పగించాలి అని నిర్ణయించుకుంది.

షెల్లీ ఈ పరిసరాల నుంచి వెళ్లిపోవాలని ఆరాట పడుతున్నాడు. తన చుట్టూ అనంతంగా పెరిగిపోయిన స్నేహితుల, కుటుంబ, వ్యాపార సంబంధమైన గోడలు దాటలేక సతమతమవుతున్నాడు.

అతని సంకల్పం రాతి కొండలాంటిది – కాని ఎడతెగక వచ్చి ఢీ కొంటున్న ఈ లౌకిక జీవన కెరటాలు – వాటికి జాలి, కరుణ ఉండవు కదా – ఎలాంటి రాతినైనా తినేస్తుంటాయి.


ఇంగ్లండులో తన గౌరవాన్ని మంటగలిపిన న్యాయ వ్యవస్థ తననెపుడూ దోషిగానే చూస్తోంది.


ఈ నేలను వదిలి వెళ్లిపోతే తనకి స్వేచ్ఛ లభిస్తుందని, తన మానసిక శక్తులు కొత్త పుంతలు తొక్క గలవని, కొత్తనేల, కొత్త దేశం తనకా అవకాశం కల్పిస్తాయని, మళ్లీ తన జీవితం తెల్ల కాగితంలా కొత్త కవిత్వం రాసుకోవటానికి వీలవుతుందని ఆశించాడు.

* * *

చివరికి ప్రయాణం చేయక పూర్వమే మేరీ తన పిల్లలకు పేర్లు పెట్టాలని పట్టుపడుతుంది. మత పరమయిన ఈ స్నాతకోత్సవం వారికి రాబోయే జీవితంలో ఎంతో మేలు చేస్తుందని నమ్ముతుంది. ఎంత తిరుగుబాటు దారైనా సాంఘిక మర్యాదలు పాటించాలి కదా! ఇదే జీవన్నాటకమని అంటుంది.

విలియం షెల్లీ, క్లారా ఎవిరీనా షెల్లీ, ఇలా ఇద్దరికీ ఈ తంతు పూర్తిచేసి బైరన్ కూతురికి కూడా జ్ఞాన స్నానం చేయించారు. ఆమెను *క్లారా అలెగ్రా* అని సంబోధించారు.





మార్లో పరిసరాలు

ఎనిమిదవ అధ్యాయం

మట్టి దిమ్మ - పాలరాతి బొమ్మ

నిర్మలాకాశం – ఇటలీ – మబ్బులే లేని ఖాళీ ఆకాశం.

మళ్లీ ఈ ముగ్గురు పథికులు తమ గాయాలను మరచిపోవటానికి, ఎండపొడలోని వేడిమి కోసం ఇటలీ దేశానికి బయలు దేరారు. వారి సంతానం సంరక్షకుల పటాలంతో ఈ యాత్ర ఉత్సాహంగానే సాగింది.

మిలన్ చేరారు. అక్కడ, బైరన్ దగ్గర నుంచి, అల్బా గురించి సమాధానం కోసం ఆగారు. అక్కడ చర్చిలో కూర్చుని షెల్లీ Dante ఇన్‌ఫెర్నో , పర్గెటోరియో చదివాడు.

క్రీస్తు బలిపీఠం వెనుక పై కిటికీలోనుంచి పసుపు రంగులో కురుస్తున్న వెలుతురులో కూర్చుని ఒంటరిగా *డాంటే* పుస్తకాలు చదివాడు.

పూర్వంలా ఇప్పుడు ఈ చర్చి వాతావరణం అతన్ని భయభ్రాంతుణ్ణి చేయటంలేదు. తను పడిన బాధలన్నింటి ప్రభావంతో ఇప్పుడు ప్రపంచంలో ఎలాంటి ప్రదేశం కూడా అతన్ని చర్చి పరిసరాలలాగ ఓదార్చ లేక పోతున్నాయి.

'డాంటే' చదువుతూ, చర్చి అద్దాలలోంచి ప్రసరిస్తున్న రంగుల సంగీతంలో – ఈ ఛాందస మతం కేవలం పండిత వేషధారులు సృష్టించిందనుకోలేక పోతున్నాడు.

అప్పటికి బైరన్ జవాబు వచ్చింది. ప్రపంచంలో దేనినైనా అంగీకరిస్తాడు గాని క్లెయిర్‌ని మాత్రం చూడనన్నాడు. ఇక పాప చదువు బాధ్యత మాత్రం తీసుకుంటానన్నాడు. పూర్తి అధికారం తనదే నన్నాడు.

షెల్లీకి ఇది చాలా దారుణమైన విషయంగా తోచి, బైరన్‌తో వాదిస్తాడు. బైరన్ ఈషణ్మాత్రం కూడా సందివ్వడు.



గండోలా

అక్కడే ఒక వెనిస్ పౌరుడు ఇప్పుడు బైరన్ జీవన శైలి గురించి వివరాలిస్తాడు.

బైరన్ - ఇంగ్లీషు లార్డ్ - అచ్చంగా వ్యభిచార జీవితాన్ని గడుపుతున్నాడు. అతనికోసం ఒక జనానాయే ఉంది అని మరిన్ని సంగతులు చెప్పాడు.

ఇలాంటి పరిస్థితుల్లో అలెగ్రాని అక్కడ ఎలా ఉంచుతారు. షెల్లీ, క్లెయిర్‌కి నచ్చచెప్తాడు ఇక్కడితో వదిలి వేయమని, అన్నీ తనే చూస్తానన్నాడు.

కాని క్లెయిర్ తన హక్కును వదులు కోవటం ఇష్టంలేక స్విస్ నర్సుతో అలెగ్రాని తండ్రి దగ్గరకు పంపాలని నిశ్చయిస్తుంది. పాపం అలెగ్రా షెల్లీని వదలకుండా పట్టుకున్నా చివరికి బలవంతంగా బయలుదేర దీస్తారు...

* * *

బైరన్, పాపను ఆరువారాలు మాత్రమే ఉండనిస్తాడు. మొదట్లో పాప ఆకర్షణీయమైన అందాన్ని చూసి వెనిస్ పౌరులు ఎంతో ఆసక్తిగా బైరన్ కూతుర్ని ముద్దు చేస్తారు. కాని ఇది త్వరలోనే కవిగారికి విసుగు కలిగిస్తుంది. అప్పుడు శ్రీమతి హాప్‌నర్ - ఈమె లండన్ లాయరుగారి భార్య - పర్యవేక్షణలో అలెగ్రాని ఉంచుతారు. ఆమె ఎంత దయగా చూసినా క్లెయిర్, జరిగిన నష్టానికి కూతుర్ని దూరం చేసుకుంది కదా, చాలా విచారిస్తుంది.

సంవత్సరకాలంగా తన కూతురుకు దూరంగా ఉండిపోతుంది. ప్రపంచంలో తనకు మిగిలింది ఈ చిన్నారి పాపే కదా అని వాపోతుంది.

షెల్లీ ఆమె విషాదాన్ని చూడలేక ఎలాగైనా పాప దగ్గరకు చేరుస్తానని మాట ఇస్తాడు. మేరీకి వీళ్లిద్దర్నే వెనిస్ పంపటం ఇష్టంలేక పనివాడైన పాలోని వెంట పంపుతుంది. క్లెయిర్ మీద ఆంక్షతో ఆమెను 'పాడువా' దగ్గరే ఉండమని చివరికి షెల్లీ, బైరన్‌ను కలవాలని అనుకుంటాడు. కాని అంత దగ్గరగా వచ్చి తన కూతుర్ని చూడకుండా ఉండలేనని క్లెయిర్ మొండికేస్తుంది.

ఆ రాత్రి గండోలా తీసుకుని గాలి, వాన, ఉరుములు, మెరుపుల వాతావరణంలో వెనిస్ చేరటానికి సముద్రపు పాయ దాటి సాహసం చేస్తారు. దూరంగా వెనిస్ దీపాలు మినుకు మినుకుమంటూ మిణుగురులా మంచు తెరల వెనక కనిపిస్తున్నాయి.

చివరికి మర్నాటి ఉదయం హాప్‌నర్ దంపతులు వీరిని సాదరంగా ఆదరిస్తారు. హాప్‌నర్ పాపకోసం కబురు పెడుతుంది. పాప ఇప్పుడు పెద్దదయింది. పాలిపోయింది. మరింత అందంగా ఎదిగింది.

వారు బైరన్ గురించి చాలా విషయాలు చెప్పారు.

బైరన్ వెనిస్ చేరిన మూడవ రోజునుంచే తన గండోలా, తన ఉంపుడు గత్తెను ఏర్పాటు చేసుకున్నాడు. ఆమె ఎవరో కాదు. తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని భార్యే. ఇరవై రెండేళ్ల నల్లకళ్ల సుందరి. ఆమె భర్త, 'మర్చెంటాఫ్ వెనిస్' దుస్తుల వ్యాపారం అంతమాత్రంగా ఉంది. వెనిస్ స్త్రీలకు ఒక ప్రియుడు ఉండటానికి అభ్యంతరం ఉండదు. ఈ మెరియానా సెగాటీ ఆనందంగా బైరన్‌కు తన గాత్ర మాధుర్యంతో దగ్గరయింది. మన నోబుల్ లార్డ్ తన అందంతో ఆమెను ఆకర్షించటానికి ఎక్కువ సమయం అవసరం లేదు. పైగా ఒకే ఇంట్లో ఉంటున్నారు కదా.

శ్రీమతి హాప్‌నర్ చాలా చురుకైన కళ్లది. ఈ కథంతా చాల చాకచక్యంగా మంచి చెడులు కలబోసి చెప్పింది.

బైరన్‌కు రావలసిన చెడు కీర్తి అంతా ఆయనతో పాటే వచ్చింది. ఇంగ్లండు నుంచి వచ్చిన యాత్రికులు, అతను నివసిస్తున్న పరిసరాలు, అతని పడక గది కూడా చూడాలని ఆసక్తి పడేవారు. వెనిస్ కాలువల్లో కార్నివాల్ పండుగ జరిగితే ముసుగులు అడ్డంపెట్టుకుని అందరూ బైరన్ చుట్టూ చేరేవారు.

చివరికి మధ్యాహ్నం మూడు గంటలకు షెల్లీ, బైరన్‌ను చూడటానికి పలాజో వెళ్తాడు.

షెల్లీని చూసి బైరన్ ఎంతో ఆనందిస్తాడు.

ప్రపంచంలో తన సమ వుజ్జీగా కేవలం షెల్లీతోనే సంభాషించగలడు. మేధావులిద్దరూ కుశల ప్రశ్నల తరువాత పాప సంగతి వస్తుంది. క్లెయిర్ పాపను చూడాలని ఆరాట పడుతున్నట్లు చెప్తాడు. బైరన్ అర్థం చేసుకున్నట్లు, తన అభిప్రాయం త్వరలో చెప్తానని అంటాడు.

షెల్లీని తనతో లిడోలో బోట్‌లో షికారు తీసుకెళ్తాడు.

గండోలా వారిని ఆ దీవి చుట్టూ సముద్రంలో చుట్టి చివరికి పెద్ద ఇసుక గుట్టల దగ్గర దింపుతుంది. ఈ ఇసుక దిబ్బలే వెనిస్‌కు రక్షణ కవచం – అడ్రియాటిక్ సముద్రం వెనిస్ నగరాన్ని ముంచివేయకుండా.

అక్కడ బైరన్ కోసం గుర్రాలుంటాయి. నిజంగా షెల్లీకి ఈ గుర్రపు స్వారీ చాలా ఇష్టం. నీటి అంచున, గుర్రాలమీద ఎంతో హాయిగా స్వారీ చేస్తారు. కాని షెల్లీ మనసులో క్లెయిర్ బాధ ఎక్కడో ఇబ్బంది పెడుతూనే ఉంది.

అప్పుడే బైరన్ ఇంగ్లీషు వాళ్ల మూర్ఖత్వాన్ని ఎగతాళి చేస్తాడు. వెనిస్ యాత్రకు వచ్చిన వాళ్ళు తన గురించి, తన జీవన శైలి గురించి ఎందుకు ఉత్సాహం చూపుతారో అర్థం కాదంటాడు.

"నీకు జరిగిన అన్యాయం చాలా దారుణం. ఆ సమయంలో నేను అక్కడ ఉండి ఉంటే నా శక్తి యుక్తులన్నీ ఉపయోగించి, నీ సంతానాన్ని నీకు అప్పగించే వాణ్ణి" అని షెల్లీతో అంటాడు.

"మానవ జాతి మూర్ఖత్వానికి అంతులేదు.

మనుషులు పరస్పరం ద్వేషించుకుంటారు. అంతకంటే వారి నుంచి మనం ఇంకేమీ ఆశించలేం" అంటాడు.

"అలా ఎందుకని? మనిషి సహజాతాలే అతని శత్రువులంటావా? వాటిని అతను నియంత్రించుకోలేడా? నా నమ్మకం పూర్తిగా భిన్నంగా ఉంది. మన సంకల్పమే మన నడవడిని మంచి మార్గంలో పెడుతుంది. చెడు, సహజంగానే ఉండవచ్చు. కాని దానిని మార్చడానికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది" షెల్లీ.

"అటు చూడు, అస్తమించే సూర్యుడు వెనిస్ నగర భవనాలకు బంగారు రంగు పూస్తున్నాడు.

గండోలాలో అలా వెళదాం. నీకు ఒక ముఖ్యమైన విషయం చూపించాలి" అని మళ్లీ బయలుదేరదీశాడు.

కొంత దూరం వెళ్లిన తరువాత "అటు చూడు, పడమర వైపు. అక్కడ నీకు గంట మోగుతున్న శబ్దం వినపడుతోందా?"

షెల్లీ శ్రద్ధగా వింటాడు. చూస్తాడు. దూరంగా చిన్న దీవి. అక్కడ కిటికీలు లేని ఎత్తైన భవనం. ఆ పైన ఓపెన్ టవర్‌లో అస్తమించే సూర్యుని వెలుతురులో చీకటిలా ఒక గంట. అది శిథిలావస్తలో ఉన్న పురాతన భవనం.

దూరంగా నల్లగా కదులుతున్న గంట మోత, వీరి గండోలా తెడ్ల శబ్దంతో కలిసి ఏదో సహాయం కోసం ఎవరో ఏడుస్తున్నట్లు అన్పించింది.

"అది పిచ్చివాళ్ల నివాసం. ప్రతి సాయంత్రం ఈ సమయంలో ఇటుగా వస్తాను. నరకంలో పిచ్చివాళ్లు గంట మోగిస్తుంటారు - వారి సంధ్యావందనం ప్రార్థనలతో" బైరన్.

"నిజానికి వారు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతుండాలి. వారినిలా దయదలిచి నందులకు" షెల్లీ.

"షెల్లీ నీవెప్పుడూ ఇంతే కదూ", బైరన్ నవ్వుతూ "నీవు మతాన్ని, దేవుణ్ణి అంగీకరించవు కదా.

నీ చేతనమే ఆ గంట– ఆ శబ్దమే నీతిగా ఉండమనే పిలుపు. ఆ పిచ్చివాళ్లలాగే మనం కూడా తెలియకుండానే దాని మాట వింటాం.

ఇంతలో పొద్దు జారిపోతుంది. గంట ఆగిపోతుంది.

ఆ పైన చావులాంటి చీకటి కమ్ముకొస్తుంది.

అటు చూడు వెనిస్ ఆ సంజ వెలుగులో గులాబి పూవులా వాడి పోతూ...

బైరన్ వంశంలో ఎవరూ ఎక్కువ కాలం బ్రతకలేదు. అమ్మ వైపు, నాన్న వైపు కూడా.

నాకు వయసుండగానే అనుభవించాలని ఆరాటపడుతున్నాను."

* * *

ఎన్నో అనుమానాలతో వచ్చిన షెల్లీకి ఆ మర్నాడు బైరన్ చాలా సరళంగా వ్యవహరించటం ఆశ్చర్యం కలిగించింది.

తనకు 'ఎస్టీ' లో వున్న విల్లాను షెల్లీ పరివారానికి రెండు నెలలు వుండటానికి ఇస్తాడు. అక్కడ అలెగ్రా వాళ్లమ్మతో వుండవచ్చు. షెల్లీ ఈ సర్దుబాటుకు సంతోషంగా అంగీకరించి - వెంటనే మేరీకి రమ్మని రాస్తాడు.

"నీవు లేకుండా ఇవన్నీ నిర్ణయించ వలసి రావటం తప్పలేదు. ఇదంతా మంచికే చేశాను. ప్రియా, నువ్వు తొందరగా వచ్చెయ్యి, ఆ తరువాత నన్ను నిందించవచ్చు. నీకు నచ్చితే ముద్దుపెట్టు. ఇది సరైన ఏర్పాటు అవునో – కాదో తెలియదు.

ఇప్పుడు నీకు శ్రీమతి హోప్నర్ గురించి చెప్పాలి.

చాలా మంచిది. చాలా అందంగా వుంటుంది. దేవత లాంటిది. చాలా తెలివి గలది కూడా. అచ్చం నీ లాంటిదే!

కానీ నీ అంత నిండుతనం వున్నది కాదు.

ఆమె కళ్లు నీకు ప్రతిబింబాలే సుమా! ఆమె తీరు తెన్నులన్నీ నీ మాదిరిగానే వున్నాయి. నీ లాంటి మరో వ్యక్తిని కలుస్తావు... నా చిన్నారి బిడ్డలిద్దరికీ నా ముద్దులు..."

* * *

మేరీ ప్రయాణం చాలా నెమ్మదిగా – అలవి కానిదిగా మారింది. ఫ్లారెన్సులో పాస్‌పోర్టు ఇబ్బందులు – క్లారా ఇప్పుడే పళ్లు కొరుక్కుంటోంది. ఈ వేడికి చాలా బాధపడుతోంది. అలసిపోయింది. పాల మార్పిడితో 'ఎస్టే' వచ్చే సరికి చాలా జబ్బు పడింది.



బైరన్ ప్రియురాలు

రెండు వారాలు జ్వరంతోనే వుంది. అక్కడి వైద్యుడు మూర్ఖుడు - సరిగ్గా వైద్యమే చేయలేదు.

దారిలో అధికారులు ఆపాలని చూశారు. వారికోసం వచ్చిన షెల్లీ - వారిని ఎదుర్కొని - క్లారా కోసం వెంటనే గండోలా ఏర్పాటు చేశాడు.

ఈ ప్రయాణంలో పాప స్పృహలో లేకుండా పోయింది.

చివరికి హోటల్‌కి చేరేసరికి - ఎంతో ఆందోళనకరంగా మారింది. పరీక్ష చేసిన వైద్యుడు ఎలాంటి ఆశ లేదన్నాడు. ఆ తర్వాత గంటకే ఎటువంటి బాధ లేకుండా నిశ్శబ్దంగా చివరి శ్వాస విడిచింది!

పాప పార్థివ శరీరంతో - పరిచయంలేని - హోటల్ హాల్లో మేరీ నిశ్చేష్టురాలై నిలబడింది! శ్రీమతి హాప్నర్ వచ్చి - షెల్లీని - మేరీని తీసుకు వెళ్లింది.

మర్నాడు షెల్లీ, ఆ చిన్నారి శవాన్ని గండోలాలో లిడోకి తీసుకు వెళ్లి పూడ్చి పెట్టాడు!

మేరీ ఈ దుఃఖాన్ని దిగమింగటానికి ప్రయత్నించింది. తన తండ్రి గాడ్విన్ చెప్తుంటాడు –

బలహీనులే దుఃఖానికి బలైపోతుంటారు. వారు దుఃఖించటంలో ఒక రకమైన రహస్యమైన ఆనందాన్ని పొంది, తమ అహాన్ని సంతృప్తి పరుస్తారు.

ధైర్యవంతులు దుఃఖాన్ని అధిగమించి భవిష్యత్తులోకి నడుస్తారు –

మేరీ ధైర్యవంతురాలు. కూతురు మరణాన్ని గతంలోకి తోసివేసింది. ఆమెను ఖననం చేసిన మర్నాడు తన జర్నల్‌లో -



వెనిస్ 'వీథి'


వెనిస్ మాస్క్

"ఆదివారం సెప్టెంబరు 17 -

చైల్డ్ హెరాల్డ్ 4వ కాంటో చదివాను.

బైట వాన పడుతోంది. డోగికి రాజభవనాన్ని చూడటానికి వెళ్లాను. శ్రీమతి హోప్నర్‌తో అకాడెమీకి వెళ్లాను. చక్కని చిత్రాలున్నాయి. లార్డ్ బైరన్‌ను కలిసి - 'పోర్నారీనా' ను చూసాను."

* * *

ఈ పోర్నారీనా - బైరన్‌గారి సరికొత్త ఉంపుడుకత్తె. పల్లెటూరిది. కాని శిల్పి చెక్కినట్లున్న ముఖం - అచ్చంగా వెనిస్ అందం!

"ఆమె ఎలాంటి అందగత్తో చూస్తావుగా -" బైరన్ షెల్లీతో నవ్వుతూ అంటాడు.

"చక్కని చీకటి కళ్లు! వీనస్ లాంటి శరీరం - ఉంగరాల - అలల్లాంటి జుట్టు - ఆ ఆ కురుల మీద వెన్నెల వెలుగుపడి జారిపోతుంది. ఆమె - ప్రేమకోసం నరకానికైనా వెళ్లగలదు.

ఆమెలోని జంతు ప్రవృత్తి, నాకెంతో ఇష్టం.

ప్రపంచంలోని మరే ఆడది - 'పోర్నారీనా' కు సరిరారు" బైరన్ గర్వంగా చెప్పాడు.

అవును - ఈ రొట్టెలు తయారీదారు భార్య - నిజంగా చాలా అందగత్తె. జంతు లక్షణాలన్నీ వున్నాయి. ఆమెను లొంగ దీయటం ఎంతో అసాధ్యం.

ఆమె కేకలకు పనివాళ్ళందరూ పారిపోతారు.

గండోలా నడిపే భారీకాయుడు - టీటా కూడా హడలి పోతాడు.

ఆమె అసూయతో రగిలిపోతుంటుంది - ఎవరినీ లెక్కచేయదు - దెయ్యంలా మార్మికమయినది.

ఆమె దుస్తులు - ముఖం మీద తెరలు ఇవన్నీ మార్చి ఉష్ట్రపక్షి ఈకలతో చేసిన టోపీ కావాలని పట్టు పడుతుంది.

బైరన్ ఇలాంటివి తీసి మంటల్లో పడవేస్తాడు - ఆమె మళ్లీ వెళ్లి అవే కొంటుంది!

చివరికి బైరన్ ఆమెను భరిస్తాడు - అతన్ని ఆమె ఎంతో ఉత్సాహపరుస్తుంది. ఆమె శరీరం - ఆమె భాష - ఆమె పొగరుబోతు తనం - ఇవన్నీ అతనికి చాలా ఇష్టం!

ఆమె మొతక - జంతు ప్రవృత్తి - అతన్ని - తన మేధోపరమైన శ్రమ నుంచి సేద తీరుస్తుంది.

ఈమె లేకపోతే - బైరన్ కవిత్వం - ఇంత ధాటిగా, ఉధృతంగా సాగేది కాదు.

అది సముద్రపు హోరులాగా సహజమైనది - లేదా పిచ్చిగా ప్రేమించే స్త్రీ ప్రవృత్తి లాంటిది-!!

* * *

కాని షెల్లీ, మేరీ - వీరు నాగరికులు - ఈ అడవి జంతువు లక్షణాలను తట్టుకోలేకపోయారు. వెనీస్‌లో వున్న కొద్దిరోజులు - షెల్లీకి - బైరన్ జీవన శైలి- మానసిక ప్రవృత్తి బాగా తెలిసివచ్చింది. ఇది ఖండించ వలసిందే -

కవిగారు - తన విశృంఖల జీవితాన్ని దాయలేదు. తన బలహీనతను అంగీకరించాడు.

"అసలు మనిషే తుచ్ఛమైన - హేయమైన వాడు" అని తీర్పు ఇచ్చాడు.

అప్పుడు షెల్లీ - బైరన్ విశృంఖలత, తన బలహీనతను కప్పివుంచే ముసుగు అనుకున్నాడు.

* * *

కొన్నాళ్లకు షెల్లీ దంపతులు 'ఎస్టే' వెళ్లారు. ఇక్కడకు తమ పాప లేకుండా రావడం వారిని ఎంతో బాధించింది.

ఎలాగైనా తమ పరిసరాలు ఆనందంగా వుంచటం వారికి తెలుసు.



వెనిస్ మాస్క్

ఇంటి చుట్టూ తోట – తోటలోంచి – మరో కుటీరంలోకి పచ్చని దారి – అక్కడి నుంచి 'ఎస్టే' కోట శిథిలాలు – ఆ పైన ఆకుపచ్చని సముద్రం లాగా పచ్చికబయలు.

లొంబార్డి సమతలం – చిన్న చిన్న వూళ్లు – ఇళ్లు – పెద్ద పెద్ద గోపురాలతో పోడువా–

ఇది 'జనాలున్న ఏకాంతవాసం' –

ఆ పైన వెనిస్ భవనాల తలలు – ఎర్రని ఆకాశపు రంగులో మెరుస్తూ –

షెల్లీ చాలా కష్టించి – Prometheus Unbound, ఇది సంగీత భరితమైన నాటకం. 'Book of Job' రాసాడు.

తన కవిత్వంలో – సీతాకోక చిలుక రెక్కల చప్పుడు, విచారగ్రస్తమైన శిశిర రాత్రులు – నింపాడు.

మళ్లీ ప్రపంచంలోకి వచ్చి – ఒక్క సారిగా ఒంటరిగా – అందరూ మరచి పోయిన ఒంటరి వానిగా దిగులు చెందేవాడు.

కవిత్వం ఎంత మత్తుగల ఆనందమో – ఈ ఒంటరి ఆలోచన అంతటి ఆవేదన – అంతులేని ఈ అనంతమైన ఆకాశం క్రింద – తన గాయాల కాయంతో – తన సాహసయాత్రలకు శోకదేవతే ముందుండి దారి చూపిందా అనుకున్నాడు.

* * *

వెనిస్ నగరం



లిడో (గ్రాండ్ కెనాల్)

తొమ్మిదవ అధ్యాయం

రోమ్‌లో సెమెటరీ

మరో నెల రోజులకు బైరన్ విల్లా ఖాళీ చేయాలి. అలెగ్రాని తండ్రికి అప్పగించాలి.

ఇక్కడ చల్లని - వర్షాల వాతావరణం - వారిని మరింత దక్షిణంగా ప్రయాణం చేయాలని ప్రోద్బలం కలిగించింది.

సంతోషంగా వుండాలంటే ఎండ వేడిమి - కాస్త సానుభూతి వుండాలి.

కొత్త ప్రదేశం - కొత్త వాతావరణం తమ బాధను మరిపించ జేయవచ్చు.


అక్కడ నుంచి రోమ్‌కు వెళ్లే మార్గం, ఎర్రబడుతున్న ద్రాక్ష తోటల చుట్టూ సాగుతోంది. పసుపు పచ్చని పశువులు దారి పొడవునా ఎంతో ఆహ్లాదకరంగా ఎదురవుతున్నాయి.

ఫెర్రారా, బొలోనా, నగరాలు దాటుకుంటూ - అక్కడి అంతులేని విగ్రహాలను - వర్ణ చిత్రాలను చర్చి కట్టడాలను చూసారు. ఇవన్ని షెల్లీ మనసులో ముద్రపడిపోయాయి.

రిమిని (Rimine) స్పొలిటో - టెర్ని లాంటి అందమైన నగరాల గుండా ప్రయాణం చేస్తూ రోమా పొలిమేర్లలో ప్రవేశించారు.

ఇది పూర్తిగా ప్రశాంతంగా నిర్నివాసంగావుంది.

వారు రోమ్ నగరంలో ప్రవేశించి నప్పుడు - పెద్ద గద్ద వారిపై నుంచి ఎగురుతూ వెళ్లిపోయింది!



ఎడతెగని ప్రయాణాలు

* * *

రోమ్‌లోని అద్భుతమైన శిథిలాలు షెల్లీని ఆశ్చర్యపరిచాయి. ముఖ్యంగా ఇంగ్లీషు వారిని ఖననం చేసే శ్మశానంవాటిక. అది సెస్టియన్ గోపురం నీడలో వుంది - అతను ఇంతవరకూ చూసిన ఎన్నో శ్మశానాల కంటే ప్రశాంతంగా వుంది.

చిరుగాలికి కబుర్లు చెప్పే చిగురాకులు - సమాధి రాళ్లపై ఊగులాడుతూ - నేలతల్లి ఒడిలో నిద్రపోయే - తల్లీ బిడ్డలను - సేద తీరుస్తున్నట్లున్నాయి. అక్కడ ఎక్కువగా యువతీ యువకుల, చంటి బిడ్డల సమాధులే వున్నాయి.

ప్రపంచంలో ఎవరైనా చనిపోతే - విశ్రాంతి తీసుకోవటానికి ఇంతకంటే ప్రశాంతమయిన ప్రదేశం లేదేమో అనుకుంటాడు!

రోమ్ నుంచి నేపుల్స్ చేరి అక్కడ కొన్నాళ్ళున్నారు. వీరున్న ఇంటికి ఎదురుగా - నాజియోనాలి (NAZIONALI) విల్లా వుంది. ఆ పైన నీలి సముద్రపు పాయ - ఎప్పుడూ మారిపోతూ, శాశ్వతంగా నిండివున్న నీళ్లు.

Vesuvius అగ్నిపర్వతం రగులుతోంది. రాత్రింబవళ్లు నల్లని పొగలు కమ్ముకుంటున్నాయి. ద్రవాగ్ని కీలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఈ బూడిద పొగ మబ్బు నీడలు అక్కడి సముద్రపు నీటిలో కనపడుతున్నాయి.

వాతావరణం - ఏప్రిల్ నెల - దాదాపు ఇంగ్లీషు వసంతం లాగానే వుంది. అయితే గాలిలో పూల వాసన తీపి లేదు.- ఇంగ్లీషు వసంతం - మధురంగా వుంటుంది.

అక్కడ నుంచి పాంపే (Pompeii) - అక్కడ నుంచి సాలెర్నో (Salerno) నుంచి పాస్టమ్ (Paestum) ఈ ప్రయాణం అంతా ఏదో మరిచిపోతున్న కలలాగా అన్పిస్తోంది.

ఇంత చక్కని పరిసరాలు వారికేమాత్రం ఆనందాన్నివ్వలేకపోతున్నాయి. ఇక్కడ ఎవ్వరూ పరిచయస్తులు లేరు. ఈ తప్పనిసరి ఒంటరితనం వారిని చాలా ఇబ్బంది పెట్టింది.

అద్భుతమైన ఈ ఇటలీ ఎండలో తడుస్తూ - విండ్సర్ - మార్లో గుర్తుకు తెచ్చుకున్నారు. లండన్ కూడా -

అరె - ఈ నీలి కొండలు - ఈ నీలి ఆకాశం - ఈ ప్రకృతి సౌందర్యం ఎంత వుంటే ఏమిలాభం - ఒక్క స్నేహితుడు, ఒక్క పరిచయస్తుడు లేకపోతే?

సంఘ జీవనంలోని ఆనందం - ఏదో రూపంలో - మనిషి మనుగడకు తప్పనిసరి! ఎంత సుందరమైన ప్రకృతి - ఎంత అందమైన పరిసరాలు మన చుట్టూ

వున్నా – ఇవన్నీ పొగమాదిరి చెదిరిపోతాయి. బాగా పరిచయమున్న ప్రదేశాలు మనసులో మెదిలినపుడు – ఇలాంటి అలవాటయిన చోట్లలో వేగంగా, పాత జ్ఞాపకాలు – ఆహ్లాదకరమైన వెలుగును ప్రసరిస్తాయి!

ఇక్కడ బజారుల్లో పనిచేస్తూ – మాట్లాడుకుంటూ నవ్వు కుంటున్న వారిని అసూయతో చూడాల్సి వస్తోంది.

చివరికి ముష్టి వాళ్లు కూడా – ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూనే కాలక్షేపం చేస్తున్నారు.

షెల్లీ మానవజాతిని ఎంతో ప్రేమిస్తాడు. కాని ఈ మానవ సమూహాల మధ్యలో ఎప్పుడూ తాను ఒంటరిగానే ఉన్నట్లు అనుభూతి చెందుతాడు.

మేరీకి ఎక్కడికి వెళ్లినా – తానొక విదేశీవనితలా చూడబడటడం ఇష్టం వుండడంలేదు. ఇప్పుడే నెల తప్పింది కూడా – క్లెయిర్ సహకారం ఏమాత్రం లేదు.

ఇంకా – తమ ఇటాలియన్ బండి వాడు – స్విస్ నర్సును ప్రేమలో దింపి పాడుచేశాడు. మేరీ అతన్ని తప్పనిసరిగా పెళ్లి చేసుకోమని బలవంతం చేసి ఒప్పించింది.

అయితే ఆ పెళ్లి – వాళ్లిద్దర్నీ ఏకంచేసినా – వీరి నుంచి దూరం చేసింది. వెళ్లిపోయారు.

తర్వాత క్లెయిర్‌కి తెలియని జబ్బు చేసింది. దీనిని మేరీ అపార్థం చేసుకుంది.

ఇన్ని సమస్యలతో నేపుల్స్ వదిలి పెట్టి మళ్లీ రోమ్ చేరాలనుకున్నారు.

ఇలా ఎడతెగని ప్రయాణాలు వారి ప్రశాంతతను భగ్నం చేశాయి.

జ్వర పీడితుడు మంచంలో ఎటుకదిలినా, లేదా లేచి ఎటు పోయినా – అతని జ్వరం అతనితోనే వుంటుంది.



విలియమ్ షెల్లీ

ఇక్కడ వేడి వాతావరణం విల్లీకి ఇబ్బందికరంగా మారింది. వైద్యుడు – వాళ్లను కాస్త

ఉత్తరంగా వెళ్లమని సలహా ఇచ్చాడు. అలా బయలుదేరటానికి సిద్ధపడుతుండగా విల్లీకి విరేచనాలు పట్టుకున్నాయి.

దాదాపు మూడు రోజులు షెల్లీ - విల్లీ చేయిపట్టుకునే వున్నాడు- అతనికి కొడుకంటే ఎనలేని ప్రేమ.

అచ్చం తనలాగే వుంటాడు. అవే నీలికళ్లు - అదే జుట్టు.

చక్కని శరీరఛాయ - తెలివైన, చురుకైన విల్లీ -

ఎంత ప్రయత్నించినా - రక్షించలేక పోయారు.

మరో మూడు రోజులు అతికష్టం మీద గడిచాయి.

ఒక మధ్యాహ్నం ఎండ ఫెళ్లున విరుస్తుండగా - విల్లీ కన్ను మూశాడు.

షెల్లీ - తను అంతకు ముందు చూసిన అందమైన స్మశానంలో - విల్లీని ఖననం చేశాడు - అతని శరీరం మట్టిలో కనపడకుండా పోతుంటే నిశ్చేష్టుడై నిలబడిపోయారు.

ఫానీ... హారియెట్ - క్లారా బేబి, ఇప్పుడు విల్లి... అందరూ - తను ప్రేమించిన అందరూ వెళ్ళిపోతున్నారు.

తన చుట్టూ ఏదో మాయ అంటురోగంలా అందర్నీ తను ప్రేమించిన అందర్నీ- ఎత్తుకుపోతోంది అనుకున్నాడు.

* * *

దేవతల శాపానికి - దేవతల కోపానికి గురైన ఈ ప్రేమజంట - ఇంతవరకూ ఎంతో ధైర్యంగా కష్టాలన్నీ ఎదుర్కొన్నారు.

కాని మేరీకి, విల్లీ మరణం కోలుకోలేని దెబ్బ - ఆమె ఇక తన పోరాటాన్ని ఆపివేసింది.

అన్నింటికీ నిర్లక్ష్యంగా వుంటోంది. తన చుట్టూ చిన్నారి పాపలు పరుగులు పెడుతున్నట్లు - తీయని పలుకులు వినపడుతున్నట్లు భ్రమల్లో వుండిపోయింది.

నిశ్శబ్దంగా - ఎక్కడో దిగంతాలను చూస్తూ - స్తబ్ద ప్రపంచంలోకి జారిపోతోంది.

ఎప్పుడైనా మేల్కొంటే, రోమ్‌లోని విల్లీ సమాధికి తెల్లని పాలరాయి వేయమని

అడిగేది. పూలు పెట్టమని కోరేది.

ఆమె తండ్రి గాడ్విన్ - మేరీ పరిస్థితి తెలిసి వుత్తరం రాస్తాడు :

"ఎందుకు నీవు అతిసామాన్యంగా - మందిలో ఒకరుగా ఆలోచిస్తున్నావు - నీవు చదివిన తత్త్వశాస్త్రం - తర్క శాస్త్ర పరిజ్ఞానం ఏమయింది?

ఇప్పుడు నీకు లేనిదేమిటి? ప్రేమించే భర్తవున్నాడు. కావలసిన వనరులన్నీ వున్నాయి. నీవు ఇతరులకు సహాయం చేసే స్థితిలో వున్నావు - కేవలం మూడు సంవత్సరాల కొడుకు చనిపోతే ప్రపంచం ఆగిపోతుందా? మిగతా ప్రపంచం అందంగా వుంది చూడు - నీ దయకోసం ఎదురు చూస్తుంది చూడు -" ఇలా సాగింది.

షెల్లీ కూడా -

"ప్రియమైన మేరీ - ఎక్కడకు వెళ్లిపోయావు ?

ఈ పనికి రాని లోకంలో నన్ను ఒంటరిగా వదిలి ?

ఇక్కడ బాగానే వుంది - నీవే పారిపోయావు -

నీ వెళ్ళిన దారి దుఃఖపూరితం -"

ఇక తనవంతుగా - అతనికి తన ఊహాలోకపు వాయు మందిరాల్లో ప్రవేశించి అక్కడ జాగ్రత్తగా ఒదిగిపోయాడు - ఇప్పటి వరకూ జరిగిన విషాదాలన్నీ - పీడ కలలు - అసందర్భపు పీడ కలలనుకుంటాడు.

అలాంటి సమయాన్ని Prometheus Unbound రాయటానికి, అదీ తన కిష్టమైన విషయం సరికొత్తగా రాయటానికి గడిపాడు!

అదీ, భావ - భౌతిక యుద్ధానికి తెరతీస్తాడు.

స్వేచ్ఛాజీవి - మిగతా లౌకిక ప్రపంచంతో జరిపే మరో పోరాటమే

భావ - భౌతిక సంఘర్షణే అతని కవితా వస్తువు!

స్వేచ్ఛాజీవి - లౌకిక ప్రపంచంతో పోరాడటమే - ఆ మహా యుద్ధం.

జూపిటర్‌ను - లార్డ్ కాజిల్ రీగీ గా చూపుతాడు. Titan ను షెల్లీగా - ఎంతటి

బాధితుడయినా ఆశాజీవి గానే దర్శనమిస్తాడు.

చివరికి మంచే జయిస్తుంది.

అక్కడి మబ్బుల్లేని ఆకాశం - పడమటి గాలి ఈలలు, ఇవన్నీ తన సంగీతానికి - గానానికి వంత పాడేవే.

నిరాశలోని ఆశ - దీనిని ఎలాంటి దురదృష్టం నాశనం చేయలేదు !!

* * *

చివరికి మేరీకి నెలల నిండుతుండగా ఫ్లారెన్సు బయలు దేరి వెళ్లారు. ఇక్కడ మంచి వైద్య సహాయం దొరుకుతుందని.

కాని ఫ్లారెన్సు వాతావరణమే గొప్ప సహాయకారి. ఇక్కడి ఏకాంతంలో ప్రశాంతత వుంది.

ఫ్లారెన్సు లో - డాంటే వున్నాడు!

సవోనరోలా ప్రక్కనే కూర్చోవచ్చు -

జియో (Giotto) మన ప్రక్క నుంచి వెళ్తాడు.

Donatello, Brunelleschi (బ్రూనెలెస్కీ) వీరిద్దరూ చర్చిల్లో - చాలా స్నేహపూర్వకమైన వైరంతో కనపడతారు.

వీధుల్లోని విగ్రహాలు చైతన్యవంతంగా ప్రాణంతో కదులుతుంటాయి.

Piazza di, San Miniato లో మైకలాంజిలో సృష్టించిన David అద్భుతంగా వుంటాడు.

Bandinelli చెక్కిన నెప్ట్యూన్ దాని ముందు తేలి పోతుంది.

హెర్క్యులెస్ గందర గోళంగా వుంటాడు.

ఇక్కడ చిన్నపిల్లలందరూ - Della Robbia ఒడిలో వున్నట్లుంటారు.

* * *

San Miniato కొండమీద నుంచి - ఫ్లొరెన్సు నగరాన్ని షెల్లీ ఎంతో ఇష్టంగా చూస్తాడు.

నగరంలోని భవనాల ఎర్రని కప్పులు స్పష్టంగా కనిపించేవి.

ఆర్నో (Arno) వర్షపు నీరు వీధుల్ని నింపుతుంది. అక్కడి ఇళ్లని మానవమాత్రుల్లా ఈ నీటిలో నిలబడి ఒకరినొకరు హత్తుకున్నట్లు కనిపిస్తాయి.


దూరంగా ఈ లోయ - దిగంతాన్ని తాకుతూ నీలికొండల్లో, ఆకాశంలో కలిసిపోతుంది.

ఫ్లొరెన్స్‌లో మేథోపరమైన వాతావరణంలో - మేరీ మళ్లీ మామూలు మనిషి కాగలిగింది. వాళ్లున్న ఇంటి క్రింది భాగంలోని వారితో కలిసి మాట్లాడ గలుగుతుంది.

మరొక్కసారి ఆమె చేతుల్లోకి పసిబిడ్డ రాగానే -

విల్లీ మరణం తర్వాత - మొదటి సారిగా చిరునవ్వు నవ్వింది.

చిన్నారి కొడుకు పేరు 'పెర్సీ ఫ్లొరెన్స్' అని పెట్టింది.



మేరీ షెల్లీ



రోమ్‌లో సెమెటరీ

పదవ అధ్యాయం

ఎవరు - ఎవ్వరికైనా

జీవితంలో – అన్ని వరుసగానే వస్తాయి.

ఒక స్నేహితుడు – మరొకర్ని తీసుకు వస్తాడు.

ఇక్కడ ఒంటరితనం అనుభవించి – బాధలు పడిన తర్వాత – మేరీ – షెల్లీ ఒక్కసారిగా మంచి స్నేహితుల మధ్య ఆనందంగా గడిపే అవకాశం వచ్చింది.

షెల్లీకి మళ్లీ ప్రక్కటెముకల్లో నొప్పి భరించిలేనిదిగా తయారయింది. చలికాలంలో ఫ్లారెన్సు కొండగాలులు చాలా నిర్దాక్షిణ్యంగా కొరుకుతున్నాయి. అక్కడి వైద్యుడు 'పీజా వెళ్లండి– అక్కడి వాతావరణం మెరుగుగా వుంటుంది' అని సలహాయిచ్చాడు.

షెల్లీ మారుటి తమ్ముడు టామ్ మెడ్విన్, వాళ్లను కలవటానికి వచ్చాడు. అతను ఇప్పటి వరకూ ఇండియా సైనిక విభాగంలో పనిచేశాడు. అదీ నౌకాదళంలో కెప్టెన్‌గా పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు.

అతనికి సాహిత్యాభిలాష మెండు. అందుకని తమ కుటుంబ సభ్యులలో అలాంటి వ్యక్తి షెల్లీ ఒక్కడేనని – అతని దగ్గరకు వచ్చాడు. మంచివాడే – కాని చాలా విసుగు కల్గిస్తాడు.

అతను చేసిన మేలు – ఎడ్వర్డు విలియమ్స్ దంపతులను షెల్లీకి పరిచయం చేయటం.

విలియమ్స్ మూడేళ్ళు నేవీలో చేసి – ఇండియాకు వచ్చాడు. అక్కడే మెడ్విన్ పరిచయం!

విలియమ్స్ గోర్కికి తన ఆరోగ్యం ఒక సమస్య! కాని ధైర్యవంతుడు – దాపరికం లేనివాడు –

అన్ని విషయాల్లో మక్కువ ఎక్కువ – షెల్లీ దంపతులకు విపరీతంగా నచ్చాడు.

ఆయన భార్య విలియమ్స్ జేన్ కూడా, చాలా అందంగా వుంటుంది.

మంచి నడవడిక గలది – మర్యాదస్తురాలు. చక్కగా తీయగా పాటపాడుతుంది. – సంగీత జ్ఞానం వుంది.

ఈ రెండు జంటలు ఎంతో ఆప్యాయంగా కలిసిపోయారు. చాలా కాలం తర్వాత స్నేహితుల రాకపోకలు – మంచీ చెడూ మాట్లాడుకోవటం – ఒకరిపట్ల మరొకరి పూర్తి విశ్వాసం–ఎదుటి వారి గొప్ప గుణాలను గుర్తించటం – ఇలా కాలం చక్కగా గడిచిపోతోంది.

ఇప్పటివరకూ ఎక్కడో – దూర దూరంగా తిరుగుతున్న ఒంటరి మనుషులు – ఇలాంటి సత్సంగం కేంద్రంగా కలవడానికి ఉత్సాహం చూపుతారు. ఆ రకంగా ఐరిష్ పౌరుడు – టాఫే, (Taaffe) గ్రీకు యువరాజు – Mavrocordato ఇందులో కలిసారు.

ఇంకా – ఇటలీ మతాధికారి – మత బోధకుడు – పచియాని (Pacchiani) ఇతన్ని Devil of Pisa అంటారు.

మతం లేని బోధకుడు – పదవిలేని ఆచార్యుడు – ఆడవాళ్లు – పురాతన చిత్రాలంటే ఇష్టపడేవాడు – అందరితో కలుపుగోలుగా తిరిగేవాడు ఈ పచియాని!

ఇళ్ల బ్రోకర్ – గదులు అద్దెకిప్పించి – అటూ ఇటూ – డబ్బు గుంజుతాడు. ఇటాలియన్ భాష నేర్పుతాడు. పాఠానికి ఇంత అని రేటు పెడతాడు.

పీజా వచ్చే ఇంగ్లీషు యాత్రికులకు, రహస్యంగా, వాళ్లకు కావలసినవన్నీ అమ్మి సొమ్ము చేసుకుంటాడు.

షెల్లీ ఇంటికి వచ్చి రాగానే, 'ఇంగ్లాస్ వనితల్లారా' అంటూ (La belle Inglis) వారిని ఆటపట్టించి, ఆవూరి కథలు వున్నవి లేనివి చెప్పి నవ్విస్తాడు!!

* * *

పచియాని చెప్పిన కథ ఒకటి, షెల్లీని ఎంతో కదిలించి వేసింది.

వివియానీ సంస్థానాధీశుడు – ఈయన ఫ్లోరెన్స్ ప్రముఖుడు – రెండవ పెళ్ళి చేసుకున్నాడు. రెండో పెళ్లాం అతని కంటే వయసులో చాలా చిన్నది. మొదటి భార్యకు ఇద్దరు చక్కని కూతుళ్ళున్నారు. వారి అందానికి అసూయ చెంది – ఈ రెండో పెళ్లాం వారిని 'పీజా'లో చెరొక కాన్వెంటులో పెట్టించింది. వారికి పెళ్లీడు వచ్చి – మొగుళ్లు దొరికే వరకూ – అదీ కానీ కట్నం లేకుండా చేసుకునే వాళ్లే రావాలి.

మన పీఠంలేని ఆచార్యులగారికి, ఈ ఇద్దరు చిన్నప్పటి నుంచి తెలుసు - వీళ్ల గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పినప్పుడు ముఖ్యంగా పెద్దమ్మాయి తెలివి గలదనీ చాలా అందకత్తె అని ఉత్ప్రేక్షలతో సహా చెప్పాడు.

పోవరీనా పాపం - పంజరంలో పక్షి ననుకుంటుంది.

ఆమె తన యౌవన గంధం అనాఘ్రాతంగా ఆవిరయిపోతున్నదని వేదన చెందుతుంది. తాను ప్రేమ కోసమే పుట్టినట్లు, ఆ ప్రేమ తనకు లభించక మగ్గిపోతున్నట్లు బాధపడిపోతుంది.

నిన్న పూలమొక్కలకు నీళ్లుపోస్తూ - ఆ అమ్మాయికి ప్రేమించటానికి మరెవ్వరూ లేరు - 'మీరు పెరగటానికే పుట్టారు. కాని మేము - ఆలోచించగలిగిన వాళ్లం - మేము ఈ విధంగా ఒకే చోటున వాడిపోవటానికి కాదు కదా' అంటుంది.

ఈ సెయింట్ యాన్ కాన్వెంటు ఘోరమైన ఖైదు. చలికి వణికిపోవాలి. నాలుగు బొగ్గులున్న పాత్రనే మోసుకుంటూ - అదీ ఆరిపోతున్న నిప్పులతో - తిరుగుతారు - నిజంగా దయనీయమైన స్థితి' ఇలా ముగించాడు.

ఈ కథ షెల్లీలో నిద్రాణమైన Knight Errant - ఒక రహస్య వీరుణ్ణి, ఒక ప్రేమికుణ్ణి మేల్కొలిపింది.

ఇప్పటి వరకు సంసార జీవితంలోని సుఖ సంతోషాలు అతనిలోని సహజ సిద్ధమైన ప్రేమికుణ్ణి స్తబ్దుణ్ణి చేస్తే, గత కొన్ని సంవత్సరాలుగా ఆ మత్తులో వుండి పోయాడు.

పచియానీని అంతులేని ప్రశ్న లడిగాడు. పోవరీనా తండ్రిని ఎంతో కోపగించాడు. పాపం ఈ సుకుమారి ఎన్ని కష్టాలు పడుతుందోనని ఆందోళన చెందాడు.

ఇద్దరు యువతీయువకులను కలపటంలోని ఆనందం - ఆ ముసలి ఆచార్యునికి ఉత్సాహంగానే వుంది. షెల్లీని కాన్వెంటుకు తీసుకువెళ్తానని మాట యిచ్చాడు.

అది నరకం లాంటి వాతావరణమే. శిథిలమవుతున్న భవనంలో - ఎవరూ నడవని



ఎమిలీ పోవరీనా

వీధిలో ఊరి పొలిమేర్లలోని కాన్వెంటుకి - షెల్లీ, మతాచార్యునితో పాటు వెళ్లి - ఎదురు చూస్తుండగా - ఆచార్యుడు ఎమిలియాను తీసుకువచ్చాడు.

ఆమె అందాన్ని ఎంత చెప్పినా తక్కువే. ఆమె నునుపైన కురులు సాధారణంగా ముడివేసి వున్నాయి.

చెక్కిన శిల్పంలా శరీరం వుంది - పాలరాతి రంగులో ఆమె శరీరం చాయ మెరిసిపోతుంది. ఆమె నల్లని కళ్లు - ఈ తెల్లని చాయకు మరింత పెద్దవిగా కన్పడుతున్నాయి.

వాలిపోతున్న కనురెప్పలు - కలలబరువుతో నిద్రపోతున్నట్లు చెంపకు చారెడు కళ్లున్నాయి.

ఆమె కనిపించిన మరుక్షణమే - తను ఆమెను ప్రేమిస్తున్నట్లు గుర్తించాడు - అది - శారీరకమో, భౌతికమైందో కాదు. కాని, తాను ఆరాధించే అందానికి తన్నుతానర్పించుకోవటం!!

అతని మనసులో గాఢంగా నాటుకు పోయింది.

కష్టాల్లో వున్న సౌందర్యం - భౌతిక సౌందర్యం - అంతే స్వచ్ఛమైన ఆత్మ సౌందర్యంతో కలగలసినపుడు - ఈ సుందరిని రక్షించే పవిత్ర కార్యాన్ని తను నెరవేర్చగలనని.

యువరాణికి - తాను రక్షకుడిగా నిలవగలనని - ఈ రహస్యమే - అతన్ని ఎప్పుడూ తన ప్రేమ సాహసాలకు పురికొల్పింది.

తాను హారియెట్‌ను, ఆమె తండ్రి నుంచి రక్షించినా - లేదా మేరీని సంతోషంగా లేదని, లేవదీసుకుపోయినా -

ఈ భావనా ప్రపంచంలో - అది అంచులకు అందనిది - అతనిని ఎన్నో సాహస యాత్రలకు - ఈ కాంక్ష - కరుణ - మొదట్లో ఇది భౌతికంగా మొదలయినా - తర్వాత పవిత్రంగా స్వచ్ఛంగా రూపొంది - తన కవిత్వంలో వ్యక్తీకరించ బడుతోంది.

'మేరీ'లో తన మార్మిక ప్రేమ లభించినట్లు చాలాకాలంగా అనుకున్నాడు. ఆమె దాదాపు దేవతామూర్తి గానే అతనికి దర్శనమిచ్చింది.

తన భావనాలోకంలో ప్రేమమూర్తికి దీటయిన దేవత లభించిందని సంతృప్తి చెందాడు.

కాని, రోజువారీ జీవితం - ఆమెను నేలకు దింపింది. సంసార భారం - పిల్లల తల్లి - ఇంటి పనులు చేస్తూ తిరుగుతున్న మేరీ - చాలా సామాన్యంగా దర్శనమిస్తోంది.

ఆమెను స్వచ్ఛమైన రత్నమని - అనుకున్నాడు - ఇప్పుడు అది కేవలం మంచుగడ్డలాగా - తన చుట్టూ గడ్డకట్టినట్లు - ఆమె అసూయాద్వేషాలు - చాలా సామాన్యమైనవి అనిపించింది.

అన్నింటి కంటే - ఆమె అతనికి పూర్తిగా తెలిసిన వ్యక్తి - ఇక ఏమాత్రం రహస్యంగాని, మార్మికతగాని లేని - తన ఊహా లోకాలకు తనతో పాటు రాలేని సంసారి!

ఈ పరిస్థితిలో -

ఈ రహస్యం - మార్మిక - ఎమిలియా సౌందర్యం చుట్టూ తన ఊహా లోకాన్ని - గాలిమందిరాలను, గాజు భవనాలను సృష్టించ గలదు - ఎందుకంటే ఆమె గురించి తన కేమీ తెలియదు కదా!

ఎన్నాళ్ల కెన్నాళ్లకు - ఒక ఇటాలియన్ కాన్వెంటు చీకటిలో - ఆరాధనీయమైన - తన చిన్నప్పటి నుంచి స్వప్నాకాశంలో మెరిసే నక్షత్రాన్ని - ఇప్పటి వరకు అందినట్లు అంది - మాయమై పోతున్న కాంతి పుంజాన్ని - ఇప్పుడు రక్తమాంసాలతో తన కళ్ల ముందే చూడ గలగటం - ఎంత అద్భుతం?!

వారికి దగ్గరగా వచ్చినపుడు - ఎమిలీ అక్కడే వున్న పంజరంలోని పక్షితో మాట్లాడిన మాటలు - షెల్లీకి ఎంతో కవితాత్మకంగా విన్పించాయి.

"నీవు చనిపోతున్నావా? ఎంత దారుణం - స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షుల పిలుపు వింటున్నావా? అవి వెచ్చని ప్రదేశాలకు ఎగిరిపోతున్నాయే. కాని నీకు నిష్కృతి లేదు - నాలాగే - ఇక్కడే - ఈ ఖైదులోనే అంతమైపోవాలి!

అయినా నిన్ను నేను వదిలి వేయ వచ్చాను కదా ? !"

ఆమె మాటల్లోని సంగీతం - ఆ సంగీతంలోని సాహిత్యం - ఆ సాహిత్యంలోని కవిత్వం - షెల్లీని ఎంతగానో ఆకట్టుకుంది.

ఆమె దగ్గర శలవు తీసుకుంటూ - 'మళ్లీ వస్తాను - మేరీని, క్లెయిర్‌ను తీసుకొస్తాను - నీవు అనుమతిస్తే'. ఆమె 'అలాగే' అంది.

* * *

ఈ సంగతుల గురించి మేరీకి ఏమీ దాయకుండా చెప్పాడు. తన ఆలోచనలన్నీ విప్పి చెప్పాడు.

వారిద్దరు Plato చదివిన వారే - మేరీకి 'ప్రేమ' అంటే తెలుసు అది 'సౌందర్యారాధనే'

అలాంటి సౌందర్యారాధన ఏ పాలరాతి విగ్రహాన్ని చూసినపుడో మేల్కొంటే సంతోషించేది –

కాని షెల్లీ – డాంటే లాగా Beatrice తో మాట్లాడే అవకాశం రాలేదు –

ఏది ఏమయినా షెల్లీ అభ్యర్థనపై ఆమె, క్లెయిర్‌తో పాటు ఎమిలియాని చూడటానికి వెళ్లింది.

ఎమిలియా అందాన్ని – గ్రీకు శిల్పం మాదిరి అద్భుతమని అంగీకరించింది. కాని ఆమె అంతరాంతరాల్లో – ఈ ఇటలీ సుకుమారి కంటే – ఇంగ్లీషు కామోద్రేకపరమైన యువతే మేలనుకుంది.

ఎమిలియా భాషణా చాతుర్యం – కాస్త బిగ్గరగావుందని – ఆమె శారీరక కదలిక కాస్త రమణీయంగా వుంటే మరింత బాగుంటాయని, ఆమె మౌనంగా వున్నపుడు మరింత ఆకర్షణీయంగా వుంటుందని – అభిప్రాయపడింది.

మేరీ తన తలపులు – ఆమెపట్ల తన అభిప్రాయం బైటపడకుండా జాగ్రత్త పడి – ఆమెతో దయగా స్నేహపూర్వకంగా మసిలింది.

క్లేర్ – షెల్లీ లాగే ఈ అమ్మాయిని చూసి పడిపోయింది.

మేరీ – ఎమిలియాకోసం ఎన్నో బహుమతులు తెచ్చింది. పుస్తకాలు, చిన్ని బంగారు గొలుసు – వగైరా.

క్లేర్ పాపం పేదది కదా – ఎమిలీకి ఆంగ్ల పాఠాలు నేర్పుతానని ప్రమాణం చేసింది. ఎమిలియా వెంటనే నేర్చుకోవటం మొదలు పెట్టింది కూడా.

Dear sister, Adored Mary, Sensible Percy -

ఇలా సాగింది.

మేరీ అంతగా పట్టించుకునేది కాదు –

నిజానికి ఎమిలియా తరువాత కాలంలో మేరీకి ఆందోళన కలిగించే స్థాయికి వచ్చింది.

ఎందుకంటే – ఇప్పటికే షెల్లీ – ఆమె చుట్టూ – కలల మందిరాలు కట్టి – ఊహా ప్రపంచంలో తనను తాను మరిచిపోయి – ఆమె కోసం ప్రేమగీతాలు రాయటం మొదలు పెట్టాడు.


ఇది – ఎంత మార్మికమైనదంటే – డాంటే – Vita Nuova లేక షేక్స్పియర్ సానెట్‌లాగా...

ఎవరో ఒకర్ని ఎంచుకోవాలనే సిద్ధాంతానికి నేనెప్పుడు కట్టుబడి వుండను –
ఈ గుంపులోంచి – ఒక స్నేహితుడో – ఒక ప్రియురాలో –
ఇక మిగతా ప్రపంచం – శూన్యం – మంచుపూరితం –
అది ఆధునిక నైతిక విలువల్లా – పాతబడిన దారే –
అది బానిసలు తిరిగే – అలసి పడిపోయే మార్గమే–
పీనుగుల గుట్టల మధ్యలో నడుస్తూ
ఇళ్లకు చేరే వాళ్లు అదే – రాజమార్గమని –
కాని – ఇదిగో ఇక్కడ బందీగా వున్న స్నేహితురాలు –
అసూయతో శత్రువు.
కలిసి మెలసి పోవలసిన ప్రయాణం –
నిజమైన ప్రేమ, బంగారాన్ని – మట్టిని వేరు చేస్తుంది.
అలా విడదీయటం – తీసుకుపోవటం కాదు.
ప్రేమ అంటే అర్థం చేసుకోవటం –
కాంతి పుంజం.
సత్యాలను దర్శించటం
అదీ – నా ఊహా ప్రపంచపు దీపం –

* * *

సంకుచితం – ప్రేమించే హృదయం –
ఆరాధించే హృదయపు ఆలోచనలు ఒకే వస్తువు – ఒకే రూపం !!
ఇక్కడ ఎమిలియా సుందర రూపాన్ని కవిత్వంలో చిత్రించాడు.
అరె – వెచ్చని పరిమళం ఆమె సున్నితమైన దుస్తుల్లోంచి ప్రసరిస్తోంది.
విడి పోయిన కురులు – అక్కడ ప్రకృతిని
చెట్ల గాలిని తీయటి వాసనలతో – నింపి వేస్తాయి.
ఆమె నిలబడితే – అంగాలన్నీ కంపిస్తున్నాయి.
మబ్బుల్లో నీటి బిందువులు దాగినట్లు –
మిల మిల మెరిసే తారల మధ్య –
నిండు చంద్రుడు – అందంగా
మండి పోతున్నాడు – ఎడతెగకుండా!!

ప్రియురాలా – ఓ సోదరీ – ఓ దేవతా – విధిని నియంత్రించే చక్రధారీ,
ఈ దారి నాకు అంధకారం – ఇప్పటికే ఎంతో
ఆలస్యం – ఇప్పటికీ తొందరపాటే
నిన్ను ఆరాధించటం –
ఎమిలియా – నీవు రేవులో నిరీక్షిస్తున్న నౌకవి.
ఏ దీవికి – ఎలాంటి అసాధ్యపు తీరాలకు
నన్ను రమ్మంటున్నావు – తెరచాపలు లేపి?
ఇద్దరం ఒక్కటవుదాం – ఒక్కటే
రెండు శరీరాలు – ఒక ఆత్మ – ఎందుకు రెండు ?
శరీరాలు కూడా ఒక్కటే.
మన శ్వాసలు కలిసిపోవాలి.
మన హృదయాలు కరిగిపోవాలి
రక్త నాళాలు – ఒక్కటిగా స్పందించాలి.
ఒక్కటే ఆశ – ఒక్కటే ఆలోచన – ఒక్కటే శక్తి.
రెండు నీడలు ఒకదాని పై మరొకటి –
ఒక్క జీవితం – ఒక్కటే మరణం –
ఒక్కటే స్వర్గం – ఒక్కటే నరకం –
అదే అమరత్వం –
ఒక్క నాశనం – ఒక్క బాధ అంతా నాదే –
రెక్కల పదాలపై – నా మనసు ముక్కలయి పోవాలి.
ప్రేమ ప్రపంచంలో –
ఈ గొలుసులన్నీ – అగ్నిలో కరిగి పోవాలి.
అలిసిపోతా – క్రుంగిపోతా – కంపించి అంతమయిపోతా.



ప్రేమా ప్రేమా!

మేరీకి బాగా తెలుసు ఈ కవిత్వపు – ధార ఎమిలియా తోనే మొదలయిందని.
అదీ ఆదిభౌతికమైన, పవిత్రమైన ఆత్మ లోకమనీ –

అందమైన శారీరకమైన ఎమిలియా నల్ల కళ్లకు – నల్లకురులకు – కాదని–
కాని మేరీకి – షెల్లీ అంత ఆసక్తికరంగా రాయటం కాస్త ఇబ్బంది గానే వుంది.

అతను ఎంతగా ఈ కవిత్వంలో మునిగి పోయాడంటే - ఎమిలియాని చూడటానికి కూడా వెళ్లడానికి సమయం వుండటంలేదు!

అంతలో ఎమిలియా అదృష్టం మారిపోయింది. ఆమె తండ్రి సందేశం - ఒకానొక పెద్దమనిషి కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాడని, తన అంగీకారం తెలుపమని. పాపం ఎమిలీకి మరో దారి ఏది?

తనను చేసుకునే వాడిని ఇప్పటి వరకు చూడలేదు - పెళ్లికి ముందు కూడా చూడలేదు. ఏమి చేయగలదు పాపం - మరో దారి లేదు.

ఈ Biondi ని పెళ్లి చేసుకోవటానికి అంగీకారం తెలిపింది.

అతనికి చిన్న గుట్ట మీద పెద్ద భవనం వుందని - దాని చుట్టూ మురుగు నీరు పేరుకు పోయిందని - అక్కడే తన అదృష్టం వెదుక్కోవాలని రాసి పెట్టి వుంది.

షెల్లీ ఆమె ఆరాధనలో రాసే కవిత పూర్తవలేదు - ఇంతలోనే, ఎమిలియాకి పెళ్లి జరిగిపోయింది.

* * *

ఆరు నెలల తరువాత మేరీ తన స్నేహితురాలికి రాసింది.

ఎమిలియా - Biondiని చేసుకుంది. ఇప్పుడు అతన్ని - అతని తల్లిని శాసిస్తోంది - ఆమె జీవితం క్షుద్ర ప్రాయంగా తయారయింది. ఆ మురుగులోనే తన అదృష్టాన్ని వెతుక్కుంటోంది.

మా స్నేహితుల - a la Italiana -
నాకు ఒక నర్సరీ పాట గుర్తుకొస్తోంది.
క్రాన్‌బోర్న్ వీధిలో వెళ్తుంటే -
అది చాలా దరిద్రంగా వుంది -
అక్కడే ఒక చక్కని పిల్ల కలిసింది
అమ్మాయికి కేకులు - వైను ఇచ్చాను
తర్వాత తీపి కాండీ
కాని ఆ అల్లరి పిల్ల బ్రాండీ
కావాలంది -



తీరని దాహం

ఇప్పుడు – ఈ క్రాన్‌బోర్న్ వీధిని –
'పీజా' లాగా చూడు –
ఇదికూడా – మురికిగానే వుంది.
బ్రాండీ – కోసం బ్రాండీ కొనాలంటే –
షెల్లీ Italian Platonics అర్థం చేసుకోవాలి...
.... దానికి షెల్లీ కలిపాడు –
ఇప్పుడు ఈ కవిత్వం చూడలేను –
అది ఆరాధించిన వ్యక్తి ఒక గాలిమబ్బు – జూనో కాదు.
ఎప్పుడూ ప్రేమించకుండా వుండలేము –
కాని –
ఈ రక్త మాంసాల శరీరంలో బందీ అయిన ఆత్మలకు
ఇది అంత తేలికయిన విషయం కాదు –
ఈ మర్త్య రూపంలో నుంచి – అమర్త్య
లోకంలోనికి ప్రయాణం అంత సుగమం కాదు...

* * *



పీజా నగరం

పదకొండవ అధ్యాయం

ప్రేమ - సేవ

వెనీస్ నుంచి వెళ్లిపోయిన చాలా రోజుల తరువాత క్లేర్‌కి తన కూతురు అలెగ్రా వార్తలు హాప్నర్ దంపతుల ద్వారా అందుతుండేవి.

అలెగ్రా, ఎప్పుడూ జలుబుతో బాధపడుతుంది. పాపం నిశ్శబ్దంగా గంభీరంగా - వయసు మళ్లిన దానిలాగా తయారయింది. హాప్నర్ గారు ఆమెను వెనీస్ నుంచి బైటకు పంపటం మేలని అనుకున్నారు. కాని, బైరన్ మహాశయుని కలిసి మాట్లడటమే గగనమై పోతుంది. అంతగా ఆయన వ్యభిచార కూపంలో రోజు రోజుకు దిగజారిపోతున్నాడు.

కొన్ని నెలలు అలా గడిచి పోయాయి.

క్లేర్ ఆందోళనతో ఉత్తరాలను పుంఖాను పుంఖాలుగా హాప్నర్ గారికి పంపుతూనే వుంది. జవాబు మాత్రం లేదు. అప్పుడు బైరన్ జీవితంలో పెద్ద మార్పు వచ్చినట్లు ఆమెకు తెలిసింది.

బైరన్‌కి బాగా జబ్బు చేసింది. కేవలం మంచానికే పరిమితమైపోయాడు. అలాంటి సమయంలో, హాప్నర్ గారు బైరన్‌ను పలకరించటానికి వచ్చి - 'మీ రాసలీలలు వెనీస్ పౌరులకు అలవాటయిపోయాయి - ఇప్పుడు కేవలం ఎగతాళిగా మాట్లాడుకుంటున్నారు. మీరు కేవలం, వెనీస్ ఏబ్రాసి లంజల వలలో పడి గిల గిల కొట్టుకునే బలహీనులుగా ఆడిపోసుకుంటున్నారు.' అంటు చెప్పుకొచ్చారు.

అంతే - కవిగారికి విపరీతమైన కోపమొచ్చి - తన వుంపుడుగత్తెలందర్ని తరిమేశాడు.

తన ఆరోగ్యం బాగుపడగానే - మళ్లీ వెనీస్ నగర జీవితంలోకి ప్రవేశించి - విందులు - వినోదాలకు హాజరవటం మొదలు పెట్టాడు.

ఆ సందర్భంలోనే – ఒక ఆకర్షణీయమైన సుందరిని – అదీ పదిహేడు సంవత్సరాల యౌవనవతిని – అప్పుడే తల నెరిసిన దొరగారిని పెళ్లిచేసుకొని Count Guiccioli చిన్న దొరసానిగా మారిన తెరీజాని కలిశాడు !

మొదటి రోజునే, ఆమె చేతిలోకి చిన్న చీటీని ఎవ్వరూ చూడకుండా పెట్టి, శలవు తీసుకున్నాడు.

ఆమె చేతులు పాలరాతి బొమ్మలా – ఆమె వక్షం, పాలసంద్రం పొంగులా అతనికి తోచింది. ఆ చీటీని ఆమె జాగ్రత్తగా దాచింది.

అది, కలవాలని ఆహ్వానం – ఆమె వచ్చింది. అతనెవరు?

ఒక గొప్ప కవి – వయసులో వున్నవాడు – అందగాడు – పైగా లార్డ్! అన్నింటినీ మించి అపార ధనవంతుడు! తన చుట్టూ ఎంత ప్రపంచం వున్నా – వెరవకుండా – అతని చేతుల్లో వాలిపోయింది.

మరికొద్ది రోజులకే – తెరీజా భర్త ఆమెను రావెనా (Ravenna) కు తీసుకువెళ్లాడు. ఆమె బైరన్‌ను కూడా రమ్మని అభ్యర్థించింది.

వెనీస్‌లో కంటే రావెనాలో మరింత స్వేచ్ఛగా వుండవచ్చు అనేది ఆమె సందేశం.

ఎడతెగని ప్రేమ బంధం అతనికి సరిపడదు – అతను అది తన బలమనుకుంటాడు.

ఆమె, రావెనా నుంచి తనకు ఆరోగ్యం సరిగా లేదు చూడటానికి రమ్మంది. ఆ విధంగా ప్రేమ సందేశం పనిచేయని చోట – కరుణ రసం విజయం సాధించింది.

కవిగారు *రాజు వెడలె రవితేజము లలరగ* అన్నట్లు వెనీస్ నుంచి బయలు దేరారు – దారిలో ఫెర్రారాలో అందాలు – మరి కొన్ని గ్రామీణ సుందరులను పలకరించే ప్రయాణం చేశారు.

రావెనా, చేరే సరికి విసుగు చెందినట్లు కనిపించినా ఆమెను కలవటం ఆనందంగానే వుంది.

తెలివిగల ఆడవాళ్ల – అదే క్లేర్‌లాంటి వాళ్లు – అతని సహనాన్ని పరీక్షిస్తారు. అటువంటి స్త్రీల కామక్రీడలు అతనికి ఏమాత్రం నచ్చవు. అలాగే, వెనీస్ బజారు లంజలు, అతని స్థాయికి చాలా క్రిందివారు –

కాని ఈ 'గూసిలి' యువరాణి అతనికి కావాలసినంత ప్రేమ నందివ్వగల - రమణీయమైన ఆడబొమ్మ!

ఆమె జ్వరంతో పడివుంటే - Don Juan (డాన్ వాన్) నర్సులా సేవ చేసి - "అరె, ఈమె లేకపోతే - నేనేమై పోతాను? నా కోసం ఎన్ని కష్టాలు పడింది. ఒక వేళ ఈమె మరణిస్తే నేను తట్టుకోగలనా? లేదు - లేదు - అలా జరగన్వివను -" అని తరువాత రాసుకున్నాడు.

రాజును గెలిచిన రాణి, రావెనా వదిలి బొలోన్యా (Bologna) వెళ్తుంటే - అతను అనుసరించాడు.

ఇది నాకంతగా గౌరవప్రదంగా వుందనుకోను -

ఆడవారికి విసనకర్ర మోసే కంటే - వారిని వేటాడటమే మేలు.

నేనిప్పుడు - Cavalier Sirvente (రాణీ సేవకుడు) అరె ఇది గొప్పగా వుందే - అనుకున్నాడు లార్డ్ బైరన్.

* * *

క్లేర్‌కి ఈ కథంతా తెలిసింది - అదీ, అలెగ్రాను బొలోన్యా తీసుకు రమ్మన్నాడని.

తన కూతురు, బైరన్ కొత్త ఉంపుడుగత్తెవున్న ఇంట్లో వుండటం ఆమె సహించ లేక పోయింది. అలెగ్రాకు అక్కడ ఎటువంటి ప్రేమ గౌరవం దక్కదని తెలుసు -

బైరన్‌కు ఘాటుగానే రాసింది - తన కూతుర్ని పంపమని - దానికి బైరన్ -

'ఇది నాకు సమ్మతం కాదు. అలెగ్రా, షెల్లీ ఇంటి వాతావరణంలో పెరగటం నా కిష్టం లేదు.

అంతకంటే ఏదయినా హాస్టల్‌కు పంపుతాను. ఇంతవరకు వాళ్లు ఎవరినైనా పెంచారా? అంతకంటే ఇంగ్లాండు పంపిస్తా. ఒక పండు కూడా తినలేని చోట -

దేవుడు లేడని నమ్మిన చోటుకు, నా కూతురు రాదు' అని ఖరా ఖండిగా రాశాడు.

ఇది చూసి క్లేర్ బాగా ఏడ్చింది.

చివరికి అలెగ్రాను కాన్వెంటుకు పంపారు.

ఈ సన్యాసినులకు శుభ్రత తెలీదు – ప్రేమ తెలీదు.

క్లేర్ వణికి పోయి గోల చేసింది. చివరికి షెల్లీకి కల్పించుకోక తప్పలేదు.

"ఈ విషయంలో క్లేర్ రాసిన వుత్తరాలు ఒకటి అరా చూడటం జరిగింది. అలా రాయటం మంచిది కాదని మందలించాను. ఆమె రాసింది చాలా అసందర్భంగా అపరిపక్వంగా వున్నా – ఆమె కూతురి మీది ప్రేమను కాదనలేము.

మీరు కూడా మీ బాధ్యతను మరిచిపోరనీ ఆశిస్తాను. క్లేర్ కూతుర్ని చూడాలనుకోవటం చాలా సహజం.

ఆమె చాలా అనారోగ్యంగా – బలహీనంగావుంది. అలాంటి వారిని చాలా శ్రద్ధగా పట్టించుకోవాలి.

"బలహీనులు – అనారోగ్య వంతులు – రాజుల వంటి వారు. వారు తప్పు చేయరు కదా!" ఆ విధంగా బైరన్‌కి రాశాడు.

* * *

నిజానికి, షెల్లీ సంసారం కూడా ఏమాత్రం సజావుగా సాగటంలేదు. మేరీ రోజు రోజుకు తన సహనాన్ని కోల్పోతుంది. గాడ్విన్ తరచు డబ్బుకోసం వుత్తరాలు పంపుతూనే వున్నాడు. షెల్లీ ఇక వాటికి సమాధానం పంపడం మానివేశాడు. ఇప్పటికే అయిదువేల పౌండ్లు వరకూ ఇచ్చాడు. అది తిరిగి వచ్చే దారి లేదు.

"మీరు మేరీకి ఉత్తరాలు రాయకండి – డబ్బుకోసం – ఆమె దగ్గర డబ్బులేదు. ఉంటే మొత్తం మీకే ఇచ్చేది – మీలాంటి మేధావికి."

మేరీకి తన తండ్రి గురించి, క్లేర్ తన కూతురు గురించి బాధపడుతూ – ఒకరి నొకరు భరించ లేని వారిగా మారారు.

వారిద్దరికీ ఇష్టుడైన షెల్లీ ఉనికి, వీరికి బాధాకరంగా మారింది. క్లేర్‌కి తన అవసరం ఈ ఇంటిలో లేదని తెలుసు.

చివరికి Bojti ఆచార్యుల గారి దగ్గర గవర్నెస్‌గా కుదిరింది.

అప్పటికీ షెల్లీ ఆమెకు ఎంతో ప్రేమాస్పదునిగా ఉత్తరాలు రాశాడు. చివరికి ఈ విషయం మేరీకి తెలియకుండా వుంచాడు - ఇదంతా క్లేర్‌ని రక్షించటానికే - మేరీని మోసం చేయాలనికాదు.

అతను పూర్వం అనుకున్నట్లు – ప్రేమ భావన అంటే అభిప్రాయాలు ఏకీభావం అనుకున్నాడు – నిజానికి అవి చెప్పుకోవలసిన అవసరం కూడా లేదు.

కాని జీవితం అతనికి నేర్పిన పాఠం – ఏదీ సంపూర్ణం కాదు – ఎలా ఎంత తక్కువగా అందినా – అందిపుచ్చుకోవాలి.

కొంతమందికి, 'అసలు సత్యం' విషంలాంటిది. మేరీకి చిన్న చిన్న - పల్చబరిచిన డోసుల్లోనే ఇవ్వాలి !



మేరీ షెల్లీ



జార్జి గోర్డాన్ లార్డ్ బైరన్

పన్నెండవ అధ్యాయం

రావెనాలో లార్డ్ బైరన్

బైరన్ ఆహ్వానంపై, షెల్లీ 'రావెనా' వచ్చాడు. అప్పటికి పూర్తి ఆరోగ్యంతో మిలమిల లాడుతుంటాడు బైరన్. అతని 'గూసిలీ' యువరాణి, నిజంగా వెనీస్ బజారు ముండలనుంచి అతన్ని రక్షించిందని చెప్పాలి. తెరీజా కూడా కాస్త వళ్లు చేసింది. ఇప్పుడు బైరన్ గారి నీడ నిండుగా పొడవుగా పరచుకుంటోంది!

'గూసిలీ' రాజభవనం గొప్పగా వుంటుంది. భవనంలోని అట్టహాసం, సామాన్యమైనది కాదు. అద్భుతమైన పాలరాతి మెట్ల మీద, మిమ్మల్ని ఆహ్వానించటానికి ఎనిమిది భారీ శునకాలుంటాయి.

మూడు కొండ కోతులుంటాయి. అయిదారు పిల్లులు గునుస్తుంటాయి. ఒక గద్ద చూస్తుంటుంది. ఒక రామచిలుక, ఒక సముద్రపు ఫాల్కన్ పోట్లాడు కుంటుంటాయి. గుర్రపు శాలలో పది గుర్రాలు సిద్ధంగానే వుంటాయి. ఒక నెమలి అలా అలా తిరుగు తుంటుంది మబ్బుల కోసం.

బైరన్ కవి – షెల్లీని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు.

రాత్రి అంతా కవిత్వం చదువుతూ – చర్చిస్తూ గడిపారు. Don Juan లోని కొత్త అధ్యాయాలు షెల్లీకి అద్భుతంగా నచ్చాయి. ఆ కవిత్వపు సాంద్రత – పదాలకూర్పు – అందులోని సంగీతం అతన్ని అబ్బుర పరిచింది. దీనితో పోలిస్తే తనెక్కడుంటాడు? ఎంతో పేలవంగా తన కవిత్వం దీనికి దరిదాపులకు రాలేదనుకుంటాడు – ఏమాత్రం అసూయ చెందకుండా అభినందిస్తాడు.

గ్రీకులకు 'ఇలియాడ్'లాగా, బైరన్‌ను, కాలానికి నిలిచే కవిత్వాన్ని రాయమంటాడు. బైరన్ – కవిత్వం అంటే డబ్బు తెచ్చిపట్టే సాధనమంటాడు!

షెల్లీ మరొకసారి బైరన్ జీవన విధానానికి అలవాటు పడాల్సి వస్తుంది.

చాలా ఆలస్యంగా నిద్రలేచేవారు. మధ్యాహ్నం బ్రేక్‌ఫాస్ట్ చేసేవారు.

అప్పటి నుంచి సాయంత్రం వరకూ సాహిత్యం పై పని చేసేవారు.

సాయంత్రం ఆరు నుంచి - ఎనిమిది గంటల వరకు గుర్రపు స్వారీ చేసేవారు.

అపుడు రాత్రి విందు - తర్వాత మళ్లీ తెల్లవార్లూ కవిత్వం - సాహిత్యం చర్చలు - ఇదీ వారి దిన, రాత్రి చర్యలు.

బైరన్ కేవలం కవిత్వమే మాట్లాడేవాడు కాదు.

షెల్లీ పై ఇంగ్లండులో వున్నవన్నీ, ఆ తరువాత - తన మీద వున్న పుకార్లు అన్నీ మాట్లాడేవాడు.

హోప్నర్ దంపతులు రాసిన వుత్తరం గురించి - షెల్లీపై వున్న అపవాదు - అన్నింటి గురించి చర్చించు కుంటారు.

అన్ని విషయాలు షెల్లీ, మేరీకి రాస్తాడు - తమ దగ్గర పనిచేసే 'ఎలీస్' ఇవన్నీ పుట్టించిందని - క్లేర్ పరిస్థితి, అలేగ్రా ఆరోగ్యం -

మేరీ చక్కగా అర్థం చేసుకుని హోప్నర్‌ను ఖండిస్తూ రాస్తుంది. షెల్లీ లాంటి దేవతలాంటి వ్యక్తి ఎటువంటి అనైతికమైన నడతకు తావీయడని-

షెల్లీని ఇలాంటి విషయాలన్నీ ఎంతగానో బాధిస్తాయి -

బైరన్ ముఖ్యంగా షెల్లీని ఆహ్వానించింది -

అలెగ్రా గురించి మాట్లాడటానికి -

ఇప్పుడు బైరన్ ప్రియురాలు - స్విట్జర్లాండు వెళ్లాలని అనుకుంటోంది. కాని బైరన్‌కు ఫ్లారెన్సుగాని, పీజాగాని రావాలని వుంది.

షెల్లీని తన ప్రియురాలికి - ఈ ప్రదేశాల అందాలను - అక్కడి వాతావరణాన్ని - వర్ణించి రాయమంటాడు - ఆ విధంగా తాను కూడా పీజా రాగలనని, ఆమెతో - భావిస్తాడు.

'నిజానికి షెల్లీ ఎప్పుడూ - తెరీజాని చూడలేదు. కాని తన రచనా శిల్పంలో అతను ఆమెను పీజా రావాలని - రాసి - వచ్చే వరకు ఒప్పిస్తాడు - బైరన్ ఎంతో ఆనందిస్తాడు.

ఆ విధంగా - బైరన్ - గూసిలీ యువరాణికి పీజాలో వుండేందుకు ఏర్పాట్లు షెల్లీ దంపతులు చేస్తారు - అలెగ్రాను కూడా కాన్వెంటు నుంచి తమతో తీసుకు రావటానికి - బైరన్ అంగీకరిస్తాడు.

రావెనా నుంచి బయలుదేరే ముందు - షెల్లీ వెళ్లి అలెగ్రాను చూస్తాడు - ఆ కాన్వెంటు దరిద్రంగా వుంది. చాలా పాలిపోయి బలహీనంగా వుంది అలెగ్రా -

కాని ఆమె స్నేహితురాళ్లలో ప్రత్యేకంగా -రాచబిడ్డలాగా కన్పించింది.

'అమ్మకు ఏమని చెప్తావు' అంటాడు.

"Che mi manda un baccio e un bel vestituro.

--- అమ్మను ముద్దు పంపమను.

"E come voi il vestituro sia fatto?" --- మంచి రుమాలు పంపమను.

"Tutte di seta e d'oro." --- అది సిల్కు రుమాలు

'నాన్నకు ఏమని చెప్పమంటావు' అంటాడు.

"Che venga farmi un visitino e che porta seco la mammina."


--- నాన్నను, అమ్మతో వచ్చి నన్ను చూడమను...

ఇది కష్టమే.

అలెగ్రాలో, బైరన్ తాలూకు జీన్స్ పుష్కలంగా వున్నాయి - అంతకు మించి చదువు రాదు. కానీ స్వర్గం, నరకం, దేవుడు ఆమె మాటల్లో వినపడుతున్నాయి. బైరన్‌కు కావాల్సింది కూడా అదే కదా!



గూసిలీ యువరాణి తెరీజా



లార్డ్ గోర్డాన్ బైరన్



బైరన్ వైద్యుడు

డా॥ పోలీడోరి

పదమూడవ అధ్యాయం

మిరాండా

రాచరికపు ప్రయాణాలు చాలా హడావుడిగా వుంటాయి. బైరన్ రాజ పరివారం పీజా వస్తోంది. మొత్తం నగరం అంతా నిద్ర లేచి కూర్చుంది.

వారికోసం లా ఫ్రాంచి LA FRANCHI పాలెస్ తీసుకున్నారు.

ఆర్నో ARNO లో వున్న గొప్ప భవనాల్లో ఇది ఒకటి. విలియమ్స్ దంపతులు సహాయం చేయగా –

షెల్లీ దంపతులు ఈ పురాతన భవానాన్ని నివాస యోగ్యం చేశారు –

ముందుగా గూసిలీ యువరాణి ఆమె తండ్రి వచ్చారు. “ఆమె చాలా అందంగా వుంది” – షెల్లీ రాసుకున్నాడు –

“నాకు మనుష్యుల గురించి ఏమయినా తెలిసి వుంటే – మా ‘బైరన్’ ఈమెలోని దురుసుతనాన్ని భరించాలి” అని కూడా రాశాడు.

ఆ తర్వాత బైరన్ – DON JUAN (డాన్ వాన్) వచ్చాడు. అతన్ని చూడటానికి – అదే ఆ ‘ఇంగ్లీషు డెవిల్’ను చూడాలని పీజా మొత్తం కిటికీలకు అతుక్కుపోయింది.

వారికి నిరాశ కలగలేదు – ఆ ఊరేగింపులో – అయిదు బగ్గీలు – ఆరుగురు సేవకులు – చక్కని గుర్రాలు, కుక్కలు – కోతులు – నెమళ్లు – అన్నీ వరసగా ఊరేగింపుగా పీజా వీధుల్లో వెళ్లాయి.

ఈ పాలెస్, బైరన్‌కు నచ్చుతుందో లేదోనని షెల్లీ ఆందోళనగా వున్నాడు.

నిజానికి ఇది మైకలాంజిలో రూపొందించిన మధ్య యుగాల నాటిది. నిజంగా 16వ శతాబ్దానికి చెందింది. నేల మాళిగలు – గోపురాలు – కిటికీలు అన్నీ ఉన్నాయి.

దిళ్లు తీసుకుని చల్లటి నేల మాళిగలో నిద్ర పోయేవాడు – బైరన్.

బైరన్ రాకతో పీజాలో ఒక్కసారిగా సాంఘికపరమైన ఉత్సాహం వచ్చినట్లయింది.

షెల్లీ - నైతిక కేంద్రమైతే , బైరన్ అక్కడ సాంస్కృతిక కేంద్రమయ్యాడు.

బైరన్‌ను చాలా ఆసక్తితో చూసేవారు. షెల్లీని ఒకరకమైన సానుభూతితో చూసేవారు.

షెల్లీ ఉదయాన్నే లేచి *గోతే* చదివేవాడు. *స్పినోజా – క్యాల్డన్* చదువుతూ మధ్యాహ్నం వరకూ గడిపేవాడు.

అప్పుడు చుట్టూవున్న పైన్ చెట్ల అడవిలోకి వెళ్లిపోయేవాడు. అక్కడి ఏకాంతంలో తిండితిప్పలు లేకుండా సాయంత్రం వరకు తన ఊహాలోకాలలో విహరిస్తూ కవిత్వం రాస్తుండేవాడు.

బైరన్, మధ్యాహ్నం లేస్తాడు. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గుర్రపు స్వారీకి వెళ్తాడు. లేదా పిస్టల్ షూటింగ్.

సాయంత్రం గూసిలీ ప్రియురాలిని దర్శించేవాడు. రాత్రికి వచ్చి - రెండు మూడు గంటలవరకూ రాసేవాడు -

ఒక రకమైన మేధో కంపనలతో - ఉత్సాహంతో నిద్రకుపక్రమించి - నిద్ర పట్టక - మర్నాడు మధ్యాహ్నం వరకూ - ప్రక్కమీద దొర్లేవాడు.

లండన్ లార్డ్ పీజాలో చాలా గొప్పగా గౌరవం పొందాడు. ముఖ్యంగా పీజాలో వున్న అంగ్లేయులు అతనికి బ్రహ్మరథం పట్టారు.

నిజానికి నిర్లక్ష్యం అనేది – అగౌరవపరచటమైతే – అసలు లెక్కచేయకపోవడం – హీనమైనదే కదా–

బైరన్ విందులు - వినోదాలు లేకుండా గడపలేడు. ఆడవారి సాంగత్యం లేకుండా వుండలేడు... అతను ఆ విందుల్లో వినోదాల్లో మునిగి తేలేవాడు.

కాని ఇదే జీవితాన్ని షెల్లీకి అలవాటు చేయలేకపోయాడు -

నిజానికి షెల్లీకి ఇలాంటి సోసైటీ వాతావరణం అంటే విసుగు.

నైతికంగా అతను – ఆచరణ ముందుపెడతాడు. అలాగే పాపకర్మల కంటే పశ్చాత్తాపాన్ని గౌరవిస్తాడు.

మనిషిని సంపూర్ణునిగా విశ్వసించడం పెద్ద నేరం! ఒక వేళ అలా నమ్మితే –మనిషిని సంపూర్ణుడిగా రూపొందాలంటుంది సంఘం – అలాంటి 'వ్యక్తిత్వం'

పొరపాటున వాసనపడితే – దానిని నాశనం చేయటానికి అందుబాటులోని ఆయుధాలన్నింటిని ఉపయోగించటానికి వెనకాడదు – అదే సంఘం.

పీజాలో 'మంచివాళ్లందరూ', షెల్లీ దంపతులను అంటరాని వాళ్లుగా – 'ఆదరించారు'!!

దీనిని గమనించి – షెల్లీ నవ్వుకున్నాడు. అతనికి ఈ పేకాట గదులు, పొగచూరిన క్లబ్బుల కంటే రాత్రి ఆరుబైట చల్లనిగాలులు వేయిరెట్లు సేదదీరుస్తాయి.

మేరీ అన్ని చోట్లకు వెళ్లటానికి ప్రయత్నించింది.

పీజాలోని బాల్స్‌కు 'అందరూ' వెళ్తున్నారు అని షెల్లీతో అన్నపుడు

"మేరీ! ఎవ్వరు ఆ 'అందరూ'? అది కేవలం 'ఊహాత్మకమైన భావనే. నీవు ఎప్పుడైన చూశావా? 'అందర్నీ' " అంటాడు.

ఒకసారి ఈ 'అందర్నీ' గెలవాలని చర్చికి కూడా వెళ్లింది. చర్చిలో వాళ్ళు చెప్పేది నాస్తికులకు వ్యతిరేకంగా – అదీ మేరీని గమనిస్తూనే –

అంతటితో ఆ ప్రయత్నం మానివేసింది.

ఈ రాత్రి విందులు – డాన్సులు – బాల్స్ షెల్లీ అసహ్యకరమైన అనవసరమైన శ్రమ అనుకుంటాడు.

అతను ఇరవయ్యేళ్ల వయసులో – షోకులు – దర్జాలు నేరమనుకున్నాడు. అవే ఇప్పుడు అసహ్యకరంగా, భరించలేనివిగా కన్పించాయి.

అలాంటి వాటి నుంచి దూరంగా వుండటానికి – విలియమ్స్‌తో గడిపేవాడు – వారిలో చక్కని అనుబంధం – చాలా సింపుల్ సాధారణ జీవన శైలి కనిపించింది.

జేన్ కంఠస్వరం చాలా తీయగా హాయిగా వుంటుంది. ఆమె కదలికలు నాగరికమైనవి. ఆమె – తనకు యుక్తవయసులో ఇంతగా నచ్చేది కాదేమో – అప్పుడు అతని సాహసం – ప్రేమకోసమనుకునే వాడు – కాని ఇప్పుడు – గతాన్ని మరచి – ప్రశాంత వాతావరణాన్ని ఆహ్వానిస్తున్నాడు.

జేన్ గొప్పగా పాడేది.

ఆమె స్వరం అతన్ని తన బాధల నుంచి – జ్ఞాపకాల నుంచి ఎటో తీసుకు పోతుంది. అతని ఇంటి వాతావరణంలోని స్తబ్దత నుంచి కూడా –

పూర్వం హారియెట్ తనని గాయ పరిచింది - మేరీ తనని సేదదీర్చింది. ఇప్పుడు 'జేన్' రూపంలో Antigone ఏదో పూర్వ జన్మ నుంచి తెలిసి, అనుసరించి తనను ప్రేమించినట్లు భావించాడు.

కాని అది ఏ మాత్రం - ధ్వంస పరచి మళ్లా నిర్మించాల్సిన అవసరం లేదని -

మేరీని వదిలి - జేన్‌తో పారిపోవలసిన అవసరం లేదని గుర్తించాడు.

జేన్ భర్త మంచివాడు - తన స్నేహితుడు. నమ్మకంగా వుండదగినవాడు.

మేరీ ఆలోచనలు కూడా పరిగణన లోకి తీసుకోవాలి. అవును జేన్‌ను ప్రేమిస్తున్నాడు. ఈ ప్రేమలు భౌతికావసరంకోసం కాదు – ఆశాలేదు, కనీసం కోరికాలేదు. – కాని ఇది అలౌకికం కాదు – ఎటువంటి ఆశా లేనిది, కోరికా లేనిది. అంతే.

* * *

జేన్ కూడా అతన్ని అర్థం చేసుకుని రొమాంటిక్‌గా అతని అవసరాన్ని తీర్చగలిగింది - అతని ముఖాన్ని నిమిరేది- జుట్టులో వేళ్ళు పోనిచ్చి సవరించేది.

అతని విచారాన్ని నివారించే పనికి, దంపతులిద్దరూ ఎంతో సహాయపడేవారు.

అతని బాధల్ని - వారు, అతని గాయాల్ని వారి స్నేహం మాన్పగలిగింది.

జేన్ అంటే ...... Miranda. ఎడ్వర్డు అంటే ..... Ferdinand

వారు గొప్ప దంపతులు - షెల్లీ వారికి గంధర్వుడు *ARIEL*

వీరి చుట్టూ చక్కని స్నేహవనాన్ని సృష్టించుకున్నారు - అది వారి అంతరంగాలలోని ప్రేమను - అనురాగాన్ని చక్కగా పెంచి పోషిస్తోంది.

* * *

విలియమ్స్ తమ స్నేహితుడు ట్రిలానీ (Trelawny) గురించి చెప్తుంటాడు. అతను నావికుడు - సముద్రపు వీరుడు - 28 ఏళ్లకే జీవితానికి సరిపడా సాహసాలు చేసినవాడు.

ఇప్పుడు పీజా వచ్చి వీరితో చేరాలని, షెల్లీ - బైరన్‌లాంటి కవులను నిజంగా చూడాలని ఆశిస్తున్నాడు. అలాగే వుత్తరాలు రాశాడు.

విలియమ్స్ ప్రోద్బలంతో ఒకరోజు దిగాడు.

రావడంతోనే - విలియమ్స్ - షెల్లీలువున్న భవనానికి వచ్చాడు. వారు ఒకే ఇంట్లో - క్రింద ఒకరు పైన ఒకరు ఉంటున్నారు.

అతను విలియమ్స్‌తో మాట్లాడుతుండగా, షెల్లీ నీలికళ్లు అక్కడ మెరవటం చూసి

– జేన్, నవ్వుతూ వెళ్ళి షెల్లీని రండి – 'ఇతను మా స్నేహితుడు ట్రీ' – అంది.

ఆడపిల్లలాగా సిగ్గుపడుతూ షెల్లీ లోనికి వచ్చి – ట్రీని – చూసి రెండు చేతులూ చాపి అతని కలుపుగోలుతనానికి ఆశ్చర్యపోయాడు –

ట్రీ కూడా – ఏమిటీ ఇతనా, ఇంత సాధారణంగా వున్నాడు – తిరుగుబాటుదారా – మేధావా? – నమ్మలేకపోయాడు. జేన్ – ఆ పుస్తకం ఏమిటి?

షెల్లీ ఇదిగో ఇది *Magico - Prodigioso* తర్జుమా చేస్తున్నాను *Calderon's*– అయితే చదవండి అని వాళ్ళు ప్రోత్సహించారు.

అతను అలా చదువుతూంటే వాళ్లు కళ్లుమూసుకుని వింటారు. ఆశ్చర్యంగా తర్వాత నిశ్శబ్దం –

'అరె ఎక్కడ షెల్లీ', ట్రీ అంటాడు. జేన్ నవ్వుతూ – అతను అంతే – వస్తాడు మాయమవుతాడు – గంధర్వుడు అంటుంది.

ఆ మర్నాడు షెల్లీ – ట్రీని, బైరన్ దగ్గరకు తీసుకు వెళ్తాడు.

ఇక్కడి వాతావరణం వేరు –

అక్కడి కుక్కలు – పనివాళ్లు – అందరిలాగే – ట్రీ కూడా

బైరన్ బాహ్య రూపాన్ని గొప్పగా అనుకున్నాడు –

అతనితో సంభాషణ చాలా సామాన్యంగానే సాగింది.

అతనొక నాటకంలో పాత్రలాగా – అదీ పురాతనమైన రాజపాత్ర పోషిస్తున్నట్టున్నాడు.

ట్రీ చెప్పిన కథలు – ఆ సముద్రపు కథలు ఇద్దరూ శ్రద్ధగా విన్నారు.

మూడు గంటలకు మూడు గుర్రాలు వచ్చాయి. ముగ్గురూ – స్వారీకి వెళ్లారు.

తర్వాత పిస్టల్ షూటింగ్ – ముగ్గురూ బాగా గురి కలవారే. తర్వాత కవిత్వం మాట్లాడుకున్నారు – ట్రీ – DON JUAN (డాన్ వాన్) లో నుంచి చక్కగా చదివాడు – బైరన్ ఆశ్చర్యపోయి – "నిజం చెప్పు – నేను Athens లోని Timon లేదా Timur - Tartar అనుకున్నావా – ఇప్పుడు ఇంత సామాన్యంగా వున్నానని నిరుత్సాహపడుతున్నావా" అని నిలదీశాడు.

ఈ ప్రపంచం అంతా ఓ చెత్త కుప్ప
మానవజాతి దాన్ని మోసే గాడిదలు.

బైరన్ స్వగతంలా అంటాడు.

అలా తిరిగి వచ్చి షెల్లీతో, మేరీతో "అరె, బైరన్ ఎంత భిన్నంగా వున్నాడు.

అతని చుట్టూ - మిస్టరీ ఏమీలేదు.

అతను మాట్లాడకూడనివి మాట్లాడతాడు.

ఆడదానికంటే అసూయాపరుడు - అది చాలా ప్రమాదం కూడా" అంటాడు.

షెల్లీ అంటాడు - "మేరీ, ట్రీకి బైరన్ పూర్తిగా అర్థమైనట్లున్నాడు - మనకు అర్థం చేసుకోవటానికి ఎంత కాలం పట్టింది?!!"

"అవును ట్రీ బ్రతికున్న వాళ్ళతో తిరిగాడు

మనం - చనిపోయిన వాళ్లతో బ్రతుకుతున్నాం" అంటుంది.



రాజును గెలిచిన రాణి (గూసిలీ)

పధ్నాల్గవ అధ్యాయం

శ్రేయోభిలాషులు

కవులకు అభిమానిగా – వారిపట్ల ఆసక్తితో 'పీజా' చేరిన ట్రీ నావికుడు – ఇప్పుడు వారి అభిమానాన్ని చూరగొంటున్నాడు. ఎప్పుడు వారికి దగ్గరగా వుండే ట్రీ – లేనపుడు, బైరన్ "మనం ట్రీని శుద్ధి చేస్తే, అతను అబద్ధాలు ఆడకుండా చేయగలిగితే – నిజంగా పెద్దమనిషి కాగలడు" అంటాడు. కాని ట్రీ ఆ చుట్టు పక్కల వున్నపుడు ఎంతో గౌరవంగా చూస్తాడు.

అందరి కళాకారుల మాదిరే – ఈ కవులు కూడా, తమ అంతర్మథనాన్ని సృష్టి చేస్తారు కవిత్వంలో – కాని ఆ రచనల ద్వారా భుక్తికోసం ప్రాకులాడరు!

అలాంటి వారికి – నిజమైన 'చేతల' వానిగా, ట్రీ పట్ల గౌరవం కలిగింది. నిజ జీవితంలో అతనే హీరో!

షెల్లీ ఎప్పుడూ, ట్రీతో సముద్ర భాషలోనే మాట్లాడతాడు – "నాకు చిన్నప్పటి నుంచి నావికుడవ్వాలని వుంది. ఈ సముద్ర తీరాలు – ఈ తెరచాపలు – ఈ పడవలు ఇవన్ని నా కెంతో ఆనందాన్ని కలిగిస్తాయి –" అంటాడు షెల్లీ.

'కనీసం పొగతాగటం రానివాడు – మద్యం సేవించలేని వాడు – నావికుడు ఎలా కాగలడు' అంటాడు ట్రీ.

ఇక బైరన్ – అతను ఊహల్లో దొంగలరాజు! నిజంగా ఈ వంచకుని దగ్గర్నుంచి నేర్చుకోవాలనుకుంటాడు.

ఈ సముద్రపు జీవుల భాష, నిర్లక్ష్య వైఖరి కూడా అతన్ని చూసి నేర్చుకోవాలను కుంటాడు.

ట్రీలానే – బైరన్ పై తన ప్రభావం వుందని గమనించి – దానిని షెల్లీకి మద్దతుగా వుపయోగించాలని –

“మీరు మీ పుస్తకాల్లో, చాలా తక్కువ ప్రజ్ఞ గలిగిన రచయితల గురించి రాస్తుంటారు.

అంత కంటే సన్నిహితుడు షెల్లీ గురించి, ఎందుకు రాయరు?” అని, “అది అతనికి చాలా ఉపయోగకరం కదా” అంటాడు.

“అన్ని వ్యాపారాలకు రహస్యాలుంటాయి. నేను ఎవ్వరికైనా సహాయంగా రాస్తే – నాకు లాభం చేకూరాలి – కాని షెల్లీ ఏమివ్వ గలడు– ఆయినా ప్రతిభ గల కవికి ఇంకెవ్వరి సాయం అవసరం వుండదు–” బైరన్ “మరో విషయం – షెల్లీ తన మార్మికమైన ఉపమానాలను – ఉత్ప్రేక్షలను తగ్గిస్తే – అతనికి ఎవ్వరి సహాయం అవసరం లేదు.”

“మరి, మీ లండన్ దొరలు, షెల్లీని ఎందుకు తక్కువగా చూస్తారు – ఆయన కూడా తక్కువ వాడు కాదుకదా – సంస్థానాధీశుని వారసుడే – బాగా చదువుకున్నవాడే కదా.”

అప్పుడు బైరన్ రహస్యంగా – “అతను క్రిస్టియన్ కాదు”

‘వాళ్లందరూ క్రిస్టియన్లా?’ – ‘వారినే అడుగు’

“ఒకవేళ మీ భోజనాల బల్ల దగ్గర నాకు సైతాను కనపడితే – అతను మీ స్నేహితుడను కుంటాను” అన్నాడు ట్రీలానీ.

బైరన్ అతని దగ్గరగా వచ్చి – “సైతానంటే రాజుగారి చుట్టమే!” అంటాడు.

* * *

విలియమ్స్ దంపతులతో ట్రీలానీ చాలా దాపరికం లేకుండా వుంటాడు.

వీరు ముగ్గురు షెల్లీకి వీరాభిమానులు –

బైరన్ గారికి షెల్లీ అంటే అసూయ అనిపిస్తుంది. కాని బైరన్ పుస్తకం విడుదలయితే పోలీసు కాపలా అవసరమవుతోంది. చైల్డ్ హెరాల్డ్ కొత్త అధ్యాయం కోసం జనం ఎగబడుతుంటారు.

అదే షెల్లీ కి పట్టుమని పదిమంది చదువరులు లేరు –

“బైరన్‌కు, పుట్టుక, సంపద, అందం వాటితో పాటు కీర్తి, కాంత కూడా వుంది!”

“అవును” విలియమ్స్ అంటాడు, “బైరన్‌కు అన్నీ వున్నాయి – వాటితో పాటు

వ్యసనాలు కూడా" -

"కానీ షెల్లీ తన గూటిలో వుండిపోతాడు. తన బోటులో ఆర్నో రేవులో తేలుతుంటాడు.

అక్కడ నుంచి కదలాలని కూడా అనుకోడు -

అంతేకాదు - అతను ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఆచరణలో జీవిస్తాడు.

బైరన్, కనీసం రెండు గంటలు మాటమీద నిలబడలేడు. పైగా షెల్లీనీ అతని నైతికతనీ విమర్శిస్తాడు."

అపుడు జేన్ అంటుంది, "బైరన్ చెడిపోయిన పిల్లవాడు -

కాని బైరన్ గాని, షెల్లీ గాని వారికి మనుష్యులు అర్థం కారు.

షెల్లీ మానవ జాతిని ప్రేమిస్తాడు - కనీసం బైరన్ ఆ పని కూడా చేయలేడు -"

నిజానికి షెల్లీ గురించి -

అతను తన గురించి - తన స్వార్థం గురించి ఆలోచన లేని వాడు - నిస్వార్థపరుడు.

నిన్న గాక మొన్న - "నాకు ఈదటం రాదు" అన్నాడు.

"ఎందుకు రాదు - నీళ్లలో దూకి - వెల్లకిలా పడుకో తేలతావు" అన్నాను.

"అంతే అప్పటికప్పుడు బట్టలూడదీసి నీళ్ళలో దిగాడు - ఎంతకీ పైకి రాలేదు-

వెంటనే నీళ్లలో చూస్తే - నీటి అడుగున వెల్లకిలా పడుకుని - కనీసం తనను తను రక్షించుకునే యత్నమే చేయలేదు - " ట్రీలానీ ఆశ్చర్యంగా చెప్తాడు.

జేన్ నిట్టూర్చింది. ఆమెకు తెలుసు - అతన్ని ఆత్మహత్య అనే భావన, ఎలా వెన్నాడుతుందో.

అతను ప్రేమించిన వాళ్లందరూ అలాగే చనిపోయారు.

కాని - 'షెల్లీ సంతోషంగా లేనట్లు కనపడడే'

అదికాదు - అతను తన స్వప్న లోకాల్లో జీవిస్తాడు.

ఈ సత్యలోకంలో - అతని అభిప్రాయాలను గౌరవించే వాళ్లు ఎవరు? అది అతనికి బాధ కాదా?



జేన్ విలియమ్స్

అతని పుస్తకాలు అమ్ముడుపోవు - ఇంటి వాతావరణం ఆనందకరం కాదు.

అతనికి మరణం అంటే ఈ బ్రతుకు పీడకలలో నుంచి మేల్కోవటమే!

* * *

"షెల్లీ పునర్జన్మను నమ్ముతాడు" ట్రీ అంటాడు.

అతన్ని 'నాస్తికుడు' అనే వాళ్లకు అతను సరిగా అర్థంకాలేదు.

ఫ్రెంచి తత్త్వవేత్తలను తప్పుపడతాడు.

ప్లేటో , డాంటే లు వీరు డిడోరాట్ ను దాటి వచ్చారంటాడు.

ఈ మత విశ్వాసాలను అతను ఏమాత్రం సహించడు.

"ఎందుకు నిన్ను నువ్వు 'నాస్తికుడ'నుకుంటావు? ఈ ప్రపంచం నిన్ను నాశనం చేస్తుంది."

"అది ఒక తిట్టు మాత్రమే - మతం గురించి చర్చ ఆపాలంటే సైతాన్‌ను తీసుకురావాలి.

మానవాతీత శక్తుల గురించి బెదరగొడితేనే వీరు దడుసుకుంటారు.

అది వీరిని ఎదుర్కోవటానికి ఒక ఆయుధం" షెల్లీ.

"నిజానికి - మతసంబంధమైన మర్మాలు - మేధను అణచివేస్తాయి.

ఆలోచనా శక్తిని హరిస్తాయి" అంటాడు.

ఈ విధంగా షెల్లీ గురించి ఈ ముగ్గురూ మాట్లాడు కుంటారు. వారికి షెల్లీ అంటే ఆరాధన. అతని దురదృష్టం, బాధల్లో షెల్లీ పెరుగుతూనే వుంటాడు.

మనం - మన దయాపాత్రులనే ఎక్కువ ప్రేమిస్తాం. వారినే ఎక్కువ అభిమానిస్తాం.

దయ - అభిమానం - ప్రేమకు సరైన సమ్మేళనం.

విలియమ్స్ దంపతులు - ట్రిలానీ ఈ ముగ్గురూ షెల్లీని అభిమానించినట్లు, బైరన్‌ను కూడా ఆరాధించాలంటే మరింత మానసిక పరిపక్వత - నమ్రత అవసరమేమో?

* * *

ఈ విధంగా తన అభిమానులు, తన గురించి తర్కించుకుంటుంటే - మన కవిగారు - తన కవితా శక్తుల బహిర్గతానికి దారుచెట్ల వనాలు దాటి - ఓ కూలిన వృక్షపు నీడలో - ప్రక్కనే నదీ ప్రవాహం గలగలలో - తన కలల ప్రపంచంలో ప్రయాణం చేస్తున్నాడు.

అతనక్కడ వున్నాడని గుర్తుగా దారి పొడవునా చేరిన కాగితాలు సగం రాసిన కవితలు - ఎంతో దూరం వున్నాయి.

తన పగటి కలల కలకలంతో - అతను తన పరిసరాలు మర్చిపోయాడు - ఆకలిదప్పులూ లేవు.

పగలు సాయంత్రం, అయిపోతోంది. మేరీకి ఎంతో కంగారు. ట్రిలానీని తోడుగా వెతకటానికి బయలుదేరింది. పాపం నడిచి నడిచి అలసి కూలబడింది -

ఆమెను అక్కడే వదిలి ట్రిలానీ ముందుకు వెళ్లాడు.

కాగితాల ముక్కలు - కవితల ఖండికలు కనపడినాయి. ఆ దారిలోనే ఆ చెట్టు నీడలో తన ప్రపంచంలో షెల్లీ!!

అతన్ని బెదర కొట్టడం ఇష్టంలేక కవితలను చూశాడు...

గిటార్ వాయిస్తున్న జేన్‌కి

మిరాండాకు ఏరియల్ రాస్తున్నాడు.

సంగీతాన్ని ప్రేమించే ఈ సేవకుని ఆదుకో...

ఇలా వున్నాయి.

అప్పుడు షెల్లీని పిలిచాడు -

ఆఁ రండి -

"ఏమిటి ఇది మీ చదువుకునే గదా?"

"అవును -ఈ చెట్లు - ఇవే నా పుస్తకాలు - ఇవి అబద్ధాలు చెప్పవు -

కవిత రాసేప్పుడు - ప్రశాంతత కావాలి-

ఇంటివద్ద తలుపుల మోత - అడుగుల శబ్దం - గంట మోత - ఇవన్నీ మార్మోగుతుంటాయి.

ఇక్కడంతా - ప్రశాంతం."

'అదేమిటి నదీ ప్రవాహం శబ్దం కదా'?

"కాదు - కాదు - నదిలో నీరు సమయంలా ప్రవహిస్తుంది - ప్రకృతిలోని శబ్దాలన్నీ సంగీతంలా వినపడతాయి.

మనిషే - జంతువులా, అసందర్భంగా నన్ను ఇబ్బంది పెడతాడు.

"అరె ఇక్కడెందుకున్నామో - ఎలా వచ్చామో ఎలా తెలుస్తుంది - మనల్ని మనం ఇలా ఎందుకు ఎదగలేక బాధించుకుంటున్నామో - అందర్నీ ఎందుకు బాధ పెడుతున్నామో- ఎలా తెలుస్తుంది..."

"మేరీ అక్కడ వుంది - ఇంతదూరం రాలేక" అంటాడు.

"అయ్యో ! పాపం మేరీ" - అని పుస్తకాలు, కాగితాలు తీసుకుని టోపీలో, కోటులో కుక్కి బయలు దేరారు.

"పాపం మేరీ, ఆమెది దురదృష్టం - ఆమెకు ఏకాంతం పనికిరాదు - నాకు 'గుంపుల'తో పడదు ఇద్దర్నీ మరణమే కలుపుతుంది."



క్లైర్

పదిహేనవ అధ్యాయం

అలెగ్రా మరణం

తప్పని సరిగా అలెగ్రాను 'పీజా' తీసుకువస్తానని షెల్లీకి మాట యిచ్చిన బైరన్ ఆమె లేకుండానే వచ్చాడు.

పాపం క్లేర్ తన కూతుర్ని చూడాలని ఎంతో ఎదురు చూస్తుంటే - ఈ వార్తతో హతాశురాలయిపోతుంది.

అలెగ్రాను బాగ్నా - కావెలో Bagna - Cavallo కాన్వెంటులో వుంచినట్లు తెసుకుని మరీ బాధపడిపోయింది.

అంతకంటే దరిద్రపు కాన్వెంటు, ఎక్కడా వుండదని - అక్కడి ఆరోగ్య పరిసరాలు అసలు లేవని క్లేర్‌కి తెలిసిన వాళ్లు చెప్పగా వింది. అక్కడ కనీసం వెచ్చగా కూడా ఉండదని విని - తాను చలిమంటనే చూడలేక పోతుంది.

దీనితో క్లేర్ ఇక ఏమీ చేయలేని హతాశురాలయి, బైరన్‌కు - మీరు అలెగ్రాను మంచి ఇంగ్లీషు కాన్వెంటులో పెట్టండి. నేను జీవించి వుండగా ఇక ఆమెను చూడనని మాట యిస్తున్నాను... అని రాసింది.

దీనికీ సమాధానం రాలేదు. క్లేర్ స్నేహితులు ఏదయినా ఉపాయం పన్ని అలెగ్రాని బైటకు తీసుకు వద్దామనీ సలహా యిచ్చారు. కానీ షెల్లీ దీనిని తీవ్రంగా వ్యతిరేకించాడు.

బైరన్ చేసేది దారుణంగానే వుంది కాని దీనికి పరిష్కారం ప్రతిహింస కాదు.

"లార్డ్ బైరన్ అసలు బెసకటంలేదు నీవు అతని అధీనంలోనే వున్నావు. నీవు మిలన్‌లో నేను ఇచ్చిన సలహా పాటించి వుంటే, ఇది - ఈ పరిస్థితి దాపురించి వుండేది కాదు - ఇప్పుడు నీవెంత బాధపడినా ఉపయోగంలేదు. మరొకసారి నీ యిష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకుంటే - దానికి చాలా ఖరీదయిన పర్యవసానం ఎదురవుతుంది..." అని ఆమెను ఆపగలిగాడు.

తర్వాత బైరన్‌ను కలిసి – క్లేర్ సంగతి వాదించాడు. ఆ లార్డ్ ఆమె పేరు వింటేనే మండి పడ్డాడు.

"ఆడవాళ్లు ఏదో గొడవ లేకుండా బ్రతకలేరు–" అని తోసి పారేశాడు.

షెల్లీ, కాన్వెంటులోని దారుణమైన పరిస్థితులు తెలియజేశాడు.

"నాకు మాత్రం ఏమి తెలుసు? ఇంతవరకూ నే నెప్పుడూ అక్కడకు వెళ్ల లేదు" అని లెక్కలేకుండా అన గలిగాడు – బైరన్

షెల్లీ, క్లేర్ – బాధను, దుఃఖాన్ని వర్ణించి చెపుతుంటే – బైరన్ ఒక రకమైన సంతృప్తితో విన్నాడు!

అంతటితో ఆ సంభాషణ ముందుకు పోలేదు.

తర్వాత షెల్లీ – అరె – అతన్ని పడదోసి తన్నాలనే ఆలోచనను అణచుకోవటానికి చాలా కష్టపడ్డాను... చాలా కోపం వచ్చింది. కాని అది సరికాదు –

అతను ఈ విషయంలో ఇక మారడు–" అన్నాడు.

"అవును తలుపులు – గోడలు అలాగే వుంటాయి. కాని బైరన్ సేవకుల, స్నేహితుల లొంగుబాటు ప్రవర్తనతో ఒక నియంతలా మారాడు." అని అతని స్నేహితుడన్నాడు.

దీనితో క్లేర్ ఎంతో నిరాశలో కూరుకు పోయింది. ఇలాంటి పరిస్థితిలో ఆమెను ఒంటరిగా ఫ్లొరెన్సు పంపటం ఇష్టం లేక తమతోనే వుంచారు. మేరీ – షెల్లీ.

ఈ వేసవి, విలియమ్స్‌తో కలిసి సముద్ర తీరంలో వుందామని నిర్ణయించారు. తమతో పాటు క్లేర్‌ను కూడా రమ్మన్నారు.

షెల్లీకి ఇది చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. మళ్లీ కొత్త తీరం – సముద్రం.

అప్పటికే 'ట్రిలాని'తో సంప్రదించి ఒక 'బోటు' తయారీకి జెనోవాలో కెప్టెన్ రాబర్ట్‌కు చెప్పారు.

దానికి DON JUAN *డాన్ వాన్* అని పేరు కూడా పెట్టారు. బైరన్ మీద వున్న గౌరవంతో –

బైరన్ తనకోసం మరొక బోటు తయారీ కోసం నియమించాడు. దానిపేరు *బోలివార్* Bolivar.

* * *

షెల్లీ - విలియమ్స్ తమను తాము మధ్యధరాసముద్రపు మొనగాళ్లమని అనుకుంటున్నారు.

కాని వారి భార్యలకు దీనిమీద అంత ఆసక్తి లేదు.

మొగవాళ్ళిద్దరు - అక్కడి ఇసకలో ఈ 'బే' తీరాన్ని - సముద్రపు లోతుపాతుల్ని గీస్తుంటే - ఆడవాళ్లిద్దరు - అక్కడి పూలు కోసుకుంటూ దూరంగా ఉండిపోయారు.

"ఈ 'బోటు' గొడవ నా కసహ్యంగా వుంది" మేరీ.

"అది సరే - కాని వీళ్లకు చెప్పలేం. ఒకవేళ చెప్పినా వారి ఆనందాన్ని పాడు చేయటమే-" జేన్ అంది.

* * *

ఈ ప్రణాళిక సక్రమంగా జరగాలంటే ఈ వేసవికాలం - వీరికి - సముద్ర తీరంలో రెండు ఇళ్లు కావాలి - షెల్లీ - విలియమ్స్ ఎంత వెతికినా ఒక్క ఇల్లూ దొరకలేదు. వీళ్లతోపాటు బైరన్ కూడా కలుస్తానన్నాడు.

లార్డ్ బైరన్‌కి చిన్న భవనం కావాలి -

ఎప్పుడైతే అక్కడ సరైన ఇళ్ళు లేవని తెలిసిందో ఇక బైరన్ ఆ ఆలోచన మానుకున్నాడు.

చివరికి విలియమ్స్ - జేన్ కలిసి - క్లేర్‌తో (ఆమెకు కాస్త వెసులుబాటుగా వుంటుందని) ఇంటి వేటలో పడ్డారు. వాళ్ల 'పీజా' వదిలివెళ్లగానే-

బైరన్ దగ్గర్నుంచి కబురు వచ్చింది - అది అలెగ్రా అనారోగ్యం గురించి - టైఫాయిడ్ వచ్చి - చివరికి అలెగ్రా కన్నుమూసిందని!

"ఇందుకు నా తప్పు ఎంతవరకూ వుందో చెప్పలేను - మనం రోజు అనుకుంటాం - ఈ పని ఇలా చేస్తే బాగుండేదోమోనని - కాని, అన్నీ కాలమే నిర్ణయిస్తుంది. ఇక్కడ - మరణమే శాసించింది-" అని ముగించాడు.

అతన్ని పలకరించటానికి షెల్లీ వెళ్లినపుడు కాస్త నలతగా కనిపించాడు - కాని చాల మామూలుగానే వున్నాడు.

రెండు రోజుల తర్వాత విలియమ్స్ దంపతులు, క్లేర్ తిరిగి వచ్చారు - ఇళ్ల వేట ముగించుకుని.

షెల్లీ, అలెగ్రా మరణవార్త క్లేర్‌కు చెప్పే ధైర్యం చేయలేక పోయాడు వెంటనే – బైరన్‌కు దగ్గర్లో వున్నపుడు మరింత గొడవ జరుగుతుందని ఆగారు.

అందుకని 'పీజా' నుంచి వెళ్లి పోయేవరకు దాచిపెట్టారు.

* * *

వాళ్లకు రెండిళ్లు దొరకలేదు – తీరంలో.

ఒకే ఒకటి రెండు అంతస్తుల భవనం – అదీ ఎటువంటి సామాను లేకుండా –

సముద్రపు అంచులో నిలిచి వుంది. అదే Casa Magni.

క్లేర్‌ను 'పీజా' నుంచి తీసుకు పోయే తొందరలో ఇక మిగతా విషయాలపై అడ్డుపెట్టకుండా – అందరూ కలిసి ఈ 'కాసా మాగ్ని'లోనే – ఉండాలని నిర్ణయించారు.

"నేనొకటి నిర్ణయించుకుంటే – అలా వెళ్లిపోతుంటాను – ఎవ్వరైనా ఆపేవరకూ – కాని ఇంతవరకు నన్నెవరు ఆపలేదు–" అంటాడు షెల్లీ.

అక్కడి అధికారులు – నావికులు – ఎన్నో సమస్యలు సృష్టించారు – కాని షెల్లీ ఇటువంటివి లెక్క చేయడు – అతని మానసిక శక్తి సాటిలేనిది.

బైటి ప్రపంచాన్ని ఖాతరు చేయడు –

మరి కొద్ది రోజుల్లో ఆ రెండు కుటుంబాలు సముద్ర తీరంలోని 'కాసా మాగ్ని'లో కుదురుకున్నాయి.

* * *

'కాసా మాగ్ని' దాదాపు సముద్రం మీదే నిలబడి వుంది. దాని వెనుకనే ఒక అడవి కూడా వుంది.

ముందు వరండా – సముద్రం మీదకు వంగి – Spezzia Bay లాగా వుంది.

క్రింది అంతస్తు – సముద్రం ఎత్తులోనే వుంది. అలలు వచ్చి తగులు తూనే వున్నాయి.

అక్కడే పడవలకు కావలసిన సామాను పెట్టుకోవాలి.

మొదటి అంతస్తులో పెద్దహాలు – మళ్లీ వరండా – నాలుగు పడక గదులు వున్నాయి.

రెండు షెల్లీకి మేరీకి – ఒకటి విలియమ్స్ దంపతులకు – ఒకటి క్లేర్‌కు పంచారు!

ఇది – చాలా ఇరుకుగానే వుందనుకోవాలి. కింద అలలు ఎప్పుడు వచ్చి తగులుతూనే వున్నాయి. దిగులుగా – ఎడ తెగకుండా!

ఒకరోజు – షెల్లీ దంపతులు, విలియమ్స్ దంపతులు క్లేర్ కీ విషయం ఎలా చెప్పాలా

అని మధన పడుతున్నారు.

క్లేర్ - అంతా గమనించి - "ఏమిటి అలెగ్రా చనిపోయిందా?" అంది.

ఆ మర్నాడు - బైరన్‌కు రాసింది. అది షెల్లీకి తిరిగివచ్చింది. బైరన్ "ఆమెకు ఎక్కడ కావాలంటే అక్కడే - అలెగ్రా అంత్యక్రియలు జరిపిస్తాను" అంటూ.

క్లేర్ విరక్తి సంపూర్ణమయింది. "నీ యిష్టం వచ్చినట్లు చేసుకో - కాని నాకు అలెగ్రా బొమ్మ ఒకటి - ఆమె 'నల్లని కురులు' కొన్ని" పంపమంది-

బైరన్ చివరికి అలెగ్రాను ఇంగ్లాండులో - అతను చదివిన పాఠశాల దగ్గర్లోని చర్చి (Harrow - on - the - Hill) లో ఖననం చేయాలని నిర్ణయించాడు.

సమాధి మీద ఇలా రాయించాడు.

అలెగ్రా - జార్జి గోర్డాన్ లార్డ్ బైరన్ కూతురు.

20, ఏప్రిల్ 1822 రోజున చనిపోయింది. అయిదు సం॥ల ఆర్నెల్లు వయసు.

నేనే ఆమె దగ్గరకు వెళ్తాను.

ఆమె ఎప్పటికీ నా దగ్గరకు రాలేదు II- Sam (12) - 23

రాయించి పంపాడు.

కాని Harrow ఈ అక్రమ సంతానాన్ని చర్చి లోపల ఖననం చేయనివ్వలేదు. చర్చి గోడబైట గొయ్యి తీసి పాతిపెట్టారు.

ఏనాడూ అలెగ్రానీ చూడటానికి కాన్వెంటుకు వెళ్లని బైరన్ - తర్వాత అలెగ్రా సమాధిని చూడటానికి వెళ్తాడు- చాలా బాధ పడి.

'ఆమె దగ్గరకు నేను వెళ్తాను.

ఆమె నా దగ్గరకు రాలేదు'

సామ్యూల్ చెప్పింది ఎంత సబబు! అనుకున్నాడు.



కాసా మాగ్నీ

పదహారవ అధ్యాయం

కాసా మాగ్ని

కాసా మాగ్ని, షెల్లీకి, ఎంతో నచ్చింది. అది వింత ఏకాంత ప్రదేశం !

వెనుకగా అడవి - తీరమంతా రాళ్లు రప్పలు - దగ్గర్లో పేద బెస్త ఇళ్లు....

కాని మేరీకి ఎక్కడో విసిరి వేసినట్లుంది. సంతోషంగా లేదు. మళ్లీ నెల తప్పింది. ఆదుర్దాగా, చిరాగ్గా వుంది. ఇంతకంటే ఏదయినా పట్నం దగ్గర్లో వుంటే మంచి వైద్యం అందుబాటులో వుంటుంది కదా. తమ చుట్టుపట్ల పేద వాళ్ల పద్ధతులు, భాష ఆమెకేమీ నచ్చలేదు.

పీజాలో వున్నపుడు విలియమ్స్ దంపతుల సాంగత్యం ఆమెకు ఆనందాన్ని కలిగించింది. ఇక్కడ - ఇరుకుగా, చిరాకుగా వుంది. ఇంటి పనులన్నీ అందరూ కలిసి చేయాలి. అదే అసలు పరీక్ష! చిన్న చిన్న విషయాలకే చిరాకు పడుతున్నారు.

షెల్లీ ఎప్పుడూ జేన్ పనినే మెచ్చుకుంటాడు. రెండు కవితలు కూడా రాశాడు !

మేరీని ఎంతో ఓదార్చేవాడు - దగ్గరగా తీసుకుని "నీలాంటి దేవతలు - ఇంటి పనులు సరిగ్గా చెయ్యలేకపోవటం TANTACUS శాపం - దీని గురించి ఎక్కువ బాధపడకు" అంటూ సరిపుచ్చేవాడు.

ఆమెను మార్చలేమని తెలుసు. శారీరకంగా బలహీనమయి - మానసికంగా గుబులు పడుతోంది. అనురాగంతో - సహనంతో అర్థం చేసుకుని భరిస్తున్నాడు!

మేరీ ఎప్పుడూ అతనితో - అందరూ చాలా ముఖ్యమనుకునే విషయాలపట్ల నీకంత నిర్లక్ష్యమెందుకు? అంటుంది - కానీ అతని మానసిక శక్తి పట్ల ఆమెకు ఎనలేని విశ్వాసం - తనకదే ఆసరా! కాని తన శక్తిని తన కోసం ఎందుకుపయోగించడు? తనకోసం ఏమీచేసుకోలేడా? ఆసక్తి లేదా?

తన వ్యక్తిత్వం గురించి – మిగతా ప్రపంచం – తమ గురించి ఆలోచించినట్లుగా– అదీ తన పరిమితులు తనే విధించుకున్నట్లు – అతనిలో ప్రసరించే వెలుగు ఎదుటి వారికి, తన స్నేహితులకు, ఇంకా ఏమాత్రం పరిచయం లేని వారికి కూడా దారి చూపుతుంటుంది.

ఇక సంప్రదాయాలు : పిల్లల బాగోగులు – అతనికెప్పుడూ పట్టవు!

ప్రతినెల 'లెగ్‌హారన్' Leghorn పట్నానికి వెళ్లి – తనకు రావలసిన భరణం తెస్తాడు, ఒక సంచి నిండా 'స్కుడి'లు పోసి – ఇంటికి రాగానే నేల మీద పోస్తాడు నాణాలు – కుప్పగా – తరవాత కాలితో కేకులాగా పరచి – ముందు రెండు భాగాలు చేసి ఒక భాగం మేరీకి ఇంటి అద్దెకు – మిగతా అవసరాలకు ఇస్తాడు – మిగతా సగాన్ని మళ్లీ రెండు భాగాలు. అందులో ఒక భాగం – జీత భత్యాలకు మేరీకి ఇస్తాడు – మిగిలినది పెర్సీకి – అంటే తనకి – అంటే – క్లేర్, గాడ్విన్, ఇంకా హంట్ ప్రభృతులుంటారని మేరీకి తెలుసు !!

* * *

ఒక రోజున కెప్టెన్ రాబర్టు జెనోవా నుంచి రావాలి. ఇంట్లో ఆడవాళ్లంతా ఎంతో హడావుడి పడిపోయారు. ఇంత చిన్న ఇంట్లో ఆయన్ను ఎట్లా మర్యాద చేయాలో!

ఈ రాబర్టు రావటంతోనే కవిగారు ఎక్కడ ? అంటూ షెల్లీని చూడాలనే ఇంత దూరం వచ్చినట్లు చెప్తారు – కాని షెల్లీ ఎక్కడ? మాయమయిపోయాడు!!

షెల్లీ లేకుండా – అందరూ కూర్చున్నారు. అంతలో ఒకరు ఓరిదేవుడా! అని గట్టిగా అరిచారు.



ఏరియల్ బోలివార్

మేరీ తిరిగి చూసింది – షెల్లీ, పూర్తి నగ్నంగా ఒక పనిపిల్ల వెనకదాగి ఇంట్లోకి వస్తాడు – "పెర్సీ ఎంత ధైర్యం?" అంటూ అరుస్తుంది. అంతే షెల్లీ పూర్తిగా కళ్లముందుకు దగ్గరగా వచ్చి జరిగిన విషయం చెప్పటానికి ప్రయత్నిస్తాడు. ముగ్గురు ఆడవాళ్లు చేతులతో ముఖాల్ని కప్పుకుని సిగ్గుపడతారు –

అయినా అతను చూడటానికి ఎంతో వింతగా – తడిసిపోయి, సముద్రపు ఉప్పు వాసనతో – వంటిమీద కలుపు తీగలతో వింతగా ఉంటాడు!!

* * *

షెల్లీ – విలియమ్స్ తమ బోటుకోసం చిన్న పిల్లల్లా ఎదురు చూస్తున్నారు. లెగ్‌హారన్ వైపు నుంచి – తెరచాప కనపడగానే – 'లెరిసి'కి దగ్గర్లోకి రాగానే తీరానికి పరుగు పెట్టారు.

అలెగ్రా మరణం తరువాత – షెల్లీ, రాబర్టుకు ఉత్తరం రాశాడు – బోటు పేరు 'ఏరియల్' అని మార్చమని – 'డాన్ వాన్' వద్దని.

బైరన్ గుర్తులన్నీ చెరిపేయాలనుకున్నాడు. అసహ్యంతో, తీరా బోటు తీరం చేరగానే, 'డాన్ వాన్' పేరు – తెరచాప మీద చూసి మండిపడ్డాడు.

ఈ పని బైరన్ – రాబర్ట్‌కు చెప్పి – పేరు మార్పుకు – అదే పేరు రాయించాడు. పైగా పడవ మీద – సైతాను బొమ్మ వేయించాడు. షెల్లీ, సబ్బు గుడ్డలు తీసుకు వెళ్లి ఆ పేరు చెరిపేయటానికి ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు – చివరికి టర్పెంటైన్‌తో కూడా రుద్దాడు – రంగు పోలేదు.

ఆఖరిగా ఆ పేరు వున్నంత వరకు తెరను చింపివేసి – వేరే గుడ్డ మీద *ఏరియల్* అని రాయించి– ఆ ఖాళీలో కుట్టించాడు.

లెరిసి నుంచి ఆ బోటు తెచ్చిన కెప్టెన్ బోటు బాగా వుందని – కాని నడపటం కష్టమని చెప్పాడు. షెల్లీ – విలియమ్స్ వారికి అంతగా బోటు గురించి తెలియకపోయినా – ఒక నౌకాధికారి ఇచ్చిన డిజైన్ ప్రకారమే తయారు చేయించారు. బోటు చూడటానికి చాలా బాగుంది. కాని తీరా తయారయిన తర్వాత – రెండు టన్నుల బరువు ఎక్కువ పెట్టాల్సి వచ్చింది – అది సరిగా నిలబడటానికి. అప్పటికీ, కాస్త గాలికే ఊగుతోంది!

ఏరియల్ ఇద్దరు యజమానులు – వారే బోటును నడపాలని నిర్ణయించారు. వారికి తోడు చార్లెస్ విలియమ్స్ – ఇతను యువ నావికుడు – ఉంచుకోవటానికి మాట్లాడుకున్నారు.

షెల్లీ – బోటు గురించి – ఆడవారికి తెలిసినంతగా కూడా తెలియదేమో! కాని అతని ఉత్సాహం ఎక్కువ.

తెరచాప తాళ్ళు వంటికి చుట్టుకుని – *సోఫోకిల్స్* చదువుతాడు. చదువుతూనే –

చుక్కాని తిప్పుతాడు. రెండు మూడు సార్లు నీళ్లలోకి పడిపోబోయాడు కూడా ! కాని తన జీవితంలో అంత ఆనందంగా మరెప్పుడు లేడు!

ట్రిలానీ అతని బోటు నడపటం చూసి – విలియమ్స్‌తో, "ఒక మంచి నావికుణ్ణి పెట్టుకోండి – ఇదికాదు పద్ధతి" అని చెప్పాడు. ఇది విలియమ్స్‌ను కూడా బాధించింది. తమలాంటి ముగ్గురు నావికులుండగా మరొక రెందుకు? నేను కెప్టెన్ను కాదా? షెల్లీ కెప్టెన్ కాదా!

'షెల్లీయా? అతనితో ఏమీ మంచి జరగదు – అతని ముఖం మీద పడుతున్న ఉంగరాల జుట్టు అడ్డుతీసే వరకు నీకు ప్రమాదమే– తరవాత అతని చేతిలో పుస్తకాలు వదిలిపెట్టమను – అతని చేతులు తారుబక్కెట్లో ముంచి అప్పుడు నడపమను" అంత గట్టిగా చెప్పాడు.

ఏరియల్ బోటు వడ్డుకు వచ్చినపుడు ఎక్కువ నీళ్లను తీసుకు వచ్చేది – కాసా మాగ్నికి! అందుకని విలియమ్స్ చిన్న బుట్టలాంటి డింగీని చేయించాడు. అదికూడా తారు కాన్వాసుతో మూసివుంచాడు.

అది ముట్టుకుంటే మునిగి పోయే బొమ్మ – దానిని చూసి కవి ఎంతో ఆనందించాడు. ఎన్నోసార్లు అతన్ని ముంచింది – అయినా సరదాగా వుంది కదా!?

ఒక సాయంత్రం బోటు ఇంటి కింద నుంచి బైటకు లాగుతుండగా, జేన్ ఇద్దరు పిల్లల్తో ఇసుకలో కూర్చుని వుండటం చూశాడు.

"రా – అలా షికారు వెళ్దాం – అందరం కూర్చో వచ్చు" అని ఆహ్వానించాడు. ఆమె అమాయకంగా బోటులో కూర్చుంది – పిల్లలనిద్దర్నీ పట్టుకుని – అప్పటికే ఆరంగుళాల కిందకి నీళ్లు వున్నాయి అంచుకు – కాస్త గాలి వస్తే ఒంగిపోతుందేమో నన్నట్లు – అలా కాస్సేపు ఒడ్డునే తిప్పి– తర్వాత లోతుగా బోటు తెడ్డు వేస్తున్నాడు – షెల్లీ మనదారిలో లేడు – అతను చూపు ఏ స్వప్న తీరాల వెంటనో తేలిపోతోంది. జేన్‌కి అర్థమయింది – అతను వినే పరిస్థితిలో లేడని – చుట్టూ మైలు దూరంలో మరే బోటు లేదుకూడా –

ఎన్నోసార్లు హెచ్చరించింది – అయినా అతను వినేట్లు లేడు – ఒక్కసారిగా "ఆం ఇప్పుడు – ఒక గొప్ప మర్మాన్ని ఛేదిద్దాం" అంటున్నాడు.

ఒక వేళ గట్టిగా అరిస్తే – పిల్లలు బెదిరి పోతారు – షెల్లీ కదిలితే బోటు తిరగపడుతుంది – అంతే నీళ్లు లోపలికి వచ్చి మునిగిపోవడమే. ఎంతో నిబ్బరంగా – "షెల్లీ – ఇప్పుడు కాదు – ముందు భోజనం చేయాలి – పిల్లలు ఆకలితో వున్నారు – అదిగో చూడు – విలియమ్స్ –

డ్రీ తీరంలో మన కోసమే చూస్తున్నారు." అంది మెల్లగా స్థిరంగా. "విలియమ్స్ - ఇది సరైన బోటు కాదంటాడు" అని కూడా అంది -

"ఏమిటీ ? సరైనది కాదా? దీనిలో లెగ్‌హారన్ కూడా వెళ్లగలను - ఎక్కడికైనా" అంటున్నాడు షెల్లీ !

జేన్‌కు చెమటలు పోసాయి - ఈ కవిని ఎప్పుడూ మరణదేవత నీళ్ల పై నుంచి దీవిస్తుంది -ఇవ్వాళ తన రెక్కలు చాచింది - అనుకుంది.

'ఇండియన్ ఎయిర్' పాట రాశావా? అంది - 'ఎప్పుడో రాశాను' కాని నీవు పాడితే - ఇంకా బాగా మారుస్తాను' అంటున్నాడు.

మెల్లగా లోతు తక్కువ నీళ్లలోకి బోటు వచ్చింది -

అంతే జేన్ - తన పిల్లలిద్దర్నీ చెరో రెక్క పట్టుకుని దూకేసింది.

ఆ హడావిడిలో బోటు తిరగబడింది - కవిని నీళ్లలో ముంచి!

మెల్లగా తాబేలు లాగా బోటును వీపు మీద మోస్తూ లేచాడు!!

విలియం "జేన్ - ఏమిటీ పిచ్చా? కాసేపు ఆగితే బోటును బైటకు లాగే వాళ్ళం కదా!"

"అవసరంలేదు - మళ్లీ అందులో అడుగు పెట్టను - అది శవపేటిక! ఇప్పటి వరకూ అదృష్టమే - 'ఓ గొప్ప మర్మాన్ని ఛేదించాలి-'

ఎందుకు అతనే గొప్ప మార్మికుడు - ఎప్పుడు ఏమి చేస్తాడో!

మనందరం దేని నుంచి దూరంగా పారిపోవాలనుకుంటామో - అతను దానినే, మరణాన్ని - వెంటాడుతున్నాడు!

మనం దూరంగా వుంటేనే మంచిది" అని వాపోతుంది.

ఇంత జరిగినా కవి ఎంతో అమాయకంగా ఆనందంగా నీటి బైటికి వస్తున్నాడు.

* * *

ఈ వేసవి అంతా అతను ఇలాంటి ఆనందంలోనే తడిసి ముద్దయిపోయాడు. ఒక రోజు - అదే రాత్రి - వెన్నెల్లో *ఏరియల్* లో సముద్రంలోకి వెళ్లాడు.

మేరీ అతని మోకాళ్ల మీద తలపెట్టుకుని పాతరోజులు - అదీ తాము మొదటి సారిగా ఇంగ్లీషు చానెల్ దాటిన రాత్రిని - పది సంవత్సరాల క్రితం - గుర్తుకు తెచ్చుకుంది. పదేళ్లు ! ఎన్ని జరిగాయి. ఈ పదేళ్ళలోను. ఎన్ని గాయాలు, ఎన్ని మరణాలు - ఎన్ని కష్టాలు

గడిచాయి– ఇలా అనుకున్నారా ఇద్దరూ - అవతల జేన్ కూర్చుని చక్కని ఇండియన్ జానపదం పాడుతోంది. అదీ గిటార్ వాయిస్తూ -

షెల్లీ ఆకాశం వంకచూస్తూ – అక్కడే చంద్రుడు ఆగకుండా మందుతున్నాడు – కొండల మీద మబ్బుల్ని, వెలుగు నింపి పంపిస్తున్నాడు–

అతని మనసులో ఏ ఆలోచనా లేదు – అతని చేతనమంతా అద్భుతమైన మహానందంతో నిండిపోయింది. అతని అంతరంగం కలల కాంతితో మునిగిపోయింది – ప్రేమ సాగర తరంగాలపై తేలిపోతున్నట్లు తీయని సంగీతంతో కలిసి పోతున్నట్లు...

తన అంతర్లోక యాత్రల్లో నడుస్తూ – గాజు మందిరాల్లో సేదదీరుతూ – మబ్బు తెరలను దాటి అంతరిక్ష వలయాలలో విహరిస్తున్నట్లు – ఇదే సత్యమనే భ్రమలో వుండిపోయాడు.

మరో అనంతలోకం వుందని – చలనం లేనిది – కఠినమైంది – కాని అంత మహోన్నతమైన ఎత్తులోకి చేరాలంటూ – సంగీతంలోని మాధుర్యాన్ని ఆస్వాదించి – అదృశ్యంగా కదిలే వెలుగు లోకాలు చుట్టిరావాలి.

ఇందులో అసూయాద్వేషాలు – డబ్బు బాధలు – రాజకీయ ఘర్షణలు చాలా చాలా నికృష్టమైనవిగా – తనకు కనీసం దగ్గర్లోకి కూడా రాలేని వాటిగా – తన ఆనందాన్ని – మధుర మధుర సమయాన్ని అందుకో లేనివిగా అనిపించింది. అతనూ

'Werweile doch! Du bist so schon' - but you are already Werweile' కూని రాగం తీశాడు.



ఫ్రాంకిన్‌స్టీన్ రచయిత్రి - మేరీ

పదిహేడవ అధ్యాయం

ఏరియల్ నిష్క్రమణ

చాలాకాలం నుంచి షెల్లీ తన స్నేహితులు లీ హంట్ కుటుంబాన్ని, ఇటలీ తీసుకు రావాలని ఆలోచిస్తున్నాడు.

వాళ్లకి ఇంగ్లాండులో అప్పుల వాళ్లతో నానా ఇబ్బందిగా వుంది. వారి ప్రయాణానికి సొమ్ము ఏర్పాటు చేయటానికీ సిద్ధపడినా – ఇక్కడకు వచ్చిన తర్వాత ఎలా పోషించాలా అని – అదీ దంపతులు – ఏడుగురు సంతానం – ఆలోచనలో పడి – చివరికి బైరన్‌తో మాట్లాడాడు.

బైరన్, హంట్ సంపాదకత్వంలో ఒక 'ఉదార వాద' పత్రికను స్థాపించి నడపటానికి అంగీకరించాడు. బైరన్ రచనలన్నింటికీ ఆ పత్రిక కాపీరైటు కలిగివుంటుంది. ఈ ఒక్కటీ చాలు – హంట్ జీవితాన్ని స్థిరపరచటానికి అనుకున్నాడు.

నిజానికి దీనివల్ల బైరన్‌కు ఎలాంటి లాభంలేదు. అయినా హంట్ కుటుంబం, తన పాలెస్ కింద భాగంలో వుండటానికి అంగీకరించాడు.

చివరికి నానా కష్టాలు పడి హంట్ పరివారం లెగ్‌హార్న్ చేరారు. అదీ జూన్ చివరిలో (1922).

ట్రిలానీ వారికోసం *బోలివర్* బోటుతో హార్బర్‌లో ఎదురు చూస్తున్నాడు.

అప్పటికి షెల్లీ – విలియమ్స్ తమ *ఏరియల్* లో హార్బరుకు చేరారు – కాసా మాగ్ని నుంచి.

షెల్లీ ఆనందానికి అంతే లేదు. హంట్ పరివారం మొత్తం దిగుమతి అయ్యారు. అందరూకలిసి 'పీజా'కు బయలు దేరారు. విలియమ్స్ మాత్రం *ఏరియల్* తో లెగ్‌హార్న్‌లోనే వుండి షెల్లీ తిరిగి రాక కోసం చూస్తుంటాడు.

అతను రాగానే – ఇంటికి తిరుగుప్రయాణం చేయటానికి!

కాని దురదృష్టం – హంట్ తను కలవాల్సిన బైరన్ గారి దర్శనం అంత సంతోషంగా జరగలేదు.

బైరన్‌కు ఎంత సానుభూతి వున్నా – హంట్ భార్య ప్రవర్తన – ఏడుగురు చిన్న పిల్లల అల్లరి అతను భరించలేకపోయాడు. చివరికి మెట్ల మీద 'బుల్‌డాగ్'ను కాపలాపెట్టాడు.

'ఈ చిల్లర మనుషులు, ఈ పాలెస్ అంతా నాశనం చేస్తున్నారు' అనుకున్నాడు – ఇప్పటికే ఆ పత్రిక మీద అతనికి నమ్మకం పోయింది.

షెల్లీ ఆ రోజునే తిరిగి వెళ్లిపోవల్సింది. అందరికీ సర్దిచెప్పి – బైరన్‌ను బ్రతిమాలి – హంట్ భార్యకు సుద్దులు చెప్పి – ఇలా అన్ని విషయాలు దారిలో పెట్టే సరికి రోజులు గడిచిపోయాయి.

అతని పట్టుదల ఎప్పుడూ బైరన్ బడలిక, నిరుత్సాహం మీద విజయం సాధిస్తుంది. చివరికి బైరన్ వార్తా పత్రిక మొదటి సంచికలోనే బైరన్ రాసిన The Vision of Judgement కాపీరైట్ వచ్చే విధంగా ఒప్పించాడు.

విలియమ్స్ – షెల్లీకోసం లెగ్‌హార్న్ లో రోజులు తరబడి చూసి చూసి అలసిపోయాడు. అతనికి వెంటనే ఇంటికి వెళ్లిపోవాలనే కోరిక పెరిగిపోయింది.

భార్యను – పిల్లలను వదిలి ఇన్ని రోజులు ఎప్పుడూ లేడు.

షెల్లీ రోజుకో వుత్తరం పంపుతూనే వున్నాడు.

అప్పటికే జూలై నెల ఆరంభమయ్యింది. ఎండ మండిపోతోంది.

రైతులు ఎండలో పనిచేయటం ఆపేశారు.

నీళ్లు దొరకటంలేదు. మంత్రగాళ్లు బొమ్మలు పట్టుకుని తిరుగుతున్నారు. వర్షాల కోసం – ప్రార్థిస్తూ.

జూలై ఎనిమిదిన ట్రిలానీ – షెల్లీ పీజా నుంచి లెగ్‌హార్న్ తిరిగి వచ్చారు. షెల్లీ బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకుని కాసామాగ్ని ఇంట్లోకి కావలసినవన్నీ కొన్నాడు.

విలియమ్స్‌తో కలిసి ఇప్పుడు హార్బర్ చేరారు.

ట్రిలానీ తాను *బోలివర్* బోటులో వారితో పాటు *ఏరియల్* ప్రక్కనే వస్తానన్నాడు.

అప్పటికి ఆకాశంలో మబ్బులు చేరుతున్నాయి. మెల్లగా గాలి కూడా మొదలయ్యింది.

కెప్టెన్ రాబర్టు తుఫాను రావచ్చన్నాడు.

విలియమ్స్‌కు వెంటనే వెళ్ళిపోవాలనే వుండటంతో ఏడు గంటల్లో 'కాసా మాగ్ని' చేరగలమని అన్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకే షెల్లీ, విలియమ్స్, వివియన్ ముగ్గురూ *ఏరియల్* ఎక్కారు.

ట్రిలానీ కూడా *బోలివర్* సిద్ధం చేస్తున్నాడు.

అంతలో తీరం అధికారులు అందరి పత్రాలు చూడటానికి ఆపారు. షెల్లీ కెప్టెన్‌గా 'డాన్ వాన్' పడవకు అభ్యంతరం లేదు.

కాని ట్రిలానీకి సరైన పత్రాలు లేవు – అందుకని ఆపేశారు. అతన్ని 14 రోజులు క్వారంటైన్‌లో పెడతానని అధికారి అన్నాడు. వెంటనే వెళ్లి పత్రాలు తెచ్చుకోమన్నాడు.

విలియమ్స్ ఆగే పరిస్థితిలో లేడు. ఇప్పటికే ఎంతో ఆలస్యమయిపోయింది – వెంటనే వెళ్లిపోవాలి – రాత్రిలోపు ఇంటికి చేరాలి –

అలా 2 – 3 గంటల మధ్య *ఏరియల్* తెరచాపలు లేపి హార్బర్ వదిలింది – రెండు తెడ్డు పడవలు కూడా బయలుదేరాయి.

ట్రిలానీ విసుక్కుంటూనే – లంగరువేసి – తెరచాపలు దింపి – *ఏరియల్* దూరంగా పోవటం బైనాక్యులర్లతో చూడటం మొదలు పెట్టాడు. అతని జినోవా స్నేహితుడు – "అరె ఇప్పుడు బయల్దేరారేమిటి? చాలా వుదయమే వెళ్లవలసింది. సముద్రం అనుకూలంగా లేదు" అన్నాడు.

"ఫర్వాలేదు పడమటి గాలి – వారిని బాగానే తీసుకు పోవచ్చు" అన్నాడు.

"మరీ ఎక్కువ గాలికూడా, పనికి రాదు – ఆ పైన వున్న తెరచాప సరిగాలేదు. కాస్త గాలికే ఊగి పోతోంది. చూడు అటు నల్ల మబ్బులు – నీటిమీద పొగ – ఇవి మంచి శకునాలు కాదు"



కమ్ముతున్న కారు మబ్బులు

కెప్టెన్ రాబర్ట్ అక్కడి గట్టు మీద నిలబడి బోటు వంకే చూస్తున్నాడు.

అది దూరంగా వెళ్లి పోతుంటే 'లైట్‌హౌస్' పైకి వెళ్లి అక్కడి నుంచీ చూశాడు.

అప్పుడు అటునుంచి తుఫాను మొదలయ్యింది. పైగా *ఏరియల్* పూర్తిగా

తుఫానులో చిక్కుకు పోతుందనుకున్నాడు.

అంతలోనే - వర్షం, గాలి - *ఏరియల్* ను కనపడకుండా చేశాయి.

హార్బర్‌లో చాలా వుక్కగా వుంది.

తర్వాత తుఫాను వాతావరణం చాలా బరువుగా కూడా అన్పిస్తోంది.

ట్రిలానీ అలిసిపోయి తన కాబిన్ లోకి వెళ్లి నిద్రపోయాడు -

ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు.

కుర్రవాళ్లు మరొక లంగరు దింపుతున్నారు.

హార్బరు అంతా కలకలంగా వుంది.

తుఫాను ఇక్కడ వరకూ వచ్చేసింది.

చీకటి మూసింది - గాలి ఉధృతంగా మారింది -

పెద్దగా వర్షం మొదలయ్యింది.

చిన్న చేపల పడవలు హార్బర్‌లోకి దూసుకు వస్తున్నాయి.

అంతలో మెరుపులు - ఉరుములు ఫెళ్ళు ఫెళ్లున మిన్ను విరిగి మీద పడినట్లు భీభత్సంగా మారిపోయింది.

అరగంటపైగా గడిచింది.

ట్రిలానీ - రాబర్ట్ సముద్రంలోకి ఆశగా చూశారు. ఎక్కడైనా *ఏరియల్* జాడ కనపడవచ్చని.

చిన్న చిన్న పడవలు తప్ప ఇంకేమీ కానరాలేదు. ఎంత తీక్షణంగా చూసినా *ఏరియల్* కనిపించలేదు... *ఏరియల్* కనిపించనే లేదు...

* * *

'బే'కి మరో ప్రక్క ఇద్దరాడవాళ్లు ఎంతో ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. మేరీకి ఏమీతోచక దిగులుపడి పోయింది.

వేసవి వేడి - ఆమెను ఎంతగానో బాధించింది.

ఇంత వేడిలోనే 'విల్లీ' చనిపోయాడు. ఇప్పుడు తన చేతుల్లోని బిడ్డను భయం భయంగా చూసింది- ఆరోగ్యంగానే కనపడుతున్నాడు.

పైకి వెళ్లి సముద్రంలోకి చూసింది - ఎంతో అందంగా కనపడుతోంది. అయినా ఆమెకు ఏమాత్రం ఆనందం లేదు.

కారణం ఆమెకు తెలుసు – "కాని షెల్లీ వస్తే – నన్ను ఓదారుస్తాడు – ప్రేమగా దగ్గరకు తీసుకుంటాడు – బాబుని ఎత్తుకుంటాడు..." అనుకుంటోంది.



అలల కల్లోలంలో *ఏరియల్*

సోమవారం – జేన్‌కి ఒక వుత్తరం చేరింది. అది శనివారం విలియమ్స్ వ్రాసింది. "షెల్లీ ఇంకా 'పీజా'లోనే వున్నాడని.

సోమవారానికి రా లేక పోతే – నేను వచ్చేస్తాను" అని వుంది.

ఈ సోమవారమే – తుఫాను సోమవారం – ప్రాణాంతకమైన తుఫాను సోమవారం!

* * *

మేరీ – జేన్ ఇంతవరకు *ఏరియల్* ఈ వాతావరణంలో సముద్రంలోకి వెళ్తుందనుకోలేదు.

మంగళవారం మొత్తం వర్షం పడుతూనే వుంది. కాని సముద్రం ప్రశాంతంగానే వుంది.

బుధవారం – లెగ్‌హార్న్ నుంచి చిన్న తెడ్డు పడవలు వచ్చాయి. అందులో ఒకటి *ఏరియల్* 'సోమవారమే' బయలు దేరినట్లు చెప్పాడు. కాని మేరీ, జేన్ ఇద్దరు నమ్మలేదు.

గురువారం వాతావరణం ఇంకా బాగుంది. ఇద్దరూ – రోజంతా సముద్రం వైపు చూస్తూనే వున్నారు.

ఏ క్షణంలోనైనా *ఏరియల్* తెరచాపలు కనపడతాయని!

అర్ధరాత్రి వరకూ – చూస్తూనే వున్నారు. కాని ఎటువంటి తెరచాప గాని, పడవగాని కనిపించనే లేదు.

ఒకవేళ – ఏదైనా కారణంతో 'లెగ్‌హార్న్'లో ఆగిపోయారేమోననుకున్నారు –

గంటలు గడిచిన కొలది వారిలో అసహనం పెరిగిపోయింది. జేన్ – పడవ అద్దెకు తీసుకుని 'లెగ్‌హార్న్' వెళ్తానంది. కాని ఎవరూ రావటానికి సిద్ధంగా లేరు – ఎందుకంటే మళ్లీ సముద్రం అల్లకల్లోంగా మారుతోంది.

* * *

మధ్యాహ్నానికి ఉత్తరాలు వచ్చాయి.

హంట్, షెల్లీకి రాసింది. "ఇంటికెలా చేరావు? నాకు తెలిసిన వార్త – నీవు వాతావరణం బాగోలేనపుడు బయలు దేరావని. అదీ సోమవారం – మేము చాలా ఆందోళనగా వున్నాము–"

ఆ వుత్తరం మేరీ చేతుల్లోంచి జారి పోయింది.

జేన్ చదివి – "అంతా అయిపోయింది"

మేరీ "లేదు జేనీ – లేదు – కాని ఈ ఆందోళన భరించ లేక పోతున్నాను."

"పద లెగ్‌హార్న్ వెళ్దాం" అంది.

లెరిసి నుంచి – లెగ్‌హార్న్ వెళ్లే మార్గంలో పీజా వుంది.

వాళ్లు లార్డ్ బైరన్ పాలెస్ దగ్గర ఆగారు. ఏమయినా వార్త తెలుస్తుందేమోనని – "షెల్లీ ఎక్కడ?" అని అడిగింది.

బైరన్‌కు ఏమీ తెలియదు –

ఆదివారం చూడటమే –

అర్థరాత్రి అయింది. అయినా ఆడవాళ్లు ఆగలేదు – అలాగే లెగ్‌హార్న్ కు – రాత్రి రెండు గంటలకు పైగా చేరారు.

వారికి ట్రిలానీ – రాబర్ట్, వున్న హోటల్ తెలియక తెల్లవార్లు తిరిగారు – చివరికి ఒక హోటల్లో పడి అలసి సొమ్మసిల్లి నిద్రపోయారు.

* * *

తెల్లవారిన తర్వాత మళ్లీ హోటళ్ళు అన్నీ తిరిగారు. చివరికి 'గ్లోబ్'లో రాబర్టు కనిపించాడు. జరిగిందంతా చెప్పాడు.

ఇంకా ఏమయినా ఆశ వుందా ?

ఏరియల్ ఇంకో రేవుకు కొట్టుకుని పోయిందేమో అలా అని – కార్సికా –ఎల్బా మనుషుల్ని పంపారు.

చివరికి నైస్ వరకూ – ఏమీలేదు.

ఏ కబురూ – లేదు

చివరికి కాసామాగ్నికి బయలు దేరారు ఉదయం 9 గంటలకు.

దారిలో ట్రిలానీకి – వయా రెగ్గీ తీరంలో ఏవో సీసాలు – నీళ్ల కుండీ – వున్నాయని

చెప్పారు. ట్రిలానీ వెళ్లి చూసి - అక్కడ *ఏరియల్*కి సంబంధించిన తెడ్డు గుర్తుపట్టాడు.

అది పొరపాటున పడిందని సరిపుచ్చుకున్నాడు.

జేన్ - మేరీ ఇంటికి చేరేసరికి - ఊళ్లో పండుగ జరుగుతోంది. పెద్దగా సంగీతం, నవ్వులు - నృత్యాలు వినపడుతున్నాయి. ఆ శబ్దాలకు రాత్రంతా మేల్కొనే వున్నారు...

* * *

అప్పటికే అన్ని తీరాలకు వార్త పంపారు. - ఎలాంటి వార్త చెప్పినా *ఏరియల్* గురించి - బహుమతి ఇస్తామని!

అయిదారు రోజుల తర్వాత ట్రిలానీని వయా రెగ్గి రమ్మని కబురు వచ్చింది. అక్కడ బీచ్‌లో ఒక శవం ఒడ్డుకు చేరినట్లు -

అతను వెళ్లి చూశాడు - చూడలేక పోయాడు -

శరీరంపై బట్టలు లేని చోటంతా చేపలు తినేశాయి.

కాని పొడవైన పలచని శరీరం - కోటు జేబులో *సోఫోకిల్స్* పుస్తకం, కీట్సు పద్యాల పుస్తకం, చదువుతూనే మూసి వున్నట్లుంది -

ఇంక ట్రిలానీకి సందేహం లేదు. ఇది షెల్లీకి చెందిన శరీరమేనని - దాదాపు అదే సమయంలో విలియమ్స్ శరీరం కూడా ఇంకా దారుణమైన స్థితిలో అక్కడికి దగ్గర్లోనే తీరానికి చేరింది.



తుఫానులో కనుమరుగవుతున్న *ఏరియల్*

ట్రిలానీ - ఈ మిగిలిన భాగాలను అక్కడే ఇసుకలో పూడ్చి - విడి విడిగా -

కాసా మాగ్నికి పరుగు పెట్టాడు -

ఇంటి గుమ్మంలో ఆగాడు.

అక్కడ ఎవరూ కనిపించలేదు.

పెద్ద గదిలో ఏదో దీపం వెలుగుతోంది.

బహుశా ఇంకా ఏదయినా ఆశ మిగిలివుందా అని ఇద్దరూ మాట్లాడుకుంటున్నారా?

అతను, తను చివరి సారి వచ్చిన సమయం గుర్తుకు వచ్చింది – అప్పుడు రెండు కుటుంబాలు అక్కడి వరండాలో కూర్చొని – నక్షత్రాలన్నీ నీళ్లలో కనపడటం చూస్తున్నారు – తన రాక చూసి విలియమ్స్ గట్టిగా అరిచాడు – గిటార్‌తో జేన్ ఏదో పాట పాడుతోంది – షెల్లీ నవ్వుతున్నాడు. అరె ఇంత కంటే ఆనందంగా ఇంకెవ్వరైనా ప్రపంచంలో వున్నారా అనుకున్నాడు –

కాని ఇప్పుడు ?

పైకి వెళ్లాడు మెల్లిగా - హాలు దాటాడు.

మేరీ - జేన్ అక్కడే వున్నారు.

అతను ఏమీ చెప్పలేక పోయాడు -

'ఏ ఆశాలేదా?' మేరీ.

అంతే, ట్రిలానీ నోట్లో గుడ్డ కుక్కుకుని వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు.



విగతజీవి షెల్లీతో - మేరీ

పద్దెనిమిదవ అధ్యాయం

చివరకు మిగిలింది

మేరీ – షెల్లీని రోమ్‌లో – విల్లీ ప్రక్కనే ఖననం చేయాలని ఆశించింది. కాని ఇక్కడి అధికారులు అందుకు అంగీకరించలేదు. ఒకసారి పూడ్చి పెట్టిన శవాన్ని మార్చటానికి వీల్లేదన్నారు.

ట్రిలానీ – అక్కడే మిగిలిన అవశేషాలు దహనం చేద్దామన్నాడు. అది గ్రీకు సాంప్రదాయమన్నాడు.

ఆ విధంగా – దానికి ముహూర్తం పెట్టారు.

బైరన్‌కు, హంట్‌కు కబురు చేశారు. వాళ్లు *బోలివర్* లో వచ్చారు.

అక్కడి అధికారులు – ఈ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లు చేశారు.

ముందు విలియమ్స్ అవశేషాలు తవ్వి తీశారు. అందరు ఎండలో చుట్టూ చేరి చూశారు.

ఆ భయంకరమైన దృశ్యాల్ని చూడలేక కళ్ళు మూసుకున్నారు. నల్లని చిన్న సిల్కు చేతిరుమాలు – చిరిగిపోయిన గుడ్డలు – కాలి బొమిక – మిగిలిన ఎముకలు – కొద్దిగా తోలు, కొంచెం మాంసం – ఒక బూటు, ఇదీ మిగిలింది.

ఎముకలన్నీ వెలికి తీసేటప్పుడు విడిపోయాయి. అక్కడ సైనికులు పారలతో, గునపాలతో, కర్రలతో, ఇనుపచువ్వలతో – ఇవన్నీ హింసించటానికి ఉపయోగపడే వస్తువులు – వీటి సహాయంతో ఒక కుప్పలాగా పోశారు.

"ఏమిటీ? ఇది మనిషి కళేబరమా?" బైరన్ ఆశ్చర్య పోయాడు. "అది, గొర్రెది లాగా వుందే" అంటాడు. చాలా కదిలిపోయాడు. ఉద్వేగాన్ని అణుచుకోటానికి ప్రయత్నించాడు.

ఏడవటం మగతనం కాదనుకుని నిర్లక్ష్యంగా వుంటాడు. వారు కపాలాన్ని తీస్తుంటే "ఆగండి – నన్ను నోటిలోని దవడను చూడనివ్వండి. పళ్లను బట్టి ఎవరో చెప్పగలను. నేనెప్పుడూ నోటినే చూస్తాను. కళ్ళు నిజాన్ని దాస్తాయి" అంటాడు.

*

దహన క్రియకు చితి పేర్చారు. ట్రీలానీ నిప్పు పెడతాడు. అన్నీ ఎండిపోయి వున్నాయి. వెంటనే మండిపోతున్నాయి. ఆ మంటల వేడికి అందరూ వెనక్కి వెళ్లిపోయారు.

ఎముకలు, పుర్రె మండిపోతుంటే ఎంతో నిర్మలంగా ప్రకాశిస్తూ అందరి మీద వెలుగు ప్రసరించింది.

మంట తగ్గిన తర్వాత బైరన్, హంట్, ధూపకాష్ఠాలను వేశారు. లవణ మద్యాలను పోసి శాంతి చేశారు.

"రా, ఈ సముద్ర జలాల పొగరేమిటో చూద్దాం. ఇవేగా మనవాళ్లను ముంచింది" అని బట్టలు వదిలి, నీళ్లలో ఈదుకుంటూ వెళ్తాడు బైరన్.

బహుశా తన దుఃఖాన్ని దాచుకోటానికి, తన గర్వాన్ని ప్రదర్శించటానికి నీళ్లల్లో దిగాడు. ఈదుకుంటూ చాలా దూరం వెళ్తారు ముగ్గురూ.

అక్కడి నుంచి చూస్తే తీరంలోని ఈ చితిమంట చిన్న దీపంలా కనపడుతోంది.

* * *

మర్నాడు షెల్లీకి ఇదే లాంఛన కర్మ జరిపారు.

అతనికోసం చాలా సేపు అక్కడి ఇసుకంతా తవ్వాల్సి వచ్చింది.

ఇవాళ చక్కగా ఎండకాస్తోంది. వెనుక పచ్చని అడవి, ముందు నీలపు సంద్రం, మధ్యలో ఈ పసుపు పచ్చని ఇసుక. చాలా అద్భుతంగా ఉంది. అడవులకు పైగా దూరంగా మంచు కిరీటాలతో ఎపినైన్స్ పర్వతాలు మబ్బులతో కబుర్లు చెప్తున్నాయి. ఇవన్నీ షెల్లీకి ఎంతో ఇష్టమైనవి కదా!

అక్కడ వున్న పిల్లా జెల్లా అందరూ చేరారు. కాని ఎవరూ ఒక మాటకూడా మాట్లాడటంలేదు.

బైరన్ మౌనంగా చాలా గంభీరంగా ఉన్నాడు.

"అవును, నీ ధైర్యం గొప్పది. నీ సాహసానికి చివరికి మిగిలింది ఇదా?

ప్రొమిథియస్ లాగా నీవు జూపిటర్‌ని కాదన్నావు, ఎంత ధైర్యం?"

సైనికులు గంట పైగా తవ్వకాలు జరిపారు - సరిగా ఎక్కడ పూడ్చిపెట్టింది కనిపెట్టలేక.

ఒక్కసారిగా, మందంగా - బోళాగా గునపం తగిలిన శబ్దం వినిపించింది. అదిగో అది కపాలమే అనుకుని జాగ్రత్తగా తవ్వారు.

బైరన్ నిలువెల్లా వణికిపోయాడు. షెల్లీని ఒక్కసారి గుర్తుతెచ్చుకున్నాడు.

తామిద్దరూ, స్విస్ లేక్‌లో, గాలివానలో విహరించినప్పుడు చేతులు కట్టుకుని ప్రశాంతంగా కూర్చున్న షెల్లీ అతని కళ్లముందు మెదిలాడు.

ఎంతటి ధైర్యం ! ఎంతటి నిర్వీర్యం! అదే షెల్లీ జీవితానికి చిహ్నంలా అనిపించింది.

"అరె– అందరూ ఎంత దారుణంగా అపార్థం చేసుకున్నారు.

ఎంత నిస్వార్థ పరుడు, ఎంతటి నిర్మలుడు – ఇంతటి పెద్దమనిషి ఎక్కడైనా ఉంటాడా?" అనుకున్నాడు.

అప్పటికి మిగిలిన అవశేషాలు సున్నంతో కప్పి ఉన్నాయి. చాలా వరకు సున్నం తినేసింది కూడా.

ధూపాలు, నూనె, ఉప్పు జల్లారు. చాలా వైను పోశారు. బహుశా అతని జీవితకాలంలో అంత వైను తాగి ఉండకపోవచ్చు.

చితినిప్పు, బయటవేడి రెండూ కలిసి మూడు గంటలు పైగా మండాయి. కానీ, చాలా పెద్దదయిన షెల్లీ కపాలం, హృదయం ఇంకా పూర్తిగా మండిపోలేదు.

ట్రిలానీ మంటలోనుంచి కపాలాన్ని తీసి చేతుల్లో పట్టుకున్నాడు. అతని చేయి కాలిపోయింది.

గునపం తగిలిన చోట చితికిపోయింది.

అతని మేధ, ఆ కపాల భాండంలో ఉడికి ఉడికి, హృదయం మరిగి, బుడగలై గాలిలో తేలి – వాయు మండలంలో ప్రయాణం చేసి – తానే నిర్మించుకున్న రోదసిలోని భారరహిత స్ఫటిక భవనాలలో సేదదీరటానికి వెళ్లిపోయింది.

* * *

బైరన్ చూడలేక, నిన్నటి మాదిరి సముద్రంలో దూకి, ఈదుకుంటూ తన పడవ *బోలివర్* ను చేరతాడు.

ట్రిలానీ మిగిలిన బూడిద, చిదుకులు ఏరుకుని చిన్న బుట్టలో పెట్టి నల్లని వెల్వెట్ బట్టలో చుట్టి తీసుకు వెళ్తుంటాడు.

అక్కడ చేరిన పిల్లలు –
ఇవన్నీ ఇంగ్లండు తీసుకువెళ్లి
మళ్లీ ప్రాణం పోస్తారని – అనుకుంటున్నారు.



మండుతున్న షెల్లీ చితి

లార్డ్ బైరన్, హంట్, ట్రిలానీ (కుడి నుంచి ఎడమకు)




రోమ్‌లో షెల్లీ సమాధి

Cor Cordium అంటే *గొప్ప హృదయం* అని.

చివరి మూడు వరుసల పద్యం

షేక్స్పియర్ 'టెంపెస్ట్' లో నుంచి తీసుకోబడింది.



మరి కొంత విషాదం...

ఏరియల్ చివరి సంఘటనలు ఎన్ని సార్లు చదివినా
కంటిలో నీటి పొర అడ్డు పడుతూనే ఉంది.
చివరి చితి వేడి – గుండెల్లో మండుతూనే ఉంది.

* * *

ఈ కథకు ముగింపు వుంటుందా – ?
తర్వాత ఏమి జరిగిందో తెలుసుకోవాలనే
అలోచనే రాలేదు చాలాకాలం – అయినా నా పాఠకులకు
తెలియజేయాల్సిన బాధ్యత వుంది కదా.

* * *

సర్ తిమోతి షెల్లీ తొంభైయేళ్లకు పైగా జీవించి 1844లో తనువు చాలించారు. మేరీకి కొంత భరణం ఏర్పాటు చేశారు. అయితే తిమోతి తను జీవించి వుండగా షెల్లీ జీవిత చరిత్ర ప్రచురించ కూడదని షరతు పెట్టారు.

ఆయన తర్వాత షెల్లి ఫ్లొరెన్సు సంస్థాన వారసుడుగా అదృష్టాన్ని పొందాడు. హారియెట్ కొడుకు పదకొండు సంవత్సరాలకే చనిపోయాడు.

ఉమ్మడి విషాదం మేరీని, జేన్‌ను దగ్గర చేసింది. చాలాకాలం వీరు ఇటలీలోనే నివసించి తరువాత లండన్ తిరిగి వచ్చారు.

షెల్లీ స్నేహితులకి అతనంటే చాలా గౌరవం. ఎంతో విశ్వాసపాత్రులు కూడా.

ట్రిలానీ – ఇష్టమైతే మేరీని వివాహం చేసుకుంటానన్నాడు. కాని మేరీ – 'మేరీ షెల్లీ' పేరు తన సమాధిరాయి మీద అందంగా వుంటుందని – అతని అభ్యర్థనను కాదంది.

మేరీ షెల్లీ, ఫ్రాంకిన్‌స్టీన్ సృష్టికర్త. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ –
ఫ్రాంకిన్‌స్టీన్ ఒక్కడే. అతన్ని సృష్టించింది మేరి షెల్లీయే.

ఇక మన హాగ్ – జేన్‌తో జతకడతానన్నాడు – అప్పటివరకూ – జేన్ – విలియమ్స్‌ల వివాహం జరగలేదనే సంగతి ఎవరికీ తెలియదు. జేన్ భర్త ఇండియాలో ఎక్కడో వున్నాడు! ఆ విధంగా ఆ రెండు పెళ్లిళ్లు జరగలేదు!

మేరీ – జేన్ స్నేహంగా – దగ్గరగానే వుండిపోయారు.

క్లేర్ – రష్యాలో గవర్నెస్‌గా కుదురుకుంది. షెల్లీ ఆమెకు వదిలిన 12వేల పౌండ్లు – తిమోతి మరణం తర్వాత లభించాయి. దానితో ఆమె సుఖంగానే వుంటోంది.

వయసు మీద పడిన కొలది – ఈ ముగ్గురు స్త్రీలు తమలో తాము పోట్లాడుకోసాగారు – షెల్లీ ఎవరిని ఎక్కువగా ప్రేమించాడని!

అయితే షెల్లీ పేరు వినపడితే వారి కన్నుల్లో వెలుగు పూలు విరబూస్తాయి!

* * *

చాలా కాలంగా క్లేర్ తన జీవితగాథ రాయసాగింది. తన గురించి – షెల్లీ గురించి – బైరన్ గురించి చాలా చాలా రాసింది. అందులో ప్రేమ – పెళ్లి – బూజుపట్టిన సాంఘిక ఆచారాలు – మారిపోతున్న కాలం – ఎన్నో రాసింది – చివరికి అలసిపోయి రాయటం ఆపి వేసింది.

ఒక రోజున, 1878 వసంతకాలం .... ఓ యువకుడు – షెల్లీకి, బైరన్‌కు సంబంధించిన ఉత్తరాలు – కాగితాలు వెతుక్కుంటూ చివరికి క్లేర్‌ను కలవటానికి వచ్చాడు.

ఈ రెండు పేర్లు చెప్పగానే క్లేర్ ముఖంలో ముడతలన్ని మాయమయి వెలిగిపోయింది. పద్ధెనిమిదేళ్ళ యువతిలా సిగ్గుపడింది.

"రా నాయనా! కూర్చో – నీవు కూడా నేను బైరన్‌ను ప్రేమించాననే" అనుకున్నావా?

అతను ఆశ్చర్య పోయాడు!

'ఆరి పిచ్చి వాడా – నీకు ఇంకా ఆడదాని మనసు తెలియదులే – అవును – నేనూ అప్పుడు – ఆశ్చర్యపోయాను – కాని అది ప్రేమకాదు! అది ప్రేమగా మారే అవకాశం రాలేదు కూడా.'

'అయితే మీరు – మీరు ఎవ్వరినీ ప్రేమించనే లేదా?'

ఆమె ఎండిపోయిన బుగ్గలు ఎర్రబడ్డాయి – ముడతలు పడిన ముఖం సిగ్గుతో మరింత ముడుచుకు పోయింది! నేల చూపులు చూసింది.

చివరికి, అతనంటాడు "షెల్లీ?"

"ఆఁ అవును ! నా మనసు – నా ఆత్మ అన్నీ అతనికే అంకితం" కనురెప్పలు దించుకునే చెప్పింది.

మెల్లగా తన చేతిలోని సిల్కు రుమాలుతో అతని బుగ్గ నిమిరింది.



క్లేర్



హారియెట్ పెర్సీ బీష్ షెల్లీ మేరీ షెల్లీ

ఇలా మొదలయింది...


ఏరియల్ చేతిలో పెట్టి – 'చదవండి – రాయండి' అని ముక్తసరిగా ముక్తవరం పార్థసారథి అన్నప్పుడు – చాలా కాజువల్‌గానే తీసుకున్నాను, కాని, André Maurois దీనిని 'ఆంద్రీ మార్వా' అని చదవాలి, అలాగే Percy Bysshe Shelley ని 'పెర్సి బీష్ షెల్లీ' అని చదవాలి – గుర్తుపెట్టుకోండి అని కూడా హెచ్చరించారు.

ఏ అర్ధరాత్రి మొదలు పెట్టానో – ఎన్నిసార్లు చదివానో... ఎన్ని సార్లు కంటనీరు పెట్టానో – షెల్లీ నా పక్కనే కూర్చున్నాడు. నా పక్కలోనే ఉండేవాడు – ఈ అవస్థ నెల రోజులు పైగానే– ఈ బరువు దించుకోవాలంటే – షెల్లీకి తెలుగు నేర్పాలి – అతను హారియెట్‌కు లాటిన్ నేర్పినట్టు. రోజూ ఆ పనే చేశాను. నెల రోజుల్లో పూర్తయింది. గుండె బరువు కాస్త తగ్గింది. కాని షెల్లీ జీవితంలోని వ్యక్తులందరూ నాకు చాలా దగ్గరయ్యారు. ఆత్మీయులైపోయారు. వాళ్లందరినీ అతని కంటే ఎక్కువగా ప్రేమించాను.

ఒక్క షెల్లీయే ఏదో పొరపాటునో, దేవతల శాపంతోనో ఈ మట్టిలో కొన్నాళ్లు తన పాద ముద్రలను వేసి – సముద్రంలో కలిసిపోయాడు.

తన స్వప్న సౌధాల స్ఫటిక వీథులలోకి *ఏరియల్* తరలి వెళ్లి పోయాడు.
తానే నమ్మని దేవుడు తన దగ్గరికే తీసుకుపోయాడు –
ప్రపంచంలో ఒకే ఒక షెల్లీ, హుఁ! దేవుడు కూడా పిసినారే.
ఇంతకంటే ఏమి చెప్పను?

– అశ్వినీకుమార్



అందరూ అందరే...

ఇప్పటికి పదిసార్లు సరిచూశాను... పదిమందికీ ఇచ్చి చదివించాను... సారిక నిర్మల ఎంతో సహనంతో డి.టి.పి చేసింది. ఫాంటు మార్చింది. బొమ్మలు పెట్టింది. అవీ మార్చింది. ఇంకా తప్పులు దిద్దుతూనే ఉంది. ఎవరో అజ్ఞాత చిత్రకారుడు వేసిన 'షెల్లీ - గేట్ టు నో వేర్' బొమ్మ దొరికింది. గుర్రపు నాడాతో గుర్రాన్నే తయారు చేశాం. నేనూ, షానూ. ఇప్పటికి పది డమ్మీలు తీసి చేశాడు శంకర్ దేవళ్ల ఎంతో సహనంతో -

కా. నాగేశ్వరరావు చదివి - షెల్లీ జీవితం మొదటి సారిగా చదివాను. చాలా నచ్చింది, ఏడుపు వచ్చింది - అన్నారు.

ముక్తవరం పార్థసారథి - చాలా లిరికల్‌గా ఉంది, గుడ్ అంటారు - ముక్తసరిగా! నీలకంఠం నరసరాజు - షెల్లీ జీవితం గురించి తెలుగువారికి తెలిసింది చాలా తక్కువ. *ఏరియల్* ఎన్నో విషయాలు తెలియజేసింది. చాలా ఆర్ద్రంగా ఉంది.

గుడిపూడి సుబ్బారావు- అద్భుతం. ఇది గొప్ప గ్రంథం - ఇదా షెల్లీ జీవితం?!

ప్రమోద్ కుమార్- ప్రేమదేవతకు పగడాల పారాణి అద్ది, ఊహాలోకపు వాయు మందిరాల్లో పరవశింపచేసిన *షెల్లి స్వప్న విషాదం* కన్నీళ్ళ తర్పణం. అక్షర శిల్పం.

కరుటూరి విజయ్ చౌదరి - న్యాయం, చట్టం మనిషిని నైతికంగా మార్చలేవు. అలాగే నైతిక జీవనానికి ఆ రెంటితో పనిలేదు.

నావ మీద సాగే నదీ ప్రయాణం-వచన కావ్యంలో వాక్యంతో సాగినట్టుంటుంది.

అదే, నావ మీద సముద్రంలో ప్రయాణిస్తే-వ్యాకరణంతో సహవాసం చేసినట్లుంటుంది.

ఇలాంటి ఒక అనుభవస్థితిని దృశ్యమానం చేశారు, రచయిత ఈ గ్రంథంలో...

కవనభువనమంతా సౌందర్యం మాత్రమే దర్శించే ఒక సౌందర్యారాధకుని జీవితానికి అద్దం పట్టినట్లుందీ పుస్తకం. మరువం, దవనం కలిపి కదంబం కడితే, నయనం పత్ర భేదాన్ని గమనిస్తుందే తప్ప, నాసికకు గంధ భేదం అంది రాదు. ఇక్కడా, అంతే. ఆంగ్లంలోని ఆంతర్యం, తెలుగు సౌందర్యంతో సహచరిస్తోంది. ఈ వాగ్విలాసిని నడక ఒక మణిప్రవాళం. సాగరతీరాలకు ఆవల, ఊహల కందని అలనాటి జీవనశైలి పునః సృజన మీద అశ్వినీకుమార్ బలంగా ప్రకటించిన తెలుగు సంతకమిది. **- డా॥ వోలేటి పార్వతీశం**

ఇంత మందికి నచ్చిందంటే మీకూ నచ్చాలి కదా!

చదివి, ఆనందించండి. కనులు తడుస్తాయి.

మీ...

అశ్వినీకుమార్

ఎపిప్సి చిడియన్

ఏ వాదానికి కట్టుబడలేదు
ఆధునిక నియమాల ప్రకారం-
గుంపులకు దూరంగా, ఒక స్నేహితుడో
ఒక ప్రియురాలో, ఎంచుకోవాలి కదా!
మిగతా ప్రపంచం - విగత ప్రపంచమే
విస్మృత శీతల ప్రపంచమే,
దేనికీ కట్టుబడలేను-
ఎందులోనూ ప్రవేశించలేదు...

ఓజిమెండిస్

ఆ పురాతన దేశం నుండి ఓ యాత్రికుడు వచ్చి,
"ఆ ఎడారిలో రెండు మొండి కాళ్ళ రాతివిగ్రహాన్ని చూశాను
ఆ ప్రక్కనే ఇసుకలో సగం కూరుకుపోయి
విగ్రహం తల పడివుంది. ఆ ముఖంలో చిట్లింపు,
ముడతలు పడిన మూతి, నిరంకుశుని అధికారం
కనపడుతోంది-ఆ శిల్పి గొప్పగా ఇన్ని
భావోద్వేగాలు కనిపింప చేశాడు - ఇప్పటికీ
ఈ విగతజీవి శిలా శిరస్సులో ప్రతిబింబిస్తున్నాయి,
ఆ ప్రక్కనే ఫలకంపై ఈ విధంగా చెక్కివుంది" అంటున్నాడు.

*'నా పేరు **ఓజిమెండిస్** - రాజాధి రాజును*
నా సామ్రాజ్యాన్ని చూడండి! ఎంత గొప్పదో!!
అయినా ఇప్పుడేమి మిగిలింది,
ఈ మహా శిథిలాల చుట్టూ
అంచులు కనిపించని ఎడారి,
విరిగిన నా మొండి కాళ్ళు!'



✣ పెర్సీ బీష్ షెల్లీ రాసిన కవితలు

పెర్సీ బీష్ షెల్లీ రచించిన
'ప్రొమితియస్ అన్‌బౌండ్' లిరికల్ డ్రామా
తెలుగు పాఠకులకు అతి త్వరలో అందజేస్తున్నాను.



అంద్రీ మార్వా రచించిన

'లార్డ్ జార్జి గోర్డాన్ బైరన్' కవి జీవిత కథనాన్ని

త్వరలో తెలుగులో .....




AK PublicationS



Vallabhaneni Aswinikumar

Author :

01. Amaaha (Short Sotries in Telugu)
02. Doora Theeraalalo (Travelogue)
03. Antharveekshanam (Essays)
04. Paarijaatam (Short Stories)
05. Naalo Nenu (Poetry)
06. Anantharangam (Poetry)
07. Siddhartha (Herman Hesse - In Telugu)
08. Agaadham (De Profundis - Oscar Wilde)
09. O Khaidi Veeragaadha (Ballad -Oscar Wilde)
10. Misimi Essays
11. Charlie Chaplin (Autobiography in Telugu)
12. Ariel (Shelley's Romance in Telugu)
13. D.D. Interviews
14. Prometheus Unbound (Shelley's Drama)
15. Adinois (Telugu - An Elegy by Shelley)



గగనాంతర సీమల్లో విహరిస్తూ
గ్రహాలను తన సున్నితమైన చేతులతో
బంతులాడిన వాడు-

వ్యోమ వీధుల్లో విధిని వెన్నాడుతూ
నక్షత్ర ధూళిని తన గులాబి పాదాలతో
చెలరేపిన వాడు –

కాలాన్ని కాంతి వేగంతో పరుగులెత్తిస్తూ
కాలావధులు దాటి
కవితలు రాసిన వాడు –

AK PublicationS

9 788192 717050

